మిసిమి / RNI Regd.No.45042/90
Postal Regd.No.HQ/SD/191/2024-26
Date of Posting: On 29th & 30th
Date of Publication: 25.2.2025



పరీక్ష తర్వాత

# మిసిమి

చింతనాత్మక సారస్వతం



పరీక్ష ముందు

మాసపత్రిక, మార్చి, 2025 ₹ 50/-

ISSN 2454–4329



నేను నేనే



కృష్ణా నీవే నేను

# మిసిమి

మాసపత్రిక

**సంపుటి 36** **సంచిక 3**

**మార్చి - 2025**

సంస్థాపకులు : రవీంద్రనాథ్ ఆలపాటి

సంపాదకుడు : **వల్లభనేని అశ్వినీకుమార్**

సహకార సంపాదకుడు : *వోలేటి పార్వతీశం*


KALA JYOTHI
Since 1946

Printed & Published by

**BAPANNA ALAPATI**

at **Kala Jyothi Process Pvt. Ltd.,**

Plot No. CFC-1&2, Survey No. 18, E-City,
SEZ, General Industrial Park, Raviryal and Srinagar,
Maheswaram, Ranga Reddy District,
**Telangana - 501 359.**
Ph: 040 - 27612436, 27645538.

Editor: V. ASWINI KUMAR
**Ph: 994 951 6567**


**చందా వివరాలు:**

₹ 600/- (సంవత్సర చందా),
₹ 1200/- (రెండు సంవత్సరాలకు),
₹ 1800/- (మూడు సంవత్సరాలకు),

కార్యదర్శి : **జి. ఉమాసుందరి**
**040-27645536**

Scan QR to Pay
Misimi A Unit of Kalajyothi


LIBRARY OF CONGRESS
LCCN 91-903060

UGC Care

ISSN INTERNATIONAL STANDARD SERIAL NUMBER INTERNATIONAL CENTRE
ISSN 2454-4329



misimi90monthly@gmail.com // misimi_monthly@kalajyothi.com
www.misimimonthly.com


YouTube : Silver jubilee celebrations of MISIMI Telugu Monthly

అట్టతో కలిపి 84 పేజీలు

# మిసిమి

## మార్చి నెల సూచికలు...


సారస్వత సందర్భం – మూడునాళ్ల ముచ్చట ! : ఎడిటర్ డైరి ... 3
జీవన మకరందం : ఎ.కె. ... 5
ముండక ఉపనిషత్తు : ఆచార్య కోదాటి వియ్యన్నరావు ... 6
విజ్ఞానం – విశ్వాసం : డా. అవధానం రఘుకుమార్...10
ఆశ : ఆచార్య పి. హరినాథ్ ... 14
వేమూరి బలరామ్ గారితో : **మిసిమి** ... 16
మధుర విజయం : వేలూరి కృష్ణమూర్తి ... 25
చరిత్రలో చిత్రకారులు : టి.వి. ప్రసాద్ ... 29
ఓ సాయంత్రం – సత్సంగం : సి.ఎస్. రాంబాబు ... 35
నిఘంటు చరిత్ర : డా. అన్నే బాలకృష్ణ ప్రసాద్ ... 40
చేనేత పరిశ్రమ : డా. కందగట్ల శ్రవణ్ కుమార్ ...43
లలిత సంగీత పరిమళం : డా. ఎమ్. పురుషోత్తమాచార్య ... 47
ట్యునీసియా – 1 : డా. నిమ్మగడ్డ శేషగిరి రావు ... 52
మాతృభాష : ఇరగ రెడ్డిశేఖర ... 60
రామాయణం – దాంపత్యాలు : మామిడి విజేత ... 63
రాణి వీరమంగ వేలు నాచియార్ : డా. సగిలి సుధారాణి ... 67
మాకొద్దీ దొరతనము : ఆచార్య కొలకలూరి మధుజ్యోతి ... 70
ఆట – జీవితానికి ఆదర్శం : ఆచార్య తంగెడ కిషన్ రావు ... 73
పుస్తక సమీక్ష : సి.ఎస్. రాంబాబు ... 78
చదవండి : **మిసిమి** ... 79




వేమూరి బలరామ్




నవరసాల బెనారస్

### అట్టమీది బొమ్మలు




పరీక్ష ముందు



నేను నేనే



కృష్ణా నీవే నేను



పరీక్ష తర్వాత

# సారస్వత సందర్భం – మూడునాళ్ల ముచ్చట !

సభలూ, మహాసభలూ – భాషాసభలు – సాహితీసభలు మనకు కొత్తేమీ కాదు – అలాగే ప్రపంచ తెలుగు మహాసభల పేరిట చాలానే జరుగుతుంటాయి. ప్రపంచం ఏమిటో తెలుగేమిటో – ఇవి ఎందుకు ఎవరు నిర్వహిస్తున్నారో ఒక మిస్టరీ – తెలుగు పేరుతో సభలు నిర్వహించే వారు ఎవరిని ఆహ్వానిస్తున్నారు? రచయితలనా? పత్రికా సంపాదకులనా? టి.వి. యాంకర్లు తెలుగును రక్షిస్తున్నారా? చందూలు, రావులు రక్షిస్తున్నారా? రమేష్‌లు కాపాడుతున్నారా? ఇదంతా ఒక కథ – అంతులేని కథ, అంతుపట్టని కథ.



సత్వా - ఆట్రియమ్

హైద్రాబాద్ లిటరరీ ఫెస్టివల్ హైద్రాబాదులోనే పదిహేను సంవత్సరాలుగా జరుగుతోంది. కర్ణాకర్ణిగా వినటమే – తెలుగు వార్తా పత్రికలకు ఇవి వార్తలుకావు – సత్వ – నాలెడ్జి సిటీ – టీ హబ్ – ఇవన్నీ ఒకే క్లస్టర్ భవనాలు – మీరు చూసి వుంటే న్యూయార్క్ మన్‌హట్టన్ లాగా వుంటుంది.




షబానా, గవర్నర్

నిర్మాణమే కాదు – నిర్వహణ – యాంబియన్సు దేనికీ తీసిపోదు – ఈ సంవత్సరం – జనవరి 24-25-26 తేదీలలో దాదాపు 10 వేదికలలో పుస్తకాలు – రచయితలు – మాట్లాడటం – అడగటం లాంటివి జరిగాయి. మేము అన్నీ తిరిగాము. తిరగేశాము కూడా. ఆట్రియమ్‌లో – ఇది ఓపెన్ సభా రంగమే – మొదటి రోజు – షబానా ఆజ్మీ – లితివేనియా అంబాసిడర్ – విద్యారావు – రెండు గంటలు పైగా వారి రచనలు – సినిమాలు–రచయితల గురించి మాట్లాడారు. మీకేమైనా సందేహాలుంటే నివృత్తి చేయటానికి ప్రయత్నించారు. షబన తన యాభై సంవత్సరాలు సినిమా నాటక జీవితాన్ని 10నిమిషాల్లో అద్భుతంగా చూపించింది.

ఒక సింధి మహిళ కంటనీరు పెట్టుకోవటం చూశాను. ఎందుకంటే, ఈ సమావేశం సింధి భాషమీద ఫోకస్ చేస్తున్నట్లు ప్రకటించారు. కాని, ఆ భాష మాట్లాడిన వారు ఎవరూ వేదిక ఎక్కలేదు – అందుకన్నమాట. మిగతా వేదికలపై (పైన వేదిక అన్నాను కదా) కాని ఇవి వేదికలు కావు – సమావేశ ప్రదేశాలు – కాని పాపం ఇందులో తమను దూరంగా పడవేసిన ఉపవేదికలని – కొందరు వాపోవటం విడ్డూరమే. అక్కడే తాటకి మంచి బాలిక అని – ఘటోత్కజునికి మాంసం పెట్టలేదని ఎగతాళి చేయటం విన్నాం – ఇక్కడే రవి పాడి, పులగం చిన్నారాయణ, జాయింట్‌గా రాసి వెలువరించిన హిచ్‌కాక్ పుస్తకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. రవి పాడి గంటసేపు తమ హాలీవుడ్ నాలెడ్జ్‌ని నామ కాలాలతో సహా అద్భుతంగా ఒలకబోసారు. ఈ కార్యక్రమాన్ని ప్రముఖ సినిమా డైరెక్టర్ ఇంద్రగంటి మోహనకృష్ణ సమన్వయ పరిచారు. బయోగ్రఫర్ పల్లవి గారు అనుసంధానం చేశారు.మరో వేదికలో ఫ్రెంచి రచయిత తన పుస్తకం గురించి వివరించటం చూశాం – సత్వా అంతా కలియ తిరిగాం – కొన్నిచోట్ల




సిద్ధార్థ, విద్యారావు

(వేదికలే) అర్థం లేని – అర్థం కాని మోడరన్ ఆర్ట్ కళాఖండాలు – AI ఆర్ట్ – మరో వేదికలో కార్టూన్‌లు – మరో వేదికలో పుస్తకాలు!


శ్రీమతి వాయు నాయుడు

26వ తేది చాలా పల్చగా మొదలయింది. ఆదివారం – గణతంత్రం – అందుకేనేమో? అయితే సిద్ధార్థ నటుడు – రచయిత – వక్త – రెండుగంటలకు వేదికనెక్కి రెండు గంటలు పైగా అద్భుతంగా తన పుస్తకాలు – సినిమాలు – ఏడు భాషల్లో తను నేర్చింది వివరించాడు – ఆడియన్స్ నుంచి ప్రశ్నలు వచ్చాయి – నా ప్రక్కనే ఒక్క గొంతు – గుడ్ ఆఫ్టర్ నూన్ సిద్ధూ అని మొదలుపెట్టి – I appreciate your oratory skills your articulation and fluent english congratulations - I want to know do you believe if any film changes the society - If your film can change an individual? Please answer me. అని ముగించింది. దీనికి ఏమి సమాధానం ఉంటుంది? థాంక్యూ వెరీమచ్ అంటూ I don't think so, అని సిద్ధూ కన్ఫెషన్‌తో ముగిసింది. 'పుస్తకాలు చదవండి. కొని చదవండి. మంచి పుస్తకాలు చదవండి అని అర్థించాడు' సిద్ధార్థ. లక్షకి ఒక్కరు కూడా పుస్తకం చదవట్లేదని వాపోయాడు.


క్రిస్‌తో ఐ.వి. రామరాజు

రాముడు తోడుగా టీహబ్‌కి బ్యాటరీ బగ్గీలో వెళ్లాం. అక్కడ ఏడో ఫ్లోర్‌లో ఒక పిట్ స్క్రీన్ ఉంది. అందులో నైమిశారణ్యం చూశాం. అది ఒక సనాతన వైభవం. డైరెక్టర్ పునీత్ సిక్కా అక్కడే ఉన్నారు. ప్రేక్షకుల ప్రశ్నలకు సమాధానం చెప్పడానికి ప్రయత్నించారు. మేము పలకరించాం. ఆ తరువాత ఓ నగర వైభవం లాంటిది మొదలైంది. మన దురదృష్టాన్ని మార్చలేం. స్క్రీన్ మీద మాకు ఎన్నో సభలలో ఉపన్యాసాలిచ్చిన వారే కనపడడంతో లేచి వచ్చేసాం. మళ్లీ సత్వాకి చేరాం. చివరి రోజు చివర్లో తొంభై ఏళ్ల రాజ్ మోహన్ గాంధి వాల్యూస్ ఆఫ్ ఇండియన్ కానిస్టిట్యూషన్ పుస్తకాన్ని ఆవిష్కరించారు. కొన్నువాళ్లకి సంతకం పెట్టి అందించారు. మరో వేదికలో శ్రీమతి వాయు నాయుడు గారు తమ పుస్తకం గురించి మాట్లాడుతున్నారు. ఆమె భర్త క్రిస్ ఇంగ్లీష్ వారు, ఆయన్ని పలకరించాం. ఎంతో ముచ్చటగా వారి భార్య మాటలు వింటున్నారు. శ్రీమతి వాయు నాయుడు గారు తెలుగు వారు కావటం మమ్మల్ని ఆకర్షించింది. వారితో కాసేపు ముచ్చటించి కొన్ని ఫోటోలు దిగాం. ఆవిధంగా మూడునాళ్ల ముచ్చట ముగిసింది.


రాజ్ మోహన్ గాంధి


రవి, మోహన్ కృష్ణ, పులగం , పల్లవి

**కొసమెరుపు :** *నిన్న '**మిసిమి**' అట్టమీద బొమ్మల సెట్టింగ్ కోసం డిజైన్ రమేష్ దగ్గరకు వెళ్లాను. ఆయనకో సందేహం వచ్చింది. 'సార్, మీరు ఎన్నో అందమైన బొమ్మలు తెస్తారు – వాటితో టైటిల్‌ని రంగులతో తీర్చిదిద్దుతారు. చక్కని శీర్షికలు రాస్తారు. అన్నీ బాగానే ఉన్నాయి. ఇవి పాఠకులకు విసుగు పుట్టించవా?' అని.*

*బాగుంది రమేష్ గారూ! ఒకటి చెప్పండి. సూర్యుడు విసుగు పుట్టిస్తున్నాడా? చంద్రుని చూసి విసిగి పోతున్నామా? మల్లెపూలు, మొగలిరేకులు పాతబడిపోతున్నాయా? జీవితం విసుగు పుడుతోందా? అంతేనండి! సౌందర్యం ఎప్పటికీ విసుగు చెందేది కాదు. **మిసిమి** నిత్య చైతన్యం అండీ! మీరు పని కానివ్వండి, అని నవ్వేసాను. మీరే చెప్పండి అవునా?*

# జీవన మకరందం

- ఇవ్వటంలోనే సంతోషం వుంది.
- విజ్ఞానానికి తెలివితేటలు ముఖ్యం.
  మతానికి విశ్వాసం ముఖ్యం!
- ఎంతగా ప్రయాణం చేస్తే అంతగా నిన్ను తెలుసుకుంటావు.
- ఇంట్లో నువ్వు – గడప దాటితే వూరు – ఊరు దాటితే దేశం –
  దేశపు హద్దులు దాటితే ప్రపంచంలో నువ్వు – ఎవ్వరు నువ్వు?
- సంసారం – కుటుంబం నీ అస్తిత్వాన్ని నిలుపుతాయి.
  నీ అస్తిత్వాన్ని పరంపరాగతం చేస్తాయి !
- నీకెవరయినా ప్రత్యేకంగా కనపడుతున్నారా?
  అయితే ఆ వ్యక్తి గురించి నీకు సరిగ్గా తెలియదన్నమాట!
- అవార్డులూ – బహుమతులు నీకు అహంకారం పెంచుతాయి! ఎదుటి వారికి అసూయ కలిగిస్తాయి!
- ఎవరో వస్తారని – ఏదో చేస్తారని ఎదురుచూడకుండా నీ కర్తవ్యం నీవు నిర్వహించు!
- అందరిలో లోపాలుంటాయి. ఎవరి లోపాలు వారు తెలుసుకుంటే – ప్రపంచం సవ్యంగా నడిచిపోతుంది!



- మనం సినిమాల్లో చూసినట్లు మంచివాళ్లు ఎప్పుడు మంచిగా వుండరు. చెడ్డవాళ్లు ఎప్పుడూ చెడ్డగా వుండరు!
- నీ చుట్టూ వున్న వారిని అదుపులో పెట్టాలని ప్రయత్నించకు– నిన్ను నువ్వు నియంత్రించుకో – అదే మేలు!
- మనిషిలో మంచి – చెడూ రెండూ వుంటాయి.
  పరిసరాలు, పరిస్థితులు వాటిని వెలికి తీస్తాయి.
- టెక్నాలజీ జీవితాన్ని తేలిక పరుస్తుంది.
  క్రమేపీ మెదడు మొద్దుబారిపోతుంది.
- సంతానాన్ని స్వేచ్ఛగా పెరగనివ్వాలి – (విచ్చలవిడిగా కాదు) లేకపోతే అందమైన చెట్టు బోన్సాయిలాగా మారిపోతుంది!
- కుటుంబంలో ఎవరి పాత్ర వారు చక్కగా పోషించాలి. తరతరాలుగా స్క్రిప్టు రాసే వుంది!
- ఈ ప్రపంచంలో – ఈ జీవితంలో చాలా విషయాలు మనకు తెలియవు!
- విశ్వాంతరాళంలో భూమి ఒక నక్షత్ర ధూళి రేణువు – అందులో మన పరిమాణం ఎంత? మనకీ అహంకారమెందుకు?
- భూమి మీద మసిలే అనంతకోటి ప్రాణుల్లో మనమూ వున్నాం. అన్నింటినీ అదుపు చేయాలని వృథా ప్రయత్నం చేస్తాం!
- వేదన బాధ నీకు జరిగే సంఘటనలో వుండదు. అది నీ మనసులో మొదలవుతుంది!
- నిష్ఠలోనే యోగముంది.
- ఆరోగ్యమే నీ జీవితంలోని గొప్ప రహస్యం!
- పూలకు ఎండపొడలాగా – మనకి హృదయంలో ప్రేమ ఉండాలి!
- మనిషి మనసులో ఏముందో ఎవరికీ తెలియదు!!

# ముండక ఉపనిషత్తు

**– ఆచార్య కోదాటి వియ్యన్నరావు**

**అ**థర్వ వేదానికి చెందిన ఉపనిషత్తులలో ముండకోపనిషత్తు ఒకటి. ఇంతకు ముందు సంచిక (ఫిబ్రవరి 2025) **మిసిమి**లో ప్రచురితమైన ప్రశ్నోపనిషత్తు కూడా ఒకటి. మండూఖ్యోపనిషత్తు కూడా అధర్వ వేదంలో భాగమే. పదకొండు ముఖ్యమైన ఉపనిషత్తులలో దీనిని కూడా ప్రధానమైనదిగా భావిస్తారు. అనేక ఇతర భాషలలోనికి ఎక్కువగా తర్జుమా చేయబడిన ఉపనిషత్తు లలో ఇది ఒకటి. భారత ప్రభుత్వ జాతీయ చిహ్నమైన నాలుగు పులులతో ఉండే గుర్తులో క్రింది భాగమైన పీఠంలో ఉన్న సత్యమేవ జయతే సూక్తి ఈ ఉపనిషత్తు నుండే గ్రహించబడింది.

అసలు ముండకం అంటే శిరోముండనం కావించ బడిన తల అని నిఘంటు అర్థంగా చెప్పబడింది. సన్యాసి అనేది మరొక అర్థం. వేదాలు నేర్చుకొనే విద్యార్థులు శిరోముండనం చేయించుకోవడం తప్పనిసరిగా పాటించే సంప్రదాయం. ఆ క్రతువు పేరే ఈ ఉపనిషత్తుకు వచ్చి ఉంటుందని వేరొక భాష్యం. ఉపనిషత్తుల వరకు దీనిని అజ్ఞానాన్ని తొలగించి, జ్ఞానాన్ని ప్రసాదించే విద్యను తెలియజేసేదిగా గ్రహించబడుతున్నది. అర్థానికి సంబంధించి వివరణ ఏ విధంగా ఉన్నా భాష్యకారులు దీనినొక ప్రధానమైన ఉపనిషత్తుగా భావించి వివరిస్తున్నారు. విషయపరంగా చూసినా, ఈ ఉపనిషత్తు ఎంతో ముఖ్యమైనది. చిన్నవైన ఉపనిషత్తులలో ఇది ఒకటి. ఇది మొత్తం మంత్రాల రూపంలో 64 శ్లోకాలు కలిగి ఉంది. దీని కంటే చిన్నదైన మండుఖ్య ఉపనిషత్తు కేవలం 12 శ్లోకాలతో ఈశోపనిషత్తు 18 శ్లోకాలతో కూర్చబడినది.

ముండక ఉపనిషత్తు మూడు భాగాలుగా ఉన్నది. మొదటి భాగంలో ఉన్నత మరియు తక్కువ (నిమ్న) జ్ఞానం గురించి 22 పద్యాలు (శ్లోకాలు), రెండవ భాగంలో ఆత్మ మరియు బ్రహ్మం యొక్క నిజ స్వభావాన్ని గూర్చి చెప్పే 21 పద్యాలు, మూడవ భాగంలో పై రెండింటితోపాటు. బ్రహ్మన్ని గురించిన ప్రత్యేక వివరణతో 21 పద్యాలు, మొత్తం 64 శ్లోకాలు లేదా పద్యాలతో కూర్చబడింది. కొద్ది మంది భాష్యకారుల ఉద్దేశ్యంలో ఈ ఉపనిషత్తు, మతతత్వ శాస్త్రంలో చెప్పబడిన సర్వదేవతా వాదానికి దగ్గరగా ఉంటుంది. ఈ ఉపనిషత్తును శౌనికుడనే ముని అంగీరసుడనే శిష్యునికి చెప్పినట్లుగా తెలుస్తుంది. ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు మొదటి భాగంలో జ్ఞానం గురించిన వివరణ ఉంది. ఈ ఉపనిషత్తు ప్రకారం జ్ఞానాన్ని రెండు రకాలుగా వర్గీకరించవచ్చు. ఒకటి ఉన్నత జ్ఞానం, రెండవది నిమ్న లేదా తక్కువ రకం జ్ఞానం. ఉన్నత జ్ఞానమంటే పరాన్ని గూర్చి తెలిపేది. పరమంటే పరలోకం లేదా నశింపు లేని, మరణం లేని ప్రపంచంగా చెప్పవచ్చు. దీనినే బ్రహ్మవిద్యగా పేర్కొన్నారు. బ్రహ్మను గురించి తెలుసుకోవడం ఉన్నత విద్య క్రిందకు వస్తుంది.

ఈ ఉపనిషత్తు ప్రకారం బ్రహ్మ దేవతలందరిలో మొదటివాడు. అతనే జ్ఞానం మొత్తానికి మూలపురుషుడు. పరమ సత్యం బ్రహ్మ ద్వారానే తెలుస్తుంది. ఈ ఉపనిషత్తు ఉన్నత జ్ఞానం యొక్క స్వభావాన్ని ఈ విధంగా విశదీకరించింది.

**యత్ తద్ ఆ ద్రేష్యమ్, అగ్రాహ్యమ్**
**అగోత్రం, అవర్ణమ్ !**
**అచాక్షుష్ శ్రోత్రమ్**
**తద్ అపాని పాదమ్ !**
**నిత్యమ్, వైభుమ్, సర్వగతమ్**
**శుశోక్షకమ్, తద్ అవ్యాయమ్ !**
**యద్ భూతాయోనిమ్**
**పరిపశ్యంతి ధీరా!**

కంటికి కనిపించనిది, ఏ విధంగాను కొరుకుడు పడనిది, గ్రాహ్య దుర్లభంగా ఉండేది, లక్షణాలు ఇవి అని చెప్పనలవి కానిది ఉన్నత జ్ఞానం. దానికి కళ్ళు, చెవులు, చేతులు, కాళ్ళు లేకుండగానే సర్వవ్యాప్తితమైనది, సృష్టికి మూలమైనది, ఉన్నత జ్ఞానం. జ్ఞానేంద్రియాలకు,

కర్మేంద్రియాలకు అతీతమైనది ఉన్నత జ్ఞానం. పూర్తి స్పృహ లేదా చైతన్యానికి (Pure Consciousness) ప్రతీక. స్పృహ (Consciousness)కు సంబంధించి, దీనిని నాల్గవ దశగా పేర్కొన్నారు. స్పృహకు సంబంధించిన నాలుగు దశలు ఈ విధంగా ఉన్నాయి. ఒకటి జాగ్రదావస్థ అంటే బాహ్య ప్రపంచాన్ని గూర్చిన మెళుకువ. రెండవది స్వప్నావస్థ ఈ స్థితిలో బాహ్య ప్రపంచాన్ని గూర్చిన స్పృహ ఉండదు. అంతర్గత ప్రపంచాన్ని గూర్చిన జిజ్ఞాస మొదలౌతుంది. మూడవది సుషుప్తావస్థ. ఈ స్థితిలో అంతర్గత, బాహ్య ప్రపంచాలను గూర్చిన స్పృహ ఉండదు. ఇంతకు ముందు ప్రశ్నోపనిషత్తులో తెలుసకొన్నట్లు స్వప్నావస్థలో మనస్సు మెళుకువగానే ఉంటుంది. ఇంద్రియాలు మాత్రమే విశ్రాంతి స్థితిలో ఉంటాయి. సుషుప్తావస్థలో మనస్సు కూడా విశ్రాంతి పొందుతుంది. ఒక్క చైతన్యం మాత్రమే స్పృహ కలిగి ఉంటుంది. అది కూడా అచేతనంగా మారితే, దేహం (కట్టె) మాత్రమే మిగులుతుంది. నిర్జీవంగా మారుతుంది. ఈ దశను తురీయావస్థ అంటారు. పై మూడు స్థాయిల కంటే మించినది. స్పృహకు సంబంధించి ఇదే శిఖరాగ్రదావస్థ.

ఇక తక్కువ లేదా నిమ్న జ్ఞానం కోవలోనికి ధ్వని లేదా శబ్ద శాస్త్రం కర్మకాండ, వ్యాకరణం, వ్యుత్పత్తి శాస్త్రం (Etymology) ఛందస్సు మొదలైనవి వస్తాయి. ఈ రెండు రకాల జ్ఞానానికి మధ్య ఉన్న సంబంధము, తేడా చాలా ఆసక్తికరమైనది. నిమ్న జ్ఞానం క్రియలు చేయడంలో సామర్థ్యాన్ని పెంచుతుంది. వాటిలో ఉత్కృష్ట స్థానాన్ని పొందడానికి వీలౌతుంది. ఉన్నత జ్ఞానం సాధనలో వీటి ఊసే ఉండదు. ఇవన్నీ కనుమరుగై, బ్రహ్మాన్ని గూర్చిన జిజ్ఞాస మొదలౌతుంది. తక్కువ జ్ఞానం ప్రయత్నంలో జ్ఞానం పొందే వ్యక్తికి, బాహ్య ప్రపంచానికి ఉన్న సంబంధ బాంధవ్యాల గుర్తింపును తెలుసుకొనే ప్రయత్నం అధికంగా ఉంటుంది. అదే ఉన్నత జ్ఞానం పొందే విషయంలో తనను గురించి తాను తెలుసుకోవడమే (Knowledge of the knower himself) ప్రధానం.

ముండకోపనిషత్తులో విపులంగా పేర్కొనబడిన మరొక అంశం కర్మకాండలకు సంబంధించినది. ఇది నిమ్న విజ్ఞానం క్రిందకు వస్తుంది. బాహ్య ప్రపంచంతో ఎక్కువ సంబంధం కలిగినవి ఈ కర్మకాండలు. వీటిని జరిపించే విధానం మంత్రాల రూపంలో ఉంటుంది. సాధారణ జీవనంలో మానవుడు అనుభవించే జన్మించడం, మరణించడం, వివాహం, ఉపనయనం వంటి దశలలో జరిగే కార్యక్రమాలనన్నింటిని ఈ కోవలో చెప్పవచ్చు. వీటిలో ప్రతి దశకు జరిపించే విధానం, పద్ధతి కొన్ని మంత్రాల రూపంలో ఉంది. ఆ విధంగా వీటిని జరిపిస్తేనే ఆశించిన ఫలితం ఒనగూడుతుంది. అగ్నిహోత్రం వీటిలో మరింత ముఖ్యమైనదిగా చెప్పబడింది. హోమం కోసం గాని, యజ్ఞం కోసం కాని అగ్నిని రాజేయడం, దానికి వస్తు సామాగ్రిని సమర్పించడం, ఎప్పుడు, ఏ విధంగా చేయాలి లేదా ఆచరించాలి అన్నవి స్పష్టంగా తెలియజేయ బడ్డాయి. అగ్నిహోత్రం చేయడానికి ఎన్నుకునే రోజులకు సంబంధించి, నెల పొడుపు రోజు గాని, పూర్ణిమ రోజు గాని, ఏరువాక రోజు గాని ఎన్నుకోవడం సూచించ బడింది. ఈ కార్యక్రమం జరిపించడానికి ఎనిమిది నియమాలను ఏర్పరించింది. పై వాటితో పాటుగా, అతిథులు లేకుండాను, సమర్పణలు లేకుండా, విశ్వంలోని దేవతలను పూజించకుండా, ధార్మిక సంప్రదాయాలకు విరుద్ధంగా నిర్వహించే అగ్నిహోత్రం ఫలితాన్ని ఇవ్వదు. అట్లే యజ్ఞాన్ని నిర్వహించడంలో 18 మంది వ్యక్తుల ప్రమేయం (హాజరు) తప్పకుండా ఉండాలి. అందులో వివిధ వేదాలు తెలిసిన 16 మంది గురువులు, యజమాని, అతని భార్య. వీరు లేకుండా నిర్వహించిన యజ్ఞం ఫలితాన్ని ఇవ్వదు.

ముండక ఉపనిషత్తు రెండవ భాగంలో పర విద్య అంటే బ్రహ్మాన్ని గురించిన సవివరణ ఉంది. జగత్తుకి సుప్రీం అధిపతి, పురుషుడు బ్రహ్మయే. పరమ పురుషుడైన బ్రహ్మాన్ని గురించి ఆయన నిర్విరాకారుడని జన్మలేనివాడని, నిర్గుణుడని, పవిత్రుడని చెప్పబడింది. బ్రహ్మ విరాట్ స్వరూపుడు, అగ్ని అతని శిరస్సు, సూర్యుడు, చంద్రుడు అతని రెండు కళ్ళు, నాలుగు దిక్కులు అతని చెవులు, వేదాలే అతని వాక్కు, వాయువు అతని శ్వాస, విశ్వం అతని హృదయం, అతని పాదాల నుండే భూమి ఉద్భవించింది. మొత్తంగా జీవులందరి ఆత్మ ఆయనే. ఇది స్థూలంగా బ్రహ్మ యొక్క స్వరూపమని చెప్పబడింది.

బ్రహ్మం నుండే ప్రాణము, మెదడు లేదా మనస్సు అన్ని ఇంద్రియాలు, ప్రకృతిలోని ఇతర పదార్థాలైనటువంటి

ఆకాశము, గాలి, నిప్పు, నీరు మరియు సృష్టిలో జీవ జాలాన్నంతా భరించే భూమి ఉద్భవించాయి. అందువలన బ్రహ్మము, విశ్వము ఒక్కటే అనే భావన ఏర్పడుతున్నది. బ్రహ్మతత్వాన్ని గూర్చి ఈ భాగంలో రెండవ కాండలో మరింత విపులంగా తెలియజేయడం జరిగింది. ఇందులోని ఎక్కువ శ్లోకాలుమన మనస్సును, దృష్టిని పరమ పురుషుడైన బ్రహ్మని ఏ విధంగా చేరుకోగలం అన్నఅంశం పై దృష్టి సారించాయి. పరిపూర్ణత్వాన్ని పొందడానికి వ్యక్తిత్వాన్ని బ్రహ్మనికి లోబరచడమే సరైన మార్గం. ధ్యానం ద్వారా దీనిని కొంతవరకు సాధించగలం. ఆత్మను గూర్చిన జిజ్ఞాస బలమై, మరింత లోతుగా విచారణ గావించిన యెడల అంతిమ వాస్తవికత లేదా కేవల జ్ఞానం గోచరమవు తుంది. ఇదియే ఆత్మను, పరమాత్మలో కలపడంగా పరిగణించవచ్చు. దీని కోసమే యోగులు నిరంతరం కృషి చేస్తుంటారు. ఆత్మలోని అత్యంత లోపలి కోశంలో బ్రహ్మ నివసిస్తుంటాడు. ఆయన మచ్చలేని, విభజనకు వీలుకాని పవిత్రమైన పదార్థము. అదియే అన్ని కాంతులకు మూలము. అది స్వయం ప్రకాశితము. దానిని సూర్యుడు కాని, చంద్రుడు కాని, నక్షత్రములు కాని, మెరుపు కాని కాంతివంతం చేయలేవు. ఎందుచేతననగా అదియే అన్ని రకములైన కాంతులకు మూలము. దీని నుండే ఇవన్నీ జనిస్తాయి. ఈ విధంగా ప్రపంచమే బ్రహ్మంగా చెప్పబడుతున్నది

ముండక ఉపనిషత్తు యొక్క మూడవ భాగంలో సత్యమంటే ఏది? దానిని ఏ విధంగా గ్రహించాలి? ఆధ్యాత్మిక ఉపకరణాలు ఏవి? వాటిని ఏ విధంగా సాధించాలి? పవిత్రీకరణ అంటే ఏమిటి? ఒక మంచి సాధువుకు ఉండవలసిన లక్షణాలు ఏవి? వాటిని ఏ విధంగా సాధించాలి? అన్న విషయాలు సవివరంగా తెలియజేయబడ్డాయి. సత్యానికి సంబంధించిన విషయాన్ని విడమర్చి చెప్పడం ద్వారా ముండక ఉపనిషత్తు, మిగిలిన వాటి కంటే ప్రముఖ స్థానాన్ని ఆక్రమించింది. బ్రహ్మన్ని తెలుసుకోవడంలో సత్యమార్గమే సరైనది. సత్యానికి సంబంధించి బహుళ ప్రచారంలో ఉన్న ఎన్నో సూక్తులు ఈ ఉపనిషత్తు నుండే ఉద్భవించాయి.

ఇంతకు ముందు చెప్పుకొన్నట్లు బారత ప్రభుత్వ అధికారిక చిహ్నంలో ఉన్న సత్యమేవ జయతే దీని నుండే గ్రహించబడినది. అట్లే సత్యే సర్వం ప్రతిష్టితమ్ అన్ని కాలాల యందు, అన్ని చోట్లా సత్యమే నిలిచి ఉంటుంది. గాంధీజీ తన జీవిత చరిత్రకు పెట్టిన పేరు సత్యంతో నా ప్రయోగాలు. ఇన్ని విధాలుగా ప్రముఖమైన సత్యమునందే బ్రహ్మ నిలిచి ఉన్నాడు. సత్యమే మానవాళి ఆచరించదగిన ధర్మం. అన్ని ధర్మాలు సత్యము నందే ప్రక్షిప్తమై ఉన్నాయి. సత్యాన్ని పాటించే వానికి జ్ఞానం దానంతట అదే బహుమతి వలె లభిస్తుంది. దానిని పొందడానికి మానవుడు తన మనస్సును, మేధస్సును పవిత్రం చేసుకోవాలి. అట్లే ప్రాణానికి సంబంధించిన పది ఇంద్రియాలను పరిశుద్ధం చేసుకోవాలి. ఆ సందర్భంలో విశుద్ధ సత్వము అనుభవం లోనికి వస్తుంది. ఇదే స్వచ్ఛమైనది, సత్యమైనది. స్వచ్ఛమైన, నిత్యమైన ఈ సత్యమే పరమాత్మ. పరిశుద్ధం కావించుకోవడం అనేది జ్ఞానకాంతికి తొలిమెట్టు. సత్యాన్ని తెలుసుకోవడానికి, ఆధ్యాత్మిక ఉపకరణాలుగా మనస్సును లగ్నం చేయడం, ఆత్మ పై నియంత్రణ, ప్రశాంతతను సాధించడం వంటివి పేర్కొనబడ్డాయి. ఇవన్నీ సత్యాన్వేషణలో ఉపకరించే సాధనాలుగా గుర్తించాలి.

ఆ పైన ఒక మంచి సాధువుకు ఉండవలసిన లక్షణాలను వివరిస్తూ ఎన్నో ముఖ్య విషయాలను పేర్కొనడం జరిగింది. దరిదాపు 25 లక్షణాల జాబితాను ఈ ఉపనిషత్తు గుర్తించింది. వాటిలో ముఖ్యమైనవి: కోరికల నుండి విముక్తి పొందడం, ఆత్మను గురించిన వివేచన, స్వీయ క్రమశిక్షణ, బంధాలు ఏమీ లేకపోవడం, ఇంద్రియ నిగ్రహం, రెండు రకాల విజ్ఞానం పై అవగాహన, యోగ సాధన, బాహ్య ప్రపంచానికి దూరంగా ఉండటం (Jivanmukti), షోడశ కళలను అంతర్లీనం చేసుకోవడం, ఇవన్నీ సాధన చేసిన వ్యక్తి తప్పని సరిగా బ్రహ్మన్ని తెలుసుకోగలుగుతాడు. అంతిమంగా తానే బ్రహ్మగా పరివర్తన చెందుతాడు. బ్రహ్మన్ని తెలుసుకోవాలనే తృష్ణయే (బలమైన కోరిక) దానిని చేరుకొనే మార్గాన్ని సూచిస్తుంది (Aspiration leads to Revelation). ముండక ఉపనిషత్తు ప్రకారం ముక్తి రెండు రకాలు. ఒకటి క్రామ ముక్తి. దీని ప్రకారం సాధకులు ఇంకను వాంచలతో తపిస్తూ డడం చేత, జీవించి ఉండగనే ముక్తిని సాధించలేరు. అట్టివారు మొదటగా ఊర్ధ్వ లోకాలకు పయనమై ఆ కోరికలు తీరిన తరువాత బ్రహ్మ లోకాన్ని చేరెదరు. అచ్చట బ్రహ్మయే గురువుగా బ్రహ్మతత్వాన్ని తెలియజేసి ముక్తిని

ప్రసాదిస్తాడు. రెండవది విదేహముక్తి. ఈ స్థితిలో దేహం ఏయే అంశాలతో కూర్చబడినదో అవన్నీ వాటి వాటి స్థానాలకు తిరిగి పయనమవుతాయి. ఇంతకు ముందు ప్రశ్నోపనిషత్తులో షోడశ కళలను గూర్చి తెలుసుకొన్నాము. అవి ఐదు కర్మేంద్రియాలు, ఐదు జ్ఞానేంద్రియాలు, పంచభూతాలు, ఒక మనస్సు, దేహం అచేతనం అయిన తరువాత అవి ఏ విధంగా వివిధ దేవతలు (స్థానాలు) నుండి దేహంలోనికి వచ్చి చేరినాయో, అదే విధంగా తిరిగి వాటిలో విలీనం చెందుతాయి.బ్రహ్మన్ని ఎరిగిన వాడు బ్రహ్మమే అవుతాడు. భవబంధాల నుండి విముక్తుడై శాశ్వతత్వాన్ని పొందుతాడు.

మిగిలిన ఉపనిషత్తుల కంటే భిన్నంగా ఈ ఉపనిషత్తును గురించి తెలుసుకొనగోరే వారికి కొన్ని అర్హత ప్రమాణాలను నిర్దేశించింది. ఎవరికి ఈ ఉపనిషత్తును బోధించాలనే విషయంగా కొన్ని తరగతల వారిని పేర్కొంది. వారు కర్మ కాండను శ్రద్ధగా పాటించేవారు, వేదాలను అధ్యయనం చేసేవారు, బ్రహ్మన్ని తెలుసుకోవాలనే జిజ్ఞాస కలిగిన వారు, కర్మకాండ ద్వారా జన్మించిన అగ్నిని పూజించే వారు, ఆ అగ్నిని శిరస్సున ధరించే వారు, బ్రహ్మతత్వం పై పూర్తి విశ్వాసం ఉన్నవారు. వీరందరు ఈ ఉపనిషత్తును తెలుసుకోవడానికి, బోధించడానికి అర్హులు. ఈ విధంగా ముండకోపనిషత్తు శాంతి మంత్రంతో ముగుస్తుంది. నిజానికి ప్రతి ఉపనిషత్తు అంతంలో శాంతి మంత్రం చెప్పడం జరుగుతుంది. అదే ఓం శాంతి! ఓం శాంతి! ఓం శాంతి! మూడుసార్లు. ఇంకా కొంచెం విపులంగా వివరిస్తే ఓ దేవతలారా ఏదైతే ప్రవిత్రమైనదో దానినే మమ్ములను విననీయండి, దానినే పూజింపనీయండి. కన్నుల దర్శింపజేయండి. మమ్ములను పురోగతిలోనికి, అంతిమంగా ఆనందలోకానికి జేరనీయండి. మమ్ములను సదాకాపాడు, ఊర్ధ్వలోకాలకు అనుమతి ప్రసాదించండి.

ఆచార్య కోదాటి వియ్యన్నరావు
పూర్వ ఉపకులపతి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం
చరవాణి : 7093260655

## కమ్మతెమ్మెరలు




**మిసిమి** జనవరి 2025 సంచికలో ప్రచురింపబడిన అమెరికన్ ఈగల్, కవిత్వతత్వం, బోయి భీమన్న, రాజ్యాంగ శాసనసభ చర్చ మొదలగునవి చాలా ఆసక్తికరంగా విషయపరంగా బాగున్నాయి. సాధారణంగా నిజాన్ని తెలియజేయాల్సిన జర్నలిజం పత్రికలు గాని సంచికలు గాని లాలూచీపడినప్పుడు అనగా డబ్బు వ్యవహారాల్లో లావాదేవీల్లో పడినప్పుడు నిజం బయటికి రాదు. ఆ విధంగా కాకుండా **మిసిమి** పత్రిక చాలా వరకు నిజాల ద్వారా పాఠకుల్ని ప్రభావితం చేస్తుంది అందువల్ల ఈ పత్రిక నాకు చాలా నచ్చింది.

*- డాక్టర్ కాసర్ల రంగారావు, హన్మకొండ*

**మిసిమి** ఫిబ్రవరి సంచిక చేతికి అందింది. ముందుగా మీకు మనసారా కృతజ్ఞతలు. నాకు అవకాశం ఇచ్చి ప్రోత్సహిస్తున్న మీ సౌజన్యానికి శిరసా నమామి. చేతికి సంచిక అందగానే ముందుగా మీ సంపాదకీయం చదువుతాను. 'తరలిపోతున్న తరాలు' ఒక అపూర్వ చిత్రం. కాలాన్ని పట్టి ఒకే పేజీలో బంధించి కళ్ళ ముందు ఒక శతాబ్దపు పరిణామాలను రాశి పోసి అద్భుత దృశ్యాలను ఆవిష్కరించారు. Hats off to you sir. మీకు మనసారా అభినందనలు.




*నీ ఆలోచనలే నీ చర్యలకు మూలం*
*నీ సంస్కారమే నీ ఆలోచనకు ధాతువు!*

*అద్వైతం అంటే అన్నింటికీ అతీతం కాదు.*
*అద్వైతం అంటే అన్నిటితో మమేకం కావటం!*

ఎంత బాగా చెప్పారు సార్. చిన్ని వాక్యంలో ఎంత లోతైన భావాన్ని నింపారు.

*- హరినాథ్*

# విజ్ఞానం - విశ్వాసం

**- డా. అవధానం రఘుకుమార్**

బహుశా, బహుశా అని ఎందుకు అంటున్నానంటే, గత మూడు దశాబ్దాల నా అధ్యయనం అనేక సంపూర్ణ సత్యాలను ప్రశ్నించేలా చేసింది కాబట్టి. ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అన్నీ అసంపూర్ణ సత్యాలనే మిగిల్చింది. "ఏకం సత్ విప్రా బహుధా వదంతి" మాత్రమే కాదు, అసలు "ఏకం సత్" అనే ప్రతిపాదనే నా మనసుకి ప్రశ్నార్థకం అయ్యింది. 1999-2000ల మధ్య ఆనాటికి నేను తెలుసుకున్న జ్ఞానం మొత్తం ప్రశ్నార్థకమై ప్రారంభం అయిన ఈ ప్రశ్నల పరంపర ఇంకా తన విధ్వంసాన్ని కొనసాగిస్తూనే వుంది. ముఖ్యంగా నన్ను అతలాకుతలం చేసిన అంశం- "సాంప్రదాయం" "ఆధునికత"ల ఈ దేశపు అన్ని సామాజిక, వ్యక్తి జీవిత పార్శ్వాలని స్పృశించిన ఈ ఆధునికత ఎన్నో సాంప్రదాయ వాదనలను వెనక్కి నెట్టేసింది. కానీ కొత్త వైషమ్యాలకు భూమిక అయ్యింది. గతంలోలాగా ఇక మనుషులు మనుషులుగా లేరు. వర్గాలుగా, కులాలుగా, సజీవం వున్న ప్రాణుల కంటే ఒక సంఖ్యగా మారుతున్నారు. నీవు ఎవ్వరూ? అంటే నేను హృదయం, ఆత్మ, బుద్ధి, జ్ఞానం, ఆలోచన, అభిప్రాయాలూ, ప్రేమ, కోపం వున్న ప్రాణి కాదు. నేను ఏదో ఒక సమూహంలో ఓ సంఖ్య! అప్రతిహతంగా సాగుతోన్న ఈ ఆధునిక విజయ యాత్ర అంతకు ముందు కొన్ని వేల ఏళ్లుగా మనిషి గొప్ప నిజాలుగా భావించిన అనేక భావనలను వెనక్కి నెట్టేసింది. నేను ఆధునికుణ్ణి. మా నాన్న సాంప్రదాయ వాది. నేను పురోగామి. మా నాన్న తిరోగామి లేదా కాల గమనంలో ఆగి పోయిన మానవుడు.

19వ శతాబ్దం యూరోప్ సాంస్కృతిక, సామాజిక రంగాలు తొలుత ఈ ఆధునికతకు ఆకర్షింపబడ్డాయి. అంతకు ముందు రెండు, మూడు వందల ఏళ్లుగా యూరోప్ రాజకీయ, ఆర్థిక ముఖచిత్రం అనేక మార్పులకు లోనవ్వడం మొదలు పెట్టింది. ఒక వైపు చర్చికి, రాజ్యానికి జరుగుతోన్న సుదీర్ఘ సంఘర్షణ లౌకిక వాదం (సెక్యులరిజమ్) అనే రాజకీయ సిద్ధాంతాన్ని తెర పైకి తెచ్చింది. మతం వ్యక్తి గతం. ఏ వ్యక్తి ఏ మతాన్ని అవలంబించినా ప్రభుత్వానికి తనదైన ప్రత్యేకమైన మతం వుండదు. అలాగని అది నిరీశ్వర వాదమేమి కాదు. బైబిల్ లో ఒక మాట వుంటుంది. దేవుడుకి ఇవ్వవలసింది దేవుడికీ, రాజుకు ఇవ్వవలసింది రాజుకు ఇచ్చేయమని. ఈ మాట ఈ నూతన లౌకిక వాద రాజకీయ సిద్ధాంతానికి బలం ఇచ్చింది. ఒక దేశ పౌరుడు రాజ్యాన్ని గౌరవిస్తూ, దాని చట్టాలను, వ్యవస్థలనూ గౌరవిస్తూ తనకు నచ్చిన మతాన్ని అవలంబించవచ్చును. ఇదే సమయంలో విజ్ఞాన శాస్త్రం వడివడిగా అడుగులు ముందుకు వేస్తోంది. భూమి బల్లపరుపుగా లేదు. భూమి గుండ్రంగా వుంది, తన చుట్టూ తాను తిరుగుతోంది, సూర్యుడి చుట్టూ తిరుగుతోంది. ఈ ఆవిష్కరణ అప్పటిదాకా మత గ్రంథాలు చెబుతోన్న అనేకానేక విషయాలను తిరస్కరించింది. ఈలోగా డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతాలు సృష్టికర్త మనుగడకే ఎసరుపెట్టింది. ఏకకణ జీవి నుండి బహుకణ జీవుల జీవపదార్థాల ఎదుగుదలలో అనేక మార్పుల ఫలితమే మనిషి. న్యూటన్ సిద్ధాంతాలు మరో వైపు నుండి భౌతిక ప్రపంచపు చలన సూత్రాల గుట్టు విప్పుతోంది. భూమి గుండ్రంగా వుంది, తన చుట్టూ తిరుగుతోంది, సూరీడు చుట్టూ తిరుగుతోంది. ఏ ఆది శేషువు లేదు, ఏ ఏనుగు లేదు. ఈ భూగోళం ఆకాశంలో ఎలా వేలాడుతోందో, ఈ గ్రహరాసి సంబంధాలలో గురుత్వాకర్షణ శక్తి ఏమిటో, ఎందుకు అవి అలా వుండగలవో అన్న రహస్యం ఛేదింపబడుతోంది. రసవాదం రసాయన శాస్త్రంగా మారుతోంది. పదార్థాలను ముక్కలుముక్కలుగా చేసి అణువుల, పరమాణువుల రహస్య ఛేదన మొదలయ్యింది. భౌతిక శాస్త్రం ఒక్కొక ఆవిష్కరణతో సాంప్రదాయ జ్ఞానం వేల ముక్కలు అవుతోంది.

ఈ వైజ్ఞానిక ఆవిష్కరణలు సామాజిక, సాంఘీక శాస్త్రాల మీద, ఆపైన తత్వ శాస్త్రం మీద చాలా బలమైన ప్రభావాన్నే చూపించాయి. తత్వశాస్త్రం ఈ ప్రకంపనలను ఎలా అర్థం చేసుకోవాలి, ఎలా సంభ్రమాశ్చర్యాలకు లోనయ్యి ఉక్కిరిబిక్కిరి అవుతోన్న మనిషిని ఎలా తిరిగి నిలబెట్టాలి, ఎలా తిరిగి జీవితాన్ని సమన్వయం పరచుకోవాలి అన్న ప్రయత్నం మొదలు పెట్టింది. ఇక

ఏ విషయానికైనా విజ్ఞాన శాస్త్రమే పరిష్కారం అనే భావన యూరోప్ మొత్తం వ్యాపించింది. ఫ్రాన్సిస్ బేకన్ ఈ వాదనలకు ఆద్యుడు. మరోవైపు దే కార్త్ అనుమానపు కనీస స్థితికి వెళ్ళి "నేను ఆలోచిస్తున్నాను, నేను వున్నాను" అనే ప్రతిపాదన తీసుకొచ్చేశాడు. హేతువాద, యంత్ర వాద, ఆధునిక తత్వశాస్త్ర పితామహుడు అయ్యాడు. మరోవైపు సామాజిక తత్వ శాస్త్రం "మానవుడే అన్ని ఆలోచనలకు కొలబద్ద" అనే వైపు కదలడం మొదలు పెట్టింది. ఆ ప్రయాణం మరింత ముందుకు సాగి నాస్తిక వాదం, హేతు వాదం, పదార్థ వాదం, ఇలా పరిణామం చెందుతూ, చెందుతూ, అభివృద్ధి పథంలో, అభ్యుదయ మార్గంలో మనిషి ప్రయాణం సాగుతోంది. 19వ శతాబ్దపు చివరికి ఫ్రెడెరిక్ నీచ "భగవంతుడు మరణించాడు" అనే ప్రకటన చేస్తాడు. అంటే ఇక మనిషిని మనిషే ఉద్ధరించు కోవాలి, నీతి, నియమం, జీవనం, సమాజ నిర్మాణం.. అన్నింటికీ మనిషే ఆధారం. పాపపుణ్యాలు లేవు, స్వర్గ నరకాలు లేవు. మధ్యలో ఇమ్మానుయేల్ కాంత్ ఈ విపరితత ధోరణులకు కొంత అడ్డుకట్ట వేసినా చారిత్రక గతి ఆయనను దాటేసింది.

అంతిమంగా తాత్విక ప్రపంచంలో న్యూటన్ లేదా ఐన్స్టీన్‌ల భౌతిక శాస్త్రం, సామాజిక శాస్త్రాలలో ఆదమ్ స్మిత్ స్వేచ్ఛా విఫణి ఆధారిత క్యాపిటలిజం, మార్క్స్ - ఎంగెల్స్‌ల గతితార్కికతపై ఆధారపడిన సామ్యవాదం, లూయిా మోర్గాన్ ఆంత్రోపాలజీ, ఏమిలి దర్క్ హీమ్ సోషియాలజీ, ఫ్రాయిడ్ మనోవిశ్లేషణ శాస్త్రాలు ఉన్నత స్థితిని తీసుకున్నాయి. రాజకీయ సిద్ధాంతాలలో లౌకిక వాదం రాజ్యం వరకు దేవుడి అస్తిత్వాన్ని దాదాపు నిరాకరించింది. కానీ ఆ తరువాతి తత్వశాస్త్రం సృష్టికర్త, దేవుడూ అనే వాటి అస్తిత్వాన్ని ప్రశ్నించడమే కాదు, మానవ జ్ఞాన పరిధి నుండి ఈ భావాలకు ఉద్వాసన పలికింది. 19 వ శతాబ్దం మనిషిని మనిషి కాళ్ళ మీద నిలబెట్టింది.

సృష్టి కర్త, దేవుడు వున్నాడు అన్న ఆలోచన ఎంత పాతదో దేవుడు లేడూ అన్నది కూడా అంతే పాతది. గ్రీకు పదం అతియోస్‌కు అర్థం దేవుడు లేడు అనే భావన. 1882లో ఈ "నిరీశ్వర వాదం" ఒక సహజ మతం అంటాడు జె. ఆర్. సీలే అనే రచయిత. అంటే నిరీశ్వర వాదం శాస్త్రీయ పరిశోధనల ఫలితం మాత్రమే కాదు. అది కూడా ఒక సహజ స్థితి, సహజ మతం. 2500 ఏళ్ల క్రితమే అంటే దాదాపు సోక్రటీస్ కంటే ముందే గ్రీస్‌లో డెమోక్రీటస్ అణువాదం అనే భావన ప్రవేశపెడతాడు. అనక్సాగోరస్ (క్రీ.పూ 500-428) అనే ఒక నిరీశ్వరవాది సూర్యుడు ఒక మండుతున్న ఒక గోళం అంటాడు. దానికి శిక్షింపబడతాడు. అదే సమయంలో డయాగోరస్ అనే సాహిత్యకారుడు అవిశ్వాసి అనే ఆరోపణపై మరణశిక్షకు గురవుతాడు. అదే సమయంలో ప్రొటాగోరస్ అనే తత్వ వేత్త "దేవుడు వున్నాడో లేడో నేను కనుగొనలేక పోతున్నాను" అంటాడు. అంతిమంగా ఎపిక్యూరస్ (బి సి 300) పదార్థ వాదాన్ని ప్రతిపాదిస్తాడు. ఈ విశ్వం అంతా కూడా ఎవరూ సృష్టించింది కాదు, ఇది అంతుబట్టని ఒక ఆకస్మాత్ సంఘటన లేదా అవకాశం అంటాడు.

మన దేశంలో కూడా నిరీశ్వర, పదార్థ వాదాలు కొత్తవి కావు. చాలా పురాతన కాలంలోనే "నాస్తికో వేద నిందకః" అనే మాట ఒకటి వుంది. ఇది దేవుడు అనే భావనను నిరాకరించిన ఆలోచనలకు నిందాపూర్వకమైన మాటే. అయితే భారత దేశపు వేద మత సాహిత్యంలో ఈ "నాస్తిక" అన్న పదం వేదాల ప్రామాణీకతను వ్యతిరేకించిన వారిని, ఆత్మ నిత్యతను, పునర్జన్మను నిరాకరించిన ఆలోచనల ప్రస్తావనలో వాడుతారు. బౌద్ధ, జైన, లోకాయత వాదనలను అవైదికాలు అంటారు. లోకాయతం అంటే లోకంతో కూడినది, లోకానికి చెందినది. అంటే మనకు కనబడే, మనం చూడగలిగే, స్పృశించ గలిగే, .. లోకమే లోకం. ఆపైన ఏమీ లేదు. లోకాయతులకు చార్వాకులు అని కూడా పేరు. బహుశా చార్వాకుడు అనే ఒక వ్యక్తి గావచ్చును లేదా అందంగా మాట్లాడేవారు అని కూడా అనుకోవచ్చును. ఈ భౌతిక ప్రపంచం నాలుగు మౌలిక పదార్థాలతో - అగ్ని, గాలి, నీరు, మట్టి తయారు అయ్యింది. స్వర్గం, నరకం అంటూ ఏమీ లేవు. ప్రత్యక్షమే ప్రమాణం. శరీరం, ఆత్మ వేరు కావు. ఆత్మ శాశ్వతం కాదు. శరీరం నశించగానే ఆత్మ కూడా పోతుంది. లోకాయతలు, చార్వాకులు కాక ఇంకా అనేక మంది భౌతిక వాదులు వున్నారు - పూరణ కశ్యప, గోశాల, అజిత కేశ కంబళి, కాత్యాయన, సంజయ వేలతి పుత్త, నిగంఠనాత పుత్త. ఇక గౌతమ బుద్ధుడు అన్ని రకాల వైదిక దేవతలను, యజ్ఞయాగాదులను, ఆరాధనాలను, మొత్తంగా వైదిక మతాన్నే తిరస్కరించాడు. ఒక నూతన మతం లేదా జీవన విధానం స్థాపించాడు. అలాగే జైన

మతం కూడాను. అయితే బౌద్ధంలో బుద్ధుడే ఆరాధన మూర్తి కావడం, జైనం తరువాతి వేదమత రూపమైన భాగవత, హిందూ మతాలలో దాదాపు కలసిపోవడం జరిగినది. మొత్తం మీద విషయం ఏమిటంటే ఇక్కడ కూడా నాస్తిక, పదార్థ భావనలకు సుదీర్ఘ చరిత్రే వుంది.

ఇలా ప్రపంచ మానవ చరిత్రలోనూ, భారత దేశంలోనూ "ఉన్నాడు", "లేడు" "కలడో, లేడో" అన్న ఆలోచనల సంఘర్షణ గత రెండు, మూడు వేల ఏళ్లుగా నడుస్తూనే వుంది. 20వ శతాబ్దపు మధ్య కాలానికి విజ్ఞాన శాస్త్రం, నాస్తిక, పదార్థ, భౌతిక వాదాలు మతం పై తుది విజయాన్ని పొందినట్టే అనిపించింది! దేవుడు లేడు, అంతిమ విజయం శాస్త్రీయ విజ్ఞానందే అనే నమ్మకం వచ్చేసింది. మతం, దేవుడు అనే భావనలు, మాటలు, చర్చలు అజ్ఞానానికి నిదర్శనాలు. వాటిని నమ్మే వారు మానవ పురోగతిలో ఆగిపోయిన గుర్తులు మాత్రమే. శాస్త్ర విజ్ఞానం మనిషి సమస్యలను, సృష్టి రహస్యాలను ఛేదించ గలదు, మనిషి ఈ విశ్వంలో బ్రతకడానికి సైన్స్ ఒక్కటి చాలు అనే మాట అన్ని ఇతర ఆలోచనలనూ దాదాపుగా మళ్ళీ కోలుకోలేనంత దెబ్బ కొట్టేసింది.

విశ్వాసి బిక్కుబిక్కుమంటూ ఎక్కడో సమాజపు మూలలో కనీకనబడని చీకటిలోకి వెళ్ళిపోయాడు లేదా తన ఇంట్లో ఓ మూల పూజా గదికి పరిమితం అయ్యాడు. మతం మళ్ళీ లేస్తుంది, మళ్ళీ తన జూలు విదుపుతుంది, ఘర్జిస్తుందీ అని కాస్తో, కూస్తో చదువుకున్న వాళ్ళు ఎవ్వరూ ఇరవయ్యవ శతాబ్దపు మధ్య కాలానికి అనుకోలేదు. కానీ ఇరవై ఒకటో శతాబ్దం భూగోళపు అన్ని భాగాలను ఒక్కసారిగా కదిపి లేపింది. సుదీర్ఘ నిద్ర వదిలించుకుని, జూలు విదుపుతూ చీకటి గుహలలోనుండీ సింహాలు ఘర్జిస్తున్నాయి. సుప్త భుజంగాలు కుబుసం వదలి పడగలెత్తుతున్నాయి. యముని మహిషపు లోహ ఘంటలు మబ్బు చాటున కణేల్మన్నాయి. నరకలోకపు జాగిలమ్ములు గొలుసు తెంచుకు ఉరికి పడ్డాయి. గతం అనుకున్నది వర్తమానం అయ్యింది, భవిష్యత్తు కూడా ఆదేనేమో అన్నట్టుగా వుంది. ఇండియా లాంటి మూడవ ప్రపంచపు అనుభవాలను, బాధను, ఏడుపును, మొరను గుర్తించని, పట్టించుకోని "అల వైకుంఠపురంబులో నగరిలో నామూల సౌధంబు దాపల" లక్ష్మీదేవితో సరసం ఆడుతోన్న ఆధునిక విష్ణువు, అగ్ర రాజ్యం అమెరికా రెండు గోపురాల విధ్వంసంతో ఉలిక్కి పడింది. యూరోప్ కొత్త నిజాలను గుర్తించ వలసి వచ్చింది. స్వేచ్ఛాస్వతంత్రతలకు పురిటి గడ్డ ఫ్రాన్స్ విలువలు వాళ్ళ సమాజంలోనే ప్రశ్నార్థకం అయ్యాయి. లౌకిక వాదం, సామ్యవాదం ప్రపంచంలోని అనేక ప్రాంతాలలో కుదేలుమన్నాయి. విప్లవాల బిడ్డ, సామ్యవాద సామ్రాజ్యం 1985-90ల మధ్య కూలిపోవడం మొదలయ్యి, పూర్తి కూడా అయ్యింది. మతాలకు అతీతమైన కొత్త మతం పంతొమ్మిదవ శతాబ్దపు చివరి రోజుల్లో పుట్టి, ఇరవైయ్యవ శతాబ్దపు మలి నాళ్లకు అదృశ్యం అయ్యింది. బహుశా మార్క్స్ మళ్ళీ నిద్ర లేస్తే బ్రహ్మ రావణుడి గురించి అడిగిన ప్రశ్నే అడిగేవాడేమో? ఏమయ్యింది నా ఆలోచనల ఫలితంగా పుట్టిన సామ్యవాద తొలి బిడ్డ? 1950లలో భారత దేశపు తాత్వికతలోకి ప్రవేశించి, 1976లో రాజ్యాంగంలోకి సాధికారిక రూపం తీసుకున్న లౌకిక, సామ్యవాద పునాదులు 1990ల నాటికి సంక్షోభంలోకి వెళ్ళి పోయాయి. అప్పటిదాకా తిరుగు లేదు అనుకున్న అనేక సామాజిక భావనలు, సిద్ధాంతాలు సాంప్రదాయపు పెను తుఫాను గాలికి రెపరెపలాడడం మొదలయ్యాయి.

ఒక్క యూరోప్, అమెరికా, ఇండియాలే కాదు. లౌకిక ప్రపంచ అనుభవమే ప్రశ్నార్థకం అయ్యింది. ఆధునికత అనే ప్రాజెక్టుకు మొదటిసారి ఒక బలమైన దెబ్బతగిలింది. నిజానికి చరిత్ర గతిని జాగ్రత్తగా గమనిస్తే 1970ల నాటికే మతతత్వవాదం ప్రపంచమంతటా తనను తాను పునరుద్ధరించుకునే ప్రయత్నం మొదలు పెట్టింది. కానీ ఆధునికత ఒక రకమైన విజయపు మత్తులో వుంది. వాస్తవ ప్రపంచాన్ని పరిశీలించడం మానేసింది. ఆ తరువాత నెమ్మదిగా అభివృద్ధి చెందిన, చెందుతూన్న, చెందని దేశాలన్నింటిలో కాలం ఆగి, వెనక్కి ప్రయాణం మొదలు పెట్టినట్టు అనిపించడం మొదలయ్యింది. అప్రతిహతంగా సాగుతోన్న విజ్ఞాన శాస్త్ర మహా ప్రస్థానం, అది ఇచ్చిన ధైర్యం, దాని ప్రాతిపదికగా నిర్మితం అయిన అనేకానేక అభ్యుదయ భావాలు - ఏ వెల్లులకీ ప్రస్థానం? అని సంభ్రమాశ్చర్యాలతో అంతరంగ పరిశోధనకు సిద్ధం అవ్వవలసిన సమయం వచ్చేసింది.

ఇంతకీ ఏమయ్యింది? ఏం జరుగుతోంది? ఎక్కడ తప్పటడుగులు పడ్డాయి? ఎక్కడ మన శోధనలు ఆగి పోయాయి? ఎందుకు ఆగిపోయాయి? ఇంతకీ మతం అంటే ఏమిటి? మత్తు మందా? మంద బలమా? అజ్ఞానమా? అశాస్త్రీయమా? ఎప్పుడో మానవ సమాజపు తొలి అడుగులలో ప్రకృతి శక్తులను అర్థం చేసుకోలేక ఆ

నాటి మనుషుల భయాలలోనుండి పుట్టుకొచ్చిన భావనా? లేదా పురోహిత వర్గాలు తమ పొట్ట నింపుకునేందుకు మనుషుల బాలహీనతలపై విసిరిన మాయాజాలమా? ఇంతకీ మతం అంటే ఏమిటి? ఎన్ని సవాళ్ళు వచ్చినా మళ్ళీ, మళ్ళీ కొత్త బలంతో, కొత్త రూపాలతో అది ఎలా ప్రజలను ఆకర్షిస్తోంది? మతం మనిషి అజ్ఞానంలో నుండి పుట్టుకొస్తే శాస్త్రీయ జ్ఞానం రహస్యాల ఛేదన చేసే కొలది బలహీన పడాలి. అది కూడా మతంపై యుద్ధం ఈ నాటిది కాదు. మరి మతం బలం ఏమిటి? ఎక్కడ వుంది?

దాదాపు అయిదు వేల ఏళ్ల తెలిసిన మానవ చరిత్రలో విశ్వాసం, హేతుకత నిరంతరం ఘర్షణలో వున్నాయి. ఒకసారి ఒకటి, మరోసారి మరొకటి పైచేయి సాధిస్తున్నాయి. ఈ ఊగిసలాట సాగుతూనే వుంది. కానీ 18, 19 వ శతాబ్దాలు హేతుకతకు శాశ్వతంగా పట్టం కట్టినట్టే అనిపించింది. మరో కోణం నుండి చూస్తే ఇంత సుదీర్ఘ పోరాటం తరువాత కూడా అధిక సంఖ్యాకులు విశ్వాసులుగా వున్నారు. అనేక మంది శాస్త్రవేత్తలు ఈ విశ్వాసాన్ని ప్రశ్నించినా అంతకు ఎక్కువే శాస్త్రవేత్తలలో కూడా విశ్వాసులు ఉన్నారు అనేది వాస్తవం. కొంత మంది అజ్ఞేయ వాదులుగా తీర్పును వాయిదా వేసేశారు, వేస్తూ వున్నారు. ఈ మధ్య కాలపు కొన్ని లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా దాదాపు పది శాతం నాస్తికులు వున్నారట! కొన్ని లెక్కల ప్రకారం అది 13 శాతం అంటున్నారు. మరో లెక్కలో 16 శాతం ప్రజలు మతాతీతంగా వున్నాం అంటున్నారాట. ఇందులో ఎక్కువ భాగం యూరోప్, అమెరికా, చైనా అని అంచనా. ఐదు వేల ఏళ్ల సంఘర్షణ, దాదాపు మూడు వందల ఏళ్ల విజ్ఞాన శాస్త్ర ప్రగతి, ఐదారు వందల నాస్తిక, హేతు, పదార్థ వాదాల కృషి, వంద నూటా యాభై ఏళ్ల కమ్యూనిజం, ఫ్రాయిడియన్ మనో విశ్లేషణ సిద్ధాంతంలాంటి అనేక సామాజిక, శాస్త్రీయ సిద్ధాంతాల కష్టం ఎందుకు ఎక్కువ శాతం మనుషుల్ని మతం నుండి దూరం తీసుకోలేక పోయినాయి?

భారతదేశంలో మతం అనే వ్యవస్థను అర్థం చేసుకునే ప్రయత్నం ఆగిపోయి వందేళ్లు దాటిపోయింది. అధిక భాగం సామాజిక శాస్త్రవేత్తలు అసలు “మతం” అనే పేరు వినబడగానే ఉలిక్కిపడుతున్నారు. వారికి అదేదో కొత్త అంటరానితనం అయిపోయింది. మతం గురించి మాట్లాడడం, లేదా శోధించడం అంటే అదేదో చేయకూడని పని చేస్తున్నట్టు, ఆ వ్యక్తి జ్ఞాన పరంగా బాగా వెనక పడి పోయినట్టు అనుకుంటున్నారు. కానీ ఇదే సమయంలో అమెరికా, ఇతర పాశ్చాత్య దేశాలలో మతం గురించిన పరిశోధన ఆగిపోలేదు. నడుస్తూనే వుంది. 1960-70 లలో అనేక అమెరికన్, యూరోపియన్ విశ్వవిద్యాలయాలు మతాన్ని అధ్యయనం చేయడానికి ప్రత్యేక విభాగాలు ఏర్పాటు చేశాయి. చారిత్రక, సామాజిక, ఆర్థిక, మానవ అధ్యయన, మానసిక శాస్త్రాలు అప్పటికే చాలా కృషి చేశాయి. కానీ వాటిని పునః పరిశీలించ వలసిన అవసరం వచ్చింది అన్న వాస్తవాన్ని అభివృద్ధి చెందిన సామాజిక శాస్త్రాలు గుర్తించాయి. ఇంతకీ ఆ శోధనాలు, సిద్ధాంతాలు ఏమంటున్నాయి?

డా. అవధానం రఘు కుమార్,
న్యాయవాది, రచయిత,
డైరెక్టర్, సెంటర్ ఫర్ సోషల్ డైలాగ్, హైదరాబాద్

## కమ్మతెమ్మెరలు

ఎప్పుడూ ఒకటవ తేదీనే అందే “మిసిమి”పత్రిక ఎందుకో ఫిబ్రవరి సంచిక నాలుగురోజులు ఆలస్యంగా అందింది. ఈలోగా ఇద్దరు ముగ్గరు మిత్రులను కూడా అడగడం జరిగింది. ఆలస్యంగానైనా తళుకుల మెరుపులతో “నగలే నవ్వు” చిత్రంతో” అలరించింది. ముఖచిత్రం తిరగవేయడంతో అశ్వినికుమార్ గారి” తరలిపోతున్న తరాల”తో పాతజ్ఞాపకాలకు తెరతీసారు. రెండోపేజీలోని జీవనమకరందంలోని జీవనసూత్రాలు జీవామృతమే. ఎప్పటిలా వెనుకపేజీల వైపుకు నా కళ్ళు పరిగెట్టాయి. చదవండిలో చదవాల్సిన పుస్తకాలు, సి.ఎస్.రాంబాబు గారి “మన సినిమా ఫస్ట్ రీల్” “ఒకమంచి ప్రేమ కల” సినిమా, వి.రాజారామమోహనరావుగారు శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి గారి అరికాళ్ళకింద మంటలు కథాపరిచయం, ఇలా చెప్పాలంటే ఇంకెన్నో వినూత్న అంశాలతో చక్కని విందుభోజనంలా ఎంతో సంతోషదాయకమైంది. **మిసిమి** నిర్వాహక వర్గానికి అభినందలతో పాటు ధన్యవాదాలు.



*- దోసపాటి వేంకటరామచంద్రరావు, విజయనగరం, ఫోన్ : 7780594995.*

# ఆశ

– ఆచార్య పి హరినాథ్

మనిషికి అవగుణాలు ఎన్నో అవసరం లేదు. ఒక్క లోభం చాలు. అంతకంటే అవగుణం ఏముంది? అంటాడు భర్తృహరి. లోభం అన్నది మనిషిని పీడించే అంశం. ఎన్ని ఉన్నా మనసుకు ఇంకా కావాలనిపిస్తుంది. దీనికి ఒక ప్రాచీన దృష్టాంతం ఉంది. పరమశివుడు చేతిలో కపాలాన్ని ధరించి, ఇల్లిల్లూ భిక్షాటన చేస్తూ ఉన్న రోజుల నాటిమాట. ఒకానొక సమయంలో–అలాగా కుబేరుని ఇంటి ముందు నిలబడ్డాడు. వచ్చినవాడు సామాన్యుడు కాదు. ప్రపంచానికి ఐశ్వర్యాన్ని ప్రసాదించగలిగిన మహాదేవుడు. అలవిమాలిన ఆశ్చర్యంతో కుబేరుడన్నాడు– ''త్రిమూర్తులలో శక్తివంతుడివి, ఐశ్వర్యదాతవు, నీకుభిక్షాటన ఎందుకయ్యా శివా! ఇది ఏమైనా బాగుందా? నీకెంత కావాలో చెప్పు నేను ఇస్తాను". శివుడు చేతిలో ఉన్న కపాలాన్ని పైకెత్తి చూపుతూ "ఈపాత్ర ఉందే దాన్ని నింపు చాలు" అన్నాడు. కుబేరుడు "ఇంతేనా" అని తన మెడలో ఉన్న నవరత్న హారాన్ని వేశాడు. కపాలం నిండలేదు. చేతులకు ఉన్న ఉంగరాలు వేశాడు. నిండలేదు. ఖజానా నుంచి కొన్ని బంగారు నాణేలు తెప్పించి వేశాడు. ఇంకా నిండలేదు. ఒకమూట నాణేలు వేశాడు. నిండలేదు. ఖజానా మొత్తం ఖాళీ అయింది. నిండలేదు. రాణుల నగలు వేశారు. ప్రయోజనం లేదు. వస్త్రాలు, ఆభరణాలు, వస్తువులు, పదార్థాలు అన్నీ వేసినా నిండడం లేదు. కుబేరుడు అడిగాడు "శివా. ఏమిటీమాయ"–అని. శివుడు నవ్వి అన్నాడు "కుబేరా, ఈ చేతిలో కపాలముందే, అది మానవ కపాలం. దాని ఆశకు అంతులేదు" ఇది ఆశా స్వరూపం. మనిషిని కృంగదీయడానికి అదొక్కటి చాలు. అన్నీ తనకు కావాలి. ఇంకా కావాలి–అనుకోవడం లోభం. ఇంతకంటే అవలక్షణం ఏముంది–అంటున్నాడు కవి.

**లోభశ్చేదగుణేన కిం పిశునతా యద్యస్తి కిం పాతకైః**
**సత్యం చే త్తపసా చ కిం శుచి మనో యద్యస్తి తీర్థేన కిం**
**సౌజన్యం యది కి బలేన మహిమా యద్యస్తి కిం మండనైః**
**సద్విద్యా యది కిం ధనై రపయశో యద్యస్తి కిం మృత్యునా**

అలా చెబుతూ మరికొన్నిటిని కూడా వివరిస్తూ ఉన్నాడు. ఒకరి గురించి మరొకరి వద్ద హీనంగా మాట్లాడటం ఉందే అది అవగుణం. కొందరు ఓర్వలేని వాళ్ళు ఉంటారు. ఇతరుల కలిమినీ, బలిమినీ కూడా భరించలేరు. వారి గురించి ఉన్నవీ లేనివీ కలిపి అప ప్రచారాలు చేయడం, అసత్యాలను అల్లించడంతో ఆనందపడతారు. ఇలా చాడీలు చెప్పడం కంటే పరమపాతకం ఏముంది? ఉన్న విషయాన్ని దాచకుండా చెప్పగలగడం, నిజానికి కట్టుబడి ఉండడం అనేవి చాలా బలమైన శక్తులు. అలా సత్యం చెప్పడం కంటే తపస్సు ఏముంటుంది? పరిశుభ్రంగా ఉన్న మనస్సు స్వచ్ఛమైన సరోవరం లాంటిది. అలాంటి మనస్సు ఉంటే ఏ పుణ్య తీర్థంతో మాత్రం పని ఏముంది?. ఇతరుల మంచికోసం పాటుపడే సజ్జన స్వభావం ఉంటే అంతకంటే బలం ఏముంటుంది? మనిషిలో ఔన్నత్యం ఉంటే అలంకారాలతో పనేముంది? విద్య అంటే తెలిసి ఉండడం. తెలివితేటలు ఉన్నవాడికి ఆ జ్ఞానమే ధనం అవుతుంది. మంచి విద్య ఉంటే ధనంతో పనేముంది? జనమంతా ఛీఛీ అని ఛీదరించుకునే అపకీర్తి ఉంటే అంతకంటే మరణం ఏముంటుంది? బ్రతుకులోని ఎగుడు దిగుడులు చూసిన వాడు భర్తృహరి. రగిలిపోయే అనుభవాల సెగతో మరిగి పోయిన మనిషి మనసులో నుంచి వచ్చిన మాటలివి. జీవన విలువలివి.

## ఎప్పుడు ఎలా ఉండాలి

మనిషి ఎలా ఉన్నాడో చూసుకోవడానికి అద్దం కావాలి. ఎలా ఉండాలో చూసుకోవడానికి కావ్యం కావాలి.

ఒకప్పుడు జీవితం విస్తారంగా పరుచుకుని ఉండేది. ఇంట్లో పెద్దలు, పిల్లలు ఉండేవారు. అవ్వ తాతలు కూడా ఉండేవారు. సమస్య ఎదురైనా సలహాలు కావాల్సి వచ్చినా పిల్లలు వారిని సంప్రదించేవాళ్లు. క్రమేపి ఉమ్మడి కుటుంబాలు ఛిన్నమైపోయి జీవితాలు చిన్నవైపోయాయి. ఏమైనా అడుగుదామంటే ఆప్తులులేరు. వినడానికి శ్రోతలులేరు. మనసు పంచుకోవడానికి, దిగులు దించుకోవడానికి మనిషి లేదు. ఇలాంటి సందర్భాలలో ఎన్నోజీవన విలువలను ఆవిష్కరిస్తూ కవులు కనిపిస్తారు.

**విపది ధైర్యమథాభ్యుదయే క్షమా**
**సదసి వాక్పటుతా యుధి విక్రమః**
**యశసి చాభిరతి ర్వ్యసనం శ్రుతౌ**
**ప్రకృతిసిద్ధమిదం మహాత్మనాం**

భర్తృహరి అంటున్నాడు. ఏదైనా ఆపదవస్తే భయపడ రాదు. ధైర్యంగా ఉండాలి. ధీ అంటే బుద్ధి. ధీరస్వభావమే ధైర్యం. ధీర అంటే ఆలోచన ఉన్నవాళ్లు. ధైర్యం అంటే ఆలోచన. ఒక ఆపద ఎదురైనప్పుడు గజగజలాడిపోతే దారి తెలియదు. నిలకడగా నిలిచి దాన్ని ఎలా దాటాలి అన్న ఆలోచన చేయాలి. చెదిరిపోని మనసుతో దారిని వెతకాలి. అలాగే ఎంతో వైభవం సిద్ధించి సంపదలతో తులతూగే స్థితి వచ్చినప్పుడు తొట్రు పడిపోని తాలిమి ఉండాలి. సంపదలు మనిషి స్వభావాన్ని పరిశీలిస్తాయి. పరీక్షిస్తాయి. ఆ మైకంలో కొట్టుకొని పోరాదు. మనిషిని మార్చగలిగే మహాశక్తులలో సంపద ఒకటి. అలాంటి సంపద వచ్చినప్పుడు సహనం ఉండాలి. దాన్ని భరించ గలిగే ఓర్పు, నేర్పు ఉండాలి. మరోటి, ఒక రాజసభలో మాట్లాడవలసి వచ్చినప్పుడు వాక్చాతుర్యం ఉండాలి. ఎందరో పెద్దలు విద్వాంసులు ఉన్న సభ అది. ఎదురుగా రాజు ఉన్నాడు. వినడానికి శ్రోతలు ఉన్నారు. మాటలాడే అవకాశం వచ్చింది. అలాంటప్పుడు తడబడని మాట ఉండాలి. తటపటాయించని ధైర్యం ఉండాలి. పూర్వం ఒకప్పుడు ఎవడికో రాజసభలో ప్రవేశించే అవకాశం వచ్చిందట. దానికోసం ఎంతోకాలంగా ఎదురు చూస్తున్నాడు. రాజును కలిస్తే ఆయనకు ఇవ్వాలి అని ఒక టెంకాయను తీసుకెళ్లాడట. ఆ టెంకాయకు ఎంతో అలంకారం చేశాడు కూడా. సభలోకి వెళ్ళగానే 'రాజా టెంకాయ పుచ్చుకోండి' అని వినయంగా చెప్పాలను కున్నాడు, ఇంటి దగ్గర పదిసార్లు ఆమాటలు పదేపదే చెప్పుకున్నాడు. తీరా సభలో ప్రవేశించేసరికి చుట్టూ ఉన్న పెద్దలను చూస్తే నాలుక తడి ఆరిపోయింది. ఎదురుగా దర్జాగా కూర్చున్న రాజును చూస్తే మాట మరపుకు వస్తోంది. ఒళ్ళు వణుకుతూ ఉండగా "రాజాంకాయ పిచ్చికొండ" అన్నాడట. ఆ తర్వాత ఏమై ఉంటుందో ఊహించుకోవాల్సిందే.

ఇంకో విషయం-యుద్ధంలో పరాక్రమం ఉండాలి. తాను ముందుకు ఉరుకుతూ శత్రు సంహారం చేయాలి. తన పేడి రూపాన్ని వీడిన క్రీడిలాగా విజయుడై సాగాలి. ఉత్తరుడిలాగా నిరుత్తరుడై నీరు కారిపోకూడదు. యుద్ధంలో విక్రమం ఉంటేనే విజయం. అది రణరంగమైనా, జీవన రంగమైనా నీతి ఒకటే. అలాగే, మంచి పేరు తెచ్చుకోవాలని కోరిక కూడా ఉండాలి. తాను ఏదైనా పదిమందికి పనికివచ్చే మంచి పనిచేయాలి అని తపించాలి. దానివల్ల రాబోయే తరం తన గురించి కీర్తిస్తుంది అన్న ఆశ ఉండాలి. ఉదాహరణకు, అశోకుడు చెట్లు నాటిస్తే అనంతరకాలం వాళ్ళు వాటి ఫలాలను అనుభవించారు. అలాగే తాను సమాజానికి ఉపయోగ పడాలి తన సేవను తర్వాతి తరాలవారు గ్రహించాలి అన్న ఆశ ఉండాలి. ఈ కోరిక మనసులో బలంగా ఉండాలి. అప్పుడే మనిషికి మంచి పనులు చేయడానికి ప్రేరణ దొరుకుతుంది. అలాగే రకరకాల శాస్త్రాలను గురించి తెలుసుకునే ఆసక్తి ఉండాలి. పుస్తకాలను చదవాలి, మరింతగా తెలుసుకోవాలి. తన విద్య తళతళలాడాలి. ఈ ఆశ మనిషిని బలపరిచి ముందుకు నడిపించాలి. ఈ ఆశలు, కోరికలు, స్వభావాలు మహాత్ములకు ప్రకృతి సిద్ధంగా ఉంటాయి-అని భర్తృహరి అంటున్నాడు. దీన్ని మరో కోణం నుంచి చూస్తే, గొప్పవారి అలవాటు ఇలా ఉంటాయి - అని కవి చూపిస్తూ ఉన్నాడు. మనం కూడా అలా నడవాలంటే ఇదిగో దారి అని చెబుతున్నాడు. కవిత్వం చేసే మహోపకారం ఇదే. ఒక అపురూప సత్యాన్ని అద్వితీయంగా ఆవిష్కరించి మనం కూడా అలాగా ఉంటే బాగుంటుంది అని మార్గోపదేశం చేస్తుంది. కొన్నిసార్లు కోమలంగా ఎదని నిమురుతూ "అలా చేయరాదూ" అని గోముగా అడుగుతుంది. మరికొన్నిసార్లు "ఇలాచేయి" అనే బెత్తం ఊపుతూ నెత్తిన మొత్తి చెబుతుంది. పై సంస్కృతపు శ్లోకం ఎంత అందంగా ఉందో తెలుగులోనూ అంత అందంగా అందించారు శ్రీఏనుగులక్ష్మణ కవిగారు

**ఆపదలందు ధైర్యగుణమంచితసంపదలందు తాల్మియున్**
**భూపసభాంతరాళముల పుష్కల వాక్చతురత్వమాజి బా**
**హా పటుశక్తియున్యశమున దనురక్తియు విద్యయందు వాం**
**ఛా పరివృద్ధియు న్ప్రకృతిసిద్ధగుణంబులు సజ్జనాళికిన్**

శతక పద్యాలు ఎన్నో విలువలను ప్రకటిస్తాయి. పాఠశాల విద్యలో తప్పనిసరిగా ఉండాల్సిన అంశాలు ఇవి. ఒకమంచి ఆలోచనను మనసులో నాటితే అది మానై ఎదిగి రేపటి తరానికి తీయని ఫలాలను ఇస్తుంది. మండే ఎండలో నిలవడానికి నీడనిస్తుంది. రగిలే వేసవిలో చల్లని గాలినిస్తుంది. ఎగిరేపక్షులకు గూడు ఇస్తుంది. ఇదంతా జరిగేది ఒక చిన్ని ఆలోచనతో-ఒక చిన్ని పద్యంతో.

ఆచార్య పి. హరినాథ్, మైసూర్
ఫోన్ : 9480443108



వేమూరి బలరామ్

# వేయి స్తంభాల వేదిక స్వాతి వార పత్రిక !

– మిసిమి

**బ**లరామ్ అంటే స్వాతి! స్వాతి ముత్యం. ఇలాంటి ముత్యం సప్త సముద్రాల్లో ఎక్కడ వెదికినా దొరికేది కాదు. అలాంటి ముత్యానికి ఎన్నో వర్ణాలు – వెలుగుతో మారిపోయే హరివిల్లులు – చీకటితో మెరిసిపోయే సహజమైన మెరుపులు – ఈ ముత్యపు నెలవు స్వాతి సముద్రం. అందులోనే ఉనికి – అందులోనే ఉలికిపాటు!

యాభై సంవత్సరాలకు పైగా ఒక పత్రిక నడపటం సామాన్యమైన విషయం కాదు.. అదికూడా ఒక వ్యక్తి ఒక పత్రిక నడపాలన్న కోరికతో ప్రభుత్వ ఉద్యోగాన్ని వదలి కుటుంబ జీవితాన్ని పణంగా పెట్టి తను నడిపే పత్రికకు అంకితమైపోవటం అసాధారణమనిపిస్తుంది. ఆ వ్యక్తి మరెవరో కాదు స్వాతి మాస, వార పత్రికల బాధ్యతను ఎంతో ఇష్టంగా నిర్వహిస్తున్న **వేమూరి బలరామ్..** తను నిర్వహించే పత్రిక తప్ప తనెక్కడా కనపడని వారిని **మిసిమి** పాఠకులకు పరిచయం చేయాలనుకున్నాం.

**మిసిమి** బృందం విజయవాడ చేరుకుని ముందుగా చెప్పిన సమయానికి వారిని కలిసేందుకు వెళ్ళినప్పుడు అక్కడున్న ఇద్దరు వనితలు సాదరంగా పలకరించి మేమే మీకు కాల్ చేస్తామన్నప్పుడు మా రెండు రోజుల విజయవాడ, గుంటూరు ప్రోగ్రామ్‌లోని మిగతా అంశాలవైపు సాగిపోయాం..

మరుసటి రోజు సాయంత్రం బలరామ్ గారే మనం కలవటం ఇంత కష్టమా రాజా! అంటూ రమ్మన్నారు. వారితో నా అనుబంధం ఇప్పటిది కాదు.. ఆయనకు ఆ విషయం గుర్తుందని తెలుసు.. మిత్రులు రామరాజు, రాంబాబులతో కలిసి దుర్భేద్యమైన స్వాతిపత్రిక కార్యాలయభవనంలో రాత్రి ఎనిమిది గంటలకు ప్రవేశిస్తే రెండవ అంతస్తులో ఓ ఖరీదైన భోజనాల బల్లకు ఓ వైపు కూర్చుని 65 అంగుళాల సోని టీ.వీలో వార్తలు చూస్తున్న బలరామ్‌ని పలకరించాను. రా రాజా ఎన్నాళ్లయ్యింది మనం కలిసి అని ఆహ్వానించాడు. డైనింగ్ టేబుల్ మీద ఓ బుట్టలో అన్నిరకాల స్వీట్స్, మరో గిన్నెలో తాంబూలాలు, ఎదురుగా చెక్కరకేళీలు. ఒకసారి బలరామ్‌ని పరీక్షగా చూశాను. వయసు భారం కంటే మనసు బరువే ఎక్కువైనట్లు తోచింది. రెండు గంటలు ఎలా గడిచిపోయాయో తెలీదు. ఎన్నో జ్ఞాపకాలు గుబాళించాయి.. సంతోషం, దుఃఖం కలగలిసిన కన్నీటితో జ్ఞాపకాలు తడిసాయి. జీవితమంటే ఏమిటో, విజయం అంటే ఏమిటో ఆయన మాటల్లోనే తెలుసుకుందాం.

**వేమూరి బలరామ్‌తో మిసిమి మాటా మంతి**

**మిసిమి : మీరొక ఫినామినా–తెలుగు పత్రికల చరిత్రలో– బహుశా భారతీయ భాషల్లో ఎవ్వరూ కూడా మీలాగా ఒక వారపత్రికను పతాకస్థాయికి తీసుకెళ్లిన వారు లేరనటం అతిశయోక్తి కాదు–మాకు పత్రికలంటే తెలుసు–మీ విజయాల వెనుక కఠోరశ్రమ–అకుంఠిత దీక్ష వున్నాయని తెలుసు–అలాగే మీపైన కురిసిన విమర్శల వానలూ తెలుసు – ఆర్థికంగా మీరెంత విజయం సాధించారో ఇన్‌కమ్‌టాక్స్ వారికీ తెలుసు–అరె ఇన్ని తెలిసీ మరి నా దగ్గరకు ఎందుకు వచ్చారు? అని మీరు అడగవచ్చు–అదీ తెలుసండీ– ఇప్పుడు చెప్పండి మాకు తెలియని విషయాలు–తెలుగు పాఠకులకు మీరు చెప్పదలుచుకుంది–మీ విజయం–మీ ప్రేమ – మీపై విమర్శలు–మీ ఫెయిల్యూర్–చెప్పండి–మనం అన్నీ మాట్లాడుకుందాం!**

**బలరామ్ :** అదీ అశ్వినీ కుమార్ అంటే.. అట్లా అడక్కపోతే ఇంకెలా అడుగుతాడు (నవ్వు).. చీకటి.. వెలుగు.. చీకటే జీవితమనుకుంటే ఎలా! రేపటి సూర్యోదయం కోసం ఎదురుచూడాలి కదా.. చీకటి, వెలుగంటే ఎవరు.. ఆ ప్రకృతిమాతే కదా.. ఇంకో మాట.. వెలుగు, చీకటి అనలేదు.. చీకటి వెలుగు అన్నారు.. కష్టసుఖాలు అన్నారు.. అదృష్టవశాత్తూ ఇవన్నీ నేను వయసులో ఉన్నప్పుడు భరించాను.. అప్పట్లో నేను హైదరాబాద్‌లోని రాంకోఠిలో ఉండేవాడిని.. సికింద్రాబాద్ కింగ్స్ వే లో(ఇప్పుడు ఆర్.పి. రోడ్డు) సినిమా కంపెనీలుండేవి.వాళ్ళిచ్చే ప్రకటనల కోసం సైకిల్ మీద ఆ మూల నుంచి ఈ మూల వరకూ వచ్చేవాడిని.. వాళ్ళు నాకు ప్రకటనలివ్వాలంటే వారి మూడ్ ఎలా ఉందో తెలుసుకోవాలి.. సినిమా మనకు బాగుండక పోయినా బావుందని చెప్పాలి. ఇన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. అప్పట్లో ధర్మదాత సినిమా వచ్చింది.. లక్ష్మీ ఫిలిమ్స్ మేనేజర్‌ని కలిసేవాడిని, ప్రకటన కోసం.

మిమ్మల్ని చూస్తుంటే మీరు, నరసింహారావు గారు "రేపు" పత్రిక నడిపిన రోజులు గుర్తుకొస్తున్నాయి.. పాత పత్రికల్లో 'భారతి' మూసేశారు. 'ఆంధ్రపత్రిక' మూసేశారు. ఇప్పుడు 'అన్నదాత' మూసేశారు. మనకి ఆ తల్లే కదా ఇచ్చింది డబ్బులు.. పోతే పోనివ్వండి.. డబ్బులు పోతున్నాయని నడపటం ఆపేస్తామా?.. మనకు సంపాదన ఎక్కువైపోయి ఇలా అయిపోయాయేమో (నవ్వు, ఏడుపు మిళితమైన స్వరంలో)

***మిసిమి : ముందు మీ విజయాల గురించి మాట్లాడుకుందాం.***

**బలరామ్ :** మొదట స్వాతి మాసపత్రిక పెట్టాం రాజా.. 1970 సంవత్సరంలో హైదరాబాద్‌లో పెట్టాం స్వాతి మాసపత్రిక.. అది కూడా రాంకోటిలో.. న్యూ సైన్స్ కాలేజీ దగ్గర..

***మిసిమి : మీకప్పుడు భాగస్వాములున్నారు కదా!***

**బలరామ్ :** ఉన్నారు.. కానీ మాకు స్వాతికి సంబంధం లేదురోయ్ అని వార్నింగ్ ఇచ్చారు. పెట్టిన పదిహేను వందల పెట్టుబడికి నోటు రాసిచ్చారు.

***మిసిమి : మీరు సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేశారు. అది భద్రతగలిగిన ఉద్యోగం-అలాంటిది వదిలి మీకు పరిచయం లేని పత్రికా ప్రపంచంలోకి దూకారు – మీకు నల్గురు వాటాదార్లుండేవారు. మాసపత్రిక ప్రారంభించాలని – అది లాభసాటిగా నడపగలమని మీరెలా అనుకున్నారు? మిగతా వాటాదార్లు మిమ్మల్ని ఎప్పుడు వదిలి వెళ్లారు? ఎందుకు?***

**బలరామ్ :** తెగింపే, ఇంకేమీ లేదు.. పత్రికలోకి రావటానికి కారణం.. నాటకరంగం.. అది నా పేషన్.. ఆరోజుల్లో నారాయణగూడా, చిక్కడపల్లి, సికింద్రాబాద్‌ల్లో వినాయక చవితి పందిళ్ళలో నాటకాలు వేసేవారు. నేను కూడా పాల్గొనేవాడిని. ఇక రవీంద్రభారతిలో నాటకం వేసినప్పుడు చప్పట్లకు లోటు ఉండేది కాదు. పొద్దున్నే వార్త మాత్రం పేపర్లో కనిపించేది కాదు.. "చుక్కాని" అనే చిన్న పత్రికలో వార్త వేసేవాడు ఆ పత్రిక సంపాదకుడు.. అదే సమయంలో కంచికచర్ల కోటేసు సంఘటన అప్పుడు సంచలనం సృష్టించింది. నేను ఆ సంఘటన ఆధారంగా కొర్రపాటి గంగాధరరావు గారితోటి నాటకం రాయించి కోటేసు పాత్ర పోషించాను.. నా పాత్ర నిప్పంటించుకోవడం చూసి జనాలు హాహాకారాలు చేసేవారు. తగలడిపోతున్నానేమోనని "ఆపండి.ఆపండి.." అనేవారు..నేను కొంచెం ఎమోషనల్‌గా ఆ కేరక్టర్‌లో ఇన్వాల్వ్ అవుతుండేవాడిని.. అదే 'రేపు' పత్రిక నరసింహారావు, అశ్వినీ కుమార్ చూసుంటే ఆ ఎమోషన్‌ను కాలిక్యులేట్ చేసి సైకాలజీ రాసేసేవారు (నవ్వు).. ఏమాటకామాట.. వీళ్ళిద్దరూ ఆ పత్రిక బాగా నడిపారు..

***మిసిమి : రేపు పత్రిక ఆరువేల సర్క్యులేషన్ ఉన్నప్పుడు నరసింహారావు గారితో కలిశాను. ఆ పత్రిక సర్క్యులేషన్ ముప్పైవేలకు పెంచగలిగాం..***

**బలరామ్ :** ఆ పత్రిక సర్క్యులేషన్ పెరగడానికి కారణం మీరే..

***మిసిమి : అదిసరే.. మీరు పత్రిక పెట్టినప్పుడు డబ్బు కోసం పెట్టలేదు.. అవునా..***

**బలరామ్ :** "ఆ చప్పట్లే కదరా.. ఆకలిగొన్న కళాకారుడికి పంచభక్ష్య పరమాన్నాలు" అంటాడు మురారి కీర్తిశేషులు నాటకంలో.. (ఈ మాటలు చాలా నాటకీయంగా చెప్పారు) అలా ఆ పాత్ర పోషించినప్పుడు.. ప్రేక్షకుల చప్పట్లు ప్రశంసలు పొందటంలో ఉండే ఆనందం మరువ లేనిది. నేను ఆ పాత్ర పోషించిన రోజులు గుర్తుకొస్తున్నాయి..

***మిసిమి : ఇప్పుడో ప్రశ్న వేస్తాను.. నేను, నరసింహారావు గారు ఒకానొక సందర్భంలో చెప్పాం.. డబ్బు పాపిష్టిది.. మీకు అశాంతినిస్తుంది – ఎదుటివారికి అసూయ గలిగిస్తుంది అని. మీరెలా మేనేజ్ చేశారు. సామాన్యుడి చేతిలో లక్షరూపాయలు వుంటే నిద్రపోలేడు. మీరు అపారమైన సంపదను ఒంటరిగా ఏవిధంగా అదుపులో పెట్టగలిగారు?***

**బలరామ్ :** డబ్బు గురించి నాకు తెలియదు.. రూపాయి కూడా చేతిలో ఉండదు.. నాకు డబ్బు ఒక బై ప్రోడక్ట్.. పనిచేయ్.. పనిచేయ్.. ఇంతే నాకు తెలిసింది. ఆరోజుల్లో నా పత్రిక ఆంధ్రజ్యోతి, ఆంధ్ర పత్రిక, విశాలాంధ్ర వారి ప్రెస్‌లో ప్రింట్ చేసేవారు..

***మిసిమి : మీరు ఆరోజుల్లో లబ్బీపేటలో ఉన్న ఆంధ్రజ్యోతి ఆఫీస్‌లో మీ పత్రిక ప్రింట్ చేయటం కోసం అర్ధరాత్రి పూట ఆ పేపర్ రీమ్స్ మీదే నిద్రించటం నేను చూశాను..***

**బలరామ్ :** అవును రాజా (ఈమాటంటుంటే వారి కళ్ళమ్మట అశ్రుగంగ చిప్పిల్లింది).. కన్ను మాత్రమే చూడగలదు. కాళ్ళు మాత్రమే నడవగలవు.. కాళ్ళు చూడలేవు.. కన్ను నడవలేదు.. అది తేల్చుకోలేకపోయాడు 'రేపు' నరసింహారావు.. ఆయన దోస్తానా అశ్వినీ కుమార్. ఆయన "నూతన ప్రపంచం" అనే మరో పత్రిక పెట్టడం 'రేపు'ను దెబ్బతీసింది..

***మిసిమి : మీకు ఆర్థికంగా వైశ్యాబ్యాంక్ బాగా ఆదుకునేదని విన్నాం – బ్యాంకులు అప్పులివ్వటంలో తప్పేముంది? మీరు ఆ బ్యాంక్ ఆఫీసర్ గురించి తరచూ మీ వారపత్రికలో రాస్తుండేవారు – బొమ్మలతో సహా! ఇది ప్రచారం కోసమా? కృతజ్ఞత కోసమా?***

**బలరామ్ :** కృతజ్ఞత.. ప్రచారం.. రెండింటి కోసం.. వైశ్యా బ్యాంకు ఒక కులానికి సంబంధించింది కాదు.. అందరిదీ అని చెప్పాలనిపించింది. అదే చెప్పి ప్రచారం చేశాను. ఆ ప్రచారం ద్వారా నాకు కూడా మేలు జరుగుతుందని నమ్మకం.

***మిసిమి : మీ వారపత్రిక ఒక బ్రాండ్‌గా–వార, వార ప్రవర్ధమానమై ఎన్నడూ –ఎక్కడాలేని ప్రచారం పొందింది.. మీకు పేరు –ఆర్థిక స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టింది. మీరెప్పుడూ పాఠక దేవుళ్ళు అని సంబోధిస్తారు.. మీకు వరాలిచ్చిన దేవుళ్ళు వారేనా? ఇంకెవ్వరూ లేరా?***

**బలరామ్ :** పాఠక దేవుళ్ళు అంటే. అవును..నాకు పాఠకులే దేవుళ్ళు.. ఆస్తికత్వం, నాస్తికత్వం కాదిక్కడ.. నా పత్రికను ఎవడాదరిస్తే వాడే దేవుడు నాకు.. మన వెంకటేశ్వరస్వామి, శ్రీశైల మల్లికార్జునుడు నేను వ్యక్తిగతంగా పూజించే దేవుళ్ళు. పబ్లిక్ డొమెయిన్‌లో నాకు పాఠకులే దేవుళ్ళు..

***మిసిమి : మీ వారపత్రికకు అక్షరాల వరాలు ఇచ్చినవారు చాలా మందే ఉన్నారు. ఓంకార్, వంశీ, ముళ్ళపూడి వెంకటరమణ, పి.వి.ఆర్.కె.ప్రసాద్, కె.వి.రమణలు అలాగే సి.యస్.రావు, వీరేంద్రనాథ్. ఇక కథలు, నవలలు రాసినవారు అనేకులున్నారు. వీరంతా మీ ఎదుగుదలలో భాగస్వామ్యులే అనుకోవచ్చా? ఎమోషనల్ కాకండి.***

**బలరామ్ :** అవును రాజా.. వారందరూ మా పత్రికను పరిపుష్టం చేశారు. యండమూరి కథలు దారి తప్పినపుడు తగ్గించాను. రచన మేలు చేయకపోయినా ఫర్వాలేదు.. కీడు చేయకూడదని నా ఉద్దేశం. నా పుట్టినరోజు ఫిబ్రవరిలో వస్తుంది. ఒక పుట్టినరోజు చెన్నైలో జరపాలని ఓంకార్ ప్లాన్ చేశాడు. అదయ్యేలోపే సడెన్‌గా వెళ్ళిపోయాడు (ఈ మాటలు చెబుతూ కళ్ళమ్మట నీళ్ళు పెట్టుకున్నారాయన)..

***మిసిమి : సి.యస్.రావు నాకు బాగా తెలుసు. రమణగారి బయోగ్రఫీ మిసిమిలో వేయమని అడిగారు. మేము వేయలేదు.***

**బలరామ్ : మిసిమి** విలువలున్న పత్రిక .."భారతి" తర్వాత మళ్లీ ఆ ధోరణిలో **మిసిమి** కనిపిస్తుంది. దయచేసి మీరు మీ పత్రికతో వ్యాపారం చేయకండి. వ్యాపారం కోసం కళాజ్యోతి ఉంది మీకు.. అక్కడ మా స్వాతి పత్రికను మీరు పబ్లిష్ చేస్తున్నారు..

***మిసిమి : మీకు ఢిల్లీ నుండి ఎస్.వెంకటనారాయణ పొలిటికల్ కాలమ్ రాసేవాడు. అలాగే దుగ్గరాజు శ్రీనివాసరావు కూడా. దాని ఫలితమా మీరు ప్రధాని పర్యటనల్లో పాల్గొనేవారు.***

**బలరామ్:** ఆ కాలమ్స్‌కీ, ప్రధాని పర్యటనల్లో పాల్గొనటానికి సంబంధం లేదు. పి.వి.గారు ప్రధానిగా ఉన్నప్పుడు "స్వాతి" చదివేవారు. ఆ రకంగా గుర్తింపు వచ్చింది. మన్ మోహన్ సింగ్ గారు ఆర్థిక మంత్రి. పి.వి.గారి దగ్గరకు వస్తుండేవారు.. అక్కడ కూర్చుని వరల్డ్ ఎకనమిక్ ఫోరం గురించి చెబుతుండేవాడు.. "మిస్టర్ సింగ్, మన ఆర్థిక

సంస్కరణలకు మానవీయ దృక్పథం ఉండాలి" అని పి.వి.గారు మన్ మోహన్ సింగ్‌కు చెప్పేవారు.. ఫిగర్స్ ముఖ్యం కాదు. ప్రజలు ముఖ్యం అనేవారు. కానీ పార్టీ ఆయనకు తర్వాత గుర్తింపు నిచ్చిందా... లేదు..

***మిసిమి : "ప్రధానితో నా పర్యటనలు" శీర్షికతో పుస్తకం ప్రచురించారు కదా..***

**బలరామ్ :** పి.వి., వాజపేయి, దేవెగౌడ, మన్ మోహన్ సింగ్ వీళ్ళందరితో వారి విదేశీ పర్యటనల్లో పాల్గొనే అవకాశం కలిగింది. మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం గారితో దక్షిణాఫ్రికా వెళ్ళాను. వాజపేయి గారితో లాహోర్ బస్సు యాత్రలో పాల్గొన్నప్పుడు ఆయనన్న మాటలు ఇంకా గుర్తున్నాయి.. మనం స్నేహితులను మార్చుకోవచ్చు.. భార్యను ఒప్పించవచ్చు. మన పొరుగు వారిని అంటే నైబర్స్‌ను మార్చుకోలేమన్నారాయన. మహానుభావుడు.. మనకు పాకిస్థాన్ పొరుగు దేశం.. పాకిస్థాన్‌కు మనం పొరుగు దేశం. మీరంటే మాకు భయం.. మేమంటే మీకు భయం.. అందుకే డిఫెన్స్ రంగంలో పెట్టుబడులు పెడుతుంటాం ఈ పద్ధతి పోవాలన్నాడాయన.. ప్రజల డబ్బులు వృధా చేయటం మానేద్దామని పిలుపిచ్చారు..

***మిసిమి : మీరు మాకు వివరంగా చెప్పండి – మన జీవితానికి ఏమీ అర్థం లేదంటాడు చాప్లిన్ – ఈ ప్రపంచం మారదంటాడు వోల్టేర్ – నా జీవితమే నా సందేశమంటాడు గాంధీ – స్వేచ్ఛకోసం సుదీర్ఘప్రయాణం అంటాడు మండేలా– మీరు జీవితాన్ని ఒక్కవాక్యంలో చెప్పాలంటే ఏమంటారు?***

**బలరామ్ :** జీవితానికి అర్థం లేదనటం కరెక్ట్ కాదు.. మీరు ముగ్గురొచ్చారు.. ముగ్గురులోను జీవితానికి మీ అర్థం వేరు.. వీళ్ళిద్దరి అర్థం వేరు.. నా దృష్టిలో జీవితానికున్న అర్థం వేరు. ఎవరి జీవితానికి వారు అర్థం చెప్పుకుంటారు. ఎవర్ని వారు ప్రేమించుకోవాలి అంతే.. అసలు ప్రేమంటే ఏమిటో తెలిస్తే ఇతరులను కూడా ప్రేమిస్తాం..

***మిసిమి : ఇంకోటి కూడా చెప్పాలి. డబ్బును ప్రేమించాలా?***

**బలరామ్ :** ప్రేమించాలండీ.. ప్రేమించకపోతే ఎలా! నీ డైనింగ్ టేబుల్‌ని కూడా నువ్వు ప్రేమించగలగాలి..

***మిసిమి: జీవితానికి ఎవరి అర్థం వారు చెప్పుకుంటారంటారు మీరు. స్వేచ్ఛ కోసం సుదీర్ఘ ప్రయాణం చేయాలంటారు నెల్సన్ మండేలా.. స్వేచ్ఛ అంటే ఏమిటి?***

**బలరామ్ :** మండేలా చెప్పింది రాజకీయ స్వేచ్ఛ కానీ కుటుంబ స్వేచ్ఛ కాదు. మనకు స్వాతంత్ర్యం కావాలన్నారు మహాత్ముడు. అంటే ఏమిటి? ఇలా కూర్చుని హాయిగా మాట్లాడుకోగలటమే.. భార్యతో తృప్తిగా మాట్లాడగలగాలి. పిల్లలతో మాట్లాడగలగాలి.

***మిసిమి : మీ అర్థం ప్రకారం జీవితం అంటే ఏమిటో చెప్పండి?***

**బలరామ్ :** నీకు నచ్చిందే జీవితం.. ఇక్కడ నలుగురం ఉన్న ఈ మీటింగ్‌లో రకరకాలుగా భావిస్తున్నాం.. ఎవరి ఆలోచనలు వారికున్నాయి. అది జీవితం కాదా.. మీరొక రకంగా తీసుకుంటారు జీవితాన్ని.. వీరొక రకంగా తీసుకుంటున్నారు జీవితాన్ని.. జీవిత ప్రయాణం అలాగే ఉంటుంది. మీదైన ప్రయాణం. మీదైన శైలిలో జీవిస్తున్నారు. అది చాలదా.. నీ బతుకు అయిపోగానే నీ చావు నువ్వే ఛస్తున్నావు కదా.. నీతోపాటు ఎవరూ చావటం లేదు కదా అలాగే నీ బతుకు నువ్వు బతుకుతున్నావు.. ఇది అర్థమయితే జీవితమంటే ఏమిటో అర్థమవుతుంది..

***మిసిమి : మీరు వేలకొద్దీ సంపాదకీయాలు రాశారు.. ఆధ్యాత్మిక గురువుల ప్రవచనాలు వేశారు.. ఒక్కొక్కసారి స్వాతి వారపత్రిక నాకు కాషాయం కట్టిన కాముకుడు అనిపిస్తుంది..***

**బలరామ్ :** అశ్విన్ బాగా చెప్పాడే స్వాతి గురించి (నవ్వు).. నువ్వన్నది ఒప్పుకుంటాను.. ఐ అగ్రీ విత్ యూ.. కాషాయం కట్టుకున్నవాడికి కాముకత్వం ఉంటుందని ప్రపంచం గుర్తించటం లేదు. కాముకుడే గొప్ప సన్యాసవుతాడని ప్రపంచానికి చెప్పాను నేను..

***మిసిమి : ఎక్కడో ఘంటసాల పాలెంలో బయలుదేరిన వేమూరి బలరాం ఎన్నో కష్టనష్టాలను భరించి తన అభిరుచిని సాకారం చేసుకున్నారు. డబ్బు సంపాదించటానికి కాదు.. డబ్బు బై ప్రోడక్ట్ ఇక్కడ.. అయినా చాలా మంది పారిశ్రామిక వేత్తల కంటే ఎక్కువ సంపాదించారు. మీరు ఆనందంగా ఉన్నారా! సుఖంగా ఉన్నారా?***

**బలరామ్ :** (కొంతసేపు నిశ్శబ్దం అనంతరం బలరామ్ గొంతులో దుఃఖజీర) ఆనందం లేదు.. సుఖం లేదు.. డబ్బుంది కానీ సంతోషం లేదు.. తెలుసుకున్న సత్యమేమిటంటే డబ్బు లేనివాడు తనకిష్టమైనట్లు బతుకుతాడు..

అలాంటి భార్యాభర్తలు కొట్టుకుంటారు.. తిట్టుకుంటారు. రాత్రయేసరికి మళ్ళీ ఒక్కటవుతారు.. ఆ పాయింట్ చెప్పటంలోనే సైకాలజిస్టులు సక్సెస్ అయ్యారు.

***మిసిమి : అయితే యువతను మీ దారిలో ప్రయాణించ వద్దంటారు.***

**బలరామ్ :** సక్సెస్ సాధించే క్రమంలో జీవితం చేజారి పోతుంది.. సక్సెస్ పొందిన వారి జీవితాలు చూడండి... కుటుంబ జీవితం నష్టపోతూ కనిపిస్తారు వారంతా.. బొమ్మ బొరుసులాంటి జీవితంలో బొరుసు చూసేవారికి బొమ్మంటే తెలీదు... భారతదేశంలో "బొరుసు" అనే సక్సెస్‌కే ప్రాధాన్యత ఉంది..

***మిసిమి : బలరామ్ గారు మీ వారపత్రికలో, పూర్వం ఆంధ్రజ్యోతి పురాణం సుబ్రహ్మణ్యం గారు ఎన్నో ప్రయోగాలను ఆహ్వానించేవారు. ఉదా : రావిశాస్త్రి, రంగనాయకమ్మ గారు, బీనాదేవి మొదలైన వారివి. మీరు ఇలాంటి ప్రయోగాలు ఎందుకు చేయలేదు? ఒకవేళ చేస్తే నాకు ఉదాహరణకి చెప్పండి. ఈ విషయం ఎందుకు అడుగుతున్నానంటే ప్రయోగాత్మకంగా రచనలను చేసిన కొంతమంది స్వాతికి పంపడానికి వెనుకాడినవారు నాకు తెలుసు. అందుకు అడుగుతున్నాను.***

**బలరామ్ :** సెక్స్ గురించి ఓపెన్‌గా మాట్లాడని మన దేశంలో సెక్స్ గురించి చెప్పింది నేనే కదా.. అది ప్రయోగం కాదా.. నువు ప్రపంచ విజేతవు కావొచ్చు.. మరి సంసార సుఖంలో ఎంతవరకు విజయం సాధించావు అన్న ప్రశ్న వేసింది స్వాతి కదా.. కాబట్టి మీరు ప్రయోగాలు చేయలేదు అనకండి.. ఇక ఆనందం అనే పాయింట్‌కు వస్తాను. సర్వే ఆఫ్ ఇండియాలో పనిచేసిన కాలంలో నెలకు నూట ఇరవై రూపాయల జీతంతో ఆనందంగా ఉండేవాడిని. ఎప్పుడైతే బెంజి కార్ వచ్చిందో అప్పుడు గంజి సౌభాగ్యం పోయింది. సర్వే ఆఫ్ ఇండియా రోజుల్లో తిరుమల వెంకన్న దర్శనానికి వెళ్ళినప్పుడు అక్కడ అజంతా హోటల్‌లో రెండు ప్లేటు భోజనాలు కొనే స్థోమత లేనప్పుడు ఇద్దరం ఏవో కారణాలు చెప్పి మా మణెమ్మకు తినిపించి మిగిలింది మేం తినేవాళ్ళం.. డబ్బు లేనప్పుడు మానవ సంబంధాలు గొప్పగా ఉంటాయి.. డబ్బుంటే ఆ సంబంధాలన్నీ డబ్బుతోనే ఉంటాయి.. మానవ సంబంధా లన్నీ ఆర్థిక సంబంధాలే అన్న కార్ల్ మార్క్స్ మాట నిజం రాజా... ఎప్పుడయితే డబ్బు ధ్యాసలో పడతామో అప్పుడు జీవితం పోతుంది.. అందుకే జీవితం బాగుండాలంటే ప్రకృతి ధర్మం ఆచరించాలి.. ఇదే ప్రకృతి చీకటి నిచ్చింది.. వెలుగునిచ్చింది..ఆ ధర్మాన్ని మనం కూడా పాటించాలి.. భగవంతుడు ప్రతి అవయవానికి ఒక పని కల్పించాడు. కన్ను పని కన్ను చేస్తుంది.. చేతి పని చేయి చేయాలి.. మనం అన్నీ కలిపేస్తున్నాం అది తప్పు..

***మిసిమి : మళ్ళీ పత్రికలోకి వస్తే మాలతీ చందూర్ మీరు పాత కెరటాలు శీర్షిక నిర్వహించారు. పాత ఇంగ్లీష్ నవలలు పరిచయం చేశారు. దాదాపు మూడు వందల యాభై నవలలు పరిచయం చేశారు.. ఇప్పుడవి ఆరు భాగాలుగా లభిస్తున్నాయి.. ఆవిడని ఎందుకు ఎంచుకున్నారో చెప్పండి!***

**బలరామ్ :** ఇంగ్లీష్ నవలలు అందరూ చదవలేరుకదా రాజా.. అందుకని పరిచయం చేయించాను.. మాలతీ చందూర్ అప్పటికే ఆంధ్ర ప్రభలో ప్రమదావనం శీర్షిక నిర్వహిస్తున్నారు. బాగా చదువుకున్నారు.. చదువుకు, జీవితానికి పెద్ద తేడాలేని వ్యక్తి వారు.. రచన వేరు.. పర్సనల్ జీవితం వేరు అంటారు.. చందూర్, మాలతీ అలా కాదు. పిల్లల్లేరు వారికి. ఒకరినొకరు బాగా ప్రేమించుకున్నారు.. వారి విశ్లేషణ న్యాయమైనది.. సత్యమైనది.. అందుకే పాఠకులు బాగా చదివారు వారి విశ్లేషణను.. చక్కటి తెలుగు రాశారావిడ..

***మిసిమి : మీరు వంశీ కథలు కూడా వేశారు.. అది కూడా ప్రయోగమేనా?***

**బలరామ్ :** అవును. లేడీస్ టైలర్ సినిమా సమయంలో పరిచయం.. అతనికి జీవితం తెలిసింది వేరు.. జీవించేది వేరు.. ఆ రెండింటికీ పొంతనుండదు.. అతను తన కథలన్నీ జీవితం నుంచి తీసుకున్నవే.. మంచి పేరొచ్చింది తనకు.. జీవితానికి, రచనకు సంబంధం లేకుండా బతుకుతాడు..

***మిసిమి : ముళ్ళపూడి రమణ చేత కోతి కొమ్మచ్చి రాయించారు..***

**బలరామ్ :** ఆయనో కాంప్లిమెంట్ ఇచ్చాడు రాజా.. మీ కోతికొమ్మచ్చి అద్భుతంగా ఉంది.. సర్క్యులేషన్ పెరిగింది. ఆపేశాక తగ్గింది అని నేననగానే స్వాతి వేయి స్థంభాల గుడి.. ఒక స్థంభం పోతే ఏమీకాదు అన్నాడు.. ఎంత గొప్ప ప్రశంస బాస్ అది..

***మిసిమి : మీరు పోటీలు బాగా నిర్వహిస్తారు మీ పత్రికలో***

**బలరామ్ :** రచయితలకు పారితోషికాలు "స్వాతి" చెల్లించినట్లు మరే పత్రికా చెల్లించలేదంటే అతిశయోక్తి కాదు. ఇరవైరూపాయలతో మొదలుపెట్టి యాభైవేల వరకు ఇస్తున్నాను. నేనెప్పుడు రచయితకు ముందే పారితోషికం పంపించేస్తాను. ఏదైనా ప్రోడక్టు కొన్నామనుకోండి.. ముందే డబ్బు చెల్లిస్తాం కదా. రచయితలకు కూడా ఆ గౌరవం ఇస్తాను..

***మిసిమి : మీరోసారి ఆర్టిస్ట్ ఈశ్వర్ గారికి లక్షరూపాయలు చెక్ పంపించారు. అనిల్ బొమ్మ వేసినందుకు ఆ పారితోషికం ఇచ్చారని ఈశ్వర్ చెప్పారు.. అది మీ ఔదార్యంగా భావిస్తాను.. ఇక మీరు షాడో మధుబాబు సీరియల్స్ చాలా ప్రచురించారు. అతన్ని పాఠకులకు కావలసిన వినోదం, సస్పెన్స్‌తో కూడిన సీరియల్స్ రాస్తున్నాడనా..***

**బలరామ్ :** రాజా. మధుబాబు కమిట్మెంట్ కలిగిన రచయిత. మధుబాబు రచన కావాలంటే స్వాతి చదవాలి అన్న భావన పాఠకుల్లో కలిగింది.. స్వాతి వేయిస్థంభాల్లో అతనొక స్థంభం.. గోరింగ్ అని ఒక మిత్రుడుండేవాడు. అతని అసలు పేరు వేమూరి రాజేంద్రప్రసాద్.. అతను నేను కలిసి మా స్కూల్‌కు ఎదురుగుండా సందు చివర లైబ్రరీలో యద్దనపూడి, రంగనాయకమ్మ, పుస్తకాలతో పాటు మధుబాబు, భగవాన్ డిటెక్టివ్ నవలలు చదివేవాళ్లం.

***మిసిమి : మీరు వేదికల మీద కనపడరు..కారణం?***

**బలరామ్ :** అవసరం లేదనుకుంటాను. నేను చెప్పదలుచు కున్నది చెప్పేందుకు పత్రిక ఉంది కదా.. దాని ద్వారా కమ్యూనికేట్ చేస్తాను. ఇక వేదికలెక్కడం ఎందుకు?

***మిసిమి : మంత్లీ నడుపుతూ వీక్లీ వైపొచ్చారు.. ప్రత్యేక కారణం ఉందా?***

**బలరామ్ :** పాఠకులు కోరారు.. అదే కారణం.. నెలవరకు వెయిట్ చేయటం కంటే వారం వారం సంచిక కావాలన్న డిమాండ్ పాఠకులు క్రియేట్ చేసిందే..

***మిసిమి : అదే సమయంలో ఆంధ్ర జ్యోతి, ఆంధ్ర పత్రిక ఆగిపోవటం కూడా మీకు కలిసొచ్చినట్టుంది.. ఆ రెండింటికీ లక్షన్నర సర్క్యులేషన్ ఉండేది.***

**బలరామ్ :** అవును రాజా.. ఇప్పటికీ నా మానస పుత్రిక స్వాతి మంత్లీయే.. స్వాతి మంత్లీ మొదట శీలా వీర్రాజు ఎడిటర్‌గా ఉన్నారు.. ఆయన చాలా బాధ్యత తీసుకున్నారు. ఆయన రాంకోటిలో ఉండేవారు.. ఒకసారి ఆదివిష్ణు రాసిన "తాళంచెవి" కథ వేశాను. ఆయనకు ఆ కథ నచ్చలేదు. బూతుకథ అని ఫీలయ్యారు.. అయితే ఆ కథలో ఓ పాయింట్ ఉంది. అది నచ్చి వేశానని ఆయన గ్రహించలేదు.

***మిసిమి : నేను వారితో బొమ్మలు కూడా వేయించాను మా కోసం. కొవిడ్ తర్వాత కొన్ని పత్రికలు కనుమరుగయ్యాయి. ఉన్నవాటికి సర్క్యులేషన్ తగ్గింది.. స్వాతి పరిస్థితి ఏమిటి..***

**బలరామ్ :** స్వాతి సర్క్యులేషన్ కూడా తగ్గింది..

***మిసిమి : బాధ పడుతున్నారా?***

**బలరామ్ :** బాధెందుకు.. అంతా ఆ తల్లే ఇచ్చింది.. మళ్లీ తీసేసుకుంటోంది అనుకుంటాను.. తల్లి మనల్ని కని, పెంచి, పెద్ద చేసి అన్నీ నేర్పిస్తుంది.. ముసల్దయిపోయిందని వదిలేస్తామా! లేదు కదా.. పత్రికా అంతే.. అన్నదాత ఆగిపోయిందని తెలిసినప్పుడు ఏడుపొచ్చింది నాకు..

***మిసిమి : మీరు సేవాకార్యక్రమాలు చేశారా?***

**బలరామ్ :** యాభై లక్షలతో అనిల్ -స్వాతి-బలరాం ఫౌండేషన్ నెలకొల్పి రెండు రాష్ట్రాల నుంచి పాతిక మంది బాలికలకు, ఇంకో పాతిక మంది బాలురకు కేష్ అవార్డులు ఇచ్చాను.. పాశ్చాత్య దేశాల్లో లిఫ్ట్ ఎక్కుతూ థ్యాంక్యూ అంటారు.. దిగుతూ థ్యాంక్యూ అంటారు.. ఎన్నో దేశాలు చూసినవాడిగా చెబుతున్నాను. మనకా సంస్కృతి లేదు.. ఉంటే బావుంటుంది.. ఈ ఇంటర్వ్యూ కోసం **మిసిమి** నుంచి అశ్వినీ కుమార్ ఎన్నో సార్లు ఫోన్ చేశాడు. నేను మాటలతో చంపేస్తానో, బోర్ కొట్టిస్తానో తెలియకపోయినా (నవ్వు).. వెంట ఇంకో ఇద్దరిని తీసుకొచ్చాడు ధైర్యం కోసం.. అది పక్కన పెట్టేస్తే కళాజ్యోతి ప్రెస్ చాలా విలువైనది బాస్.. మిగిలిన ప్రెస్‌ల లాంటిది కాదు.

***మిసిమి : స్వాతికి మీ వారసులు ఎవరనుకుంటున్నారు?***

**బలరామ్ :** మా కూతురు మణెమ్మ చనిపోయింది.. ఇద్దరు మనవరాళ్ళున్నారు... ఇద్దరికీ పెళ్ళయ్యింది..పెద్ద మనవరాలు డాక్టర్.. చిన్న మనవరాలికి ఇంట్రెస్ట్ ఉంది.. ఈ బాధ్యతను తను తీసుకుంటుందనుకుంటున్నాను.. కళాజ్యోతి అధినేత బాపన్న గారు ఎలా ఉన్నారు!

***మిసిమి : బాపన్న గారు చక్కగా ఉన్నారు. తన బాధ్యతలు తరువాతి తరానికి అప్పజెప్పి, విశ్రాంత జీవితాన్ని తనకు నచ్చినట్లుగా గడుపుతున్నారు..***

**బలరామ్ :** మన పిల్లలు అమెరికాకి వెళుతున్నారు. మంచిదే. అక్కడ ఎంతో కష్టపడుతున్నారు. ఎంతో క్రమశిక్షణతో మెలుగుతారు. ఇక్కడ కూడా అలా ఉంటే ఎంత బాగుంటుంది అనిపిస్తుంది ఒక్కోసారి.. ప్రపంచమంతా చూసిన అనుభవంతో చెబుతున్నాను..

***మిసిమి : మా రామరాజు గారు, మిమ్మల్ని ఒక ప్రశ్న వేస్తారు..***

**"మానవ సుస్థిరతకై కొత్త స్వాతి చినుకులు వేమూరి జీవితపు బరువు మేఘం నుండి పైన బెజవాడ అమ్మవారి ఆశీస్సుల కన్నీరు కొంచెం తెలుగు నేలను తడిపి కొత్త కాపురాలను నిలబెట్టే ముల్లోకాల సతీపతుల సకల నదుల కుంభలో స్నానమాచరించ బలమివ్వగలరా బలరామ్ గారంటూ ఆశిస్తున్నాడీ రామరాజు"**

**బలరామ్ :** గాడ్ బ్లెస్ యూ నాన్నా.. ఇదీ విల్ పవర్ అంటే.. ఎవరో ఇస్తే వచ్చేది కాదు.. మనలోంచి.. మన మనసులోంచి వచ్చేది.. బాధా మన సొంతమే.. నవ్వు మన సొంతమే.. అలాగే సెక్స్ కూడా.. దానికి శాస్త్రీయ కారణాలు చెప్పాడు సమరం.. మనసుంది కాబట్టి మానసిక సమస్యలుంటాయి.. వాటిని విశ్లేషణ చేసి పరిష్కారాలు చెప్పాడు డా.ఇండ్ల రామసుబ్బారెడ్డి.. కళ్ళు, ముక్కు, చెవులు లాగే మనసు కూడా శరీరంలో ఒక భాగమేనని గుర్తుంచుకోవాలి నాన్నా. అందుకే దానికి బాధలు ఉంటాయి.. ఇప్పుడు మొగుడు పెళ్ళాలు సంపాదనలో పడిపోయారు. కూతుళ్ళను, కొడుకులను అమెరికా పంపించటంలో మునిగిపోతున్నారు.. అదే పెద్ద టార్గెట్ ఇప్పుడు.. అదే పెద్ద విజయం.. అదే ఆనందంగా భావిస్తున్నారు.. అది తప్పు.. ఈ ప్రాసెస్‌లో మన జీవితాన్ని మనం కోల్పోతున్నాం..

***మిసిమి : జీవితం సరసమైన కథలా లేకపోవడానికి కారణం ఏమిటంటున్నాడు మా రాంబాబు***

**బలరామ్ :** ఎందుకంటే ఎవరికి వారు నా వ్యక్తిత్వానికి భంగం కలగకూడదనుకుంటున్నారు. అది కొంతవరకూ రైటే.. దాంతోటి కొంతకాలం తర్వాత వారిని బోర్ డమ్ ఆవరిస్తోంది. దాంతో మార్పు కావాలనుకుంటున్నారు.. దాంతోటి ఫెయిల్యూర్ దిశగా సాగుతున్నారు.. నేనే ఒక ఉదాహరణ..

***మిసిమి : డూ యూ రిగ్రెట్ యువర్ సక్సెస్?***

**బలరామ్ :** అవును.. సక్సెస్ ఎపుడూ పబ్లిక్ ఎఫైర్.. ఫెయిల్యూర్ మాత్రం పర్సనల్.

***మిసిమి : మీ అభిరుచులు చెప్పండి***

**బలరామ్ :** నా పర్సనల్ టేస్ట్ అంటూ ప్రత్యేకంగా ఏమీలేదు రాజా.. వర్క్.. వర్క్.. మోర్ వర్క్.. డబ్బులేని కాలంలో నా కుటుంబ జీవితం బావుండేది.. నా అభిరుచులు కూడా అప్పుడే ఉండేవి. నూట ఇరవై రూపాయల సర్వే ఆఫ్ ఇండియా జీవితం గొప్పగా ఉండేది...

***మిసిమి : స్వాతి మాసపత్రిక సక్సెస్ అవటానికి టైం పట్టిందా?***

**బలరామ్ :** అవును బాస్.. టైం పట్టింది.. నా కాంపిటీటర్స్ ఆంధ్రపత్రిక, ప్రభ, జ్యోతితో పోటీ పడాల్సి వచ్చింది. మంత్లీలో బాపు రమణల జ్యోతి, జయశ్రీ వంటి వుండేవి.. యాభై ఐదేళ్ల పాటు వేరే ఆలోచన లేకుండా కళ్ళకు గంతలు కట్టిన గుర్రంలా నా మనసుకు గంతలు కట్టుకుని ఒకటే పరుగు.. అలుపు లేని పరుగు.. స్వాతి ఒకటే లక్ష్యంగా ఆ పరుగు సాగుతూనే ఉంది..

***మిసిమి : మిమ్మల్ని చాలా మూడీ అంటారు..***

**బలరామ్ :** మూడీ అంటే బాడీ, మైండ్ ఒకే తీరుగా ఉండవు కదా రాజా.. నా ఫీలింగ్స్‌ను దాచేసుకుని నటించనెప్పుడూ.. ఒక్కడినే ఉన్నప్పుడు నేనెలా ఉంటానో అందరిలోనూ అలానే ఉంటాను..

***మిసిమి : చాలా మంది రచయితలు ఎడిటర్లను కలుస్తారు. మిమ్మల్ని కలవాలంటే మాత్రం సంకోచిస్తారు..!***

**బలరామ్ :** మీ గురించి మీ రచన చెప్పాలి కానీ, నన్ను కలిసి కన్విన్స్ చేస్తే ఏమిటి లాభం.. మీకు, నాకు ఇద్దరికీ టైం వేస్ట్ కదా.. మీరు నన్ను ఇన్ ఫ్లూయెన్స్ చేస్తారన్న భయం కూడా ఉంటుంది. నన్ను కలిసి మీ రచనలోని గొప్పదనం నాకు చెప్పి ఒప్పిస్తే అది నేను పబ్లిష్ చేసినప్పుడు లక్షలాది పాఠకులను చేరుతుంది కదా.. అది వారికి నచ్చకపోతే ఇద్దరికీ నష్టమే కదా. ఇది నా ఫిలాసఫీ.. అందుకే మీ రచన మాట్లాడాలి.. మీరు నన్ను కలిసి మాట్లాడటం కాదు అంటాను.

***మిసిమి : ప్రతి వారం వచ్చే వీక్లీని ఎలా మేనేజ్ చేస్తారు?***

**బలరామ్ :** ఒక డాక్టర్ తన అనుభవంతో రోగ లక్షణాలు ఎలా పసిగడతాడో..అలా ఇన్నేళ్ళ అనుభవంతో స్క్రిప్టు ఎలా ఉంటుందో చెప్పేయగలుగుతాను..

***మిసిమి : రోజుకు ఎన్ని గంటలు పనిచేస్తారు.?***

**బలరామ్ :** మూడ్ వచ్చినప్పుడు పనిచేస్తాను. తర్వాత అంతా అడ్మినిస్ట్రేషన్.. అయినా పనిచేయకపోతే వీక్లీ సరిగ్గా రాదు కదా... అప్పుడు పక్కన పడేస్తారు (నవ్వు). ఆ భయం ఎప్పుడూ ఉంటుంది.. కథలు అన్నీ నేనే చదువుతాను.. ఒక పేరా చదివితే చాలు కథ క్వాలిటీ తెలిసిపోతుంది. కూరలో ఉప్పు తక్కువైందా కారం ఎక్కువైందా అన్నట్లు చెప్పేయగలను. ఆ గుణం ఆ తల్లి ఇచ్చింది...

***మిసిమి : ఆరోగ్యం ఎలా ఉంది బలరాం గారు?***

**బలరామ్ :** ఆరోగ్యం బానే ఉంది.. బి.పి., షుగర్ సమస్యలు ఈ వయసులో తప్పవు కదా. మనుషులం కదా.. అవన్నీ భరించక తప్పదు..

***మిసిమి : మరి మాకు ఇంత సమయం కేటాయించి, మంచివో చెడ్డవో..మా అన్ని ప్రశ్నలకు ఓపిగ్గా సమాధానాలు ఇచ్చారు.. జీవిత సత్యాలు చెప్పారు.. డబ్బు విలువ చెప్పారు.. అది ఏం చేస్తుందో అనుభవపూర్వకంగా చెప్పారు..***

**బలరామ్ :** మళ్ళీ మనం చాలా కాలానికి కలుసుకుని మాట్లాడుకున్నాం..నా అనుభవాలు నేను చెప్పాను. మీ అనుభవాలు మీరు చెప్పారు.. నేను ఎలా ఉన్నానో అలానే ఉన్నాను.. అశ్వినీ కుమార్ ఎలా ఉన్నాడో అలా ఉన్నాడు.. అదే ముఖ్యమనుకుంటాను.. వయసు మారుతుందేమో కానీ వ్యక్తిత్వం మారకూడదు

***మిసిమి : చివరిగా మిసిమి గురించి చెప్పండి?***

**బలరామ్ : మిసిమి** అంటే నాకెంతో గౌరవం రాజా..

సాహిత్య పరంగా.. గౌరవప్రదంగా "**మిసిమి**" మాది.. నేనే ఎడిట్ చేస్తున్నాను అన్నంత ఆనందాన్ని కలిగిస్తుంది.. **మిసిమి** యాజమాన్యం కళాజ్యోతి వారి మంచితనం, ప్రేమ పత్రికలో కనపడుతుంది.. మనమేమిటో మన పత్రిక తెలియచెప్పాలి. ఆ పని **మిసిమి** అద్భుతంగా చేస్తోంది.. ఎంతో కమిటెడ్‌గా, ఒక దృఢ సంకల్పంతో **మిసిమి** ని తీర్చిదిద్దుతున్న కళాజ్యోతి వారికి అభినందనలు..

***మిసిమి : చాలా చాలా కృతజ్ఞతలు.. ధన్యవాదాలు వేమూరి బలరామ్ గారు.. నమస్కారం ..***

*(తరువాత ఆలింగనాలు, ఫొటోలు... మళ్ళీ ఆలింగనాలు! ఫొటోల కోసం చొక్కా మార్చనా అన్నప్పుడు నీకు అలంకారాలెందుకు రాజా అన్నాను. లిఫ్ట్ వరకూ వచ్చి నవ్వుతూ, బాధపడుతూ (వెళ్లిపోతున్నందుకు) నన్ను నిలువునా కౌగలించుకుని, నలభై ఏండ్ల స్నేహాన్ని అంతే తాజాగా ఫీలవుతూ, మనసారా నవ్వుతూ, మనసుతో కన్నీరు పెడుతూ పంపిస్తున్న స్వాతి బలరామ్‌ని వయసు మళ్లిన సింహరాజాన్ని తన నెలవులో వదిలి వస్తున్నట్లు వచ్చేసాను. తరువాత చాలాసేపు మనసంతా బరువుగా గతంలోకి టైమ్ ట్రావెల్ చేసింది.)*

సంభాషణ : అశ్వినీకుమార్

ధ్వని ముద్రణకు రాతప్రతి : సి.ఎస్. రాంబాబు

## తెలుగురాత రాతిగుడిలో-కొన్నిస్వాతి చినుకులు-
## మిసిమి అశ్వపుజూలు తడిముడిలో-శ్రీ వేమూరి బలరాం గళం!

**కు**మార్, కుమార్ అంటూ 45 సం పిదప భంగమైన ఓ మౌనం, మరల ఇదే తమిద్దరు ఇన్నాళ్ళకు కలసిన వైనం, ఆ వేమూరి బలరాములు నిజంగా ఓ కరిగిన మైనం. కడుమెత్తగా మొత్తం ఇంటర్వ్యూలో ఎవరు ఎవరని చేస్తున్నారో! ఆ కళాజ్యోతి - స్వాతిచినుకుల జోరుగానం! ఆ తెలియని స్థితి వీక్షించే మాకు (రాంబాబు&రామరాజులకు), వారిద్దరూ ఒకోసారి నవ్వుల నవయువకులుగా, మరోసారి శ్రమతెలియని శ్రామికులుగా, అలుపెరగని అంతంలేననేక జీవరసపు ప్రయాణికులుగా మరియు తదుపరితరాలకు వెలుగులిచ్చే దార్శినికులుగా గాంచినాము. "వీరిద్దరూ అజ్ఞాత వ్యక్తిలుగా ఎవరు? కూమార్!" నీతో వచ్చేరంటే తన సన్నిహితులు అనే పలకరింపుగా- మధ్యలో, "ఒకరు రాంబాబులు మరొకరు రామరాజులు-ఇద్దరూరామచంద్రులే" ఎ.కె వక్కానించడం."అయితే మేము (ఎ.కెతో కలుపుకొని) రావణులమ్" యని స్వాతి మెరవడం."అయ్యా ! మేముసు(శు)ద్ధ క్షత్రియ బ్రాహ్మణలమ్" గోదారివరదలో కొట్టుకొని పోలేని ఎన్నడు వదలని దురదతో నేనన్నాను. అయితే అన్నట్లుగా:



**మా విజయవాడ కొండపై-అమ్మవారు,**
**క్రిందపారేకృష్ణమ్మ అలల కొమ్మవారు**

గీచిన కళాబొమ్మలు మేమన్నారు-ఆ బలరామ్-తన కుమార్ని కౌగలించుకొంటూ మిగతా ఇంటర్వ్యూ వివరాలు - **మిసిమి** ఎ.కె ఎడిటోరియల్ మరియు సి.యస్ రాతలలో చదవగలరని చెబుతూ-నేను అక్కడక్కడే అంతా ఒక మరల అడిగిన ఓ వదలని ప్రశ్నగా-సార్! మన 'బూమర్' కాలపు గ్లామర్ స్వాతి చినుకులు ఇప్పటి 'జూమర్' నేలపు గ్రామర్ రాతి ఇటుకులులో ఎండి పోతుందని కాదనలేము?- ఎందుకు సరసమైన సనాతనకథ-నిత్యవధగా విడాకులు పెడాకులు బ్లాక్ మైయిల్లు రైల్లు- కన్నవారి కంటున్నకలలలో పరిగెత్తిస్తున్నారు?

మరీనూ-మారో, మెట్రో మని-మనతరం సామాజిక ప్రశ్నగా -గోర్, వైలెన్స్ ,ఫిల్త్ భాషంటూ సినిమా వేలకోట్ల మార్కెట్ -కానరాని కేస్ స్టడీ గా తీసే వ్యాపారపువారిదా?- చూసే వైపరీత్యపు వినియోగదారులదా?

ప్రభుత్వమే-ప్రజలపరిపాలనగా మన ప్రజాసామ్యం-ఏమి ఈ పరిమాణం? సెన్సార్ వారికి లెన్స్ (కనులు) కు- ఇంత వైలెన్సా? మహాత్ముని నాన్-వైలెన్స్ - మన లేడీస్- జెంటిల్ మెన్స్‌కి సామాజిక సహానుభూతి మటుమాయం? అరవదా'అరసం'? విప్పదా విరసం?ఎన్నాళ్లు ఈ నీరసం ? కానరాని కన్నీళ్ళ కళాసరసం?- ఏ మహర్షి శాపం?

మన ప్రస్తుతం-మన మానవ సుస్థిరతకై కొత్త స్వాతిచినుకుల రచనలు - వేమూరి బలరాముల జీవితపు బరువు మేఘం నుండి పైన బెజవాడ అమ్మవారి ఆశీసుల కన్నీరుగా- కొంచెం తెలుగు నేలను తడిపి కొత్తకాపురాలను నిలబట్టే - ముల్లోకాల సతీసతులు - సకల నదుల సంగమ కుంభలో స్నానమాచరించ! మీ ఆఖరి బలమివ్వ గలరా?- అయ్యా! వేమూరి బలరామం - సార్ ! యని ఈ రామరాజు ఆశిస్తున్నారు-ఓ **మిసిమి** &స్వాతి చదువరునిగా!

ఆయన జవాబుగా ఇంచుమించు-ఎ.కె & సి.యస్ రాసిన వాటిలో దాగుంది, మరల క్లుప్తంగా ముగిస్తూ:

అలా 'స్వాతి అనిల్ 'బిల్డింగ్ దిగుతూ ఓ థ్రిల్ గా గాంచిన రోల్స్ రాయిస్!
అ 'నిల్'గా అంతా శూన్యంలో ఆడుకొంటున్న చింతనాత్మక ఆ జేమ్స్ జాయిస్?

స్వాతి అక్షరనక్షత్రం కొత్తవెలుగు మెరవాలి, తెలుగు నవతరం తరించాలని తలస్తూ, ఇంతకూ అశ్వినికుమారులు **మిసిమి** ఎడిటరా? మీడియేటరా? ఎందుకంటే శ్రీ వేమూరి బలరాం చెబుతూ రాజా ! **మిసిమి** నెలనెలా కాసే వెన్నల పుత్రిక కవర్ చూస్తూ నేనే కళాజ్యోతి పత్రికకు ఎడిటర్ కదాయని తన సొంతంగా భావిస్తారట!

***- ఐ.వి.రామరాజు (9912644386)-మిసిమి తరుపున***

# మధుర విజయం

– వేలూరి కృష్ణమూర్తి

'మధుర విజయం' లేదా 'వీర కంపరాయ చరిత్ర' విజయనగరాధీశుడగు శ్రీ బుక్కరాయల కోడలు, కంపరాయల ధర్మపత్ని శ్రీమతి గంగాదేవి తొమ్మిది సర్గలలో, సంస్కృతంలో రచించిన మహా కావ్యం. ఇది అరవీడు రాజవంశంవారి ప్రారంభ కాలపు విజయనగర చరిత్ర. ఇది, విదుషీమణి గంగాదేవి తన భర్త శ్రీ వీరకంపరాయలు, మధురను–ఆ సమయంలో మధురను పాలిస్తున్న సుల్తానుపై విజయం సాధించి అతడిని చంపి మధురను విజయనగర రాజ్యంలో కలిపిన వృత్తాంతమును వర్ణించి చెప్పిన కావ్యం.

ఓరుగల్లు ప్రాంతానికి చెందిన గంగ లేక గంగాంబిక విశ్వనాథ కవిరాజు లాంటి పండిత పోషణలో పెరిగిన స్వతంత్ర ప్రవృత్తి కల ఆంధ్ర వనిత, సౌందర్యవతి, అభినవ సంగీత సాహిత్య సకలకళా సరస్వతి. రుద్రమదేవి రాజ్యంలో పెరిగిన వీర వనిత. ఈ అపురూప సౌందర్య రాశి, సర్వజ్ఞురాలిని విశ్వనాథ కవిరాజు శ్రీ బుక్క రాయల యాశ్రయమునకు పంపగా, బుక్కరాయలు ఆమెను తన దేవేరి దేవాయీ మహాదేవి సంరక్షణలో వుంచాడు. అయినా, ఆమె అంతఃపుర కన్యగా పెరుగలేదు. సకలకళా విదూషియైన గంగ లేక గంగాంబిక రాజవంశం వారి ఆశ్రయంలో వుంటూ తన సాహిత్య, సంగీత, నాట్య కళల సంస్కార చిత్త వృత్తిని ప్రదర్శిస్తూ గడిపింది. ఒక సాంస్కృతిక సందర్భంలో బుక్కరాయల జ్యేష్ఠ పుత్రుడు వీరకంపన ఆమె నృత్య ప్రదర్శనతోపాటు సంగీత సాహిత్య ప్రతిభలను గమనించి ఆమెను 'గంగాదేవి' అని సంభోదించగా, దానికి జవాబుగా ఆమె, 'ఋషీణాం పునరాధ్యానాంవాచ మర్థో సుధావతి' (ఋషులనోట వచ్చిన మాట జరిగితీరునన్న) అను భవభూతి శ్లోకం చెప్పినది విన్న కంపన ఆమె సంస్కార చిత్తవృత్తికి చకితుడై, 'కాదు దేవీ! 'లౌకికానాం హిసాధూనా మర్థం వాగను వర్తతే' (లౌకికులైన సత్పురుషుల వాగ్లక్షణమని) నిరూపించే భవభూతి శ్లోకపు పూర్వార్థమును ఉచ్చరించెను. అనంతర కాలంలో ఆమెకు గంగాదేవి నామమే స్థిరపడింది. ఒక సందర్భంలో గంగాదేవి వీర కంపనతో యిలా అంటుంది: 'ప్రభూ! నేను ఓరుగంటి గడ్డపై జన్మ మెత్తితిని. రాణి రుద్రమకు వీరత్వము నుగ్గుబాలతో బెట్టిన తల్లి ఆ కాకతీయ ధాత్రి. రాణి రుద్రమ క్షాత్రశక్తి నాకు రక్ష. ప్రభువులు యువరాజులని, సౌందర్యవంతులని, సంగీత–సాహిత్య రసజ్ఞులని మాత్రమే కాదు, మహా వీరులని, తమ అప్రతిమాన వీర తేజము కనులలో గాంచి మోహ పడితిని. నేను ధన్యురాలిని.' అప్పటికే వీర కంపనకు వివాహమై వున్నందున, అనంతర కాలంలో గంగాదేవిపై కంపన ప్రేమ ఇనుమడించి ఆమె అతని మరొక భార్య అయింది. గంగాదేవి తన 'మధుర విజయం' కావ్యంలో విజయనగర సామ్రాజ్యం చారిత్రిక నేపథ్యం, మొదటి బుక్కరాయల దయాదాక్షిణ్యాల పాలన, బుక్కరాయల కుమారుడు కంపనరాయల పుట్టుక, ప్రారంభ జీవితం గురించి రసవత్తరంగా తెలుపుతుంది. అనంతర పద్యాలలో కంపనరాయ యుక్త వయసు వచ్చినప్పటి చర్యలు, అతడు దక్షిణంవైపు గైకొన్న దండయాత్రలో మొదలు కాంచీపురంపై విజయం సాధించి సాంబువ రాయుడిని లొంగదీసుకొన్న సంగతిని వివరిస్తుంది. కంపనకు తన కలలో మారువేషంలో వచ్చిన దేవత మధుర మీనాక్షి, మహమ్మదీయ సుల్తానేట్ పాలననుండి మధురను, దక్షిణ భారత దేశాన్ని విముక్తి చేయమని ఆదేశిస్తుంది. అలా కంపనరాయ దక్షిణాది ముస్లిం పాలకులపై దండయాత్ర ప్రారంభించి ముస్లిం సైన్యాలను నాశనం చేసి శ్రీరంగం ఆలయాన్ని మునుపటి వైభవానికి పునరుద్ధరిస్తాడు. గంగాదేవికి ఆనాటి రాజకీయ స్థితిగతుల అవగాహన ముఖ్యంగా దక్షిణాన మహమ్మదీయుల పరిపాలనలో జరుగుతున్న అరాచకాలు, కుట్రలు బాగా అవగతమనిపిస్తుంది.

క్రీ.శ. 14వ శతాబ్ద కాలంలో రాజపరివారానికి చెందిన ఒక స్త్రీ ఇలాంటి ఒక కావ్యం సంస్కృతంలో రచించడాన్ని, ఆనాటి పండితుల గమనాన్ని లాగుతుంది. S.K. De మరియు S.N. Daspupta రచించిన

History of Sanskrit Literature గ్రంథంలో 'మధురా విజయం' గురించి వ్రాస్తూ, 'గంగాదేవిప్రతిభావంతురాలైన కవయిత్రి' అని కొనియాడారు. శ్రీ M. కృష్ణమాచారి గారు తన History of Classical Sanskrit Literature గ్రంథంలో 'మధుర విజయం' శ్రావ్యమైన పద్యాలతో కూడిన కథనమని' వర్ణించాడు. తన కృతిలో శ్రీ M. కృష్ణమాచారి గారు యింకా యిలా చెబుతాడు: 'ఆ సమయంలో మధురను పరిపాలిస్తున్న మహమ్మదీయులను నిర్మూలంచేసి దేశాన్ని ప్రాచీన వైభవానికి పునరుద్ధరించాలని వీరకంపరాయుడి కలలో ఒక దేవత చేసిన ప్రబోధంతో ప్రేరణ పొంది, దక్షిణాదికి సేనతో వెళ్ళి మధుర సుల్తానును చంపి, దేశంలోని అన్ని దేవాలయాలకు కానుకలు సమర్పించిన' అతని విజయ పరంపరను తెలిపే కావ్యం 'మధుర విజయం' అని వ్రాశారు.

13వ శతాబ్దం చివరలోనూ, 14వ శతాబ్దం ప్రారంభంలోనూ వున్న కాకతీయ ప్రభువు ద్వితీయ ప్రతాప రుద్రుని కాలంలో అతని ఆస్థానంలో వున్న ఎందరో విద్వన్మహాకవులలో శ్రీవిశ్వనాథుడితోపాటు వున్నవారిలో ఒకరు అగస్త్య పండితుడు. అతడు బహు గ్రంథ కర్త (74 కృతుల రచయిత). ఈతని ప్రతిభా పాండిత్యాలను, బహు గ్రంథ కర్తుత్వాన్ని ఉగ్గడిస్తూ గంగాదేవి తన 'మధుర విజయం' కావ్యంలో యిలా చెబుతుంది:

**చతుస్సప్తతి కావ్యోక్తి, వ్యక్త వైదుష్య సంపదే అగిస్త్యాయ జగత్యస్మిన్ స్పృహయేత్ కోన కోవిదః'** (మధురా విజయం 1-14) ఈ సంస్కృత కావ్యం ఎక్కడ, ఎప్పుడు, ఎలా లభించింది?

క్రీ.శ1916లో తిరువనంతపురంలోని ఒక ప్రయివేటు సంప్రదాయ గ్రంథాలయంలో 'మధుర విజయం' సంస్కృత కావ్యం 61 తాళ పత్రాల ఒకే వ్రాతప్రతి రూపంలో పండిట్ రామశాస్త్రి వారిచే కనుగోబడింది. ఈ కావ్యానికి సంబంధం లేని రెండు యితర రచనల మధ్య ఈ కావ్యం తాళ పత్రాల గ్రంథం బంధించబడింది. 500 బేసి పద్యాలు కలిగివున్న ఈ కావ్యం 9 కాంటోలలో (అధ్యాయాలలో) రూపొందించ బడింది. ఈ కావ్యంలోని కొన్ని పద్యాలు అసంపూర్తిగానూ, మరికొన్ని పూర్తిగా పాడైపోయాయి. ఈ కావ్యం రెండు వ్రాత ప్రతులు తిరువనంతపురంలో వుండి, మూడవ ప్రతి లాహోర్‌లో (7 కాంటోలు మాత్రం) వున్నదట. 'మధుర విజయం' సంస్కృత కావ్యం అనువాద ప్రక్రియ, ప్రచురణ 1916లో తాళపత్రాల రూపంలో కనుగోబడిన ఈ సంస్కృత కావ్యాన్ని మొదలు 1924లో Sreedhara Press వారు ప్రచురించారు. MADHURA VIJAYA or VIRAKAMPA RAYA CHAR ITRA: A Historical Novel By Ganga Devi, అన్న పేరుతో G. Harihara Sastry & V. Srinivasa Sastry గార్ల సంయుక్త సంపాదకత్వంలో ఇంగ్లీషుకు అనువాదం చేయబడింది. ఈ ఇంగ్లీషు అనువాద కృతిని Sreedhara Power Press తిరువనంతపురం వారు Sanskrit Textతో పాటు 1924లో 1957లో ప్రచురించారు.

ఈ సంస్కృత కావ్యం గురించి వివరాలు బయటపడగానే ఆనాటి పండితుల గమనాన్ని ఆకర్షించింది. ఈ సంస్కృత కావ్యానికి తెలుగులో కొన్ని పద్య, గద్య రూపాలు వచ్చాయి. అలాగే హిందీలోనూ వచ్చాయి. ఆశ్చర్యమంటే కన్నడ రాజ్య వంశానికి చెందిన ఈ కావ్యాన్ని ఎవరూ యిప్పటివరకూ కన్నడ భాషకు అనువాదం చేసినట్టు లేదు. మరొక ఆశ్చర్యం కలిగించే సంగతంటే, Oxford University Press కోరికపై 1991లో శ్రీమతి %Susie Tharu and K.Lalita సంయుక్తంగా సంకలనం చేసిన WOMEN WRITING IN INDIA: 600 B.C. TO THE EARLY 20th CENTURY (Volume I) అన్న 500 పుటలకు పైబడిన బృహత్ గ్రంథంలో శ్రీమతి గంగాదేవి సంస్కృతంలో రచించిన 'మధుర విజయం' గురించి ఎలాంటి విషయం గాని దాని ప్రస్తావన గాని తెలుపలేదు. ఉర్దూ, మరాఠీ, హింది అలాగే కొన్ని భారతీయ భాషలలో స్త్రీల రచనలను గురించి మాత్రం ప్రస్తావించారు. కాని సంస్కృతం గురించి గాని ఆ భాషలో వ్రాసిన స్త్రీల గురించి గాని ఎలాంటి వివరణలు లేవు. శ్రీమతి గంగాదేవి రచించిన 'మధుర విజయం' సంస్కృత కావ్యం గురించి వివిధ భాషలలో వచ్చిన కృతులు యిలా వున్నాయి:

మొదలుగా విజయనగరానికి చెందిన అరవీడు రాజవంశం గురించి 1927లో ప్రచురింపబడిన Henry Heras (who was a Spanish-Indian Jesuit priest, archeologist, and historian based in India) రచించిన The Aravidu Dynasty of Vijayanagar చరిత్రలో

గంగాదేవి 'మధుర విజయం' సంస్కృత కావ్యాన్ని ఆంగ్లం లోనికి వచన రూపంలోఅనువదించారు.

1957 గంగాదేవి 'మధుర విజయం' సంస్కృత కావ్యాన్ని ఇంగ్లీషుకు ఎస్.తిరువెంకటాచారి అనువదించి సంకలనం చేశారు. అన్నామలై యూనివర్సిటీవారు (G.S. Press, Madras) ప్రచురించారు.

**1960 మధుర విజయము - రచన :** తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి:శ్రీ వేదం వెంకటరాయశాస్త్రిగారి (శాస్త్రి గారి మనవడు)28 పుటల సుదీర్ఘ వ్యాఖ్యానంతో తెలుగు చంపూ కావ్యంగా ప్రచురింప బడింది.

**1966 మధుర విజయం-రచన :** పోతుకూచి సుబ్రహ్మణ్య శాస్త్రి, విపులమైన ఆంధ్ర భావ ప్రకాశిక వ్యాఖ్యానంతో అజంతా ఆర్ట్ ప్రింటర్స్, కొల్లూరు, తెనాలి వారు ప్రచురించారు.

**1969 మధుర విజయము :** ఈ సంస్కృత కావ్యాన్ని కవిసామ్రాట్ శ్రీ విశ్వనాథ సత్యనారాయణ గారు ఈ సంస్కృత కావ్యంలోని రసవత్తరమైన శైలికి అచ్చెరువొంది తన శిష్యుడు శ్రీ పేరాల భరత శర్మతో ఈ కావ్యాన్ని తెలుగుకు అనువాదం చేయమని ఆదేశించి నందున, శ్రీ శర్మగారు తెలుగు వచనంలో నవలగా రచించి గురువర్యులకు అంకితమిచ్చి ఉత్తమ శిష్యుడనిపించుకొన్నాడు. ఈ గ్రంథాన్ని మొదట ఆంధ్రా యూనివర్సిటీ, వాల్తేరు, విశాఖపట్నం వారు 1969లో ప్రచురించారు. ఈ గద్యకృతిని 2015లో Reem Publications Private Ltd., New Delhi వారు మరో ముద్రణగా తీసుకువచ్చారు.

**శ్రీమదాంధ్ర మధుర విజయము :** శ్రీమతి గంగాదేవి గీర్వాణ (సంస్కృతం) కావ్యమునకు పద్య రూపంలో అనువాదము, అనువాదకులు : శ్రీ బండ్ల వెంకట రమణయ్య, ప్రచురణ: గ్రంధకర్త. ప్రొద్దుటూరు (కడప) 140 పుటలు. వెల రూ. 4.50

1995 శ్రీమతి పద్మావతీదేవి త్రిపాఠి హిందీలో రచించిన 'మధుర విజయం' మహా కావ్యానికి ఆలోచనాత్మక మీమాంస (310 పుటలు) పారిజాత ప్రకాశన, గోరక్ పూర్, ఉత్తర ప్రదేశ్ వారు ప్రచురించారు.

2001 మధుర విజయం-మహాకావ్యం హిందీ అనువాదం: డా.శారద మిశ్రాబీ శారదా పబ్లికేషన్స్ & ప్రింటింగ్ మార్ట్, పత్రకార్ నగర్, పాట్నా వారి ప్రచురణ.

**2010 గంగాదేవి మధుర విజయం-రచన :** కృష్ణమాచార్య, శ్రీరంగ నాచియార్ పబ్లిషర్స్, శ్రీరంగం. 2010 శ్రీ K.S. Kannan సంపాదకత్వంలో గంగాదేవి 'మధుర విజయంలోని 8, 9 కాంటోలను ఆంగ్ల అనువాదంతో విద్యార్థులకు పాఠ్యాంశనార్థం బెంగళూరు విశ్వవిద్యాలయంవారు ప్రచురించారు.

2013 గంగాదేవి 'మధుర విజయం' సంస్కృత కావ్యాన్ని రాజారామన్ మరియు వెనేషియా కోటంరాజు సౌండ్ ప్లే (Sound Play) గా ఆంగ్లంలో అనువదించారు. Rasala Books, Bangalore వారు ప్రచురించారు.

2023లో సల్మన్ రష్దీ (Salman Rushdie) తన విక్టరీ సిటీ (Victory City) అన్ననవలలో 'మధుర విజయం' కవయిత్రి గంగాదేవి-కంపన జీవితాలను కల్పిత రి-టెల్లింగ్‌గా (Re-telling) కనిపిస్తుంది. అలాంటి కృతులలో తెలుగులో ప్రథమంగా వచ్చినది 'వీరకంపరాయ చరిత్రమను శ్రీ మధుర విజయం' పేరుతో తాడేపల్లి రాఘవ నారాయణ శాస్త్రి తెలుగులోనికి పద్య కావ్యంగా, చంపూ రూపంలో అనువాదం చేశాడు. సాధన గ్రంథ మండలి, తెనాలి వారు ప్రచురించిన ఈ కృతి (104 పుటలు రు.5) మూడు ఆశ్వాసాల గ్రంథం. ఈ కృతికి శ్రీ వేదము వెంకటరాయశాస్త్రి గారు (శాస్త్రిగారి మనవడు) 28 పేజీల విపులమైన ఉపోద్ఘాతం వ్రాశారు. ఈ ఉపోద్ఘాతంలో వెంకటరాయ శాస్త్రిగారు కావ్యమునకు సంబంధించినవే కాక ఆ కాలానికి సంబంధించిన చరిత్రాంశములకు కావ్య కథా సంగ్రహమును దాని స్వరూపమును ప్రదర్శించు విజ్ఞానదాయకమై ఈ గ్రంథ ప్రచురణకు ప్రయోజనాధిక్యము చేకూర్చినదని నోరి నరశింహ శాస్త్రిగారు తమ విమర్శలో అన్నారు. ఇది కొంత స్వేచ్ఛానువాదమైనా మూలమును సన్నిహితంగా అనుసరించినందున మూల గ్రంథ స్వరూపం సుష్టుగా ప్రదర్శించుచున్నదని కూడ తెలిపారు ఆనాటి 'భారతి' మాసపత్రికలో వచ్చిన విమర్శా వ్యాసంలో. ప్రబంధ కావ్యాలలో వున్నట్టు శృంగార, వీరరసాదులిందులో సంతరించబడ్డాయనీ, అనువాద గ్రంథమైనా యిందలి రచన స్వతంత్ర కావ్యంలా గోచరిస్తుందని అన్నారు. సూటిగా నాయక ప్రశంసలో బుక్క రాయల గుణవిశేషాలు వర్ణించే పద్యాలు శాస్త్రిగారి ప్రౌఢ శైలీ విన్యాసానికి, సంస్కృత

భాషాభిజ్ఞతకు ప్రతీకలని ఆ విమర్శ తెలిపింది. బుక్కరాయుల కీర్తి వైభవానికి సమానాంతరంగా విజయనగర పట్టణ పరిసరాలు హృద్యంగా వర్ణించబడ్డాయని అన్నారు. ఆంధ్ర వనితయైన గంగాదేవి రచించిన ప్రౌఢ సంస్కృత కావ్యమును రమ్యముగా అనువదించిన గ్రంథ కర్తను హృదయ పూర్వకంగా అభినందిస్తున్నానని కూడ అన్నారు.

ప్రథమాశ్వాసంలో బుక్కరాయుల తనూజుడైన కంపరాయుల మగపటిమిని తెచ్చి తండ్రి ప్రోద్బలంతో అతని జైత్రయాత్ర సమారంభాన్ని శాస్త్రి సృష్టించాడు. ద్వితీయాస్వాసంలో జైత్ర యాత్ర ప్రాంతాలను, ప్రకృతి కాంత కాలి యందెలల రవళిలో మేళవించి వివరించిన మధురగీతాలు ఈ అనువాద కృతిలో ఎన్నో వున్నాయన్నారు. ఉదా: కైత కాంచిత గిరి మల్లికా సుగంధ బంధుర సమీరణంబులు బ్రకట రత్న సౌధములు బ్రచబాళి సమద కూజితములు స్మరదీపకములయ్యె ధరణిపతికి. గంగాదేవి సంస్కృత కావ్యానికి మరొక తెలుగు అనువాదం, 'శ్రీమధాంధ్ర మధుర విజయము' అన్న పేరుతో ప్రొద్దుటూరు వాస్తవ్యులు, రచయిత, ప్రచురణ కర్త శ్రీ బండ్ల వెంకటరమణయ్యగారు కావించారు. (140 పుటలు వెల: రూ. 4.50) మధుర విజయం' చరిత్రను వర్ణించు కావ్యంగా కనబడుచున్నా ఇందులో ఎక్కువ సంప్రదాయ ధోరణులున్నాయని ఆనాటి పండితుల వ్యాఖ్య. ఈ కవయిత్రి కవిస్తుతిలో (1.12 శ్లోకంలో) క్రియాశక్తితో వ్యాస వాల్మీకులను, కాళిదాస, బాణ, దండి భవభూతులను, అగస్త్య కవిని, గంగాధర మహా కవిని స్తుతిస్తుంది. 'విశ్వనాథః కవీశ్వరః-యస్య ప్రసాదాత్ సార్వజ్ఞం సమంధేమాదృశేష్వపి', అని విశ్వనాథుని గ్రహ ప్రసాదులని అభివర్ణించినది. వీరితోపాటు శ్రీ తిక్కన సోమయాజిని 'తిక్కయస్య కవేః సూక్తిః' అని స్తుతించి నందున గంగాదేవి ఆంధ్రులకు విశేషంగా ప్రీతిపాత్రమైంది. కవయిత్రి గంగాదేవిపై ఆంధ్రులకున్న ప్రీతిని వ్యక్తపరుస్తున్నట్టు గుంటూరు జిల్లాలోని ప్రత్తిపాడు గ్రామ వాస్తవ్యులు శ్రీ శ్రీనివాసుల శేషభట్టాచార్యులు 'గంగ మహాదేవి' అన్న పేరుతో ఐదు అశ్వాసాల గేయ కృతిని 100 పుటలలో రచించి గంగా దేవికి ఆంధ్రుల అభిమానాన్ని వ్యక్తపరిచి ధన్యులయ్యారు. ఇలా, 14 వ శతాబ్ద కాలంలో ఒక వనితచే సంస్కృతంలో రచింపబడిన ఒక వీర విజయ కావ్యాన్ని ఆనాటి పండితులాదిగా ఆమోదించి ఇంగ్లీషు, తెలుగు, హిందీ లాంటి భాషలకు అనువదింపబడి పండిత ప్రముఖుల, విమర్శకుల గమనాన్ని ఆకర్షించడం ఎంతగానో సంతోషించదగిన విషయమని నా భావన.

వేలూరి కృష్ణమూర్తి, మైసూరు
ఫోన్ : 9448977877

## "బెల్ అమీ" నవల




మొపాసా రాసిన రెండవ నవల. ఆనాటి ఫ్రెంచ్ సొసైటీలో ధనిక కుటుంబాల జీవనశైలిని వివరిస్తుంది. డ్యూరోయ్ అనే అందమైన యువకుడు, పల్లెటూరి నుంచి పారిస్ చేరి జర్నలిస్టు రంగంలో ఎలా ఎదిగాడు, అలా ఎదగటానికి ఎవరెవరిని ఎలా వాడుకున్నాడు.. ముఖ్యంగా తన అందంతో స్త్రీలను ఆకర్షించి ఎలా హై సొసైటీలో ప్రవేశించాడో చెబుతుందీ నవల. జర్నలిజంలో అనుభవం లేకపోయినా ఇతరులను ఉపయోగించుకునే తెలివితేటలు ఎప్పుడూ మనిషికుంటాయని ఈ నవల చెబుతుంది. ఇంతకీ బెల్ అమీ అంటే అందమైన స్నేహితుడు..

నూట ఏభై సంవత్సరాల నాటి ఈ నవల మనకు కన్యాశుల్కంలోని గిరీశాన్ని గుర్తు చేస్తుంది. ఉపోద్ఘాతాలు, ఉపన్యాసాలు లేకుండా మొపాసా రాసిన ఈ నవల ఏకబిగిన చదివిస్తుంది. ఫ్రెంచ్ నవల కాబట్టి పేర్లు కొంచెం గందరగోళంగా ఉంటాయి. బీనాదేవి గారి అనువాదం సరళంగా ఉండటం పాఠకుడికి కొంచెం రిలీఫ్.. ఆడదాన్ని మోసం చేయటం మగవాడి నైజం.. దానికి స్థల కాలాలతో సంబంధం లేదని నిరూపించే నవల.

*అనువాదం: బీనాదేవి, వెల: వందరూపాయలు, పుటలు:144. ప్రతులకు : సాహితీ ప్రచురణలు, ఫోన్ : 0866 – 2436642/43*

*- సి.ఎస్. రాంబాబు, ఫోన్ : 8374818961*

# చరిత్రలో చిత్రకారులు

– టి.వి. ప్రసాద్

కళా చరిత్ర పరిధి చాలా విస్తృతమైనది. ఆదికాలపు గుహా రేఖాచిత్రాలు, పెయింటింగులతో మొదలుకుని నేటి ప్రయోగాత్మక కళ వరకు అవగాహన, సింహావలోకనం కలిగించేదే కళాచరిత్ర. గత చరిత్ర, సంస్కృతీ సాంప్రదాయాలను, నూతన పోకడలను ఇముడ్చుకుని గతం నుండి వర్తమానం లోకి సాగే నిరంతర ప్రక్రియ. వర్తమానం నుండి భవిష్యత్తులోకి ప్రవహించే మహానది.

కళ అంటేనే విద్య, సమాచారాన్ని అందించే పరి భాష, సమాచార చైతన్య స్రవంతి. మనిషి సృజనాత్మకతను, ఊహాశక్తిని చిత్ర రూపంలోగానీ, శిల్పరూపంలోగానీ చూపించే దృశ్యకళ. చిత్ర శిల్ప కళల ప్రాథమిక సూత్రం సౌందర్య ప్రదర్శన, భావోద్రేకాలను తృప్తి పరచడం. సృజన నైపుణ్యాలు సృష్టించే అందమైన భావవ్యక్తీకరణే కళ. ఇది మానవీకరించబడిన శాస్త్రం. చిత్ర కళను పలువురు పలు రకాలుగా వ్యాఖ్యానించారు. జీవ వర్తమానాన్ని, గతాన్ని, పిరమిడ్ యుగాన్ని కలిపే లంకె అని ప్రొ.జె.డబ్ల్యు.జాన్‌సన్ అంటాడు. పికాసో దృష్టిలో మనసులోని మాలిన్యాన్ని కడిగేసేది కళ. 'చూచి ఆనందించగలిగే కవిత్వం కళ' ఐతే నువ్వు చూడడం కాదు ఇతరులను చూడగలిగేలా చేసేది కళ అని ఎడ్గార్ డెగాస్ అంటే ఆధునిక వీధి చిత్రకారుడు బాంక్సీ ఆశకు అద్భుతమైన రూపం కళ అంటాడు. ఎందరో ఎన్ని రకాలుగా వ్యాఖ్యానించినా కళ అంతిమ లక్ష్యం మనసును రంజింపజేయడం.

దృశ్య సంస్కృతీ, చరిత్రల అధ్యయనం కళాచరిత్రకు మూలం. కళాభివ్యక్తి శైలులు అనేకం. అవి దేశ కాల సంస్కృతీ, సామాజికాంశాలమీద ఆధారపడి వుంటాయి. కళాచరిత్ర ప్రపంచ దేశాల సంస్కృతీ, సంస్కారాలను ప్రతిబింబిస్తుంది. హిందూ చైనా, జపాన్ దేశాల ప్రాచ్యకళ, ఇట్రస్కన్ ఆర్ట్, పాశ్చాత్యకళ – మళ్ళీ ఇందులో ఐరోపా, అమెరికా మెక్సికో కళ అనంతమైన వైవిధ్యం కలిగినట్టివి. కళాచరిత్రను ఏదో ఒకచోట మొదలుపెట్టవచ్చును కానీ ముగించడం వీలుకాని పని. ఇది నిరంతరం ప్రవహించే అనంత కాలవాహిని. ఈ ప్రవాహంలో చిత్ర కళా ప్రగతి. కాలంతో పాటు చోటు చేసుకునే మార్పులు, కళాకారుల సామర్థ్యం, భిన్న శైలులు, అభిరుచులు అవసరాలు, భావజాలాలు, సిద్ధాంతాలు, ఉద్యమాలు వంటి ఎన్నెన్నో అంశాలు అంతర్లీనంగా వుంటాయి. కళాచరిత్ర కథను రాసిన వారు ఎందరో వున్నా పాశ్చాత్య చరిత్రకారులకు మాత్రమే గుర్తింపు లభించింది. ప్రాచ్య దేశాల కళాకారులు స్వల్పమే ఐనా వారు నిరాదరణకు గురయ్యారు. ప్రాచ్య దేశాల్లో కళామూలాలు సాధారణ యుగానికి పూర్వం ఐదు వేల సంవత్సరాల నుండి కన్పిస్తాయి. చైనాలో కంచు విగ్రహాలు, జేడ్ పనిముట్లు, అలంకరణ సామగ్రి, వారి అక్షరమాల నుండి అందమైన చిత్రకళ, నీటి రంగు పెయింటింగులు అభివృద్ధి చెందాయి. జపాన్ చరిత్ర పదివేల సంవత్సరాల మరీ ప్రాచీనమైనది, పెయింటింగు, కాలిగ్రఫీ, వాస్తు శాస్త్రం గృహోపకరణాలు, శిల్పకళ, అలంకార కళకు ప్రసిద్ధి గాంచింది. అలాగే కళా చరిత్ర కారులకూ కొదవలేదు. వారి కళా సంపద సౌందర్య మయం. భారత కళావైభవం అంతా శిల్పమయం. మన దేవాలయాలు శిల్ప శాస్త్ర నిర్దేశిత నిర్మాణాలు, పెయింటింగు, పోటరీ, వస్త్ర పరిశ్రమలు కళాదర్పణాలు. తూర్పు దేశాల కళ పాశ్చాత్య దేశాల కళను మించిపోయింది. మహంజోదారో హరప్పా నాగరకతలు ఆసియాలో ప్రసిద్ధి గాంచిన నాగరకత లైతే, మన కళావైభవం హిందూ, బౌద్ధ, జైన, సిక్కు, ఇస్లాం మతాల మేలు కలయిక. మధ్య ప్రాచ్యంలో ఇస్లాం మత ప్రభావం చేత విగ్రహారాధన లేని కారణంగా కాలిగ్రఫీ ఆర్ట్ స్థాయికి ఎదగగలిగింది.

కళా ప్రశంస, కళా విమర్శలుకూడా కళాచరిత్రలోని అంతర్భాగాలే. చిత్రం ఏమిటి? దాని సృజన కర్త ఎవరు? ఎందుకు, ఎప్పుడు చిత్ర రచన జరిగింది? అనే కుతూహలం కళాచరిత్రకు పునాది. చిత్ర రచనలో ఉపయోగించబడే వస్తువులు కాన్వాస్, పేపర్, వర్ణాలు, గోడలు, శిలలు, నీటి రంగులు, తైలవర్ణాలు, సాంకేతికత, శైలి లాంటి వివిధాంశాలు చిత్రకళను అర్థం చేసుకోవడానికి, ప్రశంసించడానికి, విమర్శించడానికీ దోహదపడ్తాయి. కళా చరిత్ర రాయడంలో వర్గీకరణలో శైలి, కళాకృతి, విషయము, కళాకారుడు, ప్రభావాల పాత్ర అనివార్యం.

కళ వల్ల సంస్కృతి, సంస్కృతి వల్ల కళ ప్రభావితమౌతాయి. కళాచరిత్రకారులు సాధారణంగా పాటించిన పద్ధతి కాలానుగతంగా రాయడం చరిత్ర కారులు కళాకృతి గొప్పదనాన్ని, ప్రత్యేకతను, నిర్మాణ లక్షణాలను వివరించడం వల్ల ఆయా కళాకృతుల విలువ పెరిగిపోతుంది. విమర్శల పాలైనవి విస్మరించబడ్డాయి. మానవ ఆలోచనలకు, కళా వికాసానికి విడదీయరాని (అవినాభావ) సంబంధం వుంటుంది. భిన్నతత్వవేత్తలు, వారి ఆలోచనా ధోరణులు, సిద్ధాంతాలు కళాచరిత్రను అధ్యయనం చేసి కళాచరిత్ర పాత్రను, అర్థాన్ని వారివారి ఆలోచనా సరళి ననుసరించి వ్యాఖ్యానించారు. హెగెల్, మార్క్స్, ఫ్రాయిడ్, పొకాల్డ్, డెరీడా మొదలైనవారు ఉద్దండ వ్యాఖ్యాతల్లో కొందరు.

కళాచరిత్రను రాసిన వారిలో ప్లీనీ, వసారి, వింకిల్ మన్‌లు తొలి చరిత్రకారులు. ఆ తర్వాతి వారిలో గోంబ్రిక్, గ్రీన్‌బర్గ్, పోలాక్‌లు ప్రముఖులు. కళాచరిత్ర అంటే సంవత్సరాల వారీగా పాశ్చాత్య కళాకారుల కథ. మహిళా చిత్రకారుల ప్రస్తావన అరుదు. 2020 CEలో డోనా ఆర్నాల్డ్ 'ఆర్ట్‌హిస్టరీ' సంక్షిప్త పరిచయ పుస్తకం వెలువడిన తర్వాత వారిని గురించిన మరిన్ని వివరాలు తెలిసి వచ్చాయి. వారు జాన్ రస్కిన్, బి.యన్.గోస్వామి, జ్యోతీంద్ర జైన్ తదితరులు. ప్రపంచ కళా చరిత్ర (గ్లోబల్ ఆర్ట్ హిస్టరీ) అన్ని ఖండాలలో, వివిధ కాలాల్లో చిత్రకళ ఎలా అభివృద్ధి చెందిందో వివరించే శాస్త్రం (Discipline) ఐతే చరిత్రకారులంతా అతి ప్రాచీన ప్రాచ్య కళావైభవం జోలికి పోకుండానే చరిత్రను రాశారు. ఐదు వేల సంవత్సరాలకు పూర్వం విలసిల్లిన ఆసియా, చైనా, జపాన్, భారత, ఇట్రిస్కన్ కళను గురించి ఎవరూ మాటాడకపోవడం విచారకరం. ఇటీవలి చరిత్రకారులు పై లోపాన్ని గుర్తించి ప్రాచ్య దేశాల మహోన్నత కళాచరిత్రను, ఆయా దేశాల దృశ్య సంస్కృతినీ అధ్యయనం చేయడం కళాచరిత్రకు ముఖ్యం, శిల్ప కళే కాకుండా సినిమాలు, షార్ట్ ఫిల్మ్‌లు, ఫొటోగ్రఫీ, వీడియోలు, మీడియా పాత్ర కళా చరిత్రలో భాగమే అని తేల్చి చెప్పారు. కళా వికాసంలో సంపన్న కుటుంబాలు, కళా పోషకుల ప్రమేయం లేకపోయినట్లైతే సామాన్య చిత్రకారులకు ఖరీదైన రంగులు, బంగారు రజను, లాపిస్ లజూలి వంటి విలువైన వస్తువుల్ని ఉపయోగించం అసాధ్యమై వుండేది. మహారాజులు, చక్రవర్తులు, కళాకారులను ఆదరించి పెయింటింగ్ రంగానికి చేసిన మేలు వెలకట్టలేనిది. ఫ్లోరెన్స్ సంపన్న వ్యాపార కుటుంబాలు కళాకారులను ప్రోత్సహించి కళాకృతులను రచింపజేయకుంటే మనం ఇప్పుడు చూస్తున్న కళాఖండాలు, ఆల్టర్ పీస్‌ల (చర్చి అంతర్భాగంలోని చిత్ర, శిల్పకళ) ఉనికే వుండేది కాదు. ఆ తర్వాత రాజులు ఆస్థాన కళాకారులను నియమించుకుని వారిచేత చరిత్రలో చిరస్థాయిగా నిల్చిపోయే చిత్రకళకు, రాజవంశాల చరిత్రకు సాక్ష్యాలుగా నిలిచిపోయే అమూల్య సంపదకు కారకులయ్యారు. అనంతరకాలంలో వాటిని పదిల పరచిన రాజభవనాలు ప్రఖ్యాత మ్యూజియాలుగా మారిపోవడం చూస్తాము. పారిస్‌లోని లూవ్ర మ్యూజియం, లండన్‌లోని విక్టోరియా ఆల్బర్ట్స్ మ్యూజియం, వివిధ దేశాల్లోని ప్రముఖ మ్యూజియాలు ఇలాంటివే!

రాచరికాలు అంతరించి పోతున్న దశలో మహా దానకర్ణులు (ఫిలాంత్ర పిస్టులు) మిలియన్ల కొద్ది డాలర్లను, పౌండ్లను వెచ్చించి కళాపోషణలో అత్యంత ప్రముఖ పాత్రను నిర్వహించారు. వారి వితరణ ఫలితమే గెటీ, గూగెన్ హెయిమ్, టేట్ మోడరన్ లాంటి ప్రసిద్ధ మ్యూజియాల స్థాపన. మన దేశంలో బిర్లాల ఉదారత ఫలితమే కళా, విద్యా, సంస్కృతీ వికాసం. రాక్ ఫెల్లర్, బిల్‌గేట్సు బిలియన్ల విలువ చేసే సంపదను లోక కళ్యాణం కొరకు దానం చేసిన మానవతా ప్రియులు, పరోపకార పరాయణులు. జూకర్ బర్గ్, హెన్రీ వెల్‌కం, హేవార్డు హ్యూసి, వారెన్ బఫెట్, జార్జి సోరోస్ తదితరులు ఈ కోవకు చెందినవారే.

వివిధ కాలాల్లో కళాచరిత్ర పరిణామం చెందిన వైనం - మొట్టమొదటి చరిత్రకారునిగా ప్లీనీ (23-79 జజు), రోమన్ రచయిత 37 సంపుటాల నాచురల్ హిస్టరీని టైటస్ చక్రవర్తికి అంకితం యిచ్చాడు. పేరుకు నాచురల్ హిస్టరీ ఐనా గ్రీక్, రోమన్ దేశాల చిత్రకళను గురించి రాశాడు. ఇది చిత్రవాస్తు కళల మీద వెలువడిన అత్యుత్తమ గ్రంథాల్లో ఒకటిగా పేరు గాంచింది. ఇటలీ రినైసన్స్ కాలంలో ప్రాచీన కళకు సంబంధించిన సమాచారంపై శ్రద్ధ పెరిగింది. విజ్ఞాన సర్వస్వం లాంటి ప్లీనీ సంపుటాలు 1476లో ఇటలీ భాషలోనికి అనువదించబడినాయి. చిత్రకళపైన, చిత్రకళా చరిత్ర రచనపైన దీని ప్రభావం కన్పిస్తుంది. ప్లీనీ చిత్రకారుల జీవిత వివరాలను పొందుపరచడంతో, చిత్రకారులకు విలువ, హోదా

పెరిగిపోవడం జరిగింది. ప్రాచీన గ్రీక్, రోమన్ చిత్ర, శిల్ప కళా పరిజ్ఞానం వెలుగులోకి వచ్చింది. తరువాతి కాలపు ప్రసిద్ధ చిత్రకారుడు జార్జియో నసారి (1511–1574) రచన చిత్రకళాచరిత్రకు వరవడిగా నిల్చిపోయింది. ఫ్లోరెన్‌టైన్‌కు చెందిన వసారి వాస్తుశిల్పి కూడా. 'లైవ్స్ ఆఫ్ ఆర్టిస్టస్' రచనతో ఆధునిక కాలపు తొలి చిత్ర కళాచరిత్ర కారుడిగా చరిత్రలో సుస్థిరస్థానం సంపాదించుకున్నాడు. ఇప్పటికీ అది పునరుజ్జీవన కాలపు కళాకారుల సమాచార గ్రంథంగా నిలిచిపోవడం దాని ప్రత్యేకత. 1985CEలో మొదటిసారిగా ఆంగ్లంలోకి అనువదింపబడి, చరిత్రకారులకు నమూనాగా ఉపయోగ పడుతుంది. వసారి ఎన్నుకున్న రచనా విధానం తర్వాతి కళాచరిత్ర రచయితలపై అమిత ప్రభావాన్ని చూపించింది. ఆర్టిస్టు మేధా సంపదను, సాధించిన విజయాలను ఉటంకించడం ద్వారా వసారి కళాకారుని విలువను పెంచాడు. నాటి కళాఖండాలలోని సాంకేతికాంశాలను పరామర్శించాడు. చిత్ర కళకు గుణాత్మక తీర్పుగా ఇది పరిగణించబడుతోంది. మొదటిసారి 1550CEలో వెలువడి, (మైఖలేంజిలో మరణాంతరం (1564) CE) మెరుగులు దిద్దుకుని రెండవ ప్రచురణ 1568 CE లో వెలుగు చూసింది. వసారి లైవ్స్ పుస్తకం ద్వారా తెలిసే విషయాలు, మైఖలేంజిలోతో ఉన్నత శిఖరాలకు చేరుకున్న కళ తర్వాత ఏమి జరిగి వుంటుంది? ఆగిపోయిందా? పతన దిశలో పయనించిందా? రెండో అంశం 1270–1570ల మధ్య చరిత్రను ఎవరూ ఎందుకు ప్రశ్నించలేదు? అనే విషయాలు. వసారి చేసిన విభజన పునరుజ్జీవన తొలి దశలో, అంతకు ముందు మరుగున పడిన కళకు జీవం పోయడం, ప్రకృతి పట్ల చిత్రకళాకారులు ఆకర్షితులవడం, శిల్పకళ – సమాజం మధ్య సంబంధాన్ని చూడకపోవడం, కళా లక్షణాన్ని అంచనా వేయడానికి ప్రమాణిక సూత్రాలను నిర్దేశించడం, చివరి కారణం ఆర్టు చరిత్రను రాయడంలో తర్వాతి తరాలకు ఆదర్శంగా నిలిచింది.

వసారి తర్వాత కళాచరిత్రకారుల్లో ప్రసిద్ధుడు 20వ శతాబ్దపు గోంబ్రిచ్. గోంబ్రిచ్ చిత్రకళకు – సాంస్కృతికాంశాలకు మధ్య గల సంబంధాన్ని స్పృశించిన ప్రథమ, ప్రముఖ రచయిత. చిత్రకళను ఉన్నతశ్రేణీ సంస్కృతిగా పరిగణించాడు. పునరుజ్జీవన కాలపు కళకు ప్రాధాన్యత నిచ్చాడు. ఐనా మత సంబంధిత పెయింటింగులను ఆకాశానికెత్తాడనీ, సాంప్రదాయవాది అనీ విమర్శను ఎదుర్కోవలసి వచ్చింది. గోంబ్రిచ్ పుస్తకంThe Story of Art 1950లో మొదటి ముద్రణ పొంది 2000 నాటికి 16 ముద్రణలను పొంది ఇంకా ప్రచురింపబడడం దీని విశిష్టత. కళాచరిత్రలో ఇంతటి ఘన విజయాన్ని సాధించిన పుస్తకం మరొకటి లేదు. రీప్రింట్లు, అన్ని ఎడిషన్లు కలిపి 40 సార్లు ముద్రించడం దీని ఘనత. సామాన్యుడి నుండి మేధావుల వరకు అందరి మెప్పు పొందిన పుస్తకం. విజ్ఞానం, విద్వత్తు, కళలపైన అతనికి గల మక్కువ, ప్రేమ, గౌరవాల ఫలితం ఈ పుస్తకం. ఇది పిరమిడ్ కాలానికి నేటి కాలానికి వారధి లాంటిదని, గత వర్తమానాల అల్లికతో భవిష్యత్తును సూచించే సజీవ లంకె అనీ కొనియాడబడింది. "ఎందరో మాష్టర్స్, ఎన్నో ప్రముఖ పెయింటింగులను గురించి రాసిన నేను తప్పనిసరిగా భారతీయ కళను, ఇట్రస్కన్ ఆర్టును, మరికొందరు కళాకారులను ఇందులో చేర్చలేదు. కారణం గ్రంథ విస్తరణ భీతి" అని ముందు మాటలో చెప్పుకున్నాడు. గోంబ్రిక్ రచనలు తర్వాతి తరాల ఆలోచనా దృక్పథాన్ని మార్చి వేశాయి. ఆస్ట్రియాలో జన్మించిన ఈ చరిత్రకారుడు లండన్‌లో నివసించి అక్కడే మరణించాడు. గోంబ్రిక్ 20వ శతాబ్దపు మేటి సాంస్కృతిక చరిత్రకారుడు, రినైసన్స్ పెయింటింగులమీద దృష్టి పెట్టాడు. ఉన్నత సంస్కృతికి చెందిన కళను, నాటి మేధాపరమైన వాతావరణాన్ని పరీక్షించాడు. ఏంత్ర పాలజీ, సైకాలజీలకు కళారంగానికి గల సంబంధాన్ని వివరించాడు. రినైసన్స్ పండితుడిగా గౌరవించబడినప్పటికీ సాంప్రదాయవాది అనీ, ఉన్నత శ్రేణి కళను మాత్రమే గుర్తించాడనీ నింద మోశాడు. సిద్ధాంతాల జోలికి పోకుండా కళాచరిత్రను కాలక్రమాభివృద్ధిగా పరిశీలించాడు, వసారి లాగానే ఇతడూ సాధారణ పెయింటర్లను చులకనగా చూశాడు, కొందరిని పూర్తిగా విస్మరించాడు అన్న విమర్శను తప్పించుకోలేక పోయాడు.

ఆ తర్వాత భిన్నమైన రీతిలో ఆలోచించి కళా చరిత్రకు కొత్త వరవడిని నిర్దేశించిన రచయిత జాన్ వింకిల్‌మన్. ఇతడు చిత్రం పుట్టిన సందర్భానికీ దాని మూలాలకూ (Sources) ప్రాధాన్యత నిచ్చాడు. కళాకారుని కన్నా కళాసృష్టికి ప్రాధాన్యత నివ్వడం విప్లవాత్మకమైన మార్పు. కళాకృతిలోని ఆదర్శం, సౌందర్యం, పరిపూర్ణత

లాంటి వివరాలు ముఖ్యం అని చెప్పాడు. వింకిల్ మన్ ప్రకారం ఐదవ శతాబ్దం నుండి వికసించిన ప్రాచీన గ్రీకు కళకు క్లాసికల్ యుగం అనీ నాటి చిత్రం అందానికీ, కళామర్మానికీ ప్రతినిధి అనీ మెచ్చుకున్నాడు. ఇతడు చేసిన మేలు కళాచరిత్ర రచనలో నిర్దిష్ట, చారిత్రక, కాలక్రమ పద్ధతిని పాటించడం. మానవ నాగరికత ప్రాచీన గ్రీకు శిల్పకళలో తారస్థాయికి చేరుకుందని భావించాడు. ఇతడి ఆలోచనలు 18వ శతాబ్దపు సాహిత్యంపై ప్రబల ప్రభావాన్ని చూపించాయి. సమగ్రమైన విషయ సమాచార సేకరణ, అలంకారిక శైలితో కూడిన సాహిత్య సృష్టికి కారణమయింది. వింకిల్‌మన్ అనుసరించిన పద్ధతి మ్యూజియాలలో వస్తు సముదాయాన్ని అమర్చడంలో ప్రదర్శించడంలోనూ కన్పిస్తుంది. వింకిల్‌మన్ కళాచరిత్రను రాసిన విధానంలో కళకు స్వతంత్ర, స్వయం ప్రతిపత్తి, హోదా దక్కింది. నూతన ఆలోచనా ధోరణికి నాంది పలికింది. 19వ శతాబ్దపు ప్రాశ్చాత్య దార్శనికుల్లో హెగెల్ కళాచరిత్రను వరుస క్రమంలో కాకుండా కళాప్రగతి దృష్టితో విశ్లేషించిన మొదటివాడు. కళాచరిత్రను ఉత్థాన పతనాల ఆవృత్తం అని నిర్ణయించాడు. కళాకారుల ప్రాధాన్యత అల్పం అనీ, యుగధర్మానికి వారు బద్ధులనీ, చిత్రకళా సృష్టి సాంఘిక పరిస్థితుల కనుగుణంగా రూపొందుతుందనీ చిత్ర కళాశైలి స్వతంత్ర ప్రతిపత్తితో మానవ చర్యలపైన ప్రతిఫలిస్తుందనీ సిద్ధాంతీకరించాడు. కళాచరిత్రను రాయడంలో 20వ శతాబ్దపు చరిత్రకారులు కార్యనిమగ్నతతో కొత్త పుంతలు తొక్కారు. గత కాలపు చిత్ర కళాభివ్యక్తి కన్నా వర్తమాన చిత్రకళాభివ్యక్తికి ప్రాధాన్యత నిచ్చారు. ఫలితంగా 20వ శతాబ్దపు తొలి దశకాల్లోనే మన ఆలోచనలకూ మనం చూసే దానికీ పొంతనలేని రూపాలతో నైరూప్య చిత్రకళ (Non-figurative art) పుట్టుకొచ్చింది.

రెండో ప్రపంచ యుద్ధం ముగింపు నుండి 1960ల వరకు వచ్చిన మోడరన్ ఆర్ట్ విమర్శకుల్లో క్లెమెంట్ గ్రీన్ బర్గ్ ముఖ్యుడు. నార్బర్ట్ లిన్ టన్ (Norbert Lynton) ఆధునిక చిత్రకళ మీద రాసిన పుస్తకం The Story of Art (1980) విశిష్ట పరిచయ గ్రంథం. సులభమైన, సూటైన శైలితో మోడరన్ ఆర్ట్‌కు చెందిన సమగ్ర సమాచారాన్ని తెలుపుతుంది. 20 శతాబ్దపు అంతంలోనూ 21వ శతాబ్దపు తొలి దశలోనూ తలెత్తిన ఎన్నో సవాళ్లను, సందేహాలను, అనంతర పరిణామాలను నిష్పాక్షికంగా వివరించిన పుస్తకం. మోడరన్ ఆర్ట్ అంటే గందరగోళం అనే అభిప్రాయం చాలామందిలో వుంది, దాన్ని వివరించే కొద్ది సమస్య ఎక్కువవడమే గాని పరిష్కారం దొరకదు అంటాడు. మోడరన్ ఆర్టులో పైకి కన్పించే చిత్రాల రూపాల కన్నా వాటిలోని అంతరార్థాలు తెలుసుకోవడానికి ప్రయత్నించాలని, చిత్రం అందించే సమాచారాన్ని సూక్ష్మంగా పరిశీలించి, విశ్లేషించగలిగే విజ్ఞానం అవసరం అంటాడు. రెండవ ముద్రణ (1989)లో గత పది సంవత్సరాల పరిణామాలను జోడించి, మోడరన్ ఆర్టు మీద దాడి జరుగుతుంది అని చెబ్తూ, ముందు ముందు మరింత మంచి వర్గీకరణతో కళాచరిత్రపై పుస్తకాలు వస్తాయంటాడు. ఇది కూడా 400 పేజీల, వందలాది చిత్రాలతో గ్లేజ్ పేపర్ ముద్రణే.

మహిళా కళాచరిత్రకారులు, కళాకారుల చరిత్ర : కళాచరిత్రలో మహిళా కళాకారుల ప్రస్తావన అరుదుగా కన్పిస్తుంది. డోనా ఆర్నాల్డ్ 2020లో ఆర్ట్ హిస్టరీ సంక్షిప్త పరిచయ పుస్తకం వెలువడే వరకు మహిళాచిత్రకారుల వివరాలు మరుగున పడి వున్నాయి. లూసీ ఆఫ్ లిప్పర్ (1980) ఫెమినిస్టు ఆర్టులో ప్రత్యేకమైన శైలిగానీ, ఉద్యమంగానీ కన్పించవు. మహిళా కళకు విలువనిస్తూ మహిళా జీవన విధానాన్ని ఆధునిక దృక్పథంతో చేసిన పరిశీలన మాత్రమే అని నిర్ధారించింది. లిండా నాచ్‌లిన్ (Lynda Nochlin) (1971) గొప్ప మహిళా కళాకారులు లేకపోవడానికి కారణాలను, మహిళ స్థానాన్ని చర్చించిన మొదటి Historian. ఆ తర్వాత ఎందరో మహిళలు వారి వారి అభిరుచిని బట్టి ప్రత్యేకాంశాలపై దృష్టి పెట్టి మహిళా కళాకారుల ప్రాధాన్యతను వివరించారు. స్వెత్లానా అల్పర్స్ ఊహాత్మక చిత్రకళ (Conceptual Art) ఉద్యమాన్ని గురించి రాసి ప్రసిద్ధి కెక్కింది. ఈమె డచ్ బరోక్ ఆర్టు మీద సాధికారత సాధించింది. హేడెన్ హెరీరా కళాకారుల జీవిత చరిత్రలు రాసి ప్రసిద్ధి కెక్కింది. ఇటలీ కళాచరిత్ర రచయిత ఎన్ బాంటి, మధ్యయుగ చిత్రకళ మీద ప్రత్యేక శ్రద్ధ చూపిన కారలీన్ ఆర్స్ కాట్, ఇంప్రెషనిస్టు పెయింటర్లను గురించి రాసిన మేరీ కసాట్ – ఇంకా ఇరవై మందికిపైగా కళాచరిత్రలో మహిళా పెయింటర్లకు

న్యాయం చేశారు. ప్రపంచ చిత్రకళాచరిత్రను రాసిన వారిలో ప్రసిద్ధులు – లారెన్స్ ఆల్వే, ఫిలిప్పో బాల్టి నుచి, ఆల్ఫ్రెడ్ హెచ్ బార్, చార్లీ బాదలీర్, సిస్టర్ వెండీ బెకెట్, క్లైవ్ బెల్, బెర్నార్డ్ బెరెన్సన్, జాన్ బర్గర్ ప్రభృతులు. వీరు ఐరోపా కళాచరిత్రకే పరిమితం కాకుండా ప్రపంచ కళా చరిత్రను విస్తృత పరచారు.

గిల్డులు, మ్యూజియాలు, అకాడమీలు, ప్రదర్శనలు (Exhibitions) పరిశోధనలు, టీవీ, వీడియోలు, గ్రంథాలయాలు, మీడియాల పాత్ర; మహాదాతల ఉదారత, ప్రభుత్వాల చొరవల ప్రస్తావన లేనిదే కళాచరిత్ర సమగ్రతను సాధించలేదు. దేశానుగతంగా, కాలాను గతంగా, విషయగతంగా, ఉద్యమగతంగా వచ్చిన, వచ్చే పుస్తకాలు, కళాకారులపై మోనోగ్రాఫ్‌లు చరిత్రను సుసంపన్నం చేస్తూనే వుంటాయి.

**తెలుగులో కళాచరిత్ర రచయితలు :** ఇంతవరకూ పాశ్చాత్య కళాచరిత్రకారుల్ని గురించి తెలుసుకున్నాము. ఇప్పుడు తెలుగులో వచ్చిన కళాచరిత్ర పుస్తకాలను పరిశీలిద్దాం. ఎందరో రచయితలు చిత్ర శిల్ప కళపై ఎన్నెన్నో వ్యాసాలు, పుస్తకాలు రాసినవారున్నారు. సంజీవదేవ్, చలసాని ప్రసాదరావులు చిత్రకళపై వ్యాసాలు, విమర్శ చేసిన వారిలో ప్రముఖులు. పెక్కు భారతీయ చిత్రకారులను పరిచయం చేసిన 'మిసిమి' ప్రచురించిన చిత్ర కళానీరాజనం, దేశ విదేశీ చిత్రకారుల్ని పరిచయం చేసిన కాండ్రేగుల నాగేశ్వరరావు 'సప్తవర్ణి', 'కుంచలూ కలాలూ' రాసిన సుదర్శన్, అడపాతడపా చిత్రకారులపై పరిచయ వ్యాసాలు రాస్తున్న సుంకర చలపతిరావు, చిత్రకళపై రాస్తున్న లంకా వెంకటరమణ, కాపు రాజయ్య చిత్రకళపై సిద్దిపేట లలిత కళా సమితి వారు వెలువరించిన పుస్తకం, తోట వైకుంఠంపై వచ్చిన వ్యాసాలు, ఇటీవల కాలంలో ఐరోపా చిత్రకారులపై మిసిమిలో వరసగా రాస్తున్న, ప్రపంచ ప్రఖ్యాత చిత్రకారులు, చిత్రకళలో నూతన ధోరణులు రాసిన ఈ వ్యాసరచయిత, చిత్రకళపై వచ్చిన పుస్తకాలలో కొన్ని, రాస్తున్న వారిలో కొందరు. పైన చెప్పుకున్న వారిలో ఎవ్వరూ ఐరోపా శిల్ప చిత్ర కళాచరిత్రను స్పృశించిన వారు లేరని చెప్పవచ్చు. ఆ లోటును పూరించడానికా అన్నట్లు కోడూరు పుల్లారెడ్డిగారు నడుం బిగించడం, 'ఐరోపా శిల్ప – చిత్రకళా వైభవం' చరిత్ర పుస్తకాన్ని జనవరి 1925లో వెలువరించడం మనందరికీ గొప్ప కానుక, గర్వకారణం. ఈ గ్రంథాన్ని విజయవంతంగా పూర్తి చేసి ప్రచురించడం అసాధారణ విజయమే కాదు సాహసం కూడా! వందలాది వర్ణ చిత్రాలు, ఫోటోలతో వందకుపైగా శిల్ప చిత్రకళాకారులు, వారి వేలాది కళాకృతుల వివరాలతో సమగ్ర సమాచారాన్ని పొందుపరచిన ఈ గ్రంథం అందుబాటులోకి రావడం ముదావహం. ఐరోపా శిల్ప చిత్ర కళావైభవాన్ని సమగ్రంగా తెలుగు వారికి పరిచయం చేసిన ఒకే ఒక్కడు పుల్లారెడ్డిగారు.



'ఐరోపా శిల్ప – చిత్రకళావైభవం' గ్రంథ గొప్పదనం పరిమాణం, పరిణామం రెంటిలోనూ ప్రత్యేకతలు కలిగిన ఉద్గ్రంథం ఇది. వివరాలు – పుస్తకం అంతా ఆర్ట్‌పేపర్, 550 పేజీలు. సైజు 9×27 సి.ఎమ్, బరువు 1645 గ్రాములు. అన్నీ కలిపి 600పైగా వర్ణచిత్రాలు, ఫొటోలు. హార్డ్ బౌండ్. అందమైన ముఖ చిత్రంతో వెలువడ్డ పుస్తకం. అధ్యాయాల విభజన, పేర్లు, కళా చరిత్ర వివరాలు 8 అధ్యాయాల్లో విస్తరించాయి. అధ్యాయానికి పెట్టిన పేర్లతోనే ఆ అధ్యాయంలోని విషయం తెలుస్తుంది. మొదటి అధ్యాయం శిల్పచిత్ర కళా ప్రాదుర్భావం ఏడు పేజీలే ఐనా ఇది సమాచారగుళిక (capsule) లాంటిది. శిల్ప చిత్రకళలకు గల సంబంధాన్ని గుహాకుడ్య చిత్రాలతో మొదలైన కళ అంచలంచలుగా ఎదిగి వెసూవియస్ అగ్ని పర్వతపు పేలుడులో పాంపీ పట్టణం ధ్వంసం కావడం వరకు చూస్తాము.

రెండు మూడు అధ్యాయాల్లో ఇటలీ పునరుజ్జీవన కాలపు శిల్ప చిత్ర కళల ప్రాభవాన్ని చిమాబ్యూయేతో మొదలుపెట్టి పావ్‌లో వెరోనిసి చిత్రాలను మరికొన్ని శిల్పాలను (మాగ్దలీన్) చూస్తాము. దాదాపు 140 పేజీల అధ్యాయంలో పునరుజ్జీవన తొలితరం కళాకారుల వివరాలు తెలుసుకుంటాం. గ్రంథం అంతటికీ ఇది పెద్ద అధ్యాయం. ఉత్తర ఐరోపా పునరుజ్జీవన కాలంలో వికసించిన చిత్ర కళావివరాలు మూడవ అధ్యాయంలో చూస్తాం. చిత్రకళను ఉజ్జ్వలోపేతం చేసిన 17వ శతాబ్దం, రోకోకో నుండి ప్రామాణిక తత్త్వం గ్రహించి ముందుకు

సాగుతాం. ఆరు, ఏడు అధ్యాయాల్లో ఆధునిక ప్రపంచ చిత్ర కళ పుట్టుక, ఇంప్రెషనిజం, తదనంతర దశ దాటుకుంటూ ఆఖరి అధ్యాయం సమకాలీన ప్రపంచంలో విహరించి, సాల్వడార్‌డాలీ, డేమియన్ హర్స్ట్‌ల చిత్రకళతో ముగిస్తాము. వరసగా అధ్యాయాలు చదువుతూ సాగుతుంటే ఒక కొత్త రంగుల ప్రపంచంలో విహరించిన అనుభూతి పొందగలుగుతాము. కుప్పలు తెప్పలుగా సమాచారం, మధ్యమధ్య చిన్న చిన్న ఉపాఖ్యానాలు, రచయిత స్వానుభవాలు, అనువాద ప్రక్రియలో వీరికి గల సాధికారత (వెర్నీర్ ఫీనిక్స్‌లా పుట్టుకొచ్చాడు అని చెప్పే ఆంగ్ల కవితకు వీరి అనువాదం), ప్రాచీన భాషా సాహిత్యంపై గల మక్కువ పాఠకుణ్ణి ఆనందంతో ఉక్కిరిబిక్కిరి చేస్తాయి. ఈ గ్రంథాన్ని చదవడం గొప్ప అనుభవం.

**ప్రత్యేకతలు :** ఐరోపా చిత్రకళను లోతుగా అధ్యయనం చేసిన పుల్లారెడ్డిగారు ప్రముఖ చిత్రకారుల వివరాలతో పాటు వారి నేపథ్యాన్ని వివరించడం చదువరి కళాచరిత్ర అవగాహనకు తోడ్పడుతుంది. కథనం సూటిగానూ, శైలి సులభంగానూ ఉండి, చిత్ర విశేషాలు, చారిత్రక సాక్ష్యాలతో సాగుతుంది. చిత్రాన్ని వర్ణించడంలో చిత్రమైన పద్ధతి గతంలో వర్తమాన కాల వివరణ పాటించబడింది. ఉదా॥ క్రీస్తు బరువైన వధ్య శిలను మోస్తున్నాడు... యువక ద్రాక్షాసారా దేవుడు సారా గ్లాసు పట్టుకుని మనవైపు తొంగిచూస్తున్నాడు మొదలైనవి. చాలావరకు చిత్రకారులు, వారి పెయింటింగుల పేర్లను ఇంగ్లీషులో ఇవ్వడం వలన జియోవన్ని బెల్లిని, శాండ్రో బొత్తిసెల్లి, డెన్‌కార్ట్ మొదలైన వాటి తెలుగు ఉచ్చారణ వల్ల కలిగే సందిగ్ధత గందరగోళ పరిస్థితి లేకుండాపోయింది.

రచయిత స్వానుభవాలను ఉటంకించడం (కన్నతల్లి చేతి చల్లను ఆస్వాదించడం), శారదానంద ప్రియ తనతో (రచయితతో) అన్న మాటలను చెప్పడం, లూవ్ర మ్యూజియంలో (పారిస్) ప్రముఖుల పెయింటింగుల్ని చూసిన వివరాలు తెల్పడం లాంటి విషయాలతో, చెబుతున్న విషయంపై శ్రద్ధ, కుతూహలం కలిగిస్తాడు. అవసరమైన చోట్ల పాద సూచికలు, వివరణలు, బైబిల్ కథలు (ఉదా॥ మెడుసా, అబ్సింథ్‌ల వివరాలు) మొదలైన విషయాలు చదువరి సౌకర్యవంతంగా ముందుకు సాగడానికి సాయం చేస్తాయి.

దృష్టి ప్రక్రమత, ప్రమత్తుడు, రసికక్రైస్తవ సన్యాసి, నవోఢ, ప్రవక్తల ఆరాధన, కీర్తి బంధితుడు లాంటి అనువాద ప్రయోగాలు మురిపిస్తాయి ఈ మాటలకు వరసగా perspective, reckless, amorous monk, countess, adoration of magi, captive of tame అనేవి ఆంగ్ల పదాలు. ఆధునిక ప్రయోగాలు BC, ADల స్థానంలో BCE, ACEలు ప్రయోగించి రచయిత తాను కాలంతో సమానంగా పయనిస్తున్నట్లు తెలియజేస్తాడు. చివరగా ఒకే ఒక వెల్తి. గొప్ప పుస్తకానికి ఉండవలసిన అవశ్య లక్షణాలలో ఒకటి (పెయింటర్ల, పెయింటిగుల) ఇండెక్స్ లేకపోవడం. ఐనా ఇది చిత్ర కళా చరిత్రలో ప్రామాణిక గ్రంథంగా నిలిచిపోతుంది.



పుల్లారెడ్డి

గ్రంథ రచన ఒక ఎత్తైతే, గ్రంథంరాసిన సందర్భం మరొక ఎత్తు. ఎన్నో దశాబ్దాల అధ్యయనం, పరిపూర్ణమైన చారిత్రక అవగాహన, చిత్ర శిల్ప కళా విజ్ఞానం, విషయ సేకరణ ఎంతో వ్యయ ప్రయాసల పని ఐతే విషయాన్ని గ్రంథస్తం చేయడం మరో పని. పుల్లారెడ్డి గారిది గత పది సంవత్సరాలుగా నడవలేని పరిస్థితి. మంచానికే పరిమితమైన కదలిక. ఐనా ఆరు సంవత్సరాల అకుంఠిత దీక్షతో ఇంతటి బృహత్కార్యాన్ని సాధించగలగడం వారి దృఢ సంకల్పానికి నిదర్శనం. అంతర్జాతీయ స్థాయి పుస్తకాన్ని తీసుకువచ్చే భగీరథ ప్రయత్నంలో విజయం సాధించిన రచయితకు హృదయపూర్వక అభినందనలు.

వీధి చిత్రకారుడు Banksy దృష్టిలో 'Art disturbs the comfort and comforts the disturbed'. సుదీర్ఘకాలంగా మంచానికే పరిమితమైన పుల్లారెడ్డి గారు ఆర్టులో ఊరడింపు పొంది ఉండవచ్చు. ఫలితమే ఈ ఉద్గ్రంథం అయి వుంటుంది. ప్రతి గ్రంథాలయం, ఫైనార్ట్సు కళాశాల, విశ్వవిద్యాలయ కళా విభాగంలో తప్పక ఉండవలసిన గ్రంథం ఇది. కళా ప్రియులకు, కళాభిమానులకు ఇది తరగని గని.

'ఐరోపా శిల్ప – చిత్ర కళా వైభవం' వెలువరించిన సందర్భంగా గ్రంథకర్త పుల్లారెడ్డిగారికి అభినందనలతో అంకితం.

తంగెడ విశ్వేశ్వర ప్రసాద్
(టి.వి.ప్రసాద్), ఫోన్ నెం. 7981398250

# ఓ సాయంత్రం - సత్సంగం

- సి.ఎస్. రాంబాబు

**జ**నవరి 16వ తేదీ సాయంత్రం కోకాపేట్‌లోని థియాన్ రెస్టారెంట్లో క్యాండిల్ కాంతిలో గ్లాసులు, ప్లేట్ల గలగలల మధ్య కాలగతిలో కలిసిన సంగతులు వర్తమానం యవనికపై జతిస్వరమై పలికాయి ఆ చర్చలో స్వరం కలిపారు అమెరికా నుంచి విచ్చేసిన రావెల్ల రమేష్, పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ ప్రొఫెసర్ వై.పార్థసారధిగారు అప్పుడప్పుడు చెనుకు విసురుతూ సంపాదకులు అశ్వినీ కుమార్, ఇదంతా వింటూ రికార్డు చేస్తు ఎప్పుడయినా ప్రశ్నలు వేసే రేడియో రాంబాబు కూడా ఉన్నారు. రెండుగంటలకుపైగా సాగిన ఈ చర్చలో రమేష్ గారు త్వరలో తను వెలువరించబోయే మధ్యయుగాల సంస్కృత పండితుల జీవనరేఖల పుస్తకం స్పర్శించటమే అయినా, పాణిని వంటి పండితుడు తన వ్యాకరణ ప్రతిభ భవిష్యత్తులో కంప్యూటర్ భాష నిర్మాణానికి దోహదపడుతుందని ఊహించి ఉండక పోవచ్చని రావెల్ల రమేష్ అనటం విశేషం. చాలా కొత్త అంశాలపై ఫోకస్ పెట్టిన ఆ చర్చ నుంచి కొన్ని భాగాలు..

**ప్రొ.పార్థసారధి : మీకు సంబంధించిన సబ్జెక్టు కాకపోయినా తెలుగు భాషలో రాయటం ఎలా అలవాటు చేసుకున్నారు?**

**రమేష్ ప్రసాద్ :** రాయటం అనేది రాత్రికి రాత్రే జరిగే ప్రాసెస్ కాదు కదా. చిన్నప్పటినుంచి నుంచి చదివే అలవాటు ఉండటం విశ్వనాథ, బుచ్చిబాబు వంటి వారి సాహిత్యాన్ని పరిచయం చేసింది. అలా రాయటం కూడా అప్పుడే అలవాటు అయింది. ఒకసారి బెజవాడలో ఆంధ్రజ్యోతి ఎడిటర్ పురాణం గారిని కలిసినప్పుడు మాకు నెలకోటి రాసి ఇవ్వండని ఆర్డరేశారు (నవ్వు).. కానీ అది జరగలేదనుకోండి

**ప్రొ.పార్థసారధి : నా ప్రశ్నేమిటంటే అమెరికా దేశంలో కంప్యూటర్ శాస్త్రవేత్తగా పనిచేసే మీరు అరుంధతీ రాయ్, జుంపా లహరి వంటి వారి రచనలపై వ్యాసాలు రాయాలని ఎందుకనిపించింది. బుకర్ ప్రైజ్ పొందిన God of Small Things నవలలో రచయిత్రి ఏం చెప్పదలుచుకున్నదో మీరు విశ్లేషించారు కదా.. చాలా మంది పెద్ద విమర్శకులు ఇలాంటి పేరు పొందిన పుస్తకాలు విశ్లేషించేటప్పుడు ఆచితూచి వ్యవహరిస్తారు. మీరు అలా కాకుండా సూటిగా స్పష్టంగా రాశారు..**

**రమేష్ ప్రసాద్ :** సాహిత్య విమర్శకుడి కన్నా, సాహిత్య పాఠకుడికి ఎక్కువ స్వేచ్ఛ ఉంటుంది. పాఠకుడిగా ఒక రోజంతా ఒక పుస్తకం చదివినప్పుడు అందులో లోపాలు చెప్పటానికి నాకే మాత్రం సంకోచం లేదు. అదే విమర్శకుడనుకోండి. వంద ఆలోచిస్తాడు. ఆ రచయిత ఏమనుకుంటాడో.. ఎడిటర్ ఏమనుకుంటాడోనని.. అయితే నాకు **మిసిమి** ఎడిటర్ అలాంటి సందేహానికి తావు లేకుండా చక్కటి స్వేచ్ఛనిచ్చారు..

**ప్రొ.పార్థసారధి : ఒక పాఠకుడి కోణం నుంచి వచ్చిన వ్యాసాన్ని యధాతథంగా మీరెలా వేశారో తెలుసుకోవాలని ఉంది అశ్విని గారు..**

**అశ్వినికుమార్ :** నిజానికి ఆ పుస్తకం నాకు నచ్చలేదు. పాశ్చాత్య దేశాల వారికి భారతదేశం నుంచి ఒక పుస్తకం పరిశీలనకు వచ్చిందంటే ఒక అజెండా ప్రకారం నడుచుకుంటారు వారు. వారి అజెండాలో ఇమిడితేనే బహుమతి ఇస్తారు.

**ప్రొ.పార్థసారధి : మీరన్నట్లు అజెండా ఉండొచ్చు. కానీ ఆమె గొప్ప రచయిత్రి. అనేక సామాజిక అంశాలపై ఆవిడ వ్యాసాలు రాశారు. ఆ అంశాలపై ఆమెకు స్థిరమైన అభిప్రాయాలు ఉన్నాయి. ఒక ఐడియాలజీ ఉందావిడకు. కానీ ఈ పుస్తకం టోటల్లీ డిఫరెంట్. ఆమెకొచ్చిన పేరు ఈపుస్తకం వల్లనే ఎక్కువగా వచ్చింది. రమేష్ గారు ఈ పుస్తకం ఒక పాఠకుడిగానే చదివానని చెబుతున్నారు అలా తనకు నచ్చినట్లుగా రాసే ధైర్యం ఎవరూ చేయరని నా ఫీలింగ్.. అందులోనూ ఆ రచయితకి పేరు ప్రఖ్యాతులు వచ్చినప్పుడు అసలు చేయరని నా నమ్మకం.**

**ప్రొ.పార్థసారధి : రమేష్ గారు మీరు ఎప్పటి నుంచి రాస్తున్నారు తెలుగులో.**



రమేష్ గారితో అశ్విని

**రమేష్ ప్రసాద్ :** పదిహేనేళ్ల నుంచి రాస్తున్నాను. త్వరలో ఆంధ్రా యూనివర్సిటీ కథలు అనే పుస్తకం రాబోతోంది. ఇక నేను చేసిన అసలు వర్క్ ఆంగ్లంలో రాబోతోంది. సంస్కృతంలో ఎంతో కృషి చేసిన పాణిని, కాళిదాసు వంటి ఆరవై మంది పండితులను, రచయితలను ఎంచుకొని వారి జీవనరేఖల్ని పరిచయం చేయబోయే పుస్తకం అది. ప్రస్తుతం అనుకున్న పేరు Classical Sanskrit Scholars of India.

**ప్రొ.పార్థసారథి : కాళిదాస్ కావ్యాలు రాశాడు. పాణిని వ్యాకరణానికి ప్రసిద్ధి. మీరు ఎలా పాణిని పరిచయం చేయబోతున్నారు?**

**రమేష్ ప్రసాద్ :** నేను పాణిని సరదాగా 3D పాణిని అని సంబోధిస్తాను. పాణిని క్రీస్తు పూర్వం ఆరవ శతాబ్దానికి చెందిన వాడు. అప్పట్లో అంతా మౌఖికమే కదా. ఇది గుర్తించిన పాణిని వ్యాకరణం ఏర్పరిచాడు. భవంతిని ఎలాగైతే ఇటుక,ఇటుక పేర్చి కడతారో వ్యాకరణం కూడా అలా అనుగుణమైన సూత్రాలతో రూపొందించాడు. ఆధునిక గణితంలో ఇప్పుడు వాడే పదాలు అప్పుడే వాడాడు పాణిని. ప్రతీది రిపీట్ చేయకుండా మొత్తం చెప్పటానికి ఇప్పుడు వాడే టెక్నిక్ ను అప్పుడే వాడాడు పాణిని. ఈ 3D పాణినిలో మొదటి పాణిని వ్యాకరణ పాణిని. ఆ వ్యాకరణ పాణిని పద్దెనిమిదవ శతాబ్దంలో యేల్స్ యూనివర్సిటీ హెరాల్డ్ బ్లూమ్స్ అనే ప్రొఫెసర్ గారు పట్టుకున్నాడు. ఇరవై శతాబ్దంలో ఒక ఇరవై, ముప్పై సంవత్సరాల కాలంలో ఎన్ని కంప్యూటర్ భాషలొచ్చాయో చూశాం మనం. కంప్యూటర్‌లో కంపైలర్ అని ఉంటుంది. ప్రోగ్రామర్ రాసిన దాన్ని అనువాదం చేస్తుందది. అది బైనరీ నంబర్లలోకి 0,1 ఇలా మారుస్తుంది. కంప్యూటర్ అర్థం చేసుకునేది ఈ బైనరీ నంబర్లనే. అయితే జావా లాంటి కంప్యూటర్ భాషల్లో ఇంగ్లీష్ ఉంటుంది. మరి అదే గ్రామర్ వాడొచ్చు కదా. ఇక్కడ పాణిని ఉపయోగపడ్డాడు.

సంస్కృతంలో ఉండే పాణిని గ్రామర్ సూత్రాలు వాడుకున్నారు. ఇంతకీ పాణినిని కంప్యూటర్ రంగంలో తీసుకురావటంలో మన భారతీయ శాస్త్రవేత్తల కృషి కూడా ఉంది. ఈ పద్ధతిని "పాణిని బేకస్ నార్డ్ ఫాం" అంటున్నారు. ఇప్పుడు ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ కాలంలో ఉన్నాం కదా. ఇక్కడ కూడా పాణిని ఎలా ఉపయోగించాలా అన్న ఆలోచన వచ్చింది. ఇక్కడ థియరీటికల్ మెషీన్ ఉంది దీనిని బ్రిటిష్ వారు థింకింగ్ మెషీన్ అంటారు. అదొక ఇమేజనరీ మెషీన్‌గా చెప్పుకోవచ్చు. దాని సహాయంతో మీరు ఎదుర్కొనే సమస్యను కాగితం మీద పరిష్కరించగలిగితే దాన్ని ప్రోగ్రామింగ్‌తో సాధించవచ్చంటారు. దీన్ని స్కాలర్ క్లూరింగ్ అనే అతను రూపొందించాడు. ఇందులో కూడా పాణిని సూత్రాలు ఉపయోగిస్తారు. ఇవన్నీ బయట వారికి అంతగా తెలియవు కానీ, కంప్యూటర్ రంగంలో ఉన్నవారికి తెలుస్తాయి.

**ప్రొ.పార్థసారథి :** పాణిని వ్యాకరణం కంప్యూటర్ భాషలో ఉండటం వలన మీరు పాణిని గురించి తెలుసుకుందామనుకున్నారా?

**రమేష్ ప్రసాద్ :** అసలు సంస్క్రతం నేర్చుకోవాలన్నది నా చిరకాల వాంఛ. ఇప్పుడంటే ఇంగ్లీష్‌లో సంస్కృత సారస్వతం లభిస్తోంది.. కాబట్టి కొంత వరకు అదృష్టవంతులం.. మన తెలుగు భాషలో బోల్డన్ని సంస్కృత పదాలుండటం మనకు గొప్పే కదా..

**అశ్వినికుమార్ :** కాళిదాసు తన మేఘసందేశంలో మేఘుని దిజ్ఞాగుడు ఆంధ్రదేశంలో ఉన్నాడు, అటు వెళ్ళొద్దంటాడు. తర్కమీమాంసతో వేధిస్తాడంటాడు అని రాయటం అతను ఎన్నో ప్రదేశాలు తిరిగాడని గుర్తు చేస్తుంది.

**రమేష్ ప్రసాద్ :** పాణిని కాలంలోనే "పింగళ" ఉన్నాడు. అతను ఛందస్సు శాస్త్రం రాశాడు. ఇంగ్లీష గ్రామర్ మీటర్‌లో యతి గణాలుండవు. అదే మనకు చూడండి. ఉత్పల మాల, చంపకమాల, శార్దూలం. ఇలా ఎన్నో పద్యాలున్నాయి. ఈ గణ విభజన చేసినవాడు పాణిని. లఘువు, గురువుల ఆధారంగా చేశాడు కదా. ఇదే కంప్యూటర్‌లో వాడే బైనరీ సూత్రం. ఇదంతా చేసినవాడు "పింగళ". రెండు వేల ఐదువందల సంవత్సరాల క్రితమే మనవాళ్ళు ఈ బైనరీ విధానం ఉపయోగించారు.

**ప్రొ.పార్థసారథి : అన్ని సంవత్సరాల క్రితం మనవాళ్ళు ఎలా రూపొందించి ఉంటారు!**

**రమేష్ ప్రసాద్ :** అదే కదా మరి చెప్పుకోవాల్సింది. అవన్నీ ఇప్పుడు మనం బట్టీయం పడుతున్నాం. మన నన్నయ్య

వెయ్యేళ్ళ క్రితం పద్యాలు రాశాడు. అవి ఎవరితో చర్చించాడు. నారాయణ భట్టుతో చర్చించాడు. మరి నన్నయ్యకు నేర్పింది ఎవరు.. ఛందస్సు నేర్పించింది ఎవరు! దేనికైనా ఒక ఎకో సిస్టం ఉండాలి కదా.

**ప్రొ.పార్థసారథి : తన మేఘసందేశం గురించి ఇప్పుడు అందరూ చర్చిస్తారని అప్పుడు కాళిదాసు ఊహించి ఉండడు కదా.**

**అశ్వినికుమార్ :** అంతేకాదు.. ఇంగ్లీష్ కవులు ఉపరితల స్పర్శతో చెబితే.. మనవాళ్ళు హృదయ స్పందనతో చెప్పారు. జంధ్యాల పాపయ్య శాస్త్రి గారే మంచి ఉదాహరణ.. ఈ తాత్వికత ఆ ఇంగ్లీష్ పద్యంలో రాలేదు. రాదుకూడా.. భారతీయ కవులకే సాధ్యమయింది.

**రమేష్ ప్రసాద్ :** డెఫోడిల్స్ పద్యం రాసిన వర్డ్స్ వర్త్ అంతర్జాతీయంగా మెరిశాడు. ఎందుకు ఆ పద్యం ఇంగ్లీష్‌లో ఉండటం వలన.అదే మన పాపయ్య శాస్త్రి గారి పద్యం ఇంగ్లీష్‌లోకి అనువాదం అయివుంటే ప్రపంచ వ్యాప్తంగా వెళ్లి ఉండేది కదా. మీరు **మిసిమి**లో మధుర వాణి ఇంటర్వ్యూలు వేశారు కదా. జంధ్యాల పాపయ్య శాస్త్రి గారి పద్యం ఇంగ్లీష్‌లో మధురవాణి దృక్పథంతో విశ్లేషిద్దామని ఉన్నది.. చూద్దాం.. ఏమవుతుందో...

**ప్రొ.పార్థసారథి : పాణిని సృష్టించిన వ్యాకరణ సూత్రాలు కంప్యూటర్ సైన్స్‌లో వాడుకోవటం అనే గొప్ప విషయం తెలిసిందివ్వాళ.. ఇన్నాళ్లు సంస్కృతం అనువైన భాష అనుకున్నాం కానీ, పాణిని వ్యాకరణం ఉపయోగించారన్న గొప్ప విషయం తెలిసింది.**

**రమేష్ ప్రసాద్ :** విల్లీ మార్క్ రైడర్ అనే బర్కిలీ యూనివర్సిటీ ప్రొఫెసర్ మాటల్లో చెప్పాలంటే, ఐరోపా అంధకారంలో ఉన్న సమయంలో మన దగ్గర ఒక వెంట్రుకను వంద రకాలుగా విశ్లేషించారు..

**ప్రొ.పార్థసారథి : మీరు సాహిత్యంలోకి రావటం మీ సబ్జెక్టుకు మేలు జరిగిందా?**

**రమేష్ ప్రసాద్ :** నా చిన్నప్పుడు నార్ల వెంకటేశ్వరరావు గారు సంపాదకులుగా ఉన్న ఆంధ్ర ప్రభ, ఆంధ్రపత్రిక దినపత్రికల సంపాదకీయాలు చదవమని మా నాన్నగారు కోరుతుండేవారు.. దానివలన భాషపై సామర్థ్యం కలుగుతుంది. ఆ సంపాదకీయాలెలా ఉండేవంటే మొదటి పేరు ఒక సంఘటనలోని తప్పును చెబితే రెండో పేరా అది ఎందుకు తప్పో చెబుతుంది. తర్వాతి పేరా ఏం చేయాలో చెబుతుంది.. అంటే ఒక లాజికల్ రీజనింగ్ మనకు పరిచయం అవుతుంది.. అందుకే ఇప్పటికీ అన్ని పత్రికల ఎడిటోరియల్స్ చదువుతాను. రాబోయే పది సంవత్సరాల్లో చైనా ఇలా ఉండబోతోంది అని ఒక సంపాదకీయం చెప్పినపుడు అది అలా అవుతుందో లేదో కానీ అందులోని లాజిక్ చదవటానికి గొప్పగా ఉంటుంది. ఇప్పుడు **మిసిమి** సంపాదకీయాలు ఇందుకేమీ తీసిపోవు! కీర్తికిరీటాలు ఆల్టర్‌నేటివ్ వాల్యూస్, అస్తిత్వవేదనలు కొన్ని ఉదాహరణలు మాత్రమే! అశ్విని కూడా సంపాదకీయంలో ఒక విషయం మొదలుపెట్టి లాజికల్‌గా ముగిస్తారు. అదే కనెక్టింగ్ ది డాట్స్!



సి.ఎస్. రాంబాబు

"కనెక్టింగ్ ది డాట్స్" ఎలాగో తెలుస్తుంది. అసలు ఇంటెలిజెన్స్ అంటేనే "కనెక్టింగ్ ది డాట్స్". అదే నాలెడ్జ్ అంటే "ఎక్వైరింగ్ ది డాట్స్"..పిహెచ్ డి చేసేవాడకి, పదో తరగతి చదివిన వాడికి ఇంటెలిజెన్స్ స్థాయి ఒకటే అయి ఉండొచ్చు. కానీ కనెక్టింగ్ ది డాట్స్‌లో తేడా ఉండొచ్చు

**ప్రొ.పార్థసారథి : మీరు బాగా చెప్పారు.. ప్రస్తుతం మన భారతీయ సమాజం ఎక్వైరింగ్ ది డాట్స్‌లో ఉంటే అమెరికన్ సమాజం కనెక్టింగ్ ది డాట్స్‌లో ఉంది ఇక భారతీయ తత్త్వశాస్త్రం పరిశీలిస్తే ఇద్దరు గొప్ప వ్యక్తులు కనిపిస్తారు. ఒకరు యాజ్ఞవల్క్యుడు, మరొకరు ఉద్దాలకుడు.. యాజ్ఞ వల్క్యుడు మెటాఫిజిసిస్ట్ ఉద్దలకుడు, యూదుల సాహిత్యం అతన్ని గొప్ప శాస్త్రవేత్తగా పేర్కొంటుంది.. అతను రాసిన గ్రంథాన్ని "ఉద్దాలక ఆరణి" అంటారు.. అందులో రాజు ఉద్దాలకుడిని అడుగుతాడు.. కాంతి అంటే ఏమిటని! సూర్యుడు కదా అంటాడు ఉద్దాలకుడు.. అతను లేకపోతే.. చంద్రుడు కాంతి అవుతాడు అంటాడు.. చంద్రుడు లేకపోతే అగ్ని.. అగ్ని లేకపోతే ధ్వని కాంతి అవుతుందంటాడు..అదీ లేకపోతే అంటాడు రాజు.. నాకున్న జ్ఞానమే అంటాడు ఉద్దాలకుడు.. అలా ఒకప్పుడు ప్రపంచ జ్ఞానాన్ని పరిపుష్టం చేసిన భారతీయ సమాజం ఇప్పుడు "డాట్స్ ఎక్వైరింగ్"లో ఉండటం విచిత్రం.. విషాదం.. మీరు అంతగా సంస్కృతాన్ని ప్రేమించారు కదా.. మీకిష్టమైన సంస్కృత కవి ఎవరు..**

**రమేష్ ప్రసాద్ :** నాకు నచ్చిన సంస్కృత కవి కాళిదాసు. ఆయన అభిజ్ఞాన శాకుంతలం నాకు చాలా ఇష్టం.

కాళిదాసులో రెండు శక్తులు ఉన్నాయండీ. ఒకటి ఆయన లోని అద్భుతమైన ఊహా శక్తి, అంటే "కనెక్టింగ్ ది డాట్స్.". ఎక్కడెక్కడి ఊహల్నో కలిపి గుదిగుచ్చి మనకందిస్తాడు రెండోది.. అబ్బురపరిచే ఆయన డీటెయిలింగ్ టెక్నిక్.. మహాకవి కాళిదాసు సినిమా నెవరు తీయగలిగారు.. మన తెలుగు వారే తీయగలిగారు. మరెవరూ తీయలేదు.. తీయలేరు.. ఎప్పుడూ చూస్తుంటాను ఆ సినిమాను.. కాళిదాసులోని ఈ అటెన్షన్ టు డీటెయిల్స్ అనేది గమనించింది బ్రిటిష్ రచయిత విలియం ఆర్థర్ రైడీ.. ఆయన కాళిదాసు మీద స్కాలర్లీ వర్క్ చేశాడు.. కాళిదాసు దేశదిమ్మరి. అటు ఇటు తిరగడం వలన దేశాన్ని చూశాడు.. అందుకే కాశ్మీర్‌లోని పువ్వు వికసించడం వర్ణిస్తాడు.. ఋతువులు ఎక్కడ ఎలా ఉంటాయో చెబుతాడు. ఎక్కడో ఉజ్జయినిలో ఉన్నవాడికి ఇదెలా సాధ్యం.. పర్యటిస్తేనే కదా.. ఆయన పశువుల కాపర్లతో తిరిగాడు.. రాజా స్థానాలు వెళ్ళాడు.. అది సమాజాన్ని ఆయనదైన కోణం నుంచి చూడటానికి తోడ్పడింది. ఆ జ్ఞానం విస్తృతంగా ఉపయోగించుకున్నాడు..

**ప్రొ.పార్థసారథి :** దీనినే లాజికల్ పాజిటివిజం అంటారు.. అంటే తార్కిక ప్రత్యక్ష వాదం అన్న మాట.. డేటాను యధాతథంగా కాకుండా రియలిస్టిక్ సిస్టం ద్వారా మాత్రమే ఆమోదించడం. ఆ తార్కిక ప్రత్యక్ష వాదానికి కాళిదాసును కలపాలి మనం.. ఇప్పుడు దాకా ఎవరూ అలా కలపలేదు.. దానర్థం డాట్స్‌ను కలపగలిగే ఇంటెలిజెన్స్ కాళిదాసు తన రచనల్లో తీసుకొచ్చాడు.. మనం మాట్లాడుకున్న ఈ అంశాలను పరిశీలిస్తే ఇంటెలిజెన్స్ అంటే డాట్స్ కలపడమే అని నిరూపించారు వీరంతా..తార్కిక ప్రత్యక్ష వాదం అంటే?

**ప్రొ.పార్థసారథి :** మాకో ప్రొఫెసర్ గురువు గారు ఉండేవారు. ఆయన లెక్చర్ వింటానికి తహతహ లాడుతుండేవాళ్ళం! నేనప్పుడే కొత్తగా లెక్చరర్‌గా చేరాను. ఆయన క్లాస్‌కి ఇష్టంగా హాజరయ్యాను. ఆయన గంటసేపు లాజికల్ పాజిటివిజం (తార్కిక ప్రత్యక్ష వాదం) గురించి చెప్పారు. నాకర్థం. కాలేదు. ఆయనడిగితే అదే చెప్పాను. సరే పద టీ తాగుదామని తీసుకెళ్ళారు. ఎలా ఉందని అడిగారు. బావుందని చెప్పాను. అదే లాజికల్ పాజిటివిజం అని నవ్వుతూ చెప్పారు. కాస్త వివరంగా అంటే ఏమిటో చెప్పారు. టీ తాగావు.. ఆ రుచిని నీ అనుభవంలోకి తెచ్చుకున్నావు తర్వాత బావుందని సర్టిఫికెట్ ఇచ్చావు.. అంటే నువ్వు డేటా సేకరించి, టెస్టింగ్ చేసి దాని రిజల్ట్ తెలుసుకుని డేటా కరెక్ట్ అని సర్టిఫికెట్ ఇవ్వడమే తార్కిక ప్రత్యక్ష వాదం.. అంటూ టీ తాగిన అనుభవాన్ని విశ్లేషణ చేస్తూ చెప్పారు. అంటే నువ్వు ప్రత్యక్షంగా చూసిన దానికి తార్కికతను జోడిస్తున్నావు. అని చెప్పినప్పుడు అర్థం అయింది.



ప్రొఫెసర్ పార్థసారథి

**రమేష్ ప్రసాద్ :** తార్కిక ప్రత్యక్ష వాదం అంటే న్యూటన్ ఆపిల్ పండు నేలపై పడటాన్ని థియరీతో చెప్పినట్లన్నమాట.

**ప్రొ.పార్థసారథి :** యూదులు తమవారిలో ముగ్గురు గురించి గొప్పగా చెప్పుకుంటారు. యూదులనే ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే ఒక దేశంగా ఇజ్రాయెల్ ధైర్యంగా పోరాటం చేయటం నేర్చుకుంది.. అందుకే వారి గురించి చెబుతున్నాను.. ఏమీ అనుకోకండి (నవ్వు) మొదటి వాడు సాలమన్. ఇతను రేషనాలిటీ లేకుండా ప్రపంచం మనకు అర్థం కాదని చెబుతాడు..మనం చెప్పేదానికి ఒక ప్రూఫ్ ఉండాలంటాడు.. గాలిలో గీతలు గీయటాన్ని నమ్మడు.. అతన్ని మొదటి యూదుడిగా గుర్తిస్తారు. తర్వాత వాడు మార్క్స్.. మనిషి ఆకలి తీర్చటమే ముఖ్యమన్నాడు.. తర్వాత ఐన్‌స్టీన్ వచ్చాడు.. విశ్వం గురించి ఆలోచించడానికి ERMC2 అనే థియరీ చెప్పాడు. అలా వాళ్ళ సిస్టంలో ఒక విశ్లేషణాత్మక దృక్పథం గోచరిస్తుంది.. మన సిస్టంలో పధ్నాల్గవ శతాబ్దం తరువాత మనం ఆగిపోయాం.. అదెందుకు అలా జరిగిందనే దాని దగ్గరకు నేను పోను.. సున్నా కనిపెట్టింది మనమే అంటాం.. ఆర్యభట్ట గొప్పదనం గురించి చెబుతాం. వల్లభాచార్యుడి గురించి తలుచుకుంటాం.. వాళ్ళ గురించి చప్పట్లు కొడతాం.. పాణిని చేసిన గొప్ప కాంట్రిబ్యూషన్ గురించి ఎంతమందికి తెలుసో చెప్పండి.. పదిమంది తెలుగు ప్రొఫెసర్లను కూచోబెట్టి అడుగుదాం.. చెబు తారేమో చూద్దాం.. వాళ్ళని తప్పుపట్టడం లేదు.. మన సిస్టం అలా ఉంది.. మనకు తెలిసిన దాన్ని కూడా మనం వాడుకోలేకపోతున్నామని నా అభిప్రాయం.. అలాగే మనకున్న గొప్ప రాజనీతిజ్ఞుడు కౌటిల్యుడు. అతనో మాటంటాడు.. నాలుక మీద వేసుకున్న తేనెచుక్క అయినా, విషపు చుక్క అయినా నాలుక ఎలా అయితే రుచి చూడకమానదో, అట్లే కోశాగారము నందు, కార్యాలయము నందు పనిచేయు వారికి ధనము తస్కరింపక మానజాలదు అంటాడు.. అందుకు ముప్పై మూడు మార్గాలున్నాయని

చెబుతాడు ఇదెందుకు చెబుతున్నానంటే భారతీయ తత్వశాస్త్రంలోని ప్రాక్టికాలిటీ గురించి చెబుతున్నాను. ఏమయినా ఈరోజు పాణిని గొప్పదనం గురించి ఇలా కలిసి మాట్లాడుకోవటం చాలా ఆనందంగా ఉంది.. అరుంధతీరాయ్, ఝంపా లహరి, గీతా మెహతా రచనల గురించి మీరు రాసిన విధానాన్ని ప్రస్తావిద్దామను కుంటే మీరెన్నో విషయాలు మాట్లాడి కొత్త డాట్స్ కలిపారు.. కొత్త డాట్స్ ఎక్స్ప్లోర్ చేశాం (నవ్వు)

**రమేష్ ప్రసాద్ :** నాదో బృహత్తర ప్రాజెక్టు సిద్ధమవుతోంది. అది చెప్పి ఈ సాయంత్రం సంభాషణ ముగిస్తాను..ది రైజ్, ఫాల్ అండ్ రైజ్ ఆఫ్ ఇండియా అనే పుస్తకం తెచ్చే ప్రయత్నంలో ఉన్నాను.. మొదటి శతాబ్దంలో ప్రపంచ వ్యాప్తంగా ముప్పై ఐదు శాతమున్న భారత్ జి.డి.పి. 1947నాటికి ఎలా ఒక శాతానికి పడిపోయింది.. మళ్లీ ఇప్పుడు ఎలా పెరుగుతోందో ఈ పుస్తకం చెబుతుంది.. మళ్లీ మరో సందర్భంలో కలుసుకుని భారతీయాత్మను ఆవిష్కరించే మరికొన్ని అంశాలు మాట్లాడుకుందాం...

**అశ్వినికుమార్ :** ప్రొఫెసర్ గారూ – రమేష్ గారూ మీరు ఈ సాయంత్రాన్ని రాత్రిలోకి తీసుకెళ్లారు. 'కనెక్టింగ్ ది డాట్స్' అంటూ–ఇది ఒక మరపురాని సత్సంగం! నమస్కారం.

సి.ఎస్. రాంబాబు, ఫోన్ : 8374818961

## తీపిగురుతుల ఆపాత మధురం

*బెజవాడలో మొన్న బాబాయ్ హోటల్కి వెళ్లాం. అక్కడ ఎన్నో దినపత్రికల క్లిప్పింగ్స్ ఉన్నాయి. రాంబాబు ఫొటో తీసి ఇన్స్టాగ్రామ్లో పెట్టారు. అది అమెరికాలో 'రాజా' గారి అమ్మాయి చూసి రవి గారికి ఫోన్ చేసి, ఆపాత మధురాలు రెండు భాగాలు* ***మిసిమి****కి పంపించారు. అందుకే ఈ పరిచయం.* తెలుగు పాటకు స్వర్ణయుగంగా పేర్కొనే 1950-70సంవత్సరాల మధ్య కాలంలో 51-61 సంవత్సరాల నెంచుకుని మ్యూజికాలజిస్ట్గా పేరొందిన డా.రాజా వెలువరించిన రెండు భాగాల సుచిత్ర హృదయోల్లాస వ్యాఖ్యానం ఈ "ఆపాత మధురం". మొత్తం డెబ్బై సినిమాలను ఎంచుకుని అందులో ఇరవై యొక్క సినిమాల పాటలను మొదటి భాగంగా 2017లో తెచ్చారు.అయితే ఆయనెంచుకున్న పాటలకు, చిత్రాలకు ప్రాతిపదిక వాటి పాపులారిటీయా, బాణీయా, సాహిత్యమా అన్నది ఆయన స్పష్టం చేయలేదు.. ఆ చిత్రంలోని విశిష్టతను ఏ పాటలైతే చూపాయో వాటికి పెద్ద పీట వేశారనిపిస్తుంది.




ఇటీవల రెండో భాగాన్ని ఆయన కుటుంబ సభ్యులు ఆయనకు నివాళిగా తెచ్చారు. ఈ భాగంలో నలభై తొమ్మిది చిత్రాలు పాటలను ఆయన విశ్లేషించారు.ఈ వ్యాసాలన్నీ ఒకప్పటి హాసం పత్రికలో వెలువడ్డాయి. ఒక సినిమాలోని అన్ని పాటలకు పరిచయ వాక్యాలతోపాటు, వీలైతే ఆ పాట చిత్రీకరణకు సంబంధించిన వివరాలు, ఏ రాగంలో సంగీత దర్శకుడు బాణీ కట్టారు వగైరా విషయాలను క్లుప్తసుందరంగా పరిచయం చేస్తారు. కొన్ని తెరవెనుక విశేషాలు కళ్ళకు కట్టిస్తారు.. ఉదాహరణకు తోడికోడళ్ళు చిత్రంలోని "కారులో షికారు కెళ్ళే పాలబుగ్గల పసిడిదానా" పాట శ్రీశ్రీ రాశాడని ఇప్పటికీ అనుకుంటారు.అలా అనుకోకపోవటం తప్పవుతుందని రచయిత చమత్కరిస్తారు. నిజానికి హీరో ఆదర్శవంతుడు కావటంతో ఇంట్రొడక్షన్ పాట కావాలనటంతో, ఆత్రేయ తనెప్పుడో రాసుకున్న ఈపాటను నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు గారికి చూపటం, ఆయనకు నచ్చటం జరిగిందని రచయిత చెబుతారు.




ఇలాంటి చిన్న చిన్న సంగతులు సందర్భోచితంగా చెబుతారు.తెలుగు సినిమా పాటలు ఎక్కువగా హిందూస్తానీ శాస్త్రీయ సంగీతం ఆధారంగా చేసినవే. ఒక రాగంలో ఒక పాట కూర్చినపుడు అదే రాగాన్ని హిందీ పాటల్లో ఎలా ఉపయోగించారో కూడా చెప్పటం బావుంది.. దీనికి ఉదాహరణగా భలే రాముడు చిత్రంలోని "ఓహో మేఘమాల" పాటను ఎంతందంగా భీంప్లాస్ రాగంలో స్వరపరిచారో చెబుతారు.. మనసు రసప్లావితం చేస్తారంటూనే భలే రాముడు మాతృక "కిస్మత్" చిత్రంలోని పాటకు సంబంధం లేకుండా ట్యూన్ చేశారని చెప్పటం పాటలప్రియులకు కొత్త ముచ్చటే.. ఇలాంటి విశేషాలు ఈ పుస్తకంలో కోకొల్లలు.. సినిమా ఆధారంగా వెలువరించే పుస్తకాలకు నాణ్యత చాలా ముఖ్యం.అలాగే అందమైన ఛాయాచిత్రాలు కూడా. అరుదైన సినీ ఛాయా చిత్రాలకు పేరొందిన సంజయ్ కిషోర్, రమేష్ పంచకర్ల ఇద్దరూ చాలా వరకు మంచి ఛాయాచిత్రాలు అందించారు ఈ పుస్తకంలో. ఈ పుస్తకంలో ప్రతి పాటకు QR కోడ్" పొందుపరిచారు. తద్వారా వెంటనే పాటను వినే అవకాశం కల్పించారు...ఇదివరకు సి.డి.లను పుస్తకం తో ఇచ్చేవారు..ఇప్పుడాపద్ధతి టెక్నాలజీతో జత కలిసి చదువరికి ఇంకొంచెం సులభతరం చేసింది..పాతపాటల ప్రేమికులకు అందుబాటులో ఇప్పుడు మరో పుస్తకం.

*ఆపాత మధురం -రెండవ సంపుటి, వెల రూ. 500, పేజీలు : 420, ప్రతులకు నవోదయా బుక్ హౌస్, ఫోన్ : 9000413413*

*- సి.ఎస్. రాంబాబు, ఫోన్ : 8374818961*

# నిఘంటు చరిత్ర

- డా. అన్నే బాలకృష్ణ ప్రసాద్

*ఆయన అరడజను పత్రికలకు ప్రారంభ సంపాదకులు, అధికార భాషా సంఘానికి అధ్యక్షులు. జాతీయ పాత్రికేయ పురస్కార గ్రహీత. అంతేకాదు వేలసంఖ్యలో పుస్తకాలు చదివిన ద్రష్ట. వేల సంఖ్యలో సంపాదకీయాలు, వందల సంఖ్యలో పుస్తకాలు రాసిన గ్రంథకర్త. ఇవన్నీ అలా ఉంచితే వీరు రాసిన కొన్ని ముందుమాటలు అద్వితీయం. అలాంటి ఈ ముందుమాట **మిసిమి** పాఠకుల కోసం.*

మహాకవయిత్రి మొల్ల సుమారు ఆరు శతాబ్దాల క్రితమే అర్థంతోచని గూఢ శబ్దాలను "మూగ చెవిటి వారి ముచ్చట" కింద జమకట్టడంలో ఎంతో అర్థముంది! ఎందుకంటే, అర్థంకాని చదువు వ్యర్థం కాబట్టి అర్థ వివరణతో కూడిన శబ్దం లేదా పదమే ఏ పుస్తకాని కయినా వన్నె తెస్తుంది. వాసికెక్కిస్తుంది. నేడు శరవేగాన అగణిత సంఖ్యలో మానవజాతి విజ్ఞానానికి, వికాసానికి ఆరోగ్య భాగ్యానికి దోహదం చేస్తున్న సకల శాస్త్రాలను, వాటిలో క్షణానికొక తీరుగా అనుక్షణం ముమ్మరిస్తున్న శబ్దజాలానికి అర్థ గౌరవం కల్గించే నిఘంటువులు ఎన్నో వెలువడుతున్న రోజులివి. ఒక్కొక్క శాస్త్రానికి ఒక్కొక్క నిఘంటువు మాత్రమే కాదు, ఒక్కొక్క శాస్త్రంలో పలు విభాగాలకు సహితం ప్రత్యేక నిఘంటువులు వస్తున్నాయి. అందులోనూ ఈ వింగడింపు శాస్త్ర, సాంకేతిక విషయాలకు మరింత అవసరమవుతోంది. అలాంటి వాటిలో వైద్య విజ్ఞాన శాస్త్ర నిఘంటువు ఒకటి, 'కణ' విభజనలా పెరిగిపోతున్న ఒకేశాస్త్రంలోని పలు విభాగాలలో నిత్యనూతనంగా దూసుకు వస్తున్న పద సంపదకు అర్థ గౌరవం కలిపించవలసి ఉంది. ఆయా శాస్త్రాలలోని సాంకేతిక పరమైన పదాలకు అకారాలు గ్రీకు, లాటిన్, సంస్కృత భాషలలో ఉండగా, క్రమంగా వాటిని ఆంగ్ల భాషా శాస్త్ర నిపుణుల సాయంతో ఇంగ్లీషు వైద్య నిఘంటువులను ఆంగ్లేయులు రూపొందించుకోగా ఈ మూడు భాషల పద సంపద ఆధారంగా ప్రపంచంలోని ఇతర వైద్య విజ్ఞాన నిఘంటువులూ వెలశాయి. భాషావేత్త, కవి మోలియర్ అంటూండేవాడట "ప్రతీ అంశం మీద ఎంతో కొంత జ్ఞాన కాంతి ప్రసరిస్తుండాల"ని. ఆ పనిని నిఘంటువులు, ప్రత్యేక శాస్త్ర నిఘంటువులూ చేస్తూంటాయి. అందులోనూ ఒక భాషా నిఘంటువులోని పదజాలాన్ని మరో భాషలోకి బట్వాడా చేయడం క్లిష్టతరమైన పని, ఒక్కో పదానికే కాదు, ఒక్కొక్క వర్ణానికి (అక్షరానికి) సహితం భిన్నార్థాలు ఉంటాయి. ఇలాంటి బృహత్కార్యాన్ని ప్రపంచంలో తొలి ప్రయత్నంగా భుజాలకెత్తుకున్న వాడు క్రీ.శ. ఒకటవ శతాబ్ది నాటి చైనీస్ నైఘంటికుడు హ్యూషెన్. దాని విశేష మేమంటే, ఆ చైనీస్ నిఘంటువు రూపు దిద్దుకున్న ఆనాటి నుంచి ఈ క్షణం దాకా చెక్కు చెదరకుండా ప్రాచుర్యంలోనూ, వినియోగంలోనూ ఉండడం! తొలి ద్విభాషా నిఘంటువు క్రీ.పూ 2000 ఏళ్లనాటి సమేరియన్-అక్కాడియన్ ప్రతి, తొలి త్రిభాషా నిఘంటువు సుమేరియన్-బాబిలోనియన్-హిట్టయిట్ భాషల్లో వెలువడిందిబీ స్థానిక మాండలికాలలో ప్రపంచంలో తొలిసారిగా క్రీస్తుపూర్వం 15వ సంవత్సరంలో తొలి ప్రతి వెలువడిందట! ఔషధ శాస్త్రానికి సంబంధించిన ఔషధీ నిఘంటువు (ఫార్మకోపియా) మొదటిసారిగా మెసొపటోమియన్ మట్టి ఫలకలపై అవతరించిందంటారు! మానవాళి విజ్ఞానం వికాస దశలలో కాలిడిన తరువాత శబ్ద, రూప నిర్ణయంతో అకారాది క్రమంలో నిఘంటువులు వెలువడుతూ వచ్చాయి. మన తెలుగునాట కూడా వైద్య భాషకు ప్రాచీన చరిత్ర ఉందని తెలుగు వచనానికి నిండైన మెండైన కండను, గుండెను దండిగా అందించిన మహా కథకులు, శ్రీపాద సుబ్రహ్మణ్యశాస్త్రి నిరూపించారు. తెలుగులో వైద్య నిఘంటువులు చాలా తక్కువ. ఆ తక్కువలోనే వెలువడిన మిక్కిలిగా ఎన్నదగినవి ఒకటి రెండు కన్నా ఎక్కువలేవనే చెప్పాలి. తెలుగు అకాడమీ వారు ఒక చిన్న పొత్తంగా వైద్యనిఘంటువు వెలువరించగా, డాక్టర్ పి.హెచ్.బి.ఎస్.శర్మ "మెడికల్ డిక్షనరి" మకుటంతో ఒక ఇంగ్లీషు-తెలుగు వైద్య నిఘంటువును వైద్య విద్యార్థులకోసమని "స్టూడెంట్ ఎడిషన్"గా సంకలనం చేసారు. కాగా, విద్యార్థులకు పండితులకు, సాహితీవేత్తలకు వినియోగపడే విధంగా శ్రీపాద వారు తెలుగులో ఒక వైద్య నిఘంటువును 1948లో తొలి ముద్రణగా తీసుకొచ్చారు. పదాన్ని, విషయాన్ని శీఘ్రంగా అర్థంచేసుకోలేని సమయాల్లో "పండితులకున్నూ ఈ నిఘంటువు ఆవశ్యకం ఏర్పడుతుంద"ని తెలుపుతూ ఆయన "ఇది సమగ్రం కాదు, ఒక మహా శాస్త్రానికి దిగ్దర్శినియిది. ఇలాంటివి ఎప్పుడూ సమగ్రాలు కావు, ఇందులో చేరవలసినవే ఎక్కువ. అవి సేకరిస్తూనే ఉండాలి" అని చెప్పడం. నిఘంటు నిర్మాణంలో "ఇదే

ఆఖరిది, ఇదే ప్రమాణం, ఇదే పరసీమ" అని మనం చెప్పలేమని చెప్పక చెప్పడమే! కేవలం వైద్య విద్యార్థులకే కాదు, ఇలాంటి ప్రత్యేక శాస్త్ర విజ్ఞాన, వైద్య విజ్ఞాన నిఘంటువుల అవసరం, ఉపయోగం మాతృ భాషా పత్రికలు నిర్వహిస్తున్న పాత్రికేయులకు కూడా ఉంటుంది. చాలా కాలంగా వినియోగంలోకి వచ్చి, అలవాటై స్థిరపడిన వైద్య భాషా పదాలను యథాతథంగా వాడుకుంటూనే, తెలుగులో నూతన పద సృష్టికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉండాలి. అలాంటి విశిష్ట ప్రయత్నంలోనికి ఇటీవల పూనుకున్న ఈ సరికొత్త వైద్య నిఘంటువు కర్త మరెవరో కాదు, సాక్షాత్తూ తెలుగు వారి తొలి భాషా శాస్త్రవేత్త, వ్యావహారిక భాషా ఉద్యమ పితామహుడైన 'గిడుగు పిడుగు' (గిడుగు వేంకట రామమూర్తి) వారి మనుమడైన రామమూర్తి. తాతపేరే మనవడి పేరు అయితే ఈ మనవడి తండ్రి సుప్రసిద్ధ సాహితీవేత్త, కళాప్రపూర్ణుడై డాక్టర్ గిడుగు సీతాపతి కావడం మరో విశేషం.

తాత, తండ్రుల నుంచి సాహిత్య స్ఫూర్తిని పుణికి పుచ్చుకున్న చిన్న రామ్మూర్తి చిన్నప్పటినుంచి కడుపులో పుండు (వ్రణం)తో సంవత్సరాల తరబడి బాధ పడుతూ రావడం వల్ల వైద్య విజ్ఞానంపై ఆసక్తి కలిగి, చివరికి ఈ వైద్యనిఘంటు నిర్మాణానికి పూనిక వహించడం విశేషం! ఆయుర్దాయమే జీవికను చూపుతుందన్న (ఆయురన్నం ప్రయచ్ఛాతి) నానుడి ''అల్సర్'' రోగిగా ఆయనను ప్రేరేపించడం ఈ నిఘంటువుకు ప్రేరణ అయింది. సులభ గ్రాహ్యంగా చినరామ్మూర్తి ఈ వైద్య నిఘంటువును కమ్మని తెలుగులోకి (ఇంగ్లీషు-తెలుగు) తీసుకొచ్చినందుకు బహుధా ప్రశంసనీయులు. వైద్య నిఘంటువు నిర్మాణంలో వేల సంవత్సరాలుగా, తరాల తరబడి దేశవాళీ వైద్యులూ, ఆధునిక వైద్యులూ పెంచి పోషించుతూ వచ్చిన వైద్య విజ్ఞానంమీద ఆధారపడిన పద సంపద ఎంతో రామ్మూర్తి నిఘంటువులో ఉంది. అందరికీ అర్థమయ్యే పదాలూ, వివరణలూ ఈ అనువాద రచనలో ఉన్నాయి. ఒక్కొక్క వ్యాధికి సంబంధించిన ఎన్నో రకాల పద సంపద ఉంది.

ప్రపంచ ప్రసిద్ధికెక్కిన దేశాలలో ఈజిప్టు, భారత, చైనా దేశాలు ప్రాచీన వైద్య విధానాలలో అగ్రస్థానంలో ఉన్నాయి. వైద్య శిఖామణి అయిన హిరోడోటస్ "లిబియన్ల తర్వాత ఈజిప్టుయన్లే అందరిలోకి ఆరోగ్యవంతులు" అని కితాబిచ్చాడు. ఆనాడు ఈజిప్టు వాతావరణం పొడిగా ఉంటూ, ప్రజారోగ్య వ్యవస్థ విశిష్ట మైనదిగా ఉన్నందున జనాలు ఆరోగ్య భాగ్యంతో తులతూగారని హీరో డోటస్ అన్నాడు! ప్రాచీన కాలంలో వైద్య వృత్తి ఎలా ఉండేదంటే ప్రతీ వైద్యుడు (ఫిజిషియన్) ఏదో ఒక రోగం పైన కేంద్రీకరించి, చుప్తాగా ఆ రుగ్మతను నయం చేసేవాడని ఆయన పేర్కొన్నాడు. "ఎడ్విన్స్మిత్ పాపిరస్" గ్రంథం ప్రకారం మన ఆయుర్వేదం ఎంత ప్రాచీనతమ వైద్య విధానమో క్రీ.పూ. 3000 ఏళ్ల నాడే వెల్లడైంది. ఈజిప్షియన్ వైద్య విజ్ఞాన సమాచారం ప్రజలకు అందుబాటులో ఉండేది. స్త్రీలకు సంబంధించిన రుగ్మత లను, 'నలత'లనూ, వాటి నుంచి వచ్చే సమస్యలనూ, వాటి కారణాలను 34 రకాల కేసుల ద్వారా వివరిస్తున్న అతి ప్రాచీన ఈజిప్షియన్ గ్రంథం "కాహున్ గైనకాలజీ పాపిరస్''. మనకు శుశ్రుత, చరకుడు ఎలాగో ఈజిప్షియన్లకూ వీరు అంతటివారు! ప్రాచీన ఈజిప్షియన్లకు తెలిసిన తొలి వైద్యుడు (ఫిజిషియన్) హెసీ-రా క్రీ.పూ. 27వ శతాబ్దంవాడు. ప్రాచీన వైద్యశాల పెసీషెత్. ఆయుర్వేద వైద్యం, వనమూలికల ప్రాశస్త్యం తెలిసిన తొలి భారతీయ రచన "అధర్వవేదం" (ఇనుప రాతియుగం), క్రీస్తుపూర్వం తొలి వైదికానంతర కాలంలో ఈ వైద్యం ప్రజారోగ్యంలోకి దూసుకువచ్చింది. ఆనాటి వైద్య శిఖామణులు పెక్కుమంది. భౌతికవాదులుగా ఉన్నందుననే మనిషి ఆరోగ్యం, అనారోగ్యం 'విధినిర్ణయం' కాదనీ, ముందే రాసిపెట్టిన తంతు కాదనీ చెబుతూ "మానవ ప్రయత్నంద్వారా సంకల్పం ద్వారా జీవితాన్ని పొడిగించడం సాధ్యమని" చరకుడు తన వైద్య సంపుటం "చరక సంహిత"లో స్పష్టం చేశాడు. అలాగే శుశ్రుతుడు కూడా తన "శుశ్రుత సంహిత"లో వైద్యం లక్ష్యమే "రోగుల రోగ లక్షణాల్ని" కనిపెట్టి నయం చేయటం, అనారోగ్య వంతుల్ని కనిపెట్టి నయం చేయటం, ఆరోగ్యవంతుల్ని కాపాడటం, జీవితాన్ని పొడిగించడమని చెప్పాడు. క్రీ.పూ. ఆరవ శతాబ్ది నాటి ఈ ఇరువురు భారతీయ భిషగ్రత్నాల రచనలకూ, వేద 'వ్మాయంలోని తొలి వైద్య విజ్ఞాన భావ బీజాలకూ కొంత సంబంధం ఉన్నా, బౌద్ధ, జైన ధర్మాలకు చెందిన తొల్లింటి సాహిత్యానికీ, తొలి ఆయుర్వేదంలోని వైద్య సంబంధిత ప్రస్తావనలకూ మధ్య ప్రత్యక్ష చారిత్రిక సంబంధాలున్నాయని చరిత్రకారుల అభిప్రాయం. ఆయుర్వేద గ్రంథాలు ప్రస్తావించిన ఏడు రకాల వైద్య చికిత్సలూ ఈనాటికీ అమలులో ఉన్నాయి. వీటిలోని పదజాలానికి శ్రీపాదవారు అర్థ వివరణలు యిచ్చారు. ఆయుర్వేద వైద్య శాస్త్రంలోని ఎనిమిది శాఖలూ ఆధునిక వైద్యంలో కూడా ఉన్నాయి: 1) కాయ చికిత్సను "ఇంటర్నల్ మెడిసిన్" అనీ, శల్య చికిత్సను శరీర శాస్త్రంతో సహా "సర్జరీ"గాను శలాక్య చికిత్సను "ఇయర్, ఐ, నోస్,

త్రోట్ డిసీజెస్" అనీ, కౌమార వైద్యాన్ని "పిడియాట్రిక్స్" (చిన్నపిల్లల వైద్య) శాస్త్రం అనీ, అగద తంత్రాన్ని టాక్సికాలజీ అనీ, రసాయనాన్ని సెన్స్ ఆఫ్ రిజువెన్షన్ అనీ పిలుస్తున్నారు. అలాగే చైనా వైద్య విధానంలో భాగంగానే అక్యు పంక్చర్ ప్రసిద్ధిలోకి వచ్చింది. చైనీస్ వైద్యానికి పునాది గ్రంథం "హువాంగ్లీ నీజింగ్". ఇది రెండు భాగాలు. ఇవి క్రీ.పూ. 7వ శతాబ్దానివి. అలాగే "ఆధునిక వైద్య శాస్త్ర పితామహుడు"గా పేర్కొంటున్న గ్రీక్ వైద్య శిఖామణి హిప్పొక్రటెస్ క్రీ.పూ. 4-3 శతాబ్దులనాటివాడు. ఈయన వైద్యులకు ప్రవచించి, నిర్దేశించిన నైతిక సూత్రాలనూ, బాధ్యతలనూ "హిప్పోక్రాటిక్ వోత్" అంటారు. ఇవి ఈ రోజుకీ వైద్యులకు శిరోధార్యాలే. నిజానికి ఈ ఆదేశాలను పాటించే వైద్యులు నిజమైన ప్రజాసేవకులుగా మారి, ప్రజల గౌరవాభినందనలు పొందగలుగుతారు. అలాగే ఒక రోగం భవిష్యత్ స్వరూపాన్ని నిర్ధారించగలడాన్ని "ప్రొగ్నొసిస్" అంటారు. అందానికి సంబంధించిన తన గ్రంథానికి హిప్రొక్రటిస్ అదే పేరు పెట్టుకున్నాడు. ఈ "ప్రోగ్నొసిస్" లక్షణంగల ముఖాన్ని ఊహా మాత్రంగా ముందుగానే వర్ణించి వివరించిన తొలి ప్రపంచ వైద్యుడు హిప్పోక్రటిస్, దానినే "హిప్పొక్రటిక్ ఫేస్" అని కూడా అంటారు. దీనికి తరువాతి కాలంలో షేక్ స్పియర్ మహాకవి తన "హెన్రీ" నాటకంలో ఫాల్ స్టాఫ్ పాత్ర మరణం గురించి వర్ణిస్తూ సాదృశ్యంగా చూపాడు. శస్త్రచికిత్సలో ఉపయోగించే అనేక పరికరాలకు ఆచార్యులు రోమన్లు. మధ్యయుగాలలో అద్భుతమైన వైద్య చికిత్సా విధానాలను ఇస్లాం రూపొందించింది. క్రమబద్ధమైన వైద్య విధానాన్ని, చికిత్సా పద్ధతులనూ ప్రతిపాదించిన ప్రాచీన గ్రీక్ వైద్యుడు గాలెన్ విరచించిన 129 వైద్య గ్రంథాలను అరబిక్‌లోకి అనువదించిన ముస్లిం ప్రముఖ వైద్యుడు హునాన్ ఇబిన్ ఇషాక్, అతని సహచరులూ. ఆధునిక కాలంలో జన్యు లక్షణాలను వంశపారంపర్యంగా 'జల్లెడ' పట్టినట్టు వివరించే "డి.ఎన్.ఎ" నిర్మాణ రహస్యం కాస్తా బద్దలయిన తర్వాత జీవశాస్త్రాన్ని జాంబవంతుడి అంగలపైన వేగవంతం చేసే మోలిక్యూలర్ (పరమాణువుల సముదాయం) బయోలజీకి తలుపులు తెరచుకున్నాయి! లూయీ పాశ్చర్, రాబర్ట్ కో, కాడి బెర్నార్డ్ వైద్య శాస్త్రంలో నవీన శాస్త్రీయ పద్ధతులకు అంకురార్పణ చేశారుబీ వైద్య వృత్తిని మంత్రసానులు, సహాయకుల సహకారంతో అత్యంత విలువైన సేవలకు శ్రీకారం చుట్టిన మహిళాలోకానికి ఆదర్శనీయురాలుగా ఫ్లారెన్స్ నైటెంగేల్ అవతరించి అంతవరకూ మగ వారికే పరిమితమై ఉన్న నర్సింగ్ వృత్తిని మహిళా నర్సుల ప్రవేశంతో సుసంపన్నం చేసింది! ఇలా వైద్య వృత్తికి చెందిన విభిన్న శాఖలు, ఉపశాఖల నుంచి నిరంతరం నవీన ప్రయోగాల ద్వారా నవనవంగా కుప్పలు తెప్పలుగా ఊడిపడే వైద్య శాస్త్ర సాంకేతిక పదాలకు అకారాదిగానూ, ఆరోపాల పరంగానూ అర్థాలు, అర్థ వివరణలూ ముంచుకొస్తున్న తరుణంలో చిన గిడుగు రామ్మూర్తిగారు సిద్ధపరిచిన ఈ అభినవ వైద్య నిఘంటువు చాల విలువైనదిగా భావించాలి. అనేక వైద్య పదాలకు ఇంతకు ముందు వైద్య నిఘంటువులలో లేని సరళ సుభోదకమైన వివరణలు ఎన్నో ఉన్నాయి. బహుశా తెలుగు ప్రతికి సంబంధించినంత వరకు రామ్మూర్తి గారి నిఘంటువు ఔషధ పరిశ్రమకు చెందిన ప్రపంచ ప్రసిద్ధ సంస్థ మెర్క్ కంపెనీ ఆధ్వర్యంలో వెలువడిన "ది మెర్కె మాన్యువల్ ఆఫ్ మెడికల్ ఇన్ఫర్మేషన్" గ్రంథానికి (2003 ప్రచురణ), ఆక్స్‌ఫర్డ్ -ఐ.బి.హెచ్ సంస్థ సంయుక్త ప్రచురణగా వెలువడిన "న్యూ మెడికల్ డిక్షనరీ"కి (2010 ప్రచురణ) గానీ తీసిపోదని అనిపిస్తోంది. మెర్క్ మాన్యువల్ 163 సంవత్సరాలుగా ప్రచారంలో ఉంది. వైద్యశాస్త్రంలో పదాలను అక్షరాస్యులయిన రోగులు అర్థం చేసుకున్నప్పుడు తమకు సేవలందిస్తున్న వైద్యులను మరింత బాగా అర్థంచేసుకోగలిగి, తోడ్పడగలుగుతారు. ఇక ఆఖరిమాటగా ఒక ముచ్చట- నిఘంటు నిర్మాణం కత్తి మీద సాము లాంటిది. ఇది వైద్య శాస్త్ర, సాంకేతిక పద నిఘంటువే అయితే దాని నిర్మాణం మరింత అసిధారావ్రతమే. అందుకే 19వ శతాబ్దపు ఫ్రెంచి మేధావులలో ఒకరు, "ఫ్రాన్స్ సాహిత్య చరిత్ర"ను, ఫ్రెంచి భాషా పద వ్యుత్పత్తి శాస్త్ర నిఘంటువును రూపొందించి "నా నిఘంటువును ఎలా నిర్మించాను" అన్న ఉత్తమ గ్రంథాన్ని రచించిన ఎమిలీ లిత్రే అన్న మాటల్ని ఒకసారి ఈ సందర్భంగా కొసమెరుపుగా గుర్తు చేసుకుందాం:

"నిఘంటు రచన మతి చెడిన వాడి వృత్తి కాదు. ఎందుకంటే, ఒక పద్ధతి ప్రకారం, ప్రణాళికా బద్ధంగా, నిఘంటు నిర్మాణం జరగాలి, నా బొందో' అంటూ కేంద్రీకరించి జరగాల్సిన పని, ఇందుకు నైఘంటికుడి మనస్సు నిర్మలంగా ఉండాలి. సందేహ నివృత్తి చేయగల స్పష్టత ఉండాలి. కాని ఒకటి మాత్రం నిజం- అప్పుడప్పుడూ ఈ వృత్తి నిఘంటుకారుడి బుర్ర తినేస్తుంది. నిద్రాహారాలకు నోచుకోని పని రాక్షసుడిగా మారుస్తుంది".

డా.ఎ బి కె ప్రసాద్
పూర్వాధ్యక్షులు, ఆంధ్ర ప్రదేశ్ అధికార భాషా సంఘం
(గిడుగు మూడవతరం వారికి రాసిన ముందుమాట)
*సేకరణ : పెద్ది సాంబశివరావు, అన్నమయ్య గ్రంథాలయం*

# చేనేత పరిశ్రమ



భారతీయ చేనేత

– డా. కందగట్ల శ్రవణ్ కుమార్

మన భారతీయ సంస్కృతి సంప్రదాయాలు ఎంతో గొప్పవి, అవి వారసత్వంగా కొనసాగుతున్నవి కూడా. కళల పేరిట భారతదేశానికే ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చే వాటిలో చేతి వృత్తులు కుడా ఉన్నాయి. చేతి వృత్తులలో చేనేతకు ఎంతో చరిత్ర ఉంది. భారతదేశంలో స్వదేశీ ఉద్యమం 1905లో మొదలైంది. అప్పుడు విదేశీ వస్తు బహిష్కరణ చేస్తూ ఖద్దరు దుస్తులు వేసుకుంటూ నిరసన తెలిపినవారు ఉన్నారు. భారతీయ చేనేత పరిశ్రమకు ఎంత చరిత్ర ఉందో ఈ పరిశ్రమలో అంత కళాత్మకత కూడా ఉంది. అద్భుతమైన ఆకారాలతో, కనులను కట్టిపడేసే రంగులతో వస్త్రాలు నేయడం చేనేత కార్మికుల గొప్పదనం. భారతదేశం స్వదేశీ ఉద్యమం చేపట్టిన రోజును స్మరిస్తూ, 2015వ సంవత్సరంలో మొట్టమొదటిసారి భారతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకోవాలని నిర్ణయించి, దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగష్టు 7వ తేదీన దేశవ్యాప్తంగా చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. భారతదేశంలో ఈ చేనేత వృత్తి మీద ఆధారపడిన వారి ఆర్థిక, సామాజిక అవసరాలను గుర్తించి, చేనేత గొప్పదనం, అందులో ఉన్న సంప్రదాయపు విలువల గురించి యావత్ దేశమంతా అవగాహన కలిగించాలన్నదే ఆ రోజు ప్రత్యేకత. సంభావ్య ఉపాధి పరంగా భారతదేశంలో రెండవ అతిపెద్ద పరిశ్రమ టెక్స్‌టైల్ రంగం. దేశ ఆర్థిక వ్యవస్థ చేనేత పరిశ్రమపైనే ఎక్కువగా ఆధారపడి ఉంది. 28.2 లక్షల మగ్గాలతో చేనేత రంగం దేశంలోనే అతిపెద్ద కుటీర పరిశ్రమ. దేశంలో ప్రధాన చేనేత ఎగుమతి కేంద్రాలు కరూర్, పానిపట్, వారణాసి మరియు కన్నూర్. ఇవి ఎగుమతి కోసం చేనేత వస్త్రాలని తయారు చేస్తున్నాయి, వీటిలో ఫ్లోర్ కవరింగ్‌లు, కర్టెన్లు, కిచెన్, బాత్రూమ్ లినెన్‌లు, బెడ్ లినెన్‌లు, టేబుల్ లినెన్‌లు కూడా ఉన్నాయి. దేశవ్యాప్తంగా, చేనేత పరిశ్రమ ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా 43.31 లక్షల మంది నేత కార్మికులకు ఉపాధి కల్పిస్తోంది. వారిలో 70% పైగా మహిళలు ఉన్నారు, దీన్ని బట్టి భారతీయ చేనేత వస్త్ర పరిశ్రమలో మహిళల సాధికారతకు చేనేత వృత్తి ఎంత గొప్పగా దోహదం చేస్తోందో అర్థం చేసుకోవచ్చు. భారతదేశంలో దాదాపు 150 చేనేత కేంద్రాలు ఉన్నాయని అంచనా. ఆంధ్రా, ఒడిశా, బనారస్ సిల్క్, జరీ, కంచి, తమిళనాడు సిల్క్, గుజరాత్ రాజస్థాన్ టై&డై, సూరత్ తావోజా, పంజాబ్ పుల్కారీ, బెంగాల్ ఢకై, బలూచారి సిల్క్, అస్సాం మూగా సిల్క్, మహేశ్వరి జరీ, పటోలా డిజైన్, చందేరీ సిల్క్ నుండి నూలు ఇకత్ మరియు జమ్దానీ, పైథాని సిల్క్, కోటా పేపర్ సిల్క్, మధ్యప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, ఒడిశా, బెంగాల్–తాసర్ సిల్క్, ఖాదీ సిల్క్, మైసూర్ సిల్క్, కాశ్మీర్ సిల్క్, ఏరి ముడి సిల్క్, కాశ్మీర్ పష్మీనా మరియు షహతూష్ పల్చని ఉన్ని, ఈశాన్య రాష్ట్రాల గిరిజన చిహ్నాలు, బీహార్ మధుబని, మహారాష్ట్ర వర్లీ డిజైన్‌లు, మరెన్నో భారతీయ చేనేతలో విభిన్న రంగుల కలయికగా ఉన్నాయి. ప్రపంచ చేనేత వస్త్రాలలో 90% పైగా భారతదేశంలో నేయబడతాయి. చేనేత కళాకారులు నూలు, కాటన్, సిల్క్, పట్టు, ఇతర సహజంగా ఉపలబ్ధమయ్యే నార, పీచులతో అద్భుతమైన వస్త్రాలు తయారు చేస్తారు.

తెలంగాణలోని ప్రధాన చేనేత వస్త్రాలు – వాటి ప్రాముఖ్యత తెలంగాణ దాని సాంస్కృతిక, ఆర్థిక గుర్తింపులో అంతర్భాగమైన చేనేత గొప్ప వారసత్వానికి ప్రసిద్ధి చెందింది. చక్కగా నేసిన చీరల నుండి సున్నితమైన దుస్తుల సామగ్రి వరకు, రాష్ట్ర చేనేత రంగం ప్రతి బట్టలో సంప్రదాయం, నైపుణ్యం, వారసత్వాన్ని నేసే ఒక శక్తివంతమైన వస్త్రం. తెలంగాణలోని ప్రధాన చేనేత వస్త్రాలు, వాటి ప్రాముఖ్యతను పరిశీలిద్దాం.

**పోచంపల్లి ఇక్కత్ :** పోచంపల్లి, తెలంగాణలోని నల్గొండ జిల్లాలోని ఒక చిన్న పట్టణం, అద్భుతమైన "ఇక్కత్" చేనేత వస్త్రాలకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందింది. పోచంపల్లి ఇక్కత్ ముఖ్య లక్షణం సంక్లిష్టమైన నమూనాలు, వీటిని ఫాబ్రిక్‌లో నేయడానికి ముందు దారాలకు రంగు వేయడం ద్వారా తయారు చేస్తారు. ఈ సంక్లిష్ట సాంకేతికత చీరలు, దుస్తుల సామగ్రి, గృహోపకరణాలను అలంకరించే జ్యామితీయ డిజైన్‌లను మంత్రముగ్దులను చేస్తుంది. తరతరాలుగా వస్తున్న పోచంపల్లి ఇక్కత్ సంప్రదాయం చేనేత కార్మికుల ప్రావీణ్యానికి, కళారూపానికి అనాదిగా ఉన్న ఆకర్షణకు నిదర్శనం. 2023లో ఫ్రాన్స్ జాతీయ దినోత్సవంలో పాల్గొనడానికి పారిస్ వెళ్ళిన భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆ దేశ ప్రథమ మహిళ బ్రిజిట్ మెక్రాన్‌కు పోచంపల్లి పట్టుచీరను బహుమతిగా ఇచ్చారు. భారతీయ హస్తకళా నైపుణ్యానికి దర్పణమైన ఆ చీరను ఆమె అపురూప కానుకగా కూడా అభివర్ణించారు.

**గద్వాల్ చీరలు :** తెలంగాణలోని జోగులాంబ గద్వాల్ జిల్లాలో ఉన్న గద్వాల్ పట్టణం, సున్నితమైన చేతితో నేసిన చీరలకి ప్రత్యేకత. గద్వాల్ చీరలను వేరుగా ఉంచేది సిల్క్, కాటన్ యొక్క శ్రావ్యమైన మిశ్రమం. 5.5 మీటర్ల పొడవుతో గల చీరను చిన్న అగ్గిపెట్టెలో కూడా పట్టినంత నేయగల సామర్థ్యం ఉన్న చేనేత కార్మికులు ఇక్కడ ఉన్నారు. ఈ చీరలు 1930 నుండి ప్రాముఖ్యతను సంతరించుకున్నాయి. నూలు, పట్టుపోగుల నుంచి దారం తీయడం, వివిధ రకాల రంగులు అద్ది కళాత్మకమైన చీరలను నేస్తారు. చీరపై, కింది అంచులు జరీతో ఉండి, అంచులు మరోసారి నేసి తర్వాత ప్రత్యేకంగా జోడిస్తారు. చీరకు కావలసిన పట్టు దారాలు, అంచులు, కొంగులకు జరీని వాడుతారు. గద్వాల్ చీరలని గాంభీర్యం కోసం ప్రత్యేక సందర్భాలలో, పండుగల సమయంలో తరచుగా ధరిస్తారు, అవి ఆ ప్రాంత సాంస్కృతిక వారసత్వాన్ని కూడా ప్రతిబింబిస్తాయి.

**నారాయణపేట చీరలు :** తెలంగాణలోని మహబూబ్‌నగర్ జిల్లాలో ఉన్న నారాయణపేట, విలక్షణమైన చేనేత చీరలకు ప్రసిద్ధి చెందింది. ఈ చీరలు వాటి తేలికపాటి కాటన్ ఫాబ్రిక్ వైబ్రెంట్, బోల్డ్ కాంట్రాస్టింగ్ బార్డర్‌లతో అలంకరించబడి ఉంటాయి. నేత కార్మికుల నైపుణ్యం నేత యొక్క ఖచ్చితత్వం, శక్తివంతమైన రంగుల కలయికలో స్పష్టంగా కనిపిస్తుంది. నారాయణపేట చీరల వారసత్వం చేనేత వస్త్రాల కాలాతీత అందం, బహుముఖ ప్రజ్ఞకు ఉదాహరణగా పేర్కొనవచ్చు.

**సిరిసిల్ల చేనేత కార్మికుల ప్రతిభ :** సిరిసిల్ల నేత కార్మికులు గతంలోనే అగ్గిపెట్టెలో ఇమిడే చీర, భద్రాద్రి సీతారాముల కళ్యాణ మహోత్సవానికి పట్టు పీతాంబరాలతో పెళ్లిబట్టలు, ప్రముఖ మాజీ క్రికెటర్ సచిన్ టెండూల్కర్ పుట్టిన రోజు సందర్భంగా ఆయన చిత్రంతో వస్త్రం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాజీ ముఖ్య మంత్రి కేసీఆర్ చిత్రంతో చీర, చీరపై జనగణమణ గీతం, ఇలా ఎన్నో అద్భుతాలు ఆవిష్కరించారు. సిరిసిల్ల చంద్రంపేటకు చెందిన చేనేత కళాకారుడు వెల్ది హరిప్రసాద్ మొట్టమొదటిసారిగా చేనేత మగ్గంపై బంగారంతో పట్టుచీరను నేసి ప్రశంశలు పొందాడు. అలాగే సూక్ష్మ మర మగ్గం, రాట్నం, చేనేత మగ్గం తయారుచేసి, సొంతంగా మొట్టమొదటి డబుల్ పేటి ఎలక్ట్రానిక్ (మగ్గం) జకార్డును తయారు చేయటమే కాకుండా దానిపై పట్టు చీర కూడా నేశాడు. 2023లో ఇండియాలో జరిగిన జీ-20 సదస్సుకు, ప్రపంచలో 20 అగ్రదేశాల అధ్యక్షులు వచ్చిన సందర్భంగా సిరిసిల్ల చేనేత కార్మికుడు జీ-20 దేశాల అధ్యక్షుల ఫోటోలతో పాటు భారతదేశ చిత్రపటం, అందులో మూడు రంగుల జాతీయ జెండా ఆ మధ్యలో భారత దేశ ప్రధాని నరేంద్ర మోడీ నమస్కారం పెడుతూ స్వాగతం పలుకుతున్న చిత్రాన్ని తయారు చేసి మన దేశ ప్రజల మన్ననలే కాకుండా, ప్రపంచ ప్రతినిధుల మన్ననలు పొందాడు.

**ఉమ్మడి వరంగల్ జిల్లా తివాచీలు :** ఉమ్మడి వరంగల్ చేనేత వస్త్రాలకు దేశ విదేశీ గుర్తింపు లభిస్తోంది. ఇక్కడ కళాకారులు మగ్గంపై ఎంతో శ్రమించి తీర్చిదిద్దిన దుస్తులు ఎంతో మంది మనసును దోచుకుంటున్నాయి. వైవిధ్యానికి పెద్ద పీట వేస్తూ నేతన్నలు రూపమిచ్చే వస్త్రాలు ఎప్పటికప్పుడు సరికొత్త గుర్తింపును పొందుతున్నాయి. వరంగల్ జిల్లా కొత్తవాడ ధరీస్ (తివాచీలు)కు ఎంతో ప్రసిద్ధి చెందింది. ఇక్కడి నేతన్నలు రంగు రంగుల్లో అందమైన డిజైన్లు గల తివాచీలను నేస్తుంటారు. ఇది ఇక్కడ తప్ప మరెక్కడా నేయకపోవడంతో 2017లో కొత్తవాడ దరీస్‌కు జీఐ (జియోగ్రాఫికల్ ఇండికేషన్) గుర్తింపు దక్కింది. ఈ తివాచీలకి జపాన్, ఆస్ట్రేలియా, జర్మనీ,

ఇంగ్లండ్ అమెరికాలో కొనుగోలుదారులు కూడా ఉన్నారు. అలాగే హనుమకొండ జిల్లా కమలాపూర్ చేనేత సొసైటీలో నేతన్నలు చేనేత వస్త్రాల్లో తొలిసారిగా జీన్స్ క్లాత్‌ను నేసి అబ్బురపరిచారు, అవి చూడ్డానికి మామూలు జీన్స్ లాగే ఎంతో తేలిగ్గా, రంగు వెలిసిపోకుండా నాణ్యతగా ఉన్నాయి. కమలాపూర్‌లో రాజుల కాలం నాటి, ఒకప్పుడు రాజ కుటుంబీకులు ధరించే హిమ్రూ పట్టుకు నేతన్నలు ప్రాణం పోసి, హిమ్రూ షర్టింగ్, చీరలను అద్భుతంగా నేస్తున్నారు, వీటికి యునెస్కో విశిష్ట సంప్రదాయ వస్త్రాల్లో గుర్తింపు దక్కింది. భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ ప్రాంతంలో నేసే దసలి పట్టు చీరలకు ఎంతో ప్రత్యేకత ఉంది. పట్టు పురుగుల నుంచి దారం తీసి పట్టు వస్త్రాన్ని నేస్తారు, వాటికి అడవిలో లభ్యమయ్యే సహజ రంగులు అద్దుతారు. ఎల్కతుర్తి మండలం సూరారంలో అంతరించి పోయిన ఆర్మూర్ సిల్కు చీరలను అక్కడి యువతులు తయారు చేస్తున్నారు.

**సిద్ధిపేట గొల్లభామ చీరలు :** గొల్లభామ చీర లేదా సిద్ధిపేట గొల్లభామ మెదక్ జిల్లా, సిద్ధిపేట గ్రామంలో తయారవుతున్న చీరలు. సిద్దిపేట, దుబ్బాక ప్రాంతాల్లో చేనేత కార్మికులు నేసే గొల్లభామ చీరకు అంతర్జాతీయ ఖ్యాతి లభించింది. జీఐ జాబితాలో దీనికి 188వ సీరియల్ నెంబర్ ను కేటాయిస్తూ ప్రత్యేక గుర్తింపు ఇచ్చారు. కాటన్, మస్రెస్ రెండు దారాలతోనూ నేసే ఈ చీరలకు ఎంతో విశిష్టత ఉంది. తలపై పాల కడువ పెట్టుకొని మహిళ వయ్యారంగా నడుస్తున్నట్లుగా ఉండే గొల్లభామ చిత్రాలను దారంతో మగ్గం ద్వారా చీరపై కార్మికులు నేసే తీరు అద్భుతం. 1940లో సిద్దిపేటకు చెందిన రచ్చ రాందాస్, కాంట సాయిలు కలిసి మొదట ఈ చీరను తయారు చేశారు.

తెలంగాణలో చేనేత రంగానికి లోతైన సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక ప్రాముఖ్యత ఉండి, తరతరాలుగా అందజేయబడిన పురాతన పద్ధతులను సంరక్షిస్తుంది. హస్తకళాకారులు, నేత కార్మికులు, ప్రధానంగా మహిళలు, ఈ సాంప్రదాయిక హస్తకళను నిలబెట్టడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు, తద్వారా ఆయా కమ్యూనిటీలను బలోపేతం చేయడం, వారి సాంస్కృతిక వారసత్వాన్ని సంరక్షించ బడుతుంది, అదే విధంగా తెలంగాణ చేనేతలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గణనీయంగా దోహదపడుతున్నాయి, ఉపాధి అవకాశాలను సృష్టిస్తూ చాలా కుటుంబాల జీవనోపాధికి మద్దతు ఇస్తున్నాయి. చేనేత ఉత్పత్తుల ప్రచారం స్థానిక ఆర్థిక వ్యవస్థను పెంపొందించడమే కాకుండా తెలంగాణ రాష్ట్రానికి దేశంలోనే గుర్తింపును తెస్తున్నాయి. ప్రపంచ రంగంలో, తెలంగాణ చేనేత వస్త్రాలు భారతదేశ గొప్ప వస్త్ర వారసత్వానికి అంబాసిడర్లుగా పనిచేస్తూ, సుదూర ప్రాంతాల నుండి ఆరాధకులను ఆకర్షిస్తున్నాయి. ఈ చేనేత ఉత్పత్తుల క్లిష్టమైన హస్తకళ, కలకాలం ఆకర్షణీయంగా ఉండటం వల్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న కళ, ఫ్యాషన్‌కు సంబంధించిన వ్యసనపరుల హృదయాల్లో వాటికి ప్రత్యేక స్థానం లభించింది. చేనేత కార్మికులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం, వివిధ శాఖల నుంచి ఆర్డర్లు ఇస్తూ చేనేత కార్మికుల సంక్షేమంపై దృష్టి సారించింది. దీంట్లో భాగంగా నేత, చేనేత కార్మికులకు ప్రభుత్వ పలు శాఖల్లో విద్యా సంస్థల్లో చీరలు, స్కూల్ యునిఫారం కోసం ఆర్డర్లను చేనేత కార్మికులకు కూడా ఇచ్చి వారికీ ఆర్థికంగా అండగా ఉంది.

**చేనేత రంగం ప్రధాన సమస్యలు :** 2003 నాటికి దేశంలో 82 లక్షల మగ్గాలు ఉండేవి. 2019-20 చేనేత జనగణన సర్వే ప్రకారం, అప్పుడు దేశంలో 35 లక్షల మందికి పైగా చేనేత రంగంలో ఉన్నారు. తరవాతి కాలంలో వారి సంఖ్య దాదాపు 28 లక్షలకు పడిపోయింది. నేత కార్మికుల్లో అధికశాతం తమ నివాసాల్లో, సమీపంలోని చేనేత సహకార సంఘాల్లో పనిచేస్తున్నారు. ఆది నుండి ఉన్న చరఖాలు, రాట్నాలు, మగ్గాలనే వారు వినియోగిస్తున్నారు. నూలు తెచ్చి వస్త్రాలు తయారుచేసి విక్రయించడం ద్వారా వచ్చే ఆదాయమే వారికి జీవనాధారం. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ సహా ఎనిమిది రాష్ట్రాల్లోని చేనేత సహకార సంస్థలే వారి ఉత్పత్తులను కొనుగోలు చేస్తున్నాయి. ఒకప్పుడు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ప్రదర్శనశాలల ద్వారా చేనేత వస్త్రాలను విక్రయించే అవకాశం ఉండేది. వాటిలో 20 శాతం రాయితీపై విక్రయాలు జరిపేవారు. ఆ రాయితీ మొత్తాన్ని కేంద్ర ప్రభుత్వం నేత కార్మికులకు చెల్లించేది, కానీ నేడు ఆ సబ్సిడీ పథకం రద్దయింది. దేశవ్యాప్తంగా చేనేత ఉత్పత్తుల విక్రయాలు తగ్గుతున్నాయి. యువత జౌళి, రెడీమేడ్ దుస్తుల వైపు మొగ్గుచూపుతోంది. ప్రస్తుతం చీరలు, ధోవతులు, లుంగీలు, కుర్తాలు, శాలువాలు, ఘాగ్రా చోలీలు, దుప్పట్లు, బెడ్‌షీట్లు, కార్పెట్లు, కర్టెన్లు వంటి సంప్రదాయ ఉత్పత్తులే చేనేతను

కాపాడుతున్నాయి. మరోవైపు జౌళి రంగంలో ఫ్యాషన్, పాశ్చాత్య దుస్తులతో పాటు పడక గదులు, వంట గదులకు అవసరమైన అలంకార వస్త్రాలు తదితరాలు పెద్ద ఎత్తున ఉత్పత్తి అవుతున్నాయి. తద్వారా వస్త్ర రంగంలో 90 శాతానికి పైగా జౌళి ఉత్పత్తులే ఆక్రమించాయి. నూలు, రంగులు, రసాయనాల ధరలు పెరగడం, శారీరక శ్రమ కారణంగా చేనేత దుస్తుల ధరలు ఎక్కువగా ఉంటున్నాయి. వినియోగదారులు దూరం కావడానికి ఇదో ప్రధాన కారణం. ప్రస్తుతం నేత కార్మికులు తయారుచేసిన ఉత్పత్తుల్లో 20శాతం మేరకే విక్రయాలు జరుగుతున్నాయి. దాంతో వారి వద్ద నిల్వలు పేరుకుపోతున్నాయి. ప్రభుత్వరంగ సంస్థలు తమ విక్రయాలకు అనుగుణంగానే కార్మికుల నుంచి ఉత్పత్తులను తీసుకుంటున్నాయి, పైగా సేకరించిన వస్త్రాలకు వెంటనే బిల్లులు చెల్లించడం లేదు. బిల్లులు సకాలంలో చెల్లించకపోవడం వల్ల బకాయిలు పెరిగి వారికి అనేక ఆర్థిక ఇబ్బందులు వస్తున్నాయి. చేనేత సంస్థల ఆధ్వర్యంలోని దుకాణాల్లోనూ అమ్మకాలు తగ్గాయి. ఇలాంటి పరిస్థితుల్లో కొత్త ఉత్పత్తులు చేపట్టడానికి కార్మికులు అప్పులు చేయాల్సి వస్తోంది. అధిక శారీరక శ్రమ కారణంగా చేనేత కార్మికుల ఆరోగ్యం కుడా తీవ్రంగా దెబ్బతింటోంది. పవర్లూమ్స్ లేదా ఫ్యాక్టరీ ఉత్పత్తి మొదలైన తరువాత చేనేత పరిశ్రమ కుంటుపడింది. అనేక లోటుపాట్ల కారణంగా చేనేత కుటుంబాలకి గిట్టుబాటు ధర లభించట్లేదు. ముడి సరుకు అందుబాటులో లేకపోవడం దారం, నూలు, చెట్ల పూల రంగులు కొనుగోలు చేయడానికి ఎంతో దూరాలు వెళ్ళాల్సిరావడం కుడా చేనేత కార్మికుల సమస్యలు. మార్కెట్ల వ్యవస్థలో సదుపాయాలు లేకపోవడం చేనేత పరిశ్రమ ఉత్పత్తులకు "పేటెంట్" లేకపోవడం వల్ల రక్షణ లేదు, అన్ని సంప్రదాయ డిజైన్లు అనుకరించి నకళ్ళు చేస్తున్నారు. చేనేత సహకార సంస్థలు రాజకీయ జోక్యం వల్ల, అవినీతి వల్ల నష్టాల పాలవుతున్నాయి. కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లలలో సరైన నిధుల కేటాయింపులు లేకపోవడం బట్టల మిల్లులు, ఫాక్టరీలు, పవర్లూముల నుంచి చేనేత పరిశ్రమ అన్యాయమైన పోటీ ఎదుర్కుంటోంది. ఫ్యాక్టరీలకి, పవర్లూములకి ప్రభుత్వ సబ్సిడీలు కూడా దొరుకుతాయి. చేనేత కార్మికులకి కనీస వేతనాలు, ఉపాధి అవకాశాలు అందుబాటులో లేవు.

చేనేత సంప్రదాయ వృత్తి. కళారూపంగా అది కలకాలం నిలవాలి. దానికి కేంద్రం, రాష్ట్రాలు విశాల దృక్పథంతో బృహత్తర చర్యలు చేపట్టాలి. కార్మికులు వ్యక్తిగతంగా అభివృద్ధి చెందే అవకాశాలతో పాటు సామూహిక ఉత్పత్తి కోసం అన్ని జిల్లాల్లోనూ మెగా చేనేత పార్కులను నెలకొల్పాలి. మండలాల వారీగా చేనేత సమూహాలను ఏర్పాటుచేసి వారికి మగ్గాలు, ముడిసరకును అందించి, కనీస వేతనాలను కల్పించాలి. వృత్తిపరమైన సౌలభ్యం కోసం మగ్గాలను నవీకరించడంతో పాటు యంత్రాలను సమకూర్చాల్సిన అవసరం ఉంది. చేనేత ఉత్పత్తుల విక్రయాల కోసం మండల, జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో దుకాణాలు ఏర్పాటు చేయాలి. ఇ-కామర్స్, ఆన్‌లైన్ వేదికల ద్వారా విక్రయాలను ప్రోత్సహించాలి. ఆధునిక వస్త్రాల రూపకల్పనలో నేతన్నలకు శిక్షణ ఇవ్వాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న నేతన్నల భీమా పథకంలో గరిష్ట వయోపరిమితిని పెంచాలి, వారి ఆర్థిక స్థితిగతులపై సర్వే జరిపించి జియో ట్యాగింగ్ చేసి ధృవీకరణ పత్రాలు ఇవ్వాలి. ప్రభుత్వం చేనేత రంగానికి పలు ప్రోత్సాహకాలు, అదే విధంగా వారి ఆరోగ్య సంరక్షణకై ప్రత్యేక హెల్త్ కార్డులు అందించాలి. స్వాతంత్ర్య సమరంలో జాతిపిత మహాత్మా గాంధీ నూలు వడికి స్వదేశీ వస్త్రాల తయారీ ఎంత శక్తిమంతమైనదో చాటారు. నేడు చేనేత జెండాలు మచ్చుకైనా కనిపించకపోవడం ఈ రంగం దుస్థితిని చాటుతోంది, కాబట్టి చేనేత ప్రాశస్త్యాన్ని చాటేందుకు ప్రభుత్వాలు కృషి చేయాలి. ప్రభుత్వం చేనేత ఉత్పత్తులపై విధించే జి.యస్.టిని తగ్గించాలి. ప్రముఖ పర్యాటక ప్రదేశాలలో, దేవాలయాల్లో చేనేత కార్మికులు తయారు చేసిన వస్త్రాలు విక్రయించేలా చర్యలు తీసుకోవాలి. చేనేత కార్మికులకు ప్రభుత్వం పెండింగ్ బిల్లులు లేకుండా బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు వెంటనే విడుదల చేయాలి. చేనేతకు అవసరమైన రుణాలు బ్యాంకుల ద్వారా పావలా వడ్డీకి అందించాలి. గ్రామీణ స్థాయిలో ఉపాధి కల్పిస్తూ, పర్యావరణాన్ని కాపాడుతూ ఆర్థిక రంగం మీద భారం పడకుండా మనగలిగే సామర్థ్యం ఉన్న చేనేత రంగం వృద్ధి చెందడం వల్ల, ప్రభుత్వం చాలా తక్కువ పెట్టుబడితో, ఎక్కువ వృద్ధి రేటు సాధించవచ్చు. అందుకే చేనేత రంగంలో ప్రభుత్వ పెట్టుబడులు పెరగాలి.

డాక్టర్ కందగట్ల శ్రవణ్ కుమార్
ఫ్రీలాన్స్ రచయిత, అకడమిక్ కౌన్సిలర్ ఇగ్నో, వరంగల్
ఫోన్ : 9908843592

# లలిత సంగీత పరిమళం

## ప్రసిద్ధ లలితగీత విశ్లేషణ

– డా. ఎమ్. పురుషోత్తమాచార్య

5. రావోయి బంగారి మామా

రచన : కొనకళ్ళ వెంకటరత్నం

సంగీతం, గానం : ఘంటసాల

భీంప్లాస్–ఖండ చాపు

వచ॥పసిడిపొలాల్లో పల్లెపడుచు తన మామకోసం కలవరపడుతూ ఇలా పిలుస్తుంది.

పాట॥రావోయి బంగారి మామా
నీతోటి రాహస్య మొకటున్నదోయి ॥రావో॥

1. నీళ్ళతూరల వెన్క
నిలుచున్న పాటనే
జలజలల్ విని గుండె
జల్లుమంటున్నాది ॥రావో॥

2. అవిసెపువ్వులు రెండు
అందకున్నయి నాకు
తుంచి నా సిగలోన
తురిమిపోదువుగాని ॥రావో॥

3. ఏటి పడవ సరంగు
పాట గిరికీలలో
చెలికాడ! మన వగల్
కలబోసికొందాము ॥రావో॥

**భావం :** ఓ బంగారుమామా! నీతో ఓ రహస్యం చెప్పాలి. నీటితుంపరతో పాటు పాట వినవస్తున్నది. ఆ పాటలోని నీటి గలగలలను విన్న నా గుండె జల్లుమన్నది. చెట్టుమీద తెల్లగా మెరుస్తున్న రెండు అవిసెపువ్వులు నాకు అందడం లేదు. నువ్వొచ్చి వాటిని నా సిగలో తురిమిపోదువుగాని రావోయి. ఏటిమీద పడవలో వెళుతుంటే, పడవను నడిపే సరంగు పాడుతున్న పాట ఎన్నో సంగతులతో సాగుతున్నది. దానిలో మన ప్రేమ సంగతికూడా కలబోసుకుని ఆనందిద్దాం రావోయి, నా బంగారిమామా!

**అర్థాలు :** తూర = తుంపర తురుముట = చెక్కుట సరంగు = పడవ నడిపేవాడు గిరికీలు = గుండ్రంగా తిరగడం వగ = ప్రేమ.

ఈ పాటను సుప్రసిద్ధకవివర్యులు కొనకళ్ళ వెంకటరత్నం రచించారు. వీరు 1909లో పశ్చిమ గోదావరి జిల్లా పెంటపాడులో జన్మించారు. "ఏలూరు సాహిత్య మండలి"ని అభివృద్ధిపరచడంలో బొడ్డు బాపిరాజు, సామవేదం జానకిరామశర్మ మొదలైన వారికి సహకరించారు. వీరి రచనలు బంగారిమామ పాటలు, కథావళి, కొనకళ్ళ కథలు, పొద్దుతిరుగుడు పూలు, ప్రతోళి మొదలైనవి. వీరు జానపదధోరణిలో రచనలు చేయడంలో ఎంతో సమర్థులని పేరెన్నిక గన్నవారు. వీరు రచించిన 'బంగారిమామ పాటలు' పుస్తకంలోనిదే ఈ పాట. మూలంలో ఉన్న ఏడు చరణాలనుండి మూడిటిని మాత్రమే ఘంటసాల గానానికి తీసుకున్నారు. శ్రీ వెంకటరత్నం గారు 1954లో విడుదలైన 'అంతా మనవాళ్ళే' సినిమాలో పాటలు రాశారు. వీరు 1955లో మరణించారు. వీరి 'బంగారిమామ పాటల' గురించి ప్రసిద్ధకవి, రచయిత చలంగారు ఇలా ప్రశంసించారు. "కొన్ని కొన్ని పాదాల్లో ఎంకిపాటల్ని మించిన లయ, విరుపులు, శబ్దంలో సంగీతం, ఎక్కడినించో అపురూప పుష్పాల్ని ఏరి తెచ్చినట్టు ఆ మాటలు, మాటతో మాట ఐక్యం–అంతా ఒక గొప్ప అపురూపమైన, చాలా అందమైన కవిత్వపు పటం" ఈ మాటల్ని చక్కగా రుజువు చేసిన పాటల్లో ఈ పాట ఎంతో ముఖ్యమైనది.

ఈ పాట రచనావిధానమంతా శిష్టవ్యావహారిక శైలిలోనే సాగుతుంది. బంగారి, అంటున్నాది, అందకున్నయి అనే పదాలు మాత్రం జానపద వ్యవహారానికి సరిపోతాయి. పూర్తి గ్రామ్యాన్ని ఉపయోగించక పోయినా ప్రయోగం–భావన జానపదులకు దగ్గరగా ఉండడం విశేషం. తుంపర, జల్లు అనే అర్థంలో 'తూర' పదప్రయోగం కొత్తగా, మెత్తగా, హాయిగా ఉంది. ఆ పల్లెపడుచు సిగలో మల్లెలు, బంతులు, సన్నజాజులు లాంటివి ధరించదట. ముగ్ధమోహనమైన అవిసెపూలను మాత్రమే ధరిస్తుందట. అవిసెచెట్లు పల్లెల్లోనే కానవస్తాయి. ఇప్పుడు అక్కడకూడా దాదాపు కనుమరుగయ్యాయి. అవిసెపువ్వు తెల్లగా, అర్ధచంద్రాకారంలో వంపుదిరిగి

ఉంటుంది. విశేషం ఏమిటంటే, ఈపూలను ఆహారంలో కూడా ఉపయోగిస్తారు. ఈ పువ్వును అవసియ, అగిసె, అగిసియ, అగస్త్య అనే పేర్లతో కూడా పిలుస్తారు. అవిసె విత్తనాలనుండి తీసిన నూనె ఆరోగ్యానికి చాలా మంచిది. ముఖ్యంగా ప్రోస్టేట్ క్యాన్సర్ నిరోధకశక్తి దీనిలో ఉంది. ఈస్ట్రోజెన్, ప్రొజెస్టిరోలను సమతౌల్యపరుస్తుంది కూడ. కవి దీన్ని ప్రస్తావించడంలో గల మరో విశేషం ఏమిటంటే, తెల్లని అవిసెపువ్వంత ఆత్మీయంగా, స్వచ్ఛమైన మనస్సు గలది ఆ పల్లెపడతి అని సూచించడమే. ప్రశాంతమైన ఏటి నీటిపై నౌకావిహారం చేసే అనుభూతి ఎంతో మధురమైనది. అది మాటలకందనిది. ఆ దృశ్యాన్ని రెండో చరణంలో కవి హృద్యంగా చిత్రించారు. పడవ నడిపేవాడు వచ్చీరాని రాగంతో, వినిర్మలమైన హృదయగీతాన్ని ఆలపిస్తున్నప్పుడు అతని పాట గాలిలో కలిసి పల్టీలుకొడుతూ వెళుతుంది. చక్కని శబ్దచిత్రాన్ని వర్ణిస్తూ, జలవిహారానికి జంటగా వెళ్ళే పడుచువారు ఎంత అదృష్టవంతులో గదా! అని అనిపించగలిగే చిన్నపాటి అసూయను కూడా శ్రోతలలో ఈ పాట రగిలించకమానదు.

ఘంటసాల దీన్ని భీంప్లాస్‌రాగం ఆధారంగా, కవి ఉద్దేశించిన ఖండగతిలోనే స్వరపరిచారు. ఈ పాటను రెండు విధానాలతో పరిశీలిద్దాం.

**1) రికార్డుకోసం పాడిన విధానం :** ప్రారంభపు నేపథ్య సంగీతం వేణువుతో సాగింది. దీని చివరలో వచనాన్ని పలికి పల్లవి ఎత్తుకున్నారు. పల్లవిలోని 'రహస్య' పదం ఖండగతికి ఒదగనందువల్ల 'రాహస్య' అనక తప్పలేదు. పల్లవిని ముగించేప్పుడు 'మామా'ను 'పసనిదపా' అంటూ పిలుపును ధ్వనింపజేస్తూ ఎలుగెత్తి పాడారు. మొదటి చరణం మధ్యలో 'పాటనే' దగ్గర అందమైన ఆలాపనను వినిపించారు. 1, 2 చరణాల ఎత్తుగడలో రెండూ సమ శ్రుతిలోనే ప్రారంభమైనా, రెండవ చరణం మధ్యలో 'నాకు' దగ్గర ఆలాపన చాలా క్లుప్తంగా, నిరాడంబర సుందరంగా పాడారు. 2, 3 చరణాలు ముగిశాక ఎత్తుకునే పల్లవిలోని మొదటి పంక్తిని మూడు రకాల సంగతులతో చెప్పుకోతగ్గ వైవిధ్యంతో ఆలపించారు. ఆ మూడు రకాలను జాగ్రత్తగా పరిశీలిస్తే, సంగీతంకోసం కాదు, తన మామకోసం జాలిగా పిలుస్తున్న పడతి అనుభూతి కూడా తెలుస్తుంది. మూడు చరణాల నేపథ్యస్వరసంపుటి, మూడు రకాల సంగతులతో ముచ్చటగా సాగాయి. మూడవ చరణం ఎత్తుగడ, మిగిలినవాటి కన్న భిన్నంగా గాంధారంనుండి ప్రారంభమై, పైషడ్జమంమీద నిలచిపోగా 'గిరికీలలో' దగ్గర భీంప్లాస్ రాగాన్ని తన కిష్టమైన వివిధ సంగతులతో నిజంగానే గిరికీలు కొట్టించారు. అందుకోసం 18 ఆవర్తాలను ఉపయోగించుకున్నారు. దీన్ని వింటున్నప్పుడు పల్లెపడుచు, ఘంటసాల కనిపించరు. పడవను నడిపే నావికుడు ఎడమచేతిని ఎడమ చెవికి ఆనించుకుని, తల పైకెత్తి, ఎలుగెత్తి ఆలపిస్తున్న దృశ్యం మన మనస్సంతా వ్యాపిస్తుంది. పాట ముగింపులో 'రావోయి బంగారి మామా' అని సాకీగా పాడుతున్నప్పుడు, ఇంత పిలిచినా రాని మామ మీద చిరు అలుకను చూపిస్తూ, బుంగమూతిపెట్టి, ముఖం తిప్పుకుంటున్న పల్లెపడుచు రసికహృదయాలకు ఖచ్చితంగా కనిపిస్తుంది. అదీ ఘంటసాల ప్రతిభ.

**2) కలకత్తా కచేరీలో (1970) పాడిన విధానం :** రికార్డులో అయితే క్లుప్తసౌందర్యం తప్పకుండా కావాలి. కాని కచేరీలో స్వేచ్ఛావిహారం ఉంటుంది. అందుకే పాట ముందు వ్యాఖ్యానాన్ని కొంచెం పొడిగించి, మూడు వాక్యాలుగా పలికారు, ఇలాగ.... " పల్లెటూరులో పల్లెపడుచు పచ్చిక బయళ్ళలో పని చేసుకుంటుండేటువంటి తన మాంవ కోసం అన్నం తీసుకువెళుతుంది. మామ అక్కడ కనిపించక పోయేసరికి మనసులో చాల బాధ చెందింది. ఏది కదిలినా తన మాంవ వస్తున్నాడని భ్రాంతితో పాడుతున్నది"

పాఠకులు ఈ వ్యాఖ్యానభేదాన్ని గ్రహించివుంటారు. సన్నగా, సరదాగా నవ్వుకుంటారుకూడా. ఎందుకంటే,మన ఘంటసాల ఎంత అమాయికుడో గదా మరి! మద్రాసు పంటపొలాల్లో పనిచేసే మామ కాస్తా కలకత్తా వెళ్ళాక పొలాలు లేక పచ్చికబయళ్ళలో పారాడుతున్నాడు. అక్కడ చేసే పనేముంది? అని మనకు గమ్మత్తైన నవ్వు రాకమానదు. కాని పల్లెపడుచు మాత్రం అక్కడైనా, ఇక్కడైనా ఘంటసాలే కదా! కలకత్తాలో పిలుపు మరింత విస్తృతమైంది. వ్యాఖ్యానంలో దీర్ఘం తీయకుండా 'రహస్యం' అని పలకడం ఒక విశేషం. దీన్నే పల్లవిని సాకీగా పాడుతున్నప్పుడు కూడా అనుసరించారు. 'రావోయి' అని రెండోసారి మెలికతిరిగిన సంగతితో అలంకరించారు. ఈ సాకీ కాగానే శహనాయి

స్వరాలను అందంగా వినిపించారు. మొదటి చరణాన్ని కూడా సాకీగా కొనసాగిస్తూ 'జలజలల్ విని' బదులు 'జలజలల్‌మని' పలకడం స్వేచ్ఛావిహార ప్రభావమే. అయితే 'జలజలల్' పదాన్ని 'పపగసా' అనే స్వరాలతో అర్థస్ఫురణను కలిగిస్తూ పాడడం సరిక్రొత్త విశేషం. దీని తరువాత మొదటి పంక్తిని పక్కా లలితసంగీతంలో ముంచెత్తారు. సాకీ తరువాత పాట ప్రారంభించారు. కాని రెండవ చరణం ముందరి నేపథ్యసంగీతం కాగానే పాటను టక్కున ఆపి మాటలు మొదలుపెట్టారిలా......

"మాఁవ వచ్చేసరికి చాలా అందంగా కనిపించాలని మనసులో ఒక భ్రాంతి చెంది, పచ్చికబయళ్ళలో కనిపించేటువంటి పువ్వులేవీ కనిపించకపోతే, ఆకాశంలో ఉన్నటువంటి పువ్వులను చూచి, దూరంలో ఉన్నటువంటి పువ్వులను చూచి, అవిసె పువ్వులను చూసి, అవి తలలో తురుముకుని కనిపిస్తే బాగుంటుందని అనుకుంటూ, నిజమైనటువంటి పల్లెపడుచు కాబట్టి,అవికూడా తన మాఁవ వచ్చి తలలో తురిమితే చాలా బాగుంటుందని చెప్పనుకుంటూ..." అని ఆపారు. రెండవ చరణం మొత్తాన్ని భావాత్మకంగా సాకీలోనే పాడి లయతో చరణాన్ని ఎత్తుకోవడం చమత్కారంగా ఉన్నా, చక్కని వైవిధ్యంతో శ్రోతలను ఆకట్టుకునే విధంగా అపూర్వంగా సాగింది. అంతేకాదు, ఈ ధోరణి పాట పాడుతున్నట్లుగా కాక పద్యం పాడుతున్న పోకడలో వినిపించడం మరీ ఆకర్షణీయంగా ఉంది. ఇదే విధానం మూడవ చరణానికీ అనుసరించడం జరిగింది. ఈ చరణం మూడవ పంక్తిలో 'మన సొదల్' అని మూలంలో ఉన్నది. 'వగల్' అని ఎలా చేరిందో పరిశోధించవలసి యున్నది. ("బంగారిమామ పాటలు" జయంతి పబ్లికేషన్స్, విజయవాడ-4వ ఎడిషన్-2000సంగి). మూడవ చరణం నేపథ్యసంగీతం కాగానే "అందంగా అలంకరించుకుని మామ వచ్చిన తరువాత, హాయిగా షికార్లు కొడదామనుకుంటూ ఉంటుంది. ఎలా?......" అని వ్యాఖ్యానించారు. తరువాత చరణం అంతా సాకీగా పాడి, మళ్ళీ లయలోకి వచ్చి మనోహరంగా ముగించారు. వేదికమీద అప్పటికప్పుడు చెప్పిన వ్యాఖ్యానం కనుక వాక్యాలలో ప్రస్ఫుటత లేకున్నా పల్లెపడుచు హృదయాన్ని మాత్రం ఘంటసాల అద్భుతంగా ఆవిష్కరించారు. ఇది 1951-52లో రికార్డుగా విడుదలైంది.

**6. నిన్ను నేను మరువలేనురా**

**రచన : సముద్రాల వేంకట రాఘవాచార్యులు**

**సంగీతం, గానం : ఘంటసాల**

**హరికాంభోజి-తిశ్ర గతి**

**పంచదారవంటి పోలీసెంకటసామి!**
**నిన్ను నేను మరువలేనురా**
**ఓ వాలుకన్నుల మువ్వలెంకటసామి! ॥నిన్ను॥**

**1. నీకు వచ్చింది కోరమీసం**
**నాకు వచ్చింది దోర వయసు**
**ఇద్దరి మనసు ఒక్కటైతే హాయ్**
**యెనకసింత లేని బతుకె యెంకటసామి! ॥నిన్ను॥**

**2. కన్ను కన్ను కలిసిందోయ్**
**నిన్ను నన్ను కలిపిందోయ్**
**ఈడనున్న నేనేడనున్న నీ నీడనేనోయ్**
**పోలీసెంకటసామి! నిన్ను నేను మరువలేనురా**
**నా వాడవేనోయ్ పోలీసెంకటసామి!**
**సందు లేదు మనకు సందమామ తోడు ॥నిన్ను॥**

**భావం :** పంచదారలాంటి తీయని మనసున్న పోలీసు వెంకటస్వామీ! నిన్నెప్పటికీ మరువలేను. వాలుగన్నులతో అందంగా ఉన్న నిన్నసలే మరువలేను. మువ్వల వెంకట స్వామీ! నీకు,నాకు దోరవయసు వచ్చేసింది. మన ఇద్దరి మనసులు ఒక్కటైతే ఏ చింతా లేని బతుకవుతుంది. ఒకరి చూపులొకరితో కలిసిపోయాయి. ఎక్కడున్నా నీకు నీడగా నేనుంటాను. చందమామ సాక్షిగా మన కెప్పటికీ ఎడబాటు లేదు. చిత్రసీమలో మకుటం లేని సాహిత్యసార్వభౌమునిగా ప్రకాశించిన సముద్రాల సీనియర్ ఈ పాటను రాశారు. "పోలీసెంకటసామి, ఎనకసింత, ఈడ, ఏడ, సందమామ" అనే పదాలు మాత్రమే గ్రామీణుల యాసను ప్రతిబింబిస్తున్నాయి. మిగతాదంతా శిష్ట వ్యావహారికపు లలితగీతధోరణిలో సాగుతుంది. మేష్టారి జానపదబాణీ వలన దీనికి 'జానపదగీత' స్థాయి ఏర్పడిందని విజ్ఞులు చెబుతారు. పోలీసెంకటసామి పాత్రను జానపదులు సృష్టించారు. జానపదులు ముద్దుగా పిల్చుకున్న పాత్ర 'పొన్నకాయవంటి పోలీసెంకటసామి'. ఆచార్యులవారు పొన్నకాయను పంచదార చేసేశారు. అంతేకాదు, ఇతగానికి 'మువ్వలు' కూడా చేర్చారు. అప్పుడు ఆయన 'మువ్వ లెంకటసామి'గా మారిపోయాడు. మువ్వలు ఇంటిపేరో,

లేక చేతికెప్పుడూ మువ్వలు కట్టుకుని తిరుగుతాడో! శ్రోతలే ఊహించు కోవాలి. ఇతని పేరుతో డా॥దాసరి నారాయణ రావుగారు ఒక సినిమా తీయడం, 'పోలీసు ఎంకటసామి నీకు పూజారయ్యాడు' (తొలికోడి కూసింది) అనే పాట పుట్టడం ఈ పాత్ర సజీవచైతన్యానికి తార్కాణాలు. ప్రియుని మనసును పంచదారతో పోల్చడం, ఆడవాళ్ళలాగా 'వాలుకన్నుల వాడు' అనడం సముద్రాలలోని ప్రయోగ విశేషాలు. మొదటి చరణంలో 'ఎనక సింత లేని' అనే మాటను ప్రయోగించారు. ఇది భావకవిత్వ అవశేషం. ఈ మాటను రెండు రకాలుగా వ్యాఖ్యానించవచ్చు.

1. వెనుక, వెనక, వెన్క, యెన్క, యెంక-అనేవి రూపాంతరాలు. అటువెనుక అంటే ఆ తరువాత. ఇదే తెలంగాణాలో 'అటెంక' అయింది. వెనుక, యెనక అంటే 'తరువాత' అనే అర్థంలో, ఇద్దరం ఒక్కటైన తరువాత జీవితం చింత లేకుండ సాగాలి, అనే భావాన్ని చెప్పుకోవాలి.

2. 'యెనక సింత' వెనుకటి చింత. ఇదివరకు-అంటే గతజన్మలో మనవెవరవెూ అనుకోవడం కాని, ఇంతకుముందు మనం ఎవరికివారుగా ఒక్కరమే,అన్న చింత మానేసి కొత్తగా ఒకరికొకరం బ్రతుకుదాం అని కూడా చెప్పుకోవచ్చు. ఈ రెంటిలో ఏదైనా భావించవచ్చు. రెండూ శాశ్వతప్రేమకు సాక్ష్యాలే. 'కన్నుకన్ను కలిసింది, నిన్ను నన్ను కలిపింది' అన్న పంక్తుల్లో సంక్షిప్త ప్రేమాయణం శక్తిమంతంగా కనిపిస్తుంది. సినారె రాసిన "కనులు కనులు కలిసెను (మురళీకృష్ణ), పింగళి రాసిన 'చూపులు కలిసిన శుభవేళ' లాంటి పాటలన్నీ ఈ ధోరణిలోనివే. మనమెప్పటికీ విడిపోము అనడానికి ముగ్ధమనోహరపదప్రయోగం చేశారు. ఏమని? "సందు లేదు మనకు" అని, పైగా చందమామ అందుకు సాక్ష్యమట. సాహితీరస భరితక్షీర సముద్రాలలో అన్నీ ఇలాంటి మధుర తరంగాలే ఊయలలూపాయి. ఘంటసాల ఈ పాటను అచ్చమైన హరికాంభోజి రాగంలో బాణీ చేశారు. అదే విచిత్రం. శుద్ధమైన శాస్త్రీయరాగాన్ని జానపదులు పాడుకునేంత సులభశైలిలోకి లాక్కువచ్చి, జానపదుల కలవాటైన ధోరణిలోనే స్వరపరచడమే కాకుండ ఆ పోకడతోనే పాడడం మెచ్చదగిన అంశం. ఇలాంటి ప్రయోగాన్ని అందరూ చేయలేరు. శాస్త్రమూ, లౌక్యమూ రెంటిలోనూ ప్రావీణ్యమున్న ఘంటసాలలాంటి వారికే సాధ్యమని ఈ పాట నిరూపిస్తున్నది. ప్రారంభనేపథ్య సంగీతంలో వేణువు, క్లారియొనెట్ వాద్యాలు "గగప రిరిగసా" అనే స్వరాలను గమకరహితంగా, సాఫీగా వినిపిస్తూ ఉండగా వయొలిన్స్ కౌంటర్‌తో లీలగా అనుసరించడం ఆహ్లాదకరంగా ఉంది. వాద్యాలన్నీ గాంధారం మీదికి వాలి, పల్లవిని ఎత్తుకోవడానికి దోహదం చేశాయి. ఈ స్వరరచన అంతా జానపదగీతం కోసం, లలితసంగీతధోరణిలో, పాశ్చాత్య సాంప్రదాయిక స్పర్శను కలుపుకొని సాగడం గొప్ప విశేషం. చరణాల ముందు సమకూర్చిన బిట్‌వర్క్‌ను ఒకే తీరుగా ఉంచారు, ఏమీ మార్చలేదు. 'ఓ' అనే సంబోధన మీద గమకంలో ఘంటసాల స్వరసంతకం ప్రస్ఫుటంగా కనిపిస్తుంది. 'ఇద్దరిమనసు ఒక్కటైతే' లోని 'ఇ ఒ' అక్షరాలమీద రెండవ చరణంలో 'ఈడనున్న నే నేడనున్న' లోని 'ఈ నే నీ' అక్షరాలమీద ఇచ్చిన డోలక్ దెబ్బ మనసుకు చురుకైన ఉత్సాహాన్ని ఇస్తుంది. మొదటి చరణంలోని చివరి పాదంలో 'యెనక సింత లేని' ని పాడే స్వరాలను గమనించండి.

పపదా సారీ రీగా
యెనకా సింతా లేనీ

వెనుకటి చింత మానేసి ముందుకు దూసుకుపోతున్న స్వరాలు కనిపించి మురిపిస్తాయి. రెండవ చరణాన్ని పొందించిన తీరు మరీ ఆకర్షణీయంగా ఉంది. 'కన్ను కన్ను కలిసిందోయ్' పంక్తిలో కళ్ళు కలుసుకున్న ఉదాత్తత కనిపిస్తుంది. 'నిన్ను నన్ను కలిపిందోయ్' అనే పంక్తిని ఎలుగెత్తి పాడుతున్నప్పుడు వాస్తవాన్ని ప్రియునికి గుర్తు చేయడంతోబాటు పట్టరాని సంతోషమూ వ్యక్తమవుతుంది. ఈ చరణంలోనే మొదటి రెండు పాదాలు పాడి, తెగ్గొట్టి పల్లవి అందుకోగానే చరణం అయిపోయిందిఅనుకుంటాం. కాని వెంటనే 'నా వాడవేనోయ్' అంటూ మిగతా భాగాన్ని అసలు సిసలైన 'జానపదఫక్కీ'తో పాడి అందంగా ముగించడం అపూర్వసృష్టి. లలితసంగీత స్వరరచనలో ఇలాంటి ప్రయోగం ఎవరూ చేసివుండరని పిస్తున్నది. 'సందులేదు' అనే పంక్తిని నిజంగానే ఏమీ ఎడంలేకుండా బిగింపుగా పాడి పాట భావాన్ని సుందర శిల్పంలా నిలబెట్టిన ఘంటసాల పరమధన్యులు. ఈ పాటను 1950లో నటి, నిర్మాత, గాయని సి.కృష్ణవేణి నిర్మించిన 'మన దేశం' చిత్రంలో జిక్కి ఆలపించి గాయనిగా సినీరంగంలోకి ప్రవేశించిందని సినీపండితులు చెప్పారు.

'గపస' అనే స్వరసంపుటితో వాద్యాలు ఈ పాటను ముగించాయి. ఇది సుమధురగీతాలకుండే ఒక సుసంపన్న స్వరసంప్రదాయం. నిజానికి ఘంటసాలకు ఇలా బిట్‌తో పాటను ముగించడం ఎక్కువగా ఇష్టం ఉండదు. ఆయన, పాటలను ముగించే పద్ధతులు మూడు రకాలుగా ఉంటాయి.

1. వాద్యాల బిట్స్‌తో (చాలా తక్కువ)
   ఉదా॥ ధరణికి గిరి భారమా:-మంచిమనసుకు మంచిరోజులు
   తీయని ఊహలు :-పాతాళభైరవి.
   అల్లిబిల్లి ఆటలే :-మాయాబజార్
   సరసన నీవుంటే :-శకుంతల
2. సాకీతో(కొన్ని)
   కలనైనా నీ వలపే :-శాంతినివాసం
   పెళ్ళి చేసుకుని:-పెళ్ళిచేసి చూడు
   పలుకవేలనే :-షావుకారు
3. ఆలాపనలతో (చాలా ఎక్కువ)
   విరిసె చల్లని వెన్నెల :- లవకుశ
   ఇదిగో వచ్చితి :- పరమానందయ్యశిష్యుల కథ
   ఊహలు గుసగుస :- బందిపోటు
   చికిలింత చిగురు :- చిరంజీవులు
   అందమె ఆనందం :- బ్రతుకుతెరువు
   హిమగిరి సొగసులు :- పాండవవనవాసం

ఆలాపనతో పాటను ముగించడమంటేనే ఆయనకు చాలా ఇష్టం. వాద్యాల ఆర్భాటంతో ముగించడం వల్ల పాటమీది నుండి దృష్టి మళ్ళవచ్చునని అనుకొనియుండవచ్చు. అయితే వాద్యాల బిట్స్‌తోనే ఎక్కువగా పాటలను ముగించడంలో పెండ్యాల, రాజేశ్వరరావు మొదలైనవారు సిద్ధహస్తులు. వారి పాటలు ఈ పద్ధతిలో ఎన్నో ప్రజాదరణ పొందాయి. అదొక అందం. ఏది ఏమైనా ఘంటసాలగారి మార్గం పూర్తిగా విభిన్నమైనది. మి

డా. ఎమ్. పురుషోత్తమాచార్య
*(జాతీయ పురస్కార గ్రహీత)*
నల్లగొండ. ఫోన్ : 939 661 1905.

## రంగుల పరదా

ఇది సోమర్ సెట్ మామ్ The painted veil తెలుగు అనువాదం. తెలుగులో బీనాదేవి అనువాదం చేశారు. చాలా తాత్వికతతో కూడిన నవల. చదివిన తర్వాత కిట్టీ, వాల్టర్, మదర్ సుపీరియర్, వాడింగ్టన్ పాత్రలు మనలను వెంటాడతాయి.. నవల చైనాలో జరుగుతుంది. ఇందులో ఒక పరిశీలన ఉంటుంది. యుకె వారికి పుట్టిన గడ్డపై ప్రేముండదుట.. ఫ్రెంచ్ వారికి విపరీతమైన ఇష్టముంటుందిట.. మామ్ పారిస్‌లో పుట్టడం దానికి కారణమా అన్న అనుమానం కలుగుతుంది. ఆకర్షణ కన్నా నిజాయితీకి విలువెక్కువ అంటారు ఒకచోట శరత్ బాబు నవలను తెలుగులో చదివినట్టుంటుంది.. రచన అంత దగ్గరగా అనిపించటానికి చైనాలో ఎక్కువ భాగం కథ సాగటం కారణమేమో అనువాదంలో సంభాషణలు వరకు బానే ఉన్నాయి. కొన్ని అతకలేదు.. ఈ వాక్యం చూడండి.




"అతని సవ్యనియంత్రణ సిగ్గువల్ల అనవచ్చు" ఏమన్నా అర్థమయిందా కిట్టీ పాత్ర వయసు ఇరవై ఐదు సంవత్సరాలు.. పదే పదే ఆవిడ.. ఆవిడ అని అనువాదకురాలు సంబోధిస్తారు.. కొంత కన్ఫ్యూజన్‌కు గురవుతాం.. ఇలాంటి పంటికింద రాళ్ళు నవల డెప్త్ నేమీ తగ్గించవు.. పాత్రలను బలంగా చిత్రించటం అందరికీ సాధ్యం కాకపోవచ్చు.. అందుకే వెంటనే ఇంగ్లీష్ మూలం చదవాలనిపిస్తుంది.."మామ్" ఎందుకు అందరికి మామ్ (Mom ) లాంటి వాడు అని ఆర్ద్రంగా అనిపించక మానదు..

*సోమర్ సెట్ మామ్ "రంగుల పరదా", అనువాదం: బీనాదేవి, వెల: రూ. 100, పేజీలు 144,*
*ప్రతులకు : సాహితి, ఫోన్ : 0866-2436642/43*

*- సి.ఎస్. రాంబాబు, ఫోన్ : 8374818961*

# ట్యునీసియా - 1

- డా. నిమ్మగడ్డ శేషగిరి రావు



'బార్డో మ్యూజియమ్ - ట్యునీసియా

**2010** ఏప్రిల్ నెలలో అనుకుంటాను మా మిత్రబృందమంతా కలసి, ఆసియా ఖండపు పశ్చిమ కొనలో, మధ్యధరా తీరంలో ఉన్న లెబనాన్, సిరియా, జోర్డాన్ దేశాలను కలయజూసి వచ్చాము. ఈ ట్రిప్‌లో, జోర్డాన్ దేశంలో ఉన్న జెరాష్ నగరం నాకు బాగా గుర్తుండిపోయింది. ఇదొక శిధిలమై పోయిన పురాతన రోమన్ నగరం. 2000 సంవత్సరాల నాడు రోమన్లు నిర్మించిన భవంతులు ఇక్కడ నన్ను ప్రత్యేకంగా ఆకట్టుకున్నాయి. ముఖ్యంగా వీటి అంతర్భాగపు నేల మీద, గోడల మీద వివిధ వర్ణాల్లో ఉన్న చిన్న చిన్న పింగాణీ ముక్కలను వాడి, రంగు రంగుల చిత్రాలను సృజించిన వైనం నాకెంతో నచ్చింది. ఇది మొజాయిక్ కళ. రెండు వేల సంవత్సరాల నాడే రంగులతో మెరిసే పింగాణీని తయారు చేయటం, మళ్ళీ వాటి ముక్కలను పేర్చుతూ రూపొందించిన దృశ్య రూపాలను తన్మయంగా చూస్తున్న నన్ను గమనించిన నా మిత్రుడు మోహన్, నన్ను తప్పని సరిగా ట్యునీసియా వెళ్ళమని ప్రోత్సహించాడు. ఈ కళ పరాకాష్టకు చేరుకున్న ప్రదేశం, 'బార్డో మ్యూజియమ్' ట్యునీసియాలో ఉన్నదట. బహు పురాతనమైన ఉత్తమ స్థాయి మొజాయిక్ కళను చూడాలనుకుంటే ఇక్కడికి వెళ్ళవలసిందేనట.

ఈ విషయం తెలుసుకున్నప్పటి నుండీ, ఈ కళ గురించి, ఈ దేశం గురించి మరింత తెలుసుకోవటం మొదలుపెట్టాను. తెలుసుకున్న కొద్దీ, ఇంకా ఇంకా తెలుసుకోవాలనే ఆరాటం, ప్రత్యక్షంగా చూసి రావాలనే తమకం రోజు రోజుకూ ఎక్కువౌతూ వచ్చాయి. చివరకు, 2014 డిసెంబరు నెలలో, మా ఏడు సంవత్సరాల కవల పిల్లలకు శీతాకాలం సెలవులు ఇచ్చినప్పుడు, మేమంతా కలసి ట్యునీసియా వెళ్ళటం జరిగింది. ఇంగ్లండు వాసులకు ట్యునీసియా వెళ్ళటం ఒక చక్కని విహారయాత్ర. ముఖ్యంగా కుటుంబమంతా కలసి ఆనందించగలిగే విహార యాత్రగా ఇది బాగా ప్రాచుర్యంలో ఉంది కూడ. పైగా కొద్దిరోజులకు మాత్రమే వెళ్ళే బ్రిటిష్ వారికి వీసా కూడ అవసరం లేదు. మూడు గంటల విమాన ప్రయాణ దూరంలో, మధ్యధరా తీరంలో అందుబాటులో ఉన్న అందమైన ట్యునీసియా, నన్నే కాకుండా, నా భార్యా పిల్లలను కూడ సూదంటురాయిలా ఆకర్షించుకుంది.

మహా ద్వీపం లాంటి ఆఫ్రికా ఖండపు ఉత్తర భాగంలో, ప్రధానంగా కనపడే సువిశాల దేశాలు అల్జీరియా, లిబియా. ఈ రెండు పేర్లూ సమాచార ప్రసారాలలో చాలా సార్లు మనకు వినపడుతూనే ఉంటాయి. వీటిని విడి విడిగా ఉంచటానికి దిగవేసిన సన్నటి చెక్క ముక్కలా కనపడేదే ట్యునీసియా. రాజధాని ట్యునిస్ వద్ద, దేశం, మధ్యధరా సముద్రంలోకి ముక్కు సారించిన పక్షిలా కనపడుతుంది. ఇక్కడ నాకు తోచిన మరొక విశేషం చెప్పాలనుకుంటున్నాను. భూగోళాన్ని నైసర్గికంగా పరిశీలించినప్పుడు అటు మంగోలియా నుండి, ఇటు ఆఫ్రికా పడమటి అంచు వరకు, అక్కడితో ఆగకుండా, అట్లాంటిక్ సముద్రం దాటుకుని ఉత్తర అమెరికా ఖండంలో అరిజోనా, న్యూ మెక్సికో ప్రాంతం వరకు, భూ మాతకు పట్టెడలా ఒక జేగురురంగు పట్టీ కనపడుతుంది. దీనికి మధ్యలో, ఏర్పరచిన పతకం సహారా ఎడారి. ట్యునీసియా దక్షిణ భాగం సహారా ఎడారిలో భాగం. కాని మధ్యధరా సముద్రాన్ని ఆనుకుని ఉన్న ఉత్తర ట్యునీసియా పచ్చగానే ఉంది.

లండన్ గాట్విక్ విమానాశ్రయం నుండి, ట్యునీసియా లోని హమ్మామెట్ పట్టణపు, ఎన్ఫిధా అంతర్జాతీయ విమానాశ్రయానికి మూడున్నర గంటల ప్రయాణం. ఈ దోవలో ఫ్రాన్స్, స్పెయిన్ దేశాల ఆకాశపు సరిహద్దులు దాటుకుంటూ, మధ్యధరా సముద్రం మీదుగా మేమంతా ట్యునీసియా చేరిపోయాము. విమానాశ్రయం నుండి కొంత టాక్సీ ప్రయాణం తరువాత, మా హొటల్, 'మెరీనా బెలిసెయిర్ అండ్ థలాస్సో' చేరిపోయాము. హమ్మామెట్ ఒక మంచి వినోదాల నగరం. మా హొటల్ సముద్రపు టొడ్డున, నిండు నీలపు సముద్రం నుండి తన అస్థిత్వాన్ని ప్రకటించుకోవటానికా! అన్నట్లు తేట తెలుపుగోడలతో ఉన్నా, సముద్రుడికి స్నేహ హస్తం చాచినట్లు, నీలపు రంగు కిటికీలు, తలుపులతో చుట్టూ ఉన్న ప్రకృతిలో భాగంలా కనిపించింది. సకల సౌకర్యాలతో పాటు పరిశుభ్రమైన ఇసుక నిండిన బీచ్ అందుబాటులో ఉండటం మా అమ్మాయిలిద్దరికీ బాగా నచ్చేసింది. ఒక మంచి బీచ్ హాలి డే కోసం వాళ్ళు చాలా రోజుల నుండి ఎదురు చూస్తున్నారు కూడ. వాళ్ళ కోసం, మేము ఈ పది రోజుల కాలంలో ఎక్కువ భాగం హొటల్ లో విశ్రాంతిగా ఉండి, తనివితీర ఇసుకలోనూ, సముద్రపు అలలతో ఆడుకుంటూ సేద తీరాలని తీర్మానించుకున్నాము. సందర్శనా స్థలాలకు వెళ్ళటం అప్పటికి మా ప్రధాన లక్ష్యం కాదు.

ఉత్తర ఆఫ్రికాలోని మిగతా దేశాలతో పోలిస్తే ట్యునీసియా చాలా చిన్నది. యునైటెడ్ కింగ్డమ్ వైశాల్యంలో మూడింట రెండు వంతులు ఉంటుంది. జనాభా దాదాపు 12 మిలియన్లు. ఇక్కడి అధికారిక భాష అరబిక్. కాని ఫ్రెంచ్ భాష కూడ విరివిగా వినపడుతూ ఉంటుంది. అనుకున్నట్లే ఒక రోజంతా మా హొటల్‌ను మా ఇల్లుగా మార్చేసుకునే ప్రయత్నంలో మునిగి తేలాము. పిల్లలతో ఇటువంటి చోట, మనం కూడ పిల్లలుగా మారవలసిందే. కాని రెండో రోజు అందరికీ, దగ్గరలో చుట్టూ ఉన్న ప్రదేశాల విశేషాలు చూడకుండా ఎట్లా? అనిపించింది. ఉదయాన్నే వచ్చేసే విధంగా ఒక కారు పురమాయించుకున్నాము. మా డ్రైవరు హటెమ్ పొద్దున్నే ఎనిమిదిన్నరకల్లా వచ్చేశాడు. దానికంటే ముందే మా పిల్లలు రెడీ అయిపోయారు. మమ్మల్ని ఆ రోజంతా ట్యునీసియా రాజధాని, ట్యునిస్ నగరంలోనూ, కార్తేజ్ నగరపు శిధిల వైభవాలలోనూ తిప్పి చూపించటానికి, హటెమ్ తళతళలాడే నిస్సాన్ కారు తీసుకువచ్చాడు. కారు ప్రయోజనం ఒకచోటు నుండి మరొక చోటుకు చేర్చటమే అయితే ఏ కారయినా ఒకటే. కాని మార్గాయాసం తెలియకుండా కుటుంబ సమేతంగా రోజంతా తిరగటానికి ఇటువంటి కారుంటే చాలు, ముఖ్యంగా మా పిల్లలకు. వయసుకు, సుమారు ఏభైల మధ్యలో ఉన్నట్టు కనిపించే హటెమ్‌ను చూడగానే 'ఎక్కడో చూశామే', అనిపించింది. అతనిని చూస్తే ఎవరికైనా ఇట్లానే అనిపిస్తుందనుకుంటాను. ముఖం మీద చక్కని చిరునవ్వుతో ఎదుటి వారి హృదయాన్ని తాకటం అతనిని చూసి నేర్చుకోవాలనిపించింది. ఇంగ్లీషుతో పాటు, అరబిక్, ఫ్రెంచ్ మంచినీళ్ళ ప్రాయంగా మాట్లాడుతున్నాడు హటెమ్. ఆయా దేశాల నుండి వచ్చిన వేలాది టూరిస్టులతో సహవాసానికి ఇది నిదర్శనమనుకుంటాను. నాకున్న విషయ పరిజ్ఞానాన్ని బట్టి, అతను 'ఇంకొక భాష కూడ మాట్లాడాలే' అనుకుంటూ, అదే అడిగేశాను, "బర్బర్ భాష కూడ వచ్చా" అని. దానికతను, 'ఇక్కడ మొరాకోలో ఉన్నట్లుండదు. ఇక్కడ ఎవరూ బర్బర్ మాట్లాడరు' అని, తను మాత్రం పూర్వపు వలసదారుల (అరబిక్, ఫ్రెంచ్) భాషలు మాత్రమే మాట్లాడతానని నవ్వుతూ చెప్పాడు.

హమ్మామెట్ నుండి ట్యునిస్ 65 కిలో మీటర్ల దూరం. ఒక గంట కారు ప్రయాణం. ఇంతకు ముందు నేను విన్నట్లుగానే, అక్కడ సందడి, హడావుడి చూస్తే పారిస్ వచ్చామా! అనిపించింది. ఈ నగరానికి , 'ఉత్తర ఆఫ్రికా పారిస్' అనే ముద్దు పేరు సరైనదే. ఇక్కడి ఓడరేవు పురాతనకాలం నుండీ నౌకాయానంలో ఆరితేరిన ఫీనిషియన్లనబడే మధ్యధరా ప్రాంతపు తెగవారికి ఆలవాల మయింది. ముఖ్యంగా, శిథిలమైపోయిన కార్థేజ్ నగరానికి ప్రత్యామ్నాయంగా, రోమ్ కు ప్రత్యర్థి నగరంగా నిలబెట్టబడింది.

ఈ ప్రాంతపు కాలపుటలను తిరగేస్తే, దాగి ఉన్న ఎంతో చరిత్ర మన కళ్ళకు కనపడుతుంది. క్రీ.పూ. 264–146 సంవత్సరాల మధ్యలో రోమ్‌కు కార్థేజ్ నగరానికి మధ్య జరిగిన యుద్ధాలలో (ప్యూనిక్ యుద్ధాలు) చివరిది మూడవది అయిన యుద్ధంలో కార్థేజ్ పరాజయం పొందటంతో, ఈ ప్రాంతం రోమ్ అధీనమయింది. గెలిచిన రోమన్లు, కార్థేజ్ నగరాన్ని కొల్లగొట్టారు. మనకు ఈ రోజు చూడటానికి మిగిలినవి ఆ అవశేషాలే. ఇవి

ట్యూనిస్ నగరానికి 24 కి.మీ. తూర్పుగా, చరిత్రకు సాక్ష్యాధారాలుగా నిలచి ఉన్నాయి. భూభాగాలపై ఆధిపత్యం కోసం ఆ కాలంలో నిరంతరం జరిగిన ఎన్నో యుద్ధాల ఆటుపోట్లకు గురైన ప్రాంతం ఇది. గెలిచి ఆ ప్రాంతాన్ని కొల్లగొట్టి, కసిగా కాలరాసిన వారు కొందరైతే, గెలుచుకుని దానిని తీర్చిదిద్ది ఉపయోగించుకోవాలనే వారు మరి కొందరు.

7-8 వ శతాబ్దాల కాలం నాటికి, ఈ ప్రాంతాన్ని కైవసం చేసుకున్న అరేబియా ముస్లిములు ట్యూనిస్ నగర్ ఆవిర్భావానికి పునాదులు వేశారు. క్రీ. పూ. నాలుగవ శతాబ్ద కాలంలో తొలుతగా ఇక్కడ నివాసమేర్పరచుకున్న బెర్బరిస్ తెగ, (స్థానిక ఎడారి తెగలలో ఒకటి) క్రమేణా అరబ్బులకు తలొగ్గి, ఇస్లాముకు సలాము చేశారు. ట్యూనిస్ కొంత కాలం పాటు ఒట్టోమన్ టర్కీ సామ్రాజ్యంలో భాగంగా, తరువాత, స్పెయిన్, ఫ్రెంచివారి వలస ప్రాంతంగా, ఎన్నో దశలను దాటింది. ఆ రోజు మేము చూస్తున్న ట్యూనిస్, 2800 సంవత్సరాల పాటు చిలకబడిన విభిన్న జాతుల, సంస్కృతుల, సామ్రాజ్యాల, మత విశ్వాసాల చిలకరింపును పలకరిస్తూ, కాలపు దారిలో సాగి వచ్చిన అనుభవజ్ఞురాలైన ప్రౌఢలా కనిపించింది నాకు.

మా నగర ప్రవేశానికి స్వాగతం పలుకున్నట్లుగా కనిపించిన హబీబ్ బోర్గిబా వీధి, ఒక ప్రధాన వీధి ఇక్కడ. అదాటున ఇక్కడకు వచ్చిన వారికి పారిస్‌కు వచ్చిన భావం కలగటం సహజం. విశాలంగా పరచుకుని ఉన్న ఈ వీధికి ఇరువైపులా అందమైన భవనాలు, సుశిక్షితులైన సైనికుల్లా బారులు తీరి ఉన్నాయి. నేను చూసిన ఏ ఫ్రెంచి నగరానికి ఇది ఏ మాత్రం తగ్గదు. ఆ వీధి ఒక చివర ఒక విశాలమైన నలు చదరపు కూడలి ఉంది. దీని పేరు, 'ప్లేస్ డి ఇండిపెన్డెన్స్'. హాటెమ్ మమ్మల్ని ఇక్కడ దింపి, ఆ మదీనా ప్రాంతమంతా తిరిగి చూసి రమ్మన్నాడు. అక్కడ వాహనాలకు ప్రవేశం లేదట. చూడటం పూర్తయ్యాక అతనిని కలవటానికి ఎక్కడకు రావాలో కూడ మాకు చూపించాడు. 'జేబు దొంగలుంటారు' లాంటి హెచ్చరికలు కూడ చేశాడు. మదీనా ప్రాంతం చుట్టూ గోడలతో , మధ్య యుగాలకు చెందిన ప్రాంతపు పురాతన తత్వాన్ని తలపిస్తోంది. అక్కడి నుండి అవెన్యూ డి ఫ్రాన్స్‌లో నడుస్తూ, ఒక ఘనమైన గేటు చేరుకున్నాము. దీని పేరు బాబ్ ఎల్ బాహ్రా. ఇది పురాతన మదీనాకు, ఫ్రెంచ్ కాలనీ విభాగానికి (విలె నూవెల్) మధ్య ఉంది. ఈ గేటు, చూడగానే ఆ రెండు విభాగాలకు, వాటితో పాటు ఆవరించి ఉన్న వ్యతిరేక విలువల, విశ్వాసాలకు మధ్య గీసిన గీత లా కనిపించింది. గేటు దాటి లోపలకు అడుగు పెట్టగానే సాంస్కృతిక వాతావరణంలో మార్పు పంచేంద్రియాలకు సోకింది. అరేబియన్ నైట్స్ కథల నేపథ్యంలోకి అడుగు పెట్టిన అనుభవం మొదలయింది కూడ. సమయపాలన పత్తిడులేమీ లేకుండా అక్కడి వీధుల్లో తారట్లాడుతుంటే, ఏదో శకంలో మరో లోకంలో ఉన్న విచిత్ర అనుభూతి, పిల్ల తెమ్మెరలా నన్ను తాకింది. పిల్లలు కూడ మాతో పాటు, ఏదో కలలో నడుస్తున్నట్లు కనిపించటంతో మనసులో నవ్వుకున్నాను. 'ఈ అనుభూతికి వయసుతో పనిలేదు కదా!' అని. ఉన్నట్లుండి మదీనా గేట్లకు ఒక క్రొత్త పరమార్థం స్ఫురించింది. లోపల అంటే మేమున్న చోట ఉన్న వారు, స్థానికులు. యుద్ధ తంత్రంలోనూ, గెలుచుకోవాలనే దుష్టసంకల్పంలోనూ ధృడమైన వాళ్ళు కాదు. వారికి కావలసింది వారిని, వారి పరివారాన్ని, సంపదనూ కాపాడు కోవటం. శక్తిమంతుడైన ప్రత్యర్థిని ఎదుర్కోవటానికి ముందుగా వారిని నిలువరించాలి. దీని కోసమే ఈ గేటు. ఇది బలహీనమైతే అంతా అపజయమే. అప్పుడనిపించింది. గేటు అనేది శత్రు దుర్భేద్యమై నిలబడటం స్వీయ రక్షణకు ఎంత అవసరమోనని. ఏమైనా గేటును ఒక ఇనుప వస్తువుగా యధాలాపంగా చూడటానికి, చరిత్ర తెలుసుకుని దానితో మమేకమవుతూ చూడటానికి ఉన్న తేడా ఇదే. యాత్రల ద్వారా మనసు పొరల లోతును పెంచుకోవటానికి రెండవ మార్గాన్ని నేను ప్రతిపాదిస్తాను.

మదీనాలో దొరకని వస్తువు లేదు. కొన్ని చోట్ల అక్కడికక్కడే వస్తువులను తయారు చేస్తున్నవారి నైపుణ్యాన్ని అభినందించకుండా ఉండలేక పోయాము. కొన్ని షాపులలో తలమీద బల్ల పరుపుగా అమరే టోపీలు కనిపించాయి. వీటిని చెచియాలంటారు. ఎర్రటి టోపీని ధరించటం ట్యునీషియాలో మగవారి సంప్రదాయక వస్త్రధారణలో భాగం. వివాహం లాంటి శుభకార్యాలకు, ఉత్సవాలకు వీటిని తప్పని సరిగా ధరిస్తారని తెలిసింది. అక్కడున్న వేలాది వస్తువులలో ఒంటెల బొమ్మలు, హుక్కా పరికరాలు, లోహపు ప్లేట్లు, రంగురంగుల పింగాణీ టైల్స్ ప్రధానంగా

కనిపించాయి. వీటి మధ్యలో 'హస్తం' ఆకారపు వస్తువులు కనిపించాయి. వీటి మీద ఉన్న చిత్రాలు గోరింటాకు డిజైన్లలా ఉన్నాయని నా భార్య, పిల్లలు అనుకోవటం నేను విన్నాను. దీనిని 'హాండ్ ఆఫ్ ఫాతిమా' అంటారట. ఇది దుష్టశక్తులను దరిచేరనివ్వదని ఇక్కడి వారి నమ్మకం. ఫాతిమా, ప్రోఫెట్ మహమ్మద్ కుమార్తె. ఇక్కడ దుకాణదారుల నుండి తప్పించుకోవటం కష్టమే. ఎంతో మర్యాదగా, 'ఏమీ కొనకపోయినా ఫరవాలేదు. ఒక్కసారి లోపలికి వచ్చి చూడండి' అంటూ ప్రాధేయపడుతున్నట్లు అడిగే వారిని విదిలించుకోలేము. కొన్ని చోట్లైనా లోపలికి వెళ్ళక తప్పలేదు. లోపలకు వెళ్ళాక, చక్కని ఇంగ్లీషులో మమ్మల్ని 'టీ' అయినా త్రాగి వెళ్ళమంటూ చేసిన మర్యాదకు ఆనందపడ్డాము. టీతో పాటు తియ్యని ఖర్జూరాలు కూడ అందించారు. పిల్లలు ఖర్జూరాలను జుర్రుకున్నారు. మామూలుగా అయితే జ్ఞాపికలను యాత్రాంతపు రోజుల్లో కొంటూ ఉంటాము. కాని ఆ సమయంలో అన్నీ కలసి రావటం చేతనో, దుకాణదారుల మాటకారి తనం వల్లనో మా షాపింగ్ మొదటిరోజునే చేసేశాము. కొన్ని మంచి టీ-షర్టులు కూడ దొరికాయి. అప్పుడు పెద్ద పెద్ద బాగులు మా చేతుల్లోకి వచ్చాయి. వాటిని చూపిస్తూ మిగిలిన దుకాణదారుల బారి నుండి తప్పించుకోవటం సులభమయింది.

ఈ ఆటంకాలన్నీ తప్పించుకుని చివరికి మేము చేరాలనుకున్న ఎజ్-జిటోనా మసీదు ప్రాంగణం చేరాము. జిటోనా అంటే ఆలివ్ చెట్టని అర్థమట. ఒకానొకప్పుడు ఇక్కడ పెరిగిన మహత్తుగలిగిన ఆలివ్ చెట్టు జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలపటానికి ఈ మసీదుకు ఆ పేరు పెట్టారట. దీని ఆవిర్భావకాలం 8 వ శతాబ్దమని చెపుతున్నారు. నాలుగు ప్రక్కలా గదులు, నడవాలతో నిర్మించబడిన భవనం మధ్యలో ఆకాశమే పై కప్పుగా ఉన్న ఈ విశాల ప్రాంగణంలో వేలాది మంది ఒకే సారి ప్రార్థనలు చేసుకోవచ్చు. నలు చదరపు భవన సముదాయానికి ఒక మూల, ఒక పెద్ద గది పాటు, 44 మీటర్ల ఎత్తులో ఒకే ఒక మినార్ ఉంది. అది మసీదుకు పహరా కాస్తున్న కాపలాదారుడా! అన్నట్లుంది. ఈ మసీదు పాత బస్తీ (మదీనా) మధ్యలో ఉంది. మదీనాలో అన్ని వీధులు కేంద్రస్థానంలో ఉన్న మసీదు వైపుకు దారి తీస్తున్నాయని మేము గమనించాము. ఆ చిక్కురొక్కురు వీధుల్లో ఎప్పుడైన దోవ తప్పిపోతే, ఈ మసీదు మినార్ వైపు నడచి వస్తే సరిపోతుంది. అక్కడి నుండి మళ్ళీ సరైన దోవను పట్టుకోవటం తేలిక. 8 వ శతాబ్దంలో అరబ్బుల ఆక్రమణ తరువాత, వారు కార్థేజ్ శిథిలాలనుండి స్తంభాలను, శిలలను సంగ్రహించి దీని నిర్మాణంలో ఉపయోగించారట. తీరా అక్కడకు చేరుకున్న తరువాత తెలిసినదేమిటంటే, మసీదు మండువా లోపలకు స్త్రీలకు ప్రవేశంలేదట. మండువా దాటి ఇంకా లోపలకు ప్రవేశం కేవలం ముస్లిం పురుషులకు మాత్రమేనట. నేను కూడ, అక్కడి వారు నన్ను అనుమతించిన మేరకు మాత్రమే వెళ్ళాను. ఇకపోతే, నాకు మాత్రం ఈ మసీదు భవనం కన్నా దానికి ఉన్న చరిత్రే ఎక్కువ ఆసక్తికరంగా అనిపించింది. ట్యునిస్ మదీనా ప్రపంచంలోనే అతి పురాతనమైన మదీనాలో ఒకటి. దీనికి యునెస్కో వారి ప్రపంచ వారసత్వ సంపదగా గుర్తింపు లభించింది. ఇదంతా పూర్తి చేసుకోవడంలో మూడు గంటలు ఇట్టే గడచిపోయాయి. అక్కడ తాజాగా తీసిన దానిమ్మ రసం అమ్ముతున్నారు. దానితో మళ్ళీ శక్తి పుంజుకొని, మళ్ళీ ఆ మదీనా ఇరుకు వీధుల దృశ్యాలు, శబ్దాలను మనసులో నింపుకున్నాము. చాలా చోట్ల ఆ వీధులు పైన కప్పబడి ఉండటంతో, అక్కడ నడవటం పెద్ద శ్రమ అనిపించలేదు. మదీనా నుండి బయటకు వచ్చి చూస్తే, హటెమ్ ఉంటానన్న చోట లేడు. ఏదైనా తినటానికి మంచి చోటు దొరుకుతుందేమోనని, నడుస్తూ యూరోపియన్ సెయింట్ విన్సెంట్ పాల్ కథీడ్రల్ దాటి వెళుతున్నప్పుడు, అక్కడ ఉన్న ఒక విగ్రహం నా దృష్టిని ఆకర్షించింది. అది ఇస్లామిక్ స్వర్ణ యుగ పురుషులలో ఒకనిగా చెప్పబడే ఇబ్న్ ఖాల్డన్ విగ్రహం. ఇబ్న్ ఖాల్డన్, సర్వోన్ముఖ విజ్ఞాన సంపత్తి గల పండితునిగా విశ్వ విఖ్యాతి గడించాడు.



ఎజ్-జిటోనా మసీదు

మధ్యాహ్న భోజనంగా, ఫ్రెంచ్ క్రేప్‌లు (మన అట్లు లాంటివి) తిని, మళ్ళీ హటెమ్‌ను వెతుక్కుంటూ

బయలుదేరాము. ఈసారి అతను కూడ మమ్మల్ని వెతుకుతూ కనిపించాడు. అక్కడి నుండి కార్థేజ్ శిథిలాల వైపుకు కారు పోనిచ్చాడు హటెమ్. మాకు ఒక ఇంగ్లీష్ మాట్లాడే గైడ్ కావాలని హటెమ్‌కు చెప్పాను. అతను వెంటనే కొన్ని ఫోన్లు చేసి, ఒక హిస్టరీ ప్రొఫెసర్ మమ్మల్ని శిథిలాల దగ్గర కలుస్తారని చెప్పాడు. ప్రొఫెసర్ గైడు అంటే పారితోషికం ఎక్కువ అడుగుతారేమోనని నా భార్య భయం వ్యక్తం చేసింది. అంతే కాకుండా మాకు ఒక హిస్టరీ పాఠం లాంటి అనుభవం ఎదురౌతుందేమోనని కూడ బెదురు మొదలయింది. మా మాటలు వింటున్న హటెమ్, “ఈ ప్రొఫెసర్ సుశిక్షితుడైన గైడ్ అని, కేవలం అదనపు ఆదాయం కోసమే ఈ పని చేస్తుంటాడు” అని సర్ది చెప్పాడు.

దోవలోనే ప్రొఫెసర్ గారిని కారెక్కించుకున్నాము. ఆయనకు ముందు సీటు ఇవ్వటానికి మేము నలుగురం వెనుక సర్దుకుని కూర్చున్నాము. ఆయన సాదా సీదాగా ఉన్నారు. పెద్ద ప్రొఫెసర్ అనే అభిజాత్యం నాకేమీ కనపడ లేదు. పరిచయాలు పూర్తైన తరువాత నేను, ట్యునిస్ మదీనా దగ్గర నేను చూసిన ఇబ్న్ ఖాల్దున్ విగ్రహం గురించి ప్రస్తావించాను. దీనితో ఆయనకు ఇష్టమైన విషయాన్ని మేము కదిలించినట్లయింది. ఇస్లామిక్ స్వర్ణయుగం గురించి ఆయనకు ఎంతో అవగాహన, పరిజ్ఞానం ఉన్నాయి. ఆయన చెప్పిన దాని ప్రకారం:

క్రీ.శ. 8-14 వ శతాబ్దాల కాలంలో ఇస్లామ్ విలసిల్లటాన్ని స్వర్ణ యుగమని అంటారు. పశ్చిమంలో స్పెయిన్, మొరాకో లు మొదలిడుకుని, ఆసియా ఖండపు మధ్యభాగంలోనూ, అటు తూర్పున భారత దేశం వరకు విస్తృతంగా వ్యాప్తి చెందిన మహమ్మదీయుల చింతనా విధానం సరి కొత్త విజ్ఞానపు పుంతలు తొక్కింది. మత విశ్వాసాలు, రాజకీయ అడ్డంకులు ఛేదించుకుంటూ శాస్త్రీయ విజ్ఞానం సరికొత్త ప్రతిపాదనలు చేసింది. ఎంతో మంది ఇస్లాం మతస్థులు అనేక రంగాలలో వైజ్ఞానిక తలమానికాలుగా నిలబడ్డారు. వీరిలో చెప్పుకోదగిన వాడు ఇబ్న్ ఖాల్దున్. 14వ శతాబ్దంలో ట్యునిస్ నగరంలో జన్మించి, ఉత్తమోత్తమ విద్యనభ్యసించిన వాడిగా పరిగణించబడిన ఇతని జ్ఞానం, చింతనా సారస్వతం, అతను రచించిన ‘ముకద్దిమా’ అనే పుస్తకం ద్వారా తరువాత తరాల వారికి అందించబడింది. ముఖ్యంగా ఆర్థిక శాస్త్రం, సామాజిక శాస్త్రం, వంటి నూతన అధ్యాయన అంశాల మీద అతనికున్న అవగాహన, ఆధిపత్యం వలన అతనిని ఈ నవీన శాస్త్రాలకు ఆది పురుషుడిగా పేర్కొంటారు. మరీ ముఖ్యంగా చరిత్రను శాస్త్రబద్ధంగా అధ్యయనం చేసే ‘హిస్టోరియోగ్రఫీ’ అనే శాస్త్రానికి బీజం వేసిన పండితుడు, ఇబ్న్ ఖాల్దున్. ఈ నవీన శాస్త్రాల పునాదులు అతను రచించిన ‘ముకద్దిమా’లో మనకు కనపడతాయి. అతని ఆలోచనా విధానాలు ఈ తరపు నాయకులకు కూడ శిరోధార్యంగా నిలబడటం మనం చూస్తాము. ఉదాహరణకు, 1980లో, ఆంక్షలు లేని వ్యాపార విధానాలను ప్రవేశ పెట్టి, అమెరికాకు ఆర్థిక విజయ పరంపరకు కారకుడైన అమెరికన్ ప్రెసిడెంట్, రోనాల్డ్ రీగన్.. తను ప్రతిపాదించిన ‘రీగనోమిక్స్’, ఇబ్న్ ఖాల్దున్ ప్రతిపాదనలు ఆలంబనగా రూపుదిద్దుకున్నవేనని బహిరంగంగా వెల్లడించాడు. ఈ సమాచారం నాకైతే బాగానే ఉంది. కాని నా భార్యా పిల్లల ముఖాలమీద ఈ ప్రొఫెసర్ గారు మరెంత సమాచారం పూసగుచ్చుతారో నన్న భయం, బెరుకు నాకు అర్థమైపోయాయి. అప్పటికల్లా కార్థేజ్ శిథిలాలు చేరిపోయాము. మా ఇద్దరు పిల్లలు, స్కూల్‌లో ‘రోమ్’ గురించి తెలుసుకుంటున్నారని ప్రొఫెసర్ గారికి చెప్పి, రోమ్‌కు కార్థెజ్ శిథిలాలకు ఉన్న సంబంధం గురించి వాళ్ళకు విశదంగా చెప్పమని అడిగాను. దానికాయన క్రీస్తు పూర్వం 814వ సంవత్సరానికి చెందిన ఫీనిసియన్ ప్రిన్సెస్ ఎలిస్సా, కార్థేజ్ నగరానికి శ్రీకారం చుట్టటం గురించి చెప్పటం మొదలు పెట్టాడు. ప్రిన్సెస్ అనగానే మా ఇద్దరు ప్రిన్సెస్‌లు విషయంలోకి దూరిపోయారు. ప్రొఫెసర్ గారికి ఎవరికి ఎలా పాఠం చెప్పాలో తెలుసని మనసులోనే మెచ్చుకున్నాను. తరువాత కథంతా నాకు తెలిసినదే ఐనా, ప్రొఫెసర్‌గారు మా పిల్లలకు చెపుతున్న విధానం నచ్చి మళ్ళీ విన్నాను. ఇదే ఆ కథ:

అనగనగా ఒక రాజ్యం. దాని పేరు టైర్. అది ప్రస్తుత లెబనాన్. క్రీ.పూ. 840 నుండి 832 వరకు టైర్ రాజ్యానికి రాజు, మాట్టెన్ 1. ఆయనకు ఇద్దరు పిల్లలు. కొడుకు పిగ్మాలియన్. కుమార్తె ఎలిసా. ఈమెను గ్రీకు భాషలో ‘డిడో’ అని కూడ పిలుస్తారు. మాట్టెన్ రాజు తన తరువాత తన రాజ్యానికి తన కుమారుడు, కుమార్తె ఇద్దరినీ పాలకులుగా ప్రకటించాడు. ఐతే టైర్ ప్రజలు ఇద్దరు

పాలకులను అంగీకరించలేదు. పాలకులైన అన్నా చెల్లెళ్ళ మధ్య తంపులు పెట్టటానికి ఎన్నో ప్రయత్నాలు జరిగాయి. ముఖ్యంగా, రాకుమారి ఎలిసా, అత్యున్నత మతాధికారి, రాజు తరువాత రాజంతటి వాడైన తన మామ ఆర్చిబాస్ ను పెళ్ళి చేసుకున్న తరువాత, అన్న చెల్లెళ్ళ మధ్య దూరం పెరిగింది. అన్న పిగ్మాలియన్, బావ గారి సంపదమీద కన్ను వేసి, అతనిని అంతం చేయమని అధికారులను పురమాయించాడు. ఆ తరువాత ఎలిసా, ఎక్కడ తన అన్న తనను కూడ హతమార్చుతాడోనన్న భయంతో, అన్న అంతఃపురానికి వచ్చేస్తానని అన్నను అడుగుతుంది. తనతో పాటు అపార సంపదను కూడ వెంట తెస్తుందనే దురాశతో పిగ్మాలియన్ అందుకు అంగీకరిస్తాడు. ఆమెను తీసుకుని రావటానికి ఓడలను పంపుతాడు.

ఆ రాత్రి, తన సంపదనంతా ఒక ఓడ అడుగు భాగంలో భద్రం చేసుకుని, పైన కనపడేటట్లు మాత్రం ఇసుక మూటలను వేసుకుని బయలు దేరుతుంది. సముద్రం లోపలికి వెళ్ళాక ఇసుక మూటలను ఒక దాని తరువాత ఒక దానిని మరణించిన భర్త జ్ఞాపకాలకు అర్పించి, తన నౌకలను సైప్రస్ వైపుకు మళ్ళిస్తుంది. ఆమెను పిగ్మాలియన్ దగ్గరకు తీసుకువెళ్ళటానికి వచ్చిన ఎంతో మంది రాజ సేవకులు కూడ, ఆమె లేకుండా తిరిగి వెళితే తమకు పుట్టగతులుండవని భయపడి ఆమెతోనే ఉండి పోతారు. ఆమెతో పాటు వచ్చిన వారిలో ఎంతో మంది మతగురువులు, ప్రజాప్రతినిధులు కూడ ఉన్నారు. వారంతా సైప్రస్‌కు వెళ్ళి, దీర్ఘ ప్రయాణానికి అవసరమైన ఇంధనాన్ని, ఆహారాన్ని సమకూర్చుకుని, ఎనభై మంది కన్యలను చెరపట్టి, రాకుమారి ఎలిసాతో పాటు వస్తున్న టైర్ పురుషులకు ఇచ్చి వివాహం చేసి, మళ్ళీ సుదూర తీరాలను వెతుక్కుంటూ బయలు దేరతారు. అట్లా ప్రయాణం సాగించిన ఎలిసా, ట్యునీసియా ప్రాంతం చేరుకుని, అక్కడి స్థానికులతో వస్తుమార్పిడి వ్యాపారం సాగిస్తుంది. ఒక వ్యవహారంలో, తన వద్ద ఉన్న ఎద్దు చర్మం పరచటానికి సరిపోయేంత భూమిని అడుగుతుంది. వ్యవహారం ఫైసలా అయిన తరువాత, తన వద్ద ఉన్న చర్మాన్ని పలుచని పొరలుగా వేరు చేసి, మొదట అనుకున్న భూమి కంటె ఎన్నో రెట్లు విశాలమైన భూమిని వశం చేసుకుంటుంది. అందుకే ఈ భూభాగాన్ని బైర్సా (ఎద్దు చర్మం) అని కూడ పిలుస్తారు. ఆమె చాకచక్యానికి ఆకర్షితులై మూల మూలలనుండి ప్రజలు అక్కడికి వ్యాపార నిమిత్తం రావటంతో, అది జనావాస కేంద్రంగా వికసించటం మొదలయింది. అదే కార్థేజ్ ఆవిర్భావానికి తొలిదశ. రాకుమారి ఎలిసా రాకను, ఒక క్రొత్త నగరం ఏర్పాటును అక్కడి స్థానిక బర్బర్ తెగవారు కూడ స్వాగతించారు. నగర నిర్మాణానికి జరిగిన త్రవ్వకాలలో అక్కడ ఒక ఎద్దు తల బయటపడిందట. అది కట్టబోయే నగరానికి అశుభమని భావించి, గుర్రపు తల దొరికిన చోటుకు, తరలిపోయారట.

రాకుమారి ఎలిసా, కార్థేజ్ వంటి మహా నగర ఆవిర్భావానికి కారకురాలై, దానిని సుభిక్షంగా మార్చిన కాలంలో, మాక్సిటాన్లు అనబడే స్థానికుల రాజు హియర్బాస్, తనను వివాహం చేసుకోమని, లేని పక్షంలో యుద్ధం ప్రకటించుతానని, ఎలిసాను బలవంత పెట్టటంతో, తన భర్త పైన తనకి ఉన్న ఎనలేని విశ్వాసాన్ని వమ్ము చేయలేక, అగ్నికి ఆహుతి అయిపోయింది.

ప్రొఫెసర్ గారు ఈ కథ అంతా కళ్ళకు కట్టినట్లు చెపుతూ పోతుంటే, నాతో సహా, మేమంతా వివిధ మానసిక స్థితులను అనుభవించాము. చివరకు మా గుండెలు భారమయ్యాయి. కథ సుఖాంతమైతే బాగుండేదని అనిపించింది. మేము నిలబడి చూస్తున్న ఆ శిథిల ప్రాంతం, 2800 సంవత్సరాల క్రిందట, సాంస్కృతిక కేంద్రంగా ఈ నాటికీ చెప్పుకోబడే రోమ్ నగరపు వైభవంతో పోటీ పడుతూ వెలిగి పోయిన వైనం మా కళ్ళకు కట్టింది. ఆ వైభవాన్ని చూసి కన్నుకుట్టిన రోమన్లు, మూడవ ప్యూనిక్ యుద్ధంలో గెలిచి, నగరాన్ని నేల మట్టం చేసిన హృదయ విదారక మనో దృశ్యాలు కూడ మమ్మల్ని విచలితులుగా చేశాయి. ఆ కాలంలో సుభిక్షంగా ఉన్న కార్థేజ్‌కు, దక్షిణం నుండి బర్బర్లు, సిసిలీ వైపు నుండి గ్రీకువారు, మరో వైపు రోమన్లు ఇలా ఎందరో శతృవులు. మొదటి రెండు ప్యూన్ యుద్ధాలలో గెలుపు కార్థేజ్ దే. ముఖ్యంగా రెండవ ప్యూనిక్ యుద్ధంలో జనరల్ హన్నిబాల్ నాయకత్వాన కార్థేజ్ సేనలు, రోమ్ మీద దండయాత్ర చేసి రోమ్ నగరాన్ని చేజిక్కించుకున్నారు. ఈ యుద్ధ వ్యూహంలో భాగంగా, జనరల్ హన్నిబాల్, తన 60000 మంది సైన్యాన్ని, ఎన్నో ఆఫ్రికన్ ఏనుగులతో సహా, మధ్యధరా సముద్రాన్ని దాటించి, స్పెయిన్ చేర్చి అక్కడి నుండి పిరనీస్ పర్వతాలు,

ఫ్రాన్స్ ఇటలీల మధ్య ఉన్న ఆల్ప్స్ పర్వతాల మీదుగా రోమ్‌కు ఉత్తరంగా ఉన్న భూభాగానికి తరలించాడు. ఈ పని 15 సంవత్సరాల పాటు సాగింది. ఒకానొక మంచి రోజు చూసుకుని, రోమన్లు అప్రమత్తంగా ఉన్న సమయంలో వారి మీద విరుచుకు పడి విజయం సాధించాడు. రోమన్ల దృష్టి ఎప్పుడూ సముద్రం వైపు నుండి దాడి చేసే వారి మీద ఉండేది. నిజానికి అటునుండి ఎవరైనా రోమ్ మీదకు దండెత్తితే గెలవటం అసాధ్యం. ఆ సంగతి తెలిసిన జనరల్ హన్నిబాల్, రోమన్లు ఊహించని విధంగా, ఉత్తరపు వైపు నుండి, రోమ్ భూభాగంలోకి చొచ్చుకు పోయాడు. సుదీర్ఘ కాలం పాటు, అనూహ్యంగా మలచిన ఈ యుద్ధ వ్యూహం, దాని సృష్టి కర్త జనరల్ హన్నిబాల్, చరిత్రలో నిలిచిపోయారు. యుద్ధ వ్యూహ రచనలో అలెగ్జాండర్ ది గ్రేట్, జూలియస్ సీజర్ల సరసన నిలబడగలిగిన వాడు జనరల్ హన్నిబాల్. ఎంత వారికైనా ఎక్కడో అక్కడ అపజయానికి తలొగ్గే పరిస్థితి రావచ్చు. దెబ్బతిన్న రోమన్లు మూడవ ప్యూనిక్ యుద్ధానికి దిగారు. కార్థేజ్ కూలి పోయిన తరువాత జనరల్ హన్నిబాల్, గ్రీస్‌కు వెళ్ళిపోయి, యుద్ధ వ్యూహాల గురించ ఎన్నో పుస్తకాలు వ్రాశాడు. యుద్ధ వ్యూహ పితామహుడిగా గణుతి కెక్కాడు. అతని వ్యూహాలు ఈ నాటికీ మిలటరీ పాఠ్యాంశాలుగా బోధించ బడుతున్నాయి. ప్రపంచ చరిత్ర అంతా, ఒకరి మీద మరొకరు ఆధిపత్యం సాధించటానికి పడిన అవస్థలే. సామాన్య ప్రజలు ఈ యజ్ఞాలకు సమిధలు.

ఈ నాటి ట్యూనిస్ నగరం, కార్థేజ్ అవశేషాలమీద వెలసినదే. కార్థేజ్ అవశేషాలు నగరంలో చాలా చోట్ల కనపడతాయట. ప్రొఫెసర్ గారు అలనాటి చారిత్రక విశేషాలను ఆవాహన చేసి మాకు ప్రత్యక్షంగా చూపించటంలో కృతకృత్యులయ్యారు. అక్కడున్న బైర్సా కొండ మీద ఉన్న శిథిలాలు క్రీ.పూ. రెండవ శతాబ్దం నాటివట. ఆ ప్రాంతం హన్నిబాల్ డిస్ట్రిక్ట్‌గా పిలవ బడుతోంది. కార్థేజ్ కూడ యునెస్కో వారి ప్రపంచ వారసత్వ సంపదలో భాగంగా గుర్తించ బడింది. బైర్సా కొండ మీద నుండి మధ్యధరా సముద్రపు నయగారాలు నయనానందకరంగా కనపడు తున్నాయి. ఆ కొండ వాలులో నిర్మించబడిన ఉన్నత వర్గాల నివాసాలు సముద్రపు అంచుల వరకూ సాగి పోవటం మాకు కనిపించిన మరో మనోహరమైన దృశ్యం. అక్కడున్న ఒక మ్యూజియమ్‌లో కార్థేజ్ శిథిలాలనుండి సంగ్రహించి, సంరక్షించ బడిన పాలరాతి విగ్రహాలు, వస్తువులు ఉన్నాయి. కొన్ని మట్టితో తయారు చేసిన వస్తువులు, పింగాణీ వస్తువులు కూడ ఉన్నాయి.

ప్యూనిక్ ప్రజలు, (లెబనాన్ ప్రాంతం నుండి కార్థేజ్ కు తరలి వచ్చిన ఫీనిషియన్ తెగవారు), రోమన్లలానే దైవారాధకులు. బాల్ హామ్మన్ వారు ఆరాధించే దైవం. ఇక్కడ మట్టితో చేసిన బాల్ హామ్మన్ శిరస్సులు, ముఖాలు ప్రదర్శించబడుతున్నాయి. బైర్సా కొండ మీద రెండు గంటలు గడిపిన తరువాత, హాటెమ్ మమ్మల్ని కార్థేజ్ శిథిలాలకు తీసుకెళ్ళాడు. ఆ ప్రాంతాన, విశాలమైన వీధుల జాడలు ఇంకా అట్లాగే ఉన్నాయి. రోమన్ చక్రవర్తి ఆంటోనియస్ పియస్ పేరిట ఉన్న ఆంటోనిన్ స్నానపు గదులు ఒక ప్రత్యేక ఆకర్షణ. రోమన్ సామ్రాజ్యంలో, రోమ్ లో ఉన్న వాటి తరువాత అంతటి ఘనమైన స్నానపు గదులు ఇవేనని ప్రొఫెసర్ గారు చెప్పారు. గుట్టలుగా పడి ఉన్న శిథిలాల మధ్య, రెండు గ్రానైట్ స్థంభాలు ఎత్తుగా నిటారుగా నిలబడి, ఆ ప్రాంతపు గత వైభవాన్ని చాటుతున్నాయి. అక్కడంతా ఇసుక నేల. సముద్రానికి చేరువలో ఉండటం వలన అనుకుంటాను. ప్రొఫెసర్ గారు, మా పిల్లల పేర్లు అరబిక్‌లో ఇసుక మీద వ్రాయటం వాళ్ళకెంతో నచ్చింది. ఒకమ్మాయి, కార్థేజ్ ప్రజలు అరబిక్ మాట్లాడేవారా? అని అడిగింది. దానికి ఆయన, 'లేదు. వాళ్ళంతా ఫీనిషియన్ భాషకు రూపాంతరమైన ప్యూనిక్ భాష మాట్లాడే వారు' అని చెప్పారు. మా పిల్లలకు ఎంత వరకు అర్థమయిందో తెలియదు. కాని ఇంకేమీ ప్రశ్నలు వేయలేదు. కాకపోతే, ప్యూనిక్, ఫినీషియన్ అనే మాటలు వారికి కుతూహలాన్ని కలిగించే ఉంటాయని నా నమ్మకం. పిల్లలను విభిన్న ప్రదేశాలకు తీసుకు వెళ్ళినప్పుడు వాళ్ళ దృక్పథం, ఆలోచన వికసిస్తాయని నా కనిపిస్తుంది.

ఇదివరకే నేను లెబనాన్‌లోని బిబ్లోస్‌కు వెళ్ళినప్పటి సంగతులు గుర్తుకొచ్చాయి. శబ్దం/ఉచ్ఛారణ ప్రాతిపదికగా మొట్ట మొదటి అక్షరమాలను రూపొందించినవారు ఫినీషియన్లట. ఇంగ్లీషులో ఫొనెటిక్, ఫోన్ అనే మాటలు ఫీనిషియన్ అనే పదం నుండి పుట్టినవేనట. ఇంకొద్ది సేపట్లోనే మా టూర్ పూర్తయింది. శిథిలాలకు జీవం పోసి, వాటి చరిత్రను కథనాలుగా వినిపించిన ప్రొఫెసర్ గారికి మేమంతా మనసారా కృతజ్ఞతలు తెలుపుకున్నాము.

తిరుగు ప్రయాణంలో హటెమ్ ఒక రాజ భవనాన్ని చూపించాడు. అది 2010లో, శాంతి యుతంగా జరిగిన పోరాటంలో, పదవీచ్యుతుడైన ట్యునీసియా నియంత 'బెన్ ఆలీ' నివాసమట. ఈ పోరాటం అనతి కాలంలోనే ఇతర ఉత్తర ఆఫ్రికా, మధ్య ప్రాచ్య దేశాల్లో కూడ అలముకుని, అక్కడ రాజ్యమేలుతున్న దుష్ట నియంతల అంతమే లక్ష్యంగా సాగింది. ఇదే అరబ్ స్ప్రింగ్. నాయకుల నిరంకుశత్వానికి, అవినీతి రాజకీయాలకు, వ్యక్తి స్వేచ్ఛ హరణకు, మానవ హక్కుల ఉల్లంఘనకు, నిరుద్యోగానికి వ్యతిరేకంగా సాగిన ఉద్యమం ఇది. పదవీచ్యుతుడైన బెన్ ఆలీ, సౌదీ అరేబియాకు పారిపోయాడు. అటు తరువాత అతనికి 35 సంవత్సరాల జైలు శిక్ష విధించబడింది.

నిజానికి ట్యునీసియాను ఫ్రెంచివారి నుండి విముక్తను చేసి, ఆధునీకరణకు పునాదులు వేసినది, ట్యునీసియా మొదటి ప్రెసిడెంట్, హబిబ్ బోర్గిబా అని హటెమ్ మాకు చెప్పాడు. అతను చేసిన సంస్కరణల్లో ముఖ్యమైనది, స్త్రీలకు సమాన హక్కులు కల్పించటంతో పాటు, స్త్రీ విద్యను ప్రోత్సహించటం. టర్కీకి చెందిన కమాల్ అటాటుర్క్ వలన ప్రభావితుడైన బోర్గిబా, ట్యునీసియాను లౌకిక రాజ్యంగా రూపొందించాడు. 1957 నుండి 1987 వరకు, ముప్ఫై సంవత్సరాల పాటు దేశాన్ని తీర్చిదిద్దిన ప్రెసిడెంటును అనారోగ్యమే మిష మీద, బెన్ ఆలీ పక్కకు తప్పించాడట. దేశాభివృద్ధి కోసం పాటు పడిన బోర్గిబా తన 96వ ఏట, పూర్తి జీవితాన్ని అనుభవించి 2000 సంవత్సరంలో తనువు చాలించాడు. దేశాన్ని పీడించిన బెన్ ఆలీ కథ వేరుగా ఉంది. మరుసటి రోజు ఉదయమంతా తీరికగా బ్రేక్ ఫాస్ట్ చేసి, బీచ్‌లో పిల్లలుగా ఆడుకుంటూ గడిపేశాము. మధ్యాహ్నం నుండి యునెస్కో వారి ప్రపంచ వారసత్వ సంపదలో చేర్చబడిన సోస్సె అనే నగరానికి ప్రయాణ మయ్యాము. నిజానికి మా వాళ్ళెవరూ బయటికి వెళ్ళటానికి ఉత్సాహం చూపించలేదు. కాని అంత దగ్గరలో ఉన్న దర్శనీయ విశేషాన్ని చూడకపోవటం సరికాదని వాళ్ళను కదిలించాను. టాక్సీ తీసుకుందామా అనుకుని, హటెమ్ ఏమైనా దొరుకుతాడేమో చూద్దామని అతనికి ఫోన్ చేశాను. అదృష్టం కొద్దీ అతను ఆ దగ్గరలోనే ఉండటంతో ఒక అరగంటలో మా ముందున్నాడు. అప్పటికల్లా హటెమ్ మా పిల్లలకు 'ట్యునీసియన్ మామయ్య' అయిపోయాడు.

సోస్సె క్రీ.పూ. 9వ శతాబ్దంలో ఫీనిషియన్లు ఏర్పరచుకున్న ఆవాస నగరం. కార్థేజ్ తరువాత అంతటి రేవు పట్టణం కూడ. ఇక్కడ చుట్టూ గోడలతో పకడ్బందీగా ఏర్పరచబడిన మదీనా ఉంది. రెండవ ప్యూన్ యుద్ధంలో జనరల్ హన్నిబాల్ ఉపయోగించుకున్న రేవు పట్టణమట ఇది. ఇది ట్యునీసియాలో మూడవ పెద్ద పట్టణం కూడ. ఇక్కడ తిరిగి చూడటానికి చాలా పురాతనమైన మసీదులు, చారిత్రాత్మక భవనాలు, స్మారక చిహ్నాలు ఉన్నాయి. ఇరుకు వీధులు, కొండరాళ్ళు పరచిన గతుకు బాటలు దాని వయసును తెలుపుతున్నాయి. వీటన్నిటినీ దాటుకుని ఓడరేవు చేరుకున్నాము. అక్కడ నిలచి ఉన్న పెద్ద బోటును మేము చూడటం గమనించిన కెప్టెన్ మమ్మల్ని పైకి రమ్మని ఆహ్వానించాడు. పిల్లలకు ఇంజన్ రూమ్ చూపించి, అక్కడున్న చెక్కతో చేసిన స్టీరింగ్ వీల్ ను తిప్పమని ప్రోత్సహించాడు. సముద్రతీరం వెంబడి వేసిన పొడవైన ప్రోమెనేడ్ నడవటానికి చాలా బాగుంది. కాని అదే, ఇంగ్లండ్ లో ఐతే మంచి 'ఫిష్ అండ్ ఛిప్స్' కూడ దొరికేవి. నెమ్మదిగా సూర్యాస్తమయం తరువాత మళ్ళీ హమ్మామెట్లో మా హొటల్ దోవ పట్టాము.

ప్రస్తుత కాలంలో, సోస్సె ఒక మంచి టూరిస్ట్ ప్రదేశం. దీని జంట నగరమైన పోర్ట్ ఎల్ కాంటోయితో పాటు, సోస్సెలో సముద్రతీరాన ఎన్నో రిసార్టులు ఉన్నాయి. మేము అక్కడకు వెళ్ళొచ్చిన ఆరు నెలలోపే, సోస్సె తీరంలో ఉన్న విలాస వంతమైన హొటల్, 'రూ ఇంపీరియల్ మర్హబా' తీవ్రవాదుల దాడికి గురయ్యింది. యాత్రికుడిగా ఇక్కడ ప్రవేశించిన ఒక తీవ్రవాది, ఎ.కె.47 తుపాకీని, గొడుగులో దాచుకుని బీచ్‌కి వెళ్ళి, అక్కడ కనిపించిన వారినల్లా నిర్దాక్షిణ్యంగా కాల్చివేశాడు. మరణించిన 38 మందిలో 30 మంది బ్రిటిష్ వారే. ఇది విన్నప్పుడు, కేవలం కొన్ని నెల క్రిందట, ఎంతో ప్రశాంతంగా, అందంగా కనిపించిన స్వర్గతుల్యమైన దేశపు భవితవ్యం ఏమైపోతుందా అని నా తనువు జలదరించింది.

ఇంగ్లీషు మూలం: డా. నిమ్మగడ్డ శేషగిరి రావు (ఇంగ్లాండ్)
e-mail: srnimmagadda@googlemail.com
అనువాదం: జయశ్రీ అట్లూరి (స్టోక్ ఆన్ ట్రెంట్)
e-mail: jayasreeatluri@hotmail.com

# మాతృభాష

– ఇరగ రెడ్డిశేఖర

**1948** మార్చి 21న గవర్నర్ జనరల్ మహమ్మద్ అలీ జిన్నా ఉర్దూ పాకిస్తాన్ అధికార భాషయనే శాసనాన్ని జారీ చేశాడు. బెంగాలీ భాష మాట్లాడే తూర్పుపాకిస్తాన్ ప్రజలు దీన్ని పూర్తిగా వ్యతిరేకించారు. అధికార కార్యక్రమాలన్నీ ప్రజలభాష అయిన బెంగాలీలోనే సాగించాలని ఆందోళనలు దిగారు. బెంగాలీ భాషను తూర్పు పాకిస్తాన్ అధికార భాషగా అమలు చేయాలని 1952 ఫిబ్రవరి 21న ఢాకా విశ్వవిద్యాలయంలో విద్యార్థులు పెద్ద ఊరేగింపుతో ఆందోళన నిర్వహించారు. ప్రజల మాతృభాషని అధికారభాషగా చేయాలన్న ఇలాంటి ఉద్యమం ప్రపంచంలో మరెక్కడ జరగలేదని యునెస్కో గుర్తించి, ఫిబ్రవరి 21న మాతృభాషా దినోత్సవాన్ని జరపాలని నిర్ణయించింది. అప్పటి నుండి ప్రపంచ వ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆయా మాతృభాషలు వాళ్ళు 'మాతృభాషా దినోత్సవాన్ని' నిర్వహించుకుంటూనే వస్తున్నారు. అందులో భాగంగా మన తెలుగు నేల మీద కూడా తెలుగు భాష మాతృభాషగా కలిగిన మనమందరం కూడా ఫిబ్రవరి 21వ తేదిన ప్రపంచ మాతృభాషా దినోత్సవాన్ని జరుపుకుంటున్నాము.

**తెలుగు భాష అమలు – భాషా సంస్థలు :** అధికారభాషగా, పాలనాభాషగా, బోధనభాషగా తెలుగు అమలు చేయడం కోసం మన రాష్ట్రం ఏర్పడినప్పటి నుంచి అనేక చర్యలు తీసుకోవడం జరుగుతోంది. ప్రభుత్వపరంగా తీసుకుంటున్న చర్యలతో పాటు భాషాభిమానులు, భాషోద్యమ సంస్థలు, సంఘాలు కూడా మన భాషను కలకాలం కాపాడు కునేందుకు కృషి చేస్తున్నాయి. అందులో భాగంగా తెలుగు అధికార భాషగా అమలు అవుతున్న తీరును గమనిద్దాం.

**అధికార భాష :** ఒక జాతి సంస్కృతికి, అభివృద్ధికి కీలకమైన వాటిలో భాష కూడా ఒకటి. ఒక జాతి నాగరికతను, సంస్కృతిని, ప్రజాజీవనాన్ని భాష ప్రతిబింబిస్తుంది. భాష కేవలం భావవ్యక్తీకరణ, భావ ప్రకటన సాధనంగానేకాక, భావాలను సమైక్య పరిచి భిన్నత్వంలో ఏకత్వాన్ని సాధించడానికి దోహదం చేస్తుంది. పరిపాలన నిర్వహించడానికి ప్రపంచంలో ఏ దేశమైనా, ఏ రాష్ట్రమైనా ఒక అధికార భాషను కలిగి ఉంటుంది. ఏ దేశంలోనైనా, ఏ ప్రాంతంలో నైనా అత్యధిక సంఖ్యాకులు మాట్లాడే భాష అధికార భాష అవుతుంది. పరిపాలన నిర్వహించడానికి అధికార భాష అవసరం. అదే భాషగా అధికార భాషగా పాలనలో అమలవుతుంది. రాష్ట్ర రాజకీయ పరిపాలన, న్యాయ సంస్థలలో వ్యవహరించే భాషను పూర్వం "రాజభాష" అనేవారు. ఇప్పుడు అధికార భాష అంటున్నారు.

ఆంధ్రప్రదేశ్ అవతరణ తర్వాత అధికార భాషా బిల్లును 1966 మార్చి 23న శాసన సభలోనూ, 1966 ఏప్రిల్ 1న శాసన పరిషత్తులోనూ ఆమోదించగా భారత రాజ్యాంగంలోని 347వ అధికరణాన్ని అనుసరించి 1966 మే 14న తెలుగు అధికార భాషా చట్టం అమలులోకి వచ్చింది. అధికారభాష అమలుకు 1967లో పి.వి.నరసింహారావుగారి అధ్యక్షతన ఒక సమీక్షా సంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించింది. ఈ సంఘం అధికార భాషా కమిషన్ ఏర్పాటును సిఫారసు చేస్తూ 1971లో తన నివేదికను ప్రభుత్వానికి సమర్పించింది. ఈ క్రమంలోనే 1974 మార్చి 5వ తేదీన సాధారణ పరిపాలనా శాఖలో అధికార భాషా విభాగాన్ని ఏర్పాటు చేశారు. 1974 మార్చి 19వ తేదీన వావిలాల గోపాలకృష్ణయ్యగారు అధ్యక్షులుగా 'అధికార భాషా సంఘాన్ని' ప్రభుత్వం ఏర్పాటుచేసింది. ఈ సంఘం ప్రభుత్వ అవసరాలకు తెలుగు వాడటానికి సంబంధించిన ప్రగతిని సమీక్షించి తెలుగు భాషా వినియోగానికి కృషి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది.

ఆనందనామ సంవత్సరం ఉగాది 1974 మార్చి 24వ తేదీ నుంచి రాష్ట్రమంతటా, అన్ని ప్రభుత్వ శాఖలలో తాలూకా స్థాయి అంతకు కింది స్థాయిలోనూ శాసనేతర ఉత్తర ప్రత్యుత్తరాలు అన్నింటినీ తెలుగును తప్పనిసరిగా వాడాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. 1974 నుంచి 1979 వరకు రాష్ట్రస్థాయిలో తెలుగు అమలు విషయమై ప్రభుత్వ ఉత్తర్వులు జారీ అవుతూ వచ్చాయి. 2004 స్వభానునామ సంవత్సరాన్ని అధికార భాషా సంవత్సరంగా ప్రకటించారు.

**అధికార భాషగా తెలుగు :** క్రీ.శ. 5వ శతాబ్దంలోనే గద్య శాసనాలు, క్రీ.శ. 8వ శతాబ్దం నుంచి కనిపిస్తున్న పద్య శాసనాలు తెలుగుభాషా పరిణామక్రమాన్ని తెలియ జేస్తాయి. నాణేలు తెలుగు ప్రాచీనతకు ఆధారంగా నిలిచాయి. క్రీ.పూ. 3వ శతాబ్దం నుంచి లభ్యమవుతున్న శాసనాల్లో ఆంధ్రదేశంలోని గ్రామనామాలు, వ్యక్తుల పేర్లు కనిపిస్తాయి. అశోకుని 13వ ధర్మలిపి శిలాశాసనంలో (క్రీ.పూ. 256-254 ఆంధ్ర, పుళింద జాతుల ప్రస్తావన ఉంది. మనదేశంలో ఎక్కువమంది మాట్లాడే భాషల్లో తెలుగు మూడో స్థానంలో ఉంది. ప్రపంచంలో 15వ స్థానంలో ఉంది. ప్రపంచంలో రెండో అత్యుత్తమ లిపిగా తెలుగును ఇంటర్నేషనల్ ఆల్ఫాబెట్ అసోసియేషన్ 2012లో ఎంపిక చేసింది. ప్రాకృత భాషలో హాలుని గాధాసప్తశతిలో తెలుగు మాటలు, తెలుగు పాటలు ఉన్నట్లు తెలుస్తుంది. అమరావతి స్థూపంలో కనబడే "నాగబు" శబ్దమే తొలి తెలుగు పదం. తెలుగుకు అధికార ప్రతిపత్తి కల్పించి దాని అభివృద్ధికి దోహదం చేసింది - తూర్పు చాళుక్యులు. విజయనగర రాజుల కాలంలో తెలుగు అధికార భాషగా ఉండేదని "రాయవాచకం" (విశ్వనాధ నాయనం గారి స్థానాపతి) వల్ల తెలుస్తోంది.

దేశంలోనే మొదట భాషా ప్రాతిపదికపై 1956 నవంబరులో ఆంధ్రప్రదేశ్ అవతరించినప్పటి నుంచి తెలుగును అధికారికభాషగా రూపొందించే ప్రయత్నాలు జరిగాయి. అయ్యదేవర కాళేశ్వరరావుగారి ఆధ్వర్యంలో ఇందుకోసం అనేక ప్రయత్నాలు జరిగాయి. ప్రాచీన హోదా పొందాలంటే ఆ భాషకు వెయ్యేళ్లకు పైగా సాహిత్య చరిత్రతోపాటు 1500 ఏళ్ల భాషాచరిత్ర స్వతంత్రమైందనే పేరు కావాలి. ఈ నేపథ్యంలో క్రీ.శ. 931లో నిజామాబాద్ జిల్లా బోధన్‌కు చెందిన పంపన రచించిన ఆదిపురాణం, విక్రమార్జున విజయం చూపించి మన భాషా, సాహిత్యానికి ప్రాచీన చరిత్ర ఉన్నట్లు నిరూపించారు.

పురావస్తుశాఖ తవ్వకాల్లో కరీంనగర్ జిల్లాకు చెందిన కోటిలింగాలలో లభించిన ఆధారాలు క్రీ.పూ. 2 లేదా 3 శతాబ్దాలకు చెందినవని, పెద్దపల్లి సమీపంలోని ధూళికట్టలో కనుగొన్న బుద్ధుడి స్తూపం క్రీ.పూ. రెండో శతాబ్దానికి చెందినదని, వీటిని బట్టి మన భాషా చరిత్రకు 1500 ఏళ్లకు పైగానే చరిత్ర ఉందని గట్టి ఆధారాలు చూపించడంతో తెలుగుకు ప్రాచీన హోదా కల్పించడానికి అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చింది. చివరకు తెలుగుకు ప్రాచీన హోదా ఇచ్చేందుకు కేంద్రం 2006లోనే సిద్ధమైంది. 2008 అక్టోబరు 31న తెలుగును ప్రాచీన భాషగా గుర్తిస్తున్నట్లు కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. 2005లో సంస్కృతానికి, 2008లో కన్నడానికి, 2013లో మలయాళానికి, 2014లో ఒడియా భాషలకు ప్రాచీన హోదా అందించారు. ఇంతటి ఘన చరిత్ర కలిగిన మన తెలుగు భాష నేడు ఆంగ్ల మోజులో పడి నిర్లక్ష్యం చేస్తున్న సంఘటనలు కనిపిస్తున్నాయి. ఆంగ్లంలో చదివితేనే ఉద్యోగాలు వస్తాయని తల్లిదండ్రులంతా నమ్ముతున్నారు. ముందు పిల్లవాడు వాడి మాతృభాషలో మంచి జ్ఞానం కలిగి ఉంటే దానికదే పరభాషా జ్ఞానం కూడా వస్తుంది. అలాంటి తెలుగు భాష గొప్పతనం గురించి మన పూర్వీకులు తెలుగు భాషను కొనియాడిన తీరును పరిశీలిద్దాం.

**తెలుగు భాష - గొప్పతనం :** Mother tongue is a natural outlet for the expression of child, aesthetic sense and appreciation-మహాత్మా గాంధీ "శైశవదశ నుండి జీవితాన్ని తీర్చిదిద్ది, ఆత్మ వికాసాన్ని కలిగించి, జాతి అభివృద్ధికి, దేశాభ్యుదయానికి, లోకోద్ధరణకు కూడా సమర్థునిగా చేసేశక్తి మాతృభాషకు ఉంది" - పి.బి. బల్లార్డ్

"పసితనం నుండి పరిచయాధిక్యం కలిగిన భాషయే మాతృభాష" - నెల్లుట్ల వెంకటేశ్వరరావు

ఇటలీ వ్యాపారి నికోలో - డికాంటె తెలుగుభాషను "ప్రాచ్యదేశాల ఇటాలియన్" (Italian of the East) గా అభివర్ణించాడు.

**"తలచినంతనె తన్మయత్వము కల్గి**
**తీపినొందించు పీయూష తెలుగు భాష**
**చదివినంతనె మదిలోన సుధలుగురియు**
**దివ్య కావ్యసమున్మేష తెలుగు భాష!"**

**- కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ**

తలవగానే తన్మయత్వాన్ని పొందే తీపినిచ్చే అమృతము తెలుగు భాష. చదవగానే ఆనందాన్ని రెట్టింపు చేసే భాష తెలుగుభాషని తెలుగు భాష విశిష్టతని విశ్వనాథ సత్యనారాయణ పై పద్యంలో తెలిపారు.

**మధురమధురమైన మన భాషకంటెను**
**చక్కనైన భాష జగతి లేదు**
**తల్లిపాల కంటె తనయున కేపాలు**
**బలమునీయగలవు? తెలుగుబిడ్డ**

**– నార్ల చిరంజీవి**

సొంత తల్లి పాలు మాత్రమే బిడ్డకు శక్తిని ఇవ్వగలవు. ఏ ఇతర పాలు తల్లిపాల వంటి శక్తిని ఇవ్వలేవు. అలాగే తన తల్లి భాష తనకు మధురానుభూతిని ఇవ్వగలదు. అలా ఇవ్వగలిగే శక్తి మరే ఇతర భాష ఈ లోకంలో లేదని నార్ల చిరంజీవి పై పద్యంలో వెల్లడించారు.

**అన్యభాషపైని అధికార మబ్బదు**
**అంతుపట్టదేని సొంత భాష**
**మొదలు నేర్వకున్న తుదయెట్లు నేర్చురా**
**వాస్తవమ్ము నార్లవారి మాట**

– నార్ల వెంకటేశ్వరరావు

సొంతభాష పూర్తిగా నేర్చుకోకపోతే ఇతర భాషలు రావు. మొదలు నేర్చుకోకుండా చివరిది నేర్చుకోలేము. ఇది వాస్తవమైన విషయమని పై పద్యం ద్వారా నార్ల వెంకటేశ్వరరావు తెలుపుతున్నారు.

**తెనుగునాడు నీది తెనుగు బిడ్డవు నీవు**
**తెనుగటన్న నీకు తీపిమెందు**
**తెనుగకన్న జడలదీర్చి మక్కువ తోడ**
**తెనుగు తోటలందు దిప్పినావు**

**– దేవులపల్లి రామానుజరావు**

నీది తెలుగు ప్రాంతం. నీవు తెలుగు బిడ్డవు. తెలుగంటే నీకు ఇష్టం. తెలుగువాడా! ఇష్టంతో నన్ను తెలుగు తోటలలో తిప్పావు కదా! అని దేవులపల్లి రామానుజరావు పై పద్యంలో ఉన్న సౌందర్యాన్ని తెలిపారు.

**సుధలఁ జల్లి దెసల మధుర యాత్రలు చేసి**
**దినదినాభివృద్ధి దీప్తి నిండి**
**క్రొమ్మె ఋంగు దాల్చి క్రొంగొత్త సొగసుల**
**తళుకు జిమ్ము భాష తెలుగు భాష**

**– తిరుమల శ్రీనివాసాచార్యులు**

తెలుగుభాష అమృత జల్లులు జల్లి అన్ని దిక్కులా వ్యాపించి, మధుర యాత్రలు చేసి, దినదినము అభివృద్ధితో తేజస్సు నిండి, కొత్త మెఱుగులు పొంది, కొంగొత్త అందాల కాంతులు చిందుతున్న భాష మన తెలుగు భాషని తిరుమల శ్రీనివాసాచార్యులు పై పద్యం ద్వారా తెలుగు భాష గొప్పతనాన్ని తెలుపుతున్నారు.

**జిలిబిలి పలుకుల బలు ము**
**ద్దులు గులికెడు తెలుగు బాసతో సరియగునే**
**తెలిసియు దెలియక వీనుల**
**నల యించెడు వెతిమొతియఅమెఅబాసల్!**

**– వేటూరి ప్రభాకరశాస్త్రి**

జిలిబిలి పలుకులతో ముద్దుముద్దుగా ఉండే తెలుగు భాషతో తెలిసీ తెలియక చెవులకు ఇంపుగా గూర్చే వెట్టి మొట్టి పదాలు సాటిరావని వేటూరి ప్రభాకరశాస్త్రి పై పద్యంలో పేర్కొన్నారు.

**కవులకంటె తుహిన కర్పూర నభకీర్తి**
**తెచ్చిరెవరు నీకు తెలుగు తల్లి?**
**సాహితీ తరంగ సంగీత రసధుని**
**దేశ భాషలందు తెలుగు లెస్స!**

**– నందూరి రామకృష్ణమాచార్యులు**

"దేశ భాషలందు తెలుగు లెస్స!" అని 16వ శ్రీకృష్ణదేవరాయలువారు పేర్కొంటే ఈ కాలంలో నందూరి రామకృష్ణమాచార్యులు వారు తెలుగు భాష గురించి పేర్కొన్నారు. తెలుగు తల్లీ నీకు కవుల కంటే గొప్ప కీర్తి తెచ్చినవారు ఎవ్వరూ లేరు. సంగీత సాహిత్య రస ప్రవాహమైన తెలుగుభాష దేశ భాషలన్నింటిలో గొప్పదని కృష్ణమాచార్యులు వారు ఎలుగెత్తి చాటిచెప్పారు.

**ముగింపు :** ఆధునిక వైజ్ఞానిక ప్రగతి పరుగులు తీస్తున్న ఇప్పటి నేపథ్యంలో తెలుగు విశ్వభాషగా అవతరించాల్సిన అవసరం కూడా ఎంతైనా ఉంది. ఇందుకోసం ప్రభుత్వం, పరిశోధన సంస్థలు, విశ్వవిద్యాలయాలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం కూడా ఉంది. అలాగే, విభిన్న సంస్కృతులు, భాషల నేపథ్యం నుంచి పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు మన తెలుగును మనసుకు హత్తుకునేలా నేర్పించాల్సిన అవసరమూ ఉంది. కాబట్టి తెలుగు భాషను గౌరవిద్దాం.. తెలుగు భాషను మాట్లాడుదాం.. తెలుగు భాషను వెలుగిద్దాం...

ఇరగ రెడ్డిశేఖర
పరిశోధక విద్యార్థి, ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం,
ఫోన్ : 8142591227.

# రామాయణం - దాంపత్యాలు

– మామిడి విజేత

భరతభూమిలో ప్రసిద్ధిగాంచిన రామాయణం సులభ గ్రాహ్యంగా, సాంప్రదాయకంగా ఉండటం వలన అందరి నోళ్లలో నానుతుంది. రామాయణం మొట్టమొదట వాల్మీకి మహర్షి సంస్కృతంలో రాశాడు. ప్రపంచంలో ఇంతవరకు ఉన్న గ్రంథాల న్నింటిలో రామాయణంతో సమానమైన గ్రంథం లేదని పండితులు అంగీకరించారు.

**"కావ్యం రామాయణం సీతాయాశ్చరితమ్ మహత్**
**పౌలస్యవధ మిత్యేవ చకార చరిత వ్రతః"**

రామాయణం, సీతాయాశ్చరితం, పౌలస్త్యవధ అని మూడు పేర్లు కలవు. "మానిషాద ప్రతిష్ఠాత్వం..." అనే శోకం నుండి శ్లోకం పుట్టింది. 24 వేల శ్లోకాలు, 6 కాండలతో సంస్కృతభాషలో సాగిన రచన. మధురంగా పాడుకోగల కావ్యం రామాయణం. సినిమాలు రాకపూర్వం తోలుబొమ్మలాటలు, పురాణాలు, హరికథలు, యక్షగానాల రూపంలో రామాయణాన్ని వినటం, చూడటం వలన ప్రజల మనసుల్లో చోటు చేసుకుంది.

**"శ్రీరామ రామ రామేతి రమే రామే మనోరమే**
**సహస్రనామ తత్తుల్యం రామనామ వరాననే"** భారత వాఙ్మయంలో పురాణత్రయంగా చెప్పుకోబడుతున్న ఇతిహాసాలు భారత, భాగవత, రామాయణాలు. వీటిలో రామాయణం విశిష్టమైంది. రామనామము కర్ణరసాయనం. అందుకే రామాయణం సర్వజన పారాయణమయింది.

**"కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరం**
**ఆరూహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్"**
కవిత్వం అనే చెట్టుకొమ్మలపైన ఎక్కి, రామ, రామ అనే మధురాక్షరాలను గానం చేస్తున్న వాల్మీకి అనే కోకిలకు మానవజాతి నమస్కరింపవలసిందే. రామాయణాన్ని పరిశీలించినప్పుడు మనకు అది ఒక ఆదర్శప్రాయమైన గ్రంథంగా కనిపిస్తుంది. భారతం సాంఘిక ఇతివృత్తానికి, భాగవతం ఆధ్యాత్మికతకు ఉదాహరణలుగా నిలుస్తాయి. రామాయణం ఒక మనస్తత్వశాస్త్రం, మానవసంబంధాలను, మానవీయ విలువలను చెప్పే ఉత్తమ కథ. రామాయణం అంటే రాముని కదలిక. పయనం అని అర్థం. 'ఆయనం' అంటే ప్రయాణం, పయనం అని అర్థం.

**నారదుడు :**
**"కోన్వస్మిన్ సాంప్రతంలోకే గుణవాన్ కశ్చ వీర్యవాన్,**
**ధర్మజ్ఞశ్చ కృతజ్ఞశ్చ సత్యవాక్యో దృఢవ్రతః"** (బాలకాండ 1-2) ఈ యుగంలో, ఈ లోకంలో సద్గుణ సంపన్నుడు, ప్రతాపం కలవాడు, ధర్మం తెలిసినవాడు, కృతనిశ్చయం కలవాడు, సత్యవాక్కు పలికేవాడు, నిశ్చలమైన మనస్సు కలవాడు. అలాంటి మహాపురుషుని గురించి తెలుపమని నారద మహర్షిని ప్రశ్నించగా, అందుకు సమాధానంగా నారదమహర్షి సకల గుణాలు కలవాడు ఒక్కడే ఒక్కడు ఉన్నాడని వివరిస్తాడు.

**"ఇక్ష్వాకు వంశ ప్రభవో రామనామ జనైఃశ్రుతః**
**నియతాత్మ మహావీర్యో ద్యుతిమాన్ ధృతిమాన్ బలీ"**
(బాలకాండ 1-8)

ఇక్ష్వాకువంశంలో రాముడనే ప్రసిద్ధ నామధేయం కలవాడు ఉన్నాడు. ఆయన నియతాత్ముడు. పరాక్రమ వంతుడు, ధైర్యవంతుడు, ఇంద్రియనిగ్రహం కలవాడు, బుద్ధిమంతుడు, నీతిమంతుడు. షోడశగుణ పరిపూర్ణుడైన మానవోత్తముడెవరు? ఎవరి కథ రాయాలి? అని అడిగిన వాల్మీకికి శ్రీరామ కావ్యాన్ని రాయమని ఆదేశించిన ఉత్తముడు నారదమహర్షి. ఈనాటికి మానవులంతా రామకథ విని, చదివి గానం చేస్తున్నారంటే అందుకు కారణం నారదుడు. నారద మహర్షిని మానవ సంబంధాలకు ఆద్యుడిగా చెప్పవచ్చు. ఎలాగంటే దేవతలు, మునులు, ఋషులు, రాజులు మొదలైన వారితో వినోదంగా మాట్లాడుతూ మంచి మాటకారిగా పేరుపొంది మానవ సంబంధాలను సృష్టించిన మహోన్నత వ్యక్తి.

విశ్వామిత్రుడు ఒకనాడు దశరథ మహారాజు ఇంటికి వెళ్ళాడు. విశ్వామిత్రునికి స్వాగతవచనాలు పలికి, గౌరవ మర్యాదలు చేసి, వచ్చిన పని ఏమిటని ప్రశ్నించాడు దశరథ మహారాజు. విశ్వామిత్రుడు వెంటనే నేను ఒక గొప్ప

యజ్ఞాన్ని నిర్వహిస్తున్నాను. పూర్తికావాల్సిన చివరిదశలో మారీచ, సుబాహులు అనే ఇద్దరు రాక్షసులు యజ్ఞానికి అంతరాయం కలిగిస్తున్నారు. వారిని సంహరించడానికి రాముణ్ణి నా వెంట పంపవలసిందని, నీ సహాయం అర్థించడానికి వచ్చానని చెప్పాడు. అది విన్న దశరథుడు భయంతో, శోకంతో, పుత్రవాత్సల్యంతో విశ్వామిత్రుని అభ్యర్థనను తిరస్కరించాడు. పరిస్థితి అంతా గ్రహించిన కులగురువు వశిష్టుని ప్రేరణతో మహారాజు విశ్వామిత్రుని అభ్యర్థనను అంగీకరిస్తాడు. సరయూనది తీరంలో విశ్వామిత్రుడు రాముడికి బల, అతిబల అనే మంత్రాలను ఉపదేశించటం, రాక్షసి తాటకిని వధించడం జరుగుతుంది.

విశ్వామిత్రుడి యజ్ఞవాటికను రామలక్ష్మణులు అప్రమత్తంగా సంరక్షిస్తున్నారు. ఆ సమయంలో మారీచ, సుబాహులు యజ్ఞానికి అంతరాయం కలిగించడానికి తన అనుచరగణంతో విరుచుకుపడతారు. అప్పుడు రాముడు ఈ దుష్టరాక్షసులను నా ఆయుధాలతో తొలగిస్తానని చెప్పి, రాక్షసులందరినీ పారద్రోలి, యజ్ఞవాటిక ప్రాంతమంతా శాంతిని నెలకొల్పాడు. యజ్ఞ కార్యనిర్వాహణ నిర్విఘ్నంగా, శాంతియుతంగా ముగిసింది.

**దాంపత్యం :**

**"ఇంద్రియాణి బలిష్ఠాని ననియుక్తాని మానదా**
**అపక్వస్య ప్రకుర్వంతి వికారం స్థానమే కష"** అని వ్యాసుడు దేవీభాగవతంలో ఇంద్రియాలను బలవంతంగా అణచి పెట్టినట్లయితే అవి పాములై కాటువేస్తాయి. కాలు కింద పామును తొక్కిపట్టి కాలెత్తినప్పుడు ఎలా కరుస్తుందో అలాగే ఇంద్రియాలు ఇబ్బంది పెడతాయి. ఇంద్రియాలు (కళ్ళు, ముక్కు, చెవి, నాలుక, స్పర్శేంద్రియాలు) అందుకే కామం వలన మనిషి భ్రష్టం కాకుండా ఉండటానికి కామాన్ని ధర్మంతో ముడి వేశారు. అలా కామాన్ని ధర్మంతో ముడి వేసిన ప్రక్రియకు గృహస్థాశ్రమం అని, దానికే వివాహం అని పేరు. కుటుంబ సంబంధాలన్నింటిలో అత్యంత ప్రాధాన్యమైనది వైవాహిక వ్యవస్థ. వివాహం అన్నది సమాజంలోని అతిముఖ్యమైన సామాజిక చర్య. వివాహవ్యవస్థ మానవ సంస్కృతి నాగరికతల పరిణామక్రమంలో మంచి పరిణామం. మానవుని జీవితాన్ని ప్రభావితంచేసే తర్వాతి వలయం దాంపత్యం. ఇది అంతరంగికంగా ఉంటుంది. వివాహం హైందవుల దృష్టిలో జన్మ జన్మాంతర బంధం. ఇంతటి గొప్ప బంధాన్ని గురించి వాల్మీకి తన రామాయణ కావ్యం ద్వారా సందేశ మివ్వటం జరిగింది.

**'చతుర్ణామాశ్రమాణాం చ గార్హస్థ్యం శ్రేష్ఠముత్తమమ్'** అంటే భారతీయ సంస్కృతిలో నాలుగు ఆశ్రమాలున్నాయి. అందులో గృహస్థాశ్రమం శ్రేష్ఠమైనదని వాల్మీకి రామాయణ కావ్యంలో పేర్కొనటం జరిగింది. పూర్వకాలంలో బ్రహ్మచారులను, వానప్రస్థులను ఈ గృహస్థులే పోషించేవారు. వివాహితులై గృహస్థాశ్రమాన్ని స్వీకరించే దంపతులకు నిర్మలమైన మనస్సు, స్నేహపూరితమైన మాట, ఉదార స్వభావం ఉండాలి. గృహస్థులు సామాజిక ధర్మాన్ని విడువకూడదు. గృహ బాధ్యతలను భార్యాభర్తలిద్దరూ సమానంగా పంచుకోవాలి. ఎవరి ధర్మాన్ని వారు సక్రమంగా నిర్వహించాలి. భార్య వలన భర్త, భర్త వలన భార్య ప్రసన్నంగా అనురాగబద్ధులై ఉండాలి. ఒకరియందు మరొకరికి విశ్వాసం, ప్రేమ ఉండాలి. భర్త మనోవాక్కాయ కర్మలతో తన భార్యయందే మనసును లగ్నం చేయాలి. భార్య తన భర్తతోనే పరిపూర్ణమైన అనురాగాన్ని పొందాలి. ఎవరి వ్యక్తిత్వాన్ని వారు కాపాడుకుంటూ చరిత్రవంతులై వర్ధిల్లిన దంపతులను మనం రామాయణంలో చూడవచ్చు.

**అహల్యా గౌతముల దాంపత్యం :** యజ్ఞ కార్యనిర్వాహణ నిర్విఘ్నంగా ముగించుకున్న విశ్వామిత్రుడు రామలక్ష్మణులను వెంటపెట్టుకొని జనకమహారాజు నిర్వహిస్తున్న యజ్ఞానికి పిలుపురాగా మిథిలానగరానికి బయలుదేరాడు. మార్గమధ్యంలో గౌతముని ఆశ్రమానికి వెళ్లారు. గౌతముని భార్య అహల్య. ఈమె వంచితురాలై ప్రమాదవశాత్తు చెయ్యని పాపానికి గౌతమమహర్షి ఆమెను శిలారూపంలో ఉండమని శపించి హిమాలయాలకు వెళ్ళాడు. భవిష్యత్తులో శ్రీరాముడు ఈ ప్రదేశానికి వచ్చినప్పుడు నీవు శుద్ధి పొంది నీ భర్తనైనా నన్ను తిరిగి పొందుతావు అని గౌతమముని చెప్పాడు. ఈ వృత్తాంతం తెలిసిన విశ్వామిత్రుడు, శ్రీరాముడు, గౌతమముని ఆశ్రమంలోకి అడుగుపెట్టిన వెంటనే పాదస్పర్శ వలన శిలారూపంలో ఉన్న అహల్య మంచి తేజస్సుతో తన పూర్వరూపాన్ని పొందింది.

**'ప్రభు మేనిపై గాలిపై వచ్చినంతనే పాషాణ మొకటికి స్పర్శ కలిగే**
**ప్రభు కాలి సవ్వడి ప్రాప్తమైనంతనే శిలకొక్కదానికే చెవులు కలిగే**
**ప్రభు మేని నెత్తాని పరిమళించిన తోన యశ్మంబు...'**
విశ్వనాథ బాలకాండలో విశ్వామిత్రుడు రామా నీవలననే ఆమెకి శాపవిమోచనం కలగాలి. ఆమె తపస్సు సిద్ధి

పొందాలి. ఆమె పూర్వస్థితిని పొందాలి కావున ఆశ్రమ ప్రవేశం చేయమని చెప్పాడు. రాముడు ఆశ్రమప్రవేశం చేశాడు తప్ప రామ పాదము సోకి రాతి నాతిగా మారిందని కాకుండా ఆయన ప్రవేశించినప్పటికీ ఆమెకు తపస్సులో తెలిసి ఆమె వెంటనే పైకి లేచిందని వర్ణించాడు. రామచంద్రుని మీద ఉన్న గాలి తపోనిష్ఠలో ఉన్న అహల్య మీదికెళ్లి ఆవిడకు స్పర్శేంద్రియం పని చేసింది. రాముని మించిన సువాసన ఆమె నాసాపుటలకు తాకి ఆమె ముక్కు పని చేయడం జరిగింది. రాముని శరీరకాంతి ఆమె కన్నుల మీద పడి ఆమె కళ్ళు పనిచేయడం మొదలు పెట్టింది. ఆమె రామచంద్రునికి ఆతిథ్యం ఇచ్చింది. విశ్వామిత్రునికి స్వాగతం పలికింది. అదే సమయంలో గౌతమమహర్షి వచ్చి ఆమెను భార్యగా స్వీకరించి పత్ని సమేతంగా భక్తిశ్రద్ధలతో రామలక్ష్మణులను పూజించాడు. విడిపోయిన భార్యాభర్తల మధ్య సంబంధాలను పునరుద్ధరించాడు శ్రీరాముడు. ఈ ఇద్దరి దాంపత్యం వలన భార్య తప్పు చేసినప్పటికీ ఆ తప్పుని క్షమించి తన భార్యగా స్వీకరించాలని, భర్త ఆమె రక్షకుడని, వివాహం అనేది బాధ్యత అని తెలుసుకోవాలని అహల్యా గౌతముల ద్వారా మనం తెలుసుకోవచ్చు.

**సీతారాముల దాంపత్యం :** మిథిలానగర రాజైన జనకమహారాజు 'శివధనుర్భంగం' ఎవరు చేస్తారో వారికి నా కుమార్తె సీతను ఇచ్చి వివాహం చేస్తానని ప్రకటించాడు. ఆ మాట విన్న విశ్వామిత్రుడు రామలక్ష్మణులతో మిథిలానగరానికి వెళ్లారు. సీత స్వయంవరానికి అనేక మంది రాజులు వచ్చి శివధనుర్భంగం చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యారు. శ్రీరాముడు తన వంతు రాగానే శివధనస్సును సమీపించి, నమస్కరించి, ధనుస్సును ఎక్కుపెట్టి సునాయాసంగా విరిచాడు. సిగ్గుతో తలవంచి, చిరునవ్వు చిందిస్తూ రాముని మెడలో పుష్పహారం వేసి తన అంగీకారాన్ని ప్రకటించింది సీత. ఈ శుభవార్తను దశరథునికి విన్నవించి, జనకుడు సీతను రామునికిచ్చి వైభవంగా వివాహం జరిపించారు. రూపం, సౌందర్యం, ప్రవర్తనవంటి లక్షణాలు అన్నింటిలోనూ సీతారాములు సమానులే. సీతారాముల సహజ ప్రేమానురాగాలు దినదిన ప్రవర్ధమానమైనాయి. రాముని హృదయాంతర్గత భావాలన్నింటిన్ని సీత మనస్సుతో చదవగలిగింది.

తండ్రి దశరథుడు అరణ్యవాసం చేయమని రాముని ఆజ్ఞాపిస్తాడు. అప్పుడు రాముడు సీతతో "సీతా! తండ్రి ఆజ్ఞను పాలించడం తప్ప నాకు గత్యంతరం లేదు. కానీ నీవు మాత్రం అయోధ్యలోనే ఉండి నా తండ్రి పాదాలకు ప్రతి రోజు నమస్కారం చేస్తూ ఉండు. భరతుని ఆజ్ఞలను కచ్చితంగా అమలు పరుస్తుండు" అని చెప్పాడు. ఈ మాటలు విన్న సీత భర్తతో "ఓ పతిదేవా! భర్త జీవితంలో పాలుపంచుకోవడం భార్య విధి. భార్యగా స్వీకరించిన స్త్రీ జీవితంలో పాలుపంచుకోవడం భర్త విధి". కావున అడవికి నీతో పాటు నేను రాకతప్పదని చెప్తుంది.

రావణాసురుడు సీతను అపహరించి లంకకు తీసుకెళ్లి, తనను భర్తగా స్వీకరించమని, సకల భోగాలు సమకూరుస్తానని చెప్తాడు. ఆ సమయంలో సీత అశోక వృక్షం కింద కూర్చొని విలపిస్తూ, బాధాతప్త హృదయంతో తలవంచుకుని ప్రక్కన నేలమీద ఉన్న గడ్డిపోచను రావణునికి చూపింది. సీత చాలా చులకన చేసి రావణాసురుని తిరస్కరించినట్లు గడ్డిపోచతో సంకేతాన్నిచ్చింది.

సనాతన దంపతులైన సీతారాములు పరస్పరం విడదీయరాని భార్యభర్తలు. సీతారాముల నిరాడంబరతకు, ఆర్భాటాలపై ఆసక్తి లేకపోవడం వారి సాధారణ జీవితానికి నిదర్శనం. కష్టసుఖాలను భార్యాభర్తలు సమానంగా పంచుకోవాలని వారిద్దరి మనస్సులోని నిర్ణయం. వైభవోపేతంగా జరిపే వివాహ మహోత్సవాలంటే ఈనాటికీ ప్రపంచంలో ఎక్కడైనా ప్రజలు మక్కువ చూపుతూనే ఉంటారు. ధర్మబద్ధంగా నడుచుకోవడం ద్వారా స్త్రీ పురుషులు తమ వైవాహిక జీవితాన్ని విజయవంతంగా ఎలా అనుభవించవచ్చో సీతారాములు ఆచరించి చూపారు. వాల్మీకి రామాయణంద్వారా సీతారాముల ప్రేమైక జీవనం అందరికీ ఆదర్శమని మంచి సందేశాన్ని ఇచ్చారు.

**మండోదరి, రావణుల దాంపత్యం :** రావణుడు సీతను అపహరించి లంకకు తీసుకెళ్తాడు. సీతను వెతుకుతున్న రాముడికి సుగ్రీవుడితో స్నేహం ఏర్పడుతుంది. సుగ్రీవుడు సీతను వెదకడంలో సహాయం చేస్తానని మాటిస్తాడు. సుగ్రీవుడి మంత్రి అయిన హనుమంతుడు సీతను వెతుకుతూ లంకలో ప్రవేశిస్తాడు. లంకా నగరమంతా తిరిగి సమీపంలోని వృక్షంపై ఎక్కి జాగ్రత్తగా పరిశీలిస్తున్నాడు. లంకానగరంలో రావణునితో స్త్రీలు ఉన్న విధానాన్ని చూచి

**"మనో హి హేతు సర్వేషామిన్ద్రియాణాం ప్రవర్తనే,**
**శుభాశుభా స్వవస్థాసు తచ్చమే సువ్యవస్థితం"**
(సుందరకాండ-40)

అని చూడటం నా ధర్మం, ఇవన్నీ చూడటం వలన నా మనసు చలించలేదు కాబట్టి నా బ్రహ్మచర్యానికి లోపం కలుగలేదు అంటాడు హనుమ. మండోదరి పడుకొని ఉంటే హనుమ అంతటి ప్రాజ్ఞుడికి సాక్షాత్తు సీతమ్మలాగే కనిపించింది. ఈమె మహా పతివ్రత, కాంతివంతురాలని తెలుస్తుంది. రావణుని పట్టమహిషి అయి ఉండి కూడా తను వేరుగా హంస తూలికల తల్పంపై పడుకొని ఎంత తప్పు చేసినా భర్తను దైవంగానే భావించింది. తనతోపాటు తన భార్యల్ని తీసుకెళ్లి సీతమ్మతో మాట్లాడకూడని మాటలు మాట్లాడాడు. అంటే ఎదుటివారి మనసు ఎంత గాయపడుతుంది. తన భార్య ఎంత బాధపడుతుంది. ఆమెకు ఒక మనసుంటుంది, గాయపడటానికి కూడా ఒక అర్థం ఉంది. నేనిలా ప్రవర్తించకూడదు అనే లక్షణమే లేనివాడు రావణుడు. రావణుడు మరణించినప్పుడు మండోదరి **"సహృదం హితకామం నశృచం వచనం ద్వయా"** అని ఏడుస్తుంది. ఎన్నోసార్లు చెప్పాను ఇలా చేయవద్దని ఎప్పుడైనా విన్నావా అని అంటుంది. నువ్వు దేవదానవ యక్షకిన్నరులను జయించావు కాని నీ ఇంద్రియాల చేతిలో నువ్వు ఓడిపోయావు అంటుంది.

ఒక మహాపతివ్రతను తీసుకొచ్చావు. ఆమె నాకన్నా ఎందులో గొప్పది. **"న కులేన న రూపేణ న దాక్షిణ్యేన మైథిలీ, మయాధికా వా తుల్యా వా తత్త్వం మోహాన్న బుధ్యసే"** నాతో కులం కన్నా గొప్పదా, నా రూపం కన్నా గొప్పదా, నాతో దాక్షిణ్యం కన్న గొప్పదా ఎందులో గొప్పది సీతమ్మ నాకన్నా గొప్పదా నాతో సమానురాలా. నాలోని గొప్ప గుణాలు నీకు కనపడలేదు సీతమ్మలో కనపడింది. నీ పతనం ఏమనుకోవాలి అంటుంది. వీళ్ళు ఎంతకాలం కలిసి ఉన్నారని దాంపత్యం చెప్పిన ఈ దాంపత్యానికి అర్థం ఏం లేదు. ఇలా బ్రతకకూడదని వీరి దాంపత్యంవల్ల చెప్పడమే తప్పు ఏం లేదు.

**ముగింపు :** పెళ్లికి పునాది నమ్మకం. ఆ నమ్మకాన్ని నిలబెట్టుకోవాల్సిన బాధ్యత దంపతులిద్దరిపైనా ఉంటుంది. భార్య తప్పు చేస్తే ఆ తప్పుని క్షమించి స్వీకరించాలని అహల్య, గౌతముల దాంపత్యం వల్ల తెలిస్తే, రెండు మనసుల ఏకత్వంగా జీవించాలని సీతారాముల వలన, దంపతులు ఎలా ఉండకూడదో మండోదరి రావణుల ద్వారా చెప్పటం జరిగింది రామాయణం. కాని అది ఇప్పటికీ అనుసరణీయం గ్రంథంగా మానవీయ విలువలను తెలియజేస్తుంది.


మామిడి విజేత
పరిశోధక విద్యార్థిని, హైదరాబాద్ విశ్వవిద్యాలయం,
ఫోన్ : 84999 17782


## కుల్ఫీ లాంటి కుప్రిన్ కథలు




రష్యన్ సాహిత్యంలో మాక్సిమ్ గోర్కీ ఎంత ప్రసిద్ధుడో అంతే స్థాయిలో ఇతర రచయితలుండటం వలన రష్యన్ సాహిత్యం సుసంపన్నమైంది.రష్యన్ జీవితపు విశాల దృశ్యాన్ని చిత్రించిన కుప్రిన్‌ని కూడా ఈ సందర్భంగా గుర్తు చేసుకోవాలి. సాధారణ మనుషులను కథానాయకులను చేస్తాడు కుప్రిన్ తన కథల్లో. నల్లసముద్రపు బెస్తవాళ్ళు, పల్లెటూరి డాక్టర్లు,గుమాస్తాలు సర్కస్ జోకర్, రేవు దగ్గర కల్లు అంగడిలో ఉండే సంగీతకారుడు ఆయన కథానాయకులు. సాహితీ వారు మళ్ళీ కుప్రిన్ కథలను "రాళ్ళవంకీ" కథలుగా మనముందుకు తెచ్చారు. ఇవన్నీ పెద్ద కథలు.. ఒక్కో కథ డెబ్బై, ఎనభై పేజీలుంటుంది.. ఈ కథల ద్వారా రష్యన్ సంస్కృతి సంప్రదాయాలతో పాటు గ్రామీణ రష్యాను మనం చూస్తాం. కుప్రిన్‌కు ఇష్టమైన "ఒలేస్యా" కథ మనలను ఒక ట్రాన్స్‌లోకి తోసేస్తుంది.. ఈ కథలు చదివితే మన కథలు ఎలా ఉన్నాయో తెలుస్తుంది..

"రాళ్ళవంకీ" కథలు గతంలో వచ్చినవే.. మరోసారి తెచ్చారు అయితే అనువాదకుడి పేరు లేకుండా పుస్తకం తేవటం మాత్రం విచారణీయం.

*కుప్రిన్ "రాళ్ళవంకీ" కథలు, వెల : రూ. 200, పేజీలు : 288 ప్రతులకు : సాహితి ప్రచురణలు, ఫోన్ : 8121098500*

*- సి.ఎస్. రాంబాబు, ఫోన్ : 8374818961*

# రాణి వీరమంగ వేలు నాచియార్

**– డా. సగిలి సుధారాణి**

**భా**రత స్వాతంత్ర్య సంగ్రామంలో బ్రిటిష్ వారిని ఎదిరించిన వీరనారి అనగానే అందరికీ ముందుగా గుర్తుకు వచ్చేది ఝాన్సీరాణి లక్ష్మీబాయి (1828–1858) కాని, అంతకంటే చాలాకాలం ముందే బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ వారిని ఎదిరించి, యుద్ధం చేసి గెలిచిన వీరనారి మరొకరున్నారు.

**ఆమే రామనాథపురం కోటకు యువరాణి!**

**శివగంగ సీమ సంస్థానానికి రారాణి!**

**బ్రిటిష్ వారిని ఎదిరించిన తొట్టతొలివీరనారీమణి రాణి వేలు నాచియార్ (1730–1790)**

**రామనాథపురం సంస్థానం ఆడపడచు!**

మధురను నాయకరాజులు పాలించే కాలంలో రామేశ్వరం పోయే యాత్రికులకు దొంగల భయం అధికంగా ఉండేది. దీనిని అరికట్టేందుకు ముత్తుకృష్ణప్ప నాయకుని నాయకత్వంలో రామేశ్వరం వచ్చే యాత్రికుల రక్షణార్థం సేతుపతులను 1600–1609 మధ్యకాలంలో నాయకురాజులు నియమించారు. తరువాతి కాలంలో వారే రామనాథ పురానికి సంస్థానాధీశులుగా నియమితులైనారు.

రామానాథపుర సేతుపతి రాజాచెల్లముత్తు విజయ రఘునాథ సేతుపతికి, నాచియార్ రాణి దంపతులకు 1730సం. జనవరి3న ఏకైక కుమార్తె వీరమంగ (వేలు నాచియార్) జన్మించింది. మగ సంతానం లేకపోవడంతో మగబిడ్డలాగా తల్లిదండ్రులు ఆమెను పెంచారు. బాల్యం నుండే విద్యాబుద్ధులతో పాటు సిలంబాట (కర్రసాము), కత్తిసాము, గుర్రపుస్వారీ, విలువిద్య వంటి వివిధ యుద్ధ కళలన్నింటిలో నైపుణ్యాన్ని వీరమంగ సాధించింది.

**పుట్టినిల్లు రామనాడు సంస్థానమైతే మెట్టినిల్లు శివగంగ సంస్థానం :** రామనాథ సంస్థానం అయిదు భాగాలుగా విడిపోయి, రెండు భాగాలతో శివగంగ సంస్థానం 1730సం.లో ఏర్పడింది. శివగంగ మొదటి పాలకుడు శశివర్ణుడు 1730 నుండి 1750 వరకు పాలించాడు. అతని తరువాతశివగంగ రాజు ముత్తు వడుగ నాథుడు శివగంగ సంస్థానాన్ని (1750 - 1772) పాలించాడు. రఘునాథ సేతుపతి కుమార్తె అయిన యువరాణి వీరమంగ ముత్తు వడగ నాథుని వివాహం చేసుకొని, రాణి వేలునాచియార్‌గా మెట్టినింట శివగంగ సంస్థానంలో అడుగు పెట్టింది. ఈ దంపతులకు ఒక కుమార్తె 'వెళాచి నాచియార్' కలిగింది.



రాణి వీరమంగ వేలు నాచియార్

శివగంగ సంస్థానం వైభవంగా వెలిగింది. దక్షిణాది సంస్థానాలలో కీలక సంస్థానంగా పేరొందింది. లక్ష రూపాయల కప్పం కట్టమని ఈస్టిండియా కంపెనీ వారు శివగంగ పాలకునికి ఆజ్ఞ జారీ చేశారు. కాని శివగంగ రాజు ముత్తు వడుగనాథర్ దానిని ధిక్కరించాడు. తమపై శత్రువులు దాడి చేస్తారని ముందే పసిగట్టి, తమ రాజధానిని తాత్కాలికంగా 'కలయార్‌కోయిల్'కు మార్చారు. 1772 సం.జూన్–25 తేదీన కలయార్ కోయిల్‌లో శివగంగరాజు తన రెండవ భార్య గౌరీ నాచియార్, ఇతర సైనికులు రహస్య సమావేశమై ఉన్నప్పుడు కప్పం కట్టలేదన్న నెపంతో నవాబు కుమారుడు 'ఉమ్మత్తు ఉమర్' బ్రిటిష్ ఈస్టిండియా పాలకుడు 'జోసఫ్ స్మిత్' అండతో దాడి చేశాడు, స్మిత్ సైన్యాలు ముత్తు వడుగనాథునీ, రెండవ రాణి గౌరినీ సంహరించాయి. ఈ సందర్భంగా రాణికి సంరక్షకురాలుగా ఉన్న అంగరక్షకురాలు ఉదయల్, మహిళా సైనికులు నవాబుకు బందీలుగా చిక్కారు. రాణి వేలునాచియార్ ఆచూకి కోసం ఉదయల్‌ను తీవ్రంగా హింసించినప్పటికీ నోరు విప్పకపోవడంతో ఆమె తల నరికి, శివగంగ సంస్థానంలోని ధనాన్ని, బంగారాన్నీ కొల్లగొట్టారు. ఈ విషయాన్ని నాటి లండన్‌లోని ప్రముఖ పత్రికలు "కలయార్ కోయిల్ దాడి దారుణమైనది" అనే ప్రధానశీర్షికతో ప్రత్యేక కథనాలు ప్రచురించాయి.

శివగంగ రాజు ముత్తు వడుగనాథర్ మొదటిభార్య రాణి వేలునాచియార్, కుమార్తె వెళ్ళాచి నాచియార్ మంత్రి తాండవరాయ పిళ్ళై సహాయంతో కొల్లన్ గుడి ప్రాంతంలో తలదాచుకొన్నారు. తమ వారిని శత్రువులు సంహరించార్న విషయం తెలుసుకొని అక్కడ నుండి రాణి, వారి కుమార్తె రహస్య మార్గం గుండా తప్పించుకొని మంత్రి సహాయంతో దిండిగల్ దగ్గర గల విరూపాక్షపాళెంకు చేరుకొని అజ్ఞాతంలో, గోపాలనాయకర్ అనే సామంత పాలకుని సంరక్షణలో సుమారు 8 సంవత్సరాలు గడిపారు. ఆ సమయంలో 'తాండవ రాయ పిళ్ళై' శిక్షణలో రాణి వేలునాచియార్ తమిళ, తెలుగుతో పాటు ఉర్దు, పర్షియన్, ఫ్రెంచ్, ఆంగ్లం మొదలైన ఆరు భాషలు నేర్చుకొన్నది.

**యుద్ధబలం కన్నా యుద్ధ తంత్రం మిన్న! :** బ్రిటిష్ ఈస్టిండియా వారిని ఎలాగైనా నిలువరించాలని భావించి, ఫ్రెంచ్ దేశస్థుడైన 'జోన్డూప్లే' శిక్షణలో వేలునాచ్చియార్ యుద్ధతంత్రాలు నేర్చుకొని రహస్యంగా జీవిస్తూనే, ఏవిధంగా బ్రిటిష్ వారిని ఎదుర్కోవాలో ఎత్తులు వేయసాగింది. ఇదే సందర్భంలో గోపాల నాయకర్ సహాయసహకారాలతో మైసూరు పాలకుడు హైదర్ అలీతో మైత్రి చేసుకొని తన బలాన్ని, బలగాన్ని పెంచుకొంది రాణి వేలునాచియార్. 1780 సం.లో తన ఉనికి గురించి శత్రువులు తీవ్రంగా హింసించినా, నోరు విప్పక వారి ద్రోహానికి బలైన అంగ రక్షకురాలు గుర్తుగా 'ఉదయల్' అనే ఒక ప్రత్యేక మహిళా సైనికదండును వేలునాచియార్ తయారుచేసింది. అయితే ఆంగ్లేయుల దగ్గర ఉన్న ఆయుధసామగ్రి ముందు వీరి బలం చిన్నదే! ఇక్కడ 'యుద్ధబలం' కన్నా 'యుద్ధ తంత్రం' పనిచేస్తుందని భావించి తన దండులోని వారికి మానసిక బలాన్ని అందించింది. అదనుకోసం ఎదురు చూడసాగింది.

ఆంగ్లేయుల అధీనంలో ఉన్న శివగంగ కోటలోపలి కోవెలలో అమ్మవారిని దర్శించుకొనేందుకు ఆనాడు ఆడవారికి మాత్రం అనుమతి ఇచ్చేవారు. దీనిని అవకాశంగా తీసుకొని, ఒకసారి దసరా నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గుళ్ళో పూజలు చేసే నెపంతో భక్తురాళ్ళ ముసుగులో రాణి వేలు నాచియార్ తయారు చేసిన 'ఉదయల్' ప్రత్యేక మహిళా సైనిక దండు 'కుయిలీ' అనే యువతి నేతృత్వంలో వ్యూహం పన్నింది. ఆంగ్లేయుల మీద ప్రతీకారం తీర్చుకొనేందుకు గుడిలో దీపం కోసం వుంచిన ఆజ్యాన్ని (నెయ్యి) కుయిలీ ఒంటిపై కుమ్మరించుకొని ఆంగ్లేయుల ఆయుధాల గదిలోనికి జొరబడి తనకు తాను నిప్పు అంటించుకొని ఆత్మాహుతై, ఆయుధాల గదిని పేల్చి వేసింది. చరిత్రలో మొట్ట మొదటిసారి 'మానవ బాంబు' ఈమేనని చరిత్రకారుల అభిప్రాయం. (బ్రిటిష్ పాలన నేపథ్యంలో ఒక అగ్రనటుడు నటించిన తెలుగు చిత్రంలో ఈ దృశ్యాన్ని చిత్రీకరించడం జరిగింది.)

ఆ విధంగా ఆంగ్లేయుల ఆయుధాగారం నాశనం కాగా, వారిని బలహీనపరచి, వారిపై దాడిచేసి, తన శివగంగసీమను తిరిగి దక్కించుకొంది రాణి వేలునాచియార్. తన పాలనకాలంలో శివగంగ సంస్థానంలో ఉరిశిక్షను రద్దు చేసింది. కొన్నేళ్ళకు వేలునాచ్చియార్ అనారోగ్యానికి గురై ఫ్రాన్స్‌దేశానికి వెళ్ళి చికిత్స కూడా తీసుకొంది. కాని ఫలితం లేక పోయింది. 1790 సం.లో వేలు నాచియార్ మరణించింది. నేటి తమిళనాట శివగంగ కోట ముందు వేలు నాచియార్ కాంస్య విగ్రహం మనకు దర్శనం ఇస్తుంది. 2008 సం.లో భారత ప్రభుత్వం ఆమె సంస్మరణార్థం పోస్టల్ స్టాంప్ విడుదల చేసింది. 2014 సం.జూలై 18 వతేదీన అప్పటి తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత 'వీరమంగై వేలు నాచియార్ మెమోరియల్'ను శివగంగలో ప్రారంభించారు. ఆ తరువాత దాని పక్కనే 'అమర వీర వనిత కుయిలీ మెమోరియల్ ట్రస్ట్'ను కూడా పెట్టడం విశేషం.

**తెలుగు సంస్కృత భాషలలో చక్కటి ప్రావీణ్యత! :** ఆనాటి కోటలు, దేవాలయాలు, విద్యాలయాలు, ఇతర కట్టడాల భాధ్యతలను ప్రస్తుతం శివగంగ వారసురాలు మధురాంతకి నాచియార్, మహేష్ దొరై చూసుకొంటున్నారు. అవ్వగారైన "రాణి వేలు నాచియార్ ఆంగ్లేయులతో పోరాడి, ఓడిపోయినా తిరిగివచ్చి తన సీమను చేజిక్కించుకొన్న మొట్టమొదటి స్వాతంత్ర్య సమర యోధురాలు" అని సగర్వంగా వారు చాటి చెబుతారు. 'ముత్తు వడుగు నాయకర్' అనేది తమకు గల బిరుదని చెప్పారు. సంగంకాల చరిత్ర ప్రకారం తమిళులు తెలుగు వారిని 'వడుగర్' అని పిలిచేవారు. 'వడుగర్' అని అంటే వారికి ఉత్తర ప్రాంతంలో ఉన్నవారు అని అర్థం. ఇంకా 'గౌరి వల్లభ', 'ముత్తువల్లభ' అనే బిరుదులు వీరికి ఉన్నాయి. "మా తాతగారైన షణ్ముఖరాజు తెలుగు, సంస్కృత




శివగంగ సంస్థానం

భాషలలో చక్కటి ప్రావీణ్యాన్ని సాధించారు'' అని మధురాంతకి నాచ్చియార్ చెప్పారు.

**అన్నవరంతో అనుబంధం :** శివగంగ సంస్థానానికి తెలుగునాట సంస్థానాల వారితో చాలా బలమైన సంబంధాలే ఉన్నాయి. తూర్పుగోదావరి అన్నవరం సంస్థానంతోను, విజయనగరం జిల్లా బొబ్బిలి వారితోను వైవాహిక సంబంధాలు ఉన్నాయి. ముఖ్యంగా అన్నవరం ఆలయ ధర్మకర్తలతో సన్నిహిత సంబంధాలున్నాయని చెప్పారు. "రాజమ్మ(జేజమ్మ) గారి అన్నకొడుకు అన్నవరం ఆలయ ధర్మకర్త!" అని ప్రస్తుత రాణి మధురాంతకి నాచియార్ అన్నారు. అన్నవరం దేవస్థాన ధర్మకర్త కిర్లంపూడి జమిందారు కీ. శే. ఇనుగంటి రామ్ కుమార్ ఈ విషయాన్ని ధృవీకరించారు. "పూర్వం శివగంగ సంస్థానంలోని రాజావారికి మామేనత్తను ఇచ్చారు. ఆవిధంగా అత్తగారి సంబంధీకులు శివగంగ సంస్థానంలో ఉన్నారు. అలాగే రామనాథపుర సంస్థానంలో మా అక్క గారిని ఇచ్చాము. అక్కడివారు తెలుగు భాషను అర్థం చేసుకోగలుగుతారు" అని చెప్పారు. రాణి మధురాంతకి నాచియార్‌తో నేను ముఖాముఖి జరిపినపుడు తెలుగులో మాట్లాడితే బాగా అర్థం చేసుకున్నారు. కాకపోతే ఇంగ్లీషు, తమిళంలో సమాధానం చెప్పారు. వారి కోట లోపలికి మమ్మల్ని సాదరంగా ఆహ్వానించి అందులోని విశేషాలు తెలియజేశారు.

**శివగంగ కోటలో గౌరి విలాసం(మూలమాడి సంస్థానం):** శివగంగ కోట లోపల మూడు అంతస్థుల భవంతి ఉంది. పై అంతస్థులో రాణివాసం. అంతస్థుపైన బంగారంతో నిర్మించిన బంగారు కలశం ఉండటంతో దీనికి 'తంగ కలశ భవంతి' అనే పేరు వచ్చింది. రెండో అంతస్థులో అపురూపమైన తైల వర్ణ చిత్రాలు ఉన్నాయి. మొదటి అంతస్థులో, వీరి పూర్వీకులు ఉపయోగించిన ఖడ్గాలు, ఆయుధాలు ఉన్నాయి. ఆంజనేయ స్వామి గంగతో పాటు వున్న రాజచిహ్నం వీరిది. ఇలాంటిది వేరెక్కడా మనకు కనిపించదు.

**మధురాంతకి నోట తెలుగు పలుకులు! :** "బావ, పెద్దమ్మ, నాయన, రాజమ్మ, బువ్వ, సీమ" మొదలైన తెలుగు పదాలు కొన్ని వారి వాడుక భాషలో ఉపయోగిస్తారని మధురాంతకి నాచియార్ చెప్పారు. "మీరు తెలుగు మూలాలు ఉన్నవాళ్లే!" అని నేను మధురాంతకి రాణితో అనగానే ఆమె వెంటనే ఒక చిరునవ్వు నవ్వి, తన ముందువున్న బల్లపై ఉన్న నోటుపుస్తకంలో తెలుగు అక్షరమాలలోని 'అ,ఆ' రెండు అక్షరాలను చక్కగా వ్రాసిచూపి నా పరిశోధనకు మరింత బలం చేకూర్చింది. తను చేవ్రాలు చేసిన శివగంగ చరిత్రకు సంబంధించిన పుస్తకాన్ని నాకు అందించారు. దానిని భద్రంగా దాచుకొన్నాను.

**తొట్ట తొలి స్వాతంత్ర్య సమరయోధురాలుగా ఘనత!** చివరిగా నా పరిశీలనలో తేలిందేమంటే బ్రిటిష్ వారిని ఎదురొడ్డి నిలిచిన తొలి స్వాతంత్ర్య యోధుడు కట్టబొమ్మన అయితే, తెల్లవాళ్ళ అంతు చూసేందుకు కత్తి దూసిన తొలి వీరనారి, ప్రథమ స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి వేలునాచియార్ అన్న వాస్తవం చాలామందికి తెలియదు! ఇక్కడ చారిత్రకంగా ముఖ్యమైన విషయం ఏమిటంటే "ఝాన్సీ లక్ష్మీబాయి లాంటి వాళ్లు శత్రువులతో పోరాడి వాళ్ల ప్రాణాలను పోగొట్టుకొన్నారు. కానీ వేలు నాచియార్ ఓడిపోయినా, తిరిగివచ్చి ఆంగ్లేయులతో పోరాడి తన శివగంగసీమను చేజిక్కించుకొని సుమారు పది సంవత్సరాలు పాటు శివగంగ సంస్థానాన్ని పాలించి దక్షిణాపథ చరిత్రలో మొట్టమొదటి స్వాతంత్ర్య సమర యోధురాలుగా ఘనతకెక్కి చరిత్రలో నిలిచి పోయింది! తెలుగు జాతికి గర్వ కారణమైంది!"

డా. సగిలి సుధారాణి
ఫోన్ : 9490428825

# మాకొద్దీ దొరతనము

– ఆచార్య కొలకలూరి మధుజ్యోతి

గరిమెళ్ళ సత్యనారాయణ (14.7.1893-18.12.1952) రాసినది మాకొద్దీ తెల్ల దొరతనము, కుసుమ ధర్మన్న కవి రాసినది మాకొద్దీ నల్ల దొరతనము.

1920 డిసెంబరులో కలకత్తాలో జరిగిన కాంగ్రెస్ సభలలో సహాయ నిరాకరణ తీర్మానం ఆమోదం పొందింది. ఆ సభల వలన కలిగిన ఆవేశం గరిమెళ్ళ 'మాకొద్దీ తెల్ల దొరతనం' రాయడానికి కారణం అయ్యింది. కుసుమ ధర్మన్న 1921లో 'మాకొద్దీ నల్ల దొరతనము' రాశారు. తెల్ల దొరతనం వద్దు అనటం బాగానే ఉంది. అది సమకాలీన చైతన్య ప్రదర్శితం. కానీ ఇక్కడే ఉన్న నల్ల దొరలు తీరు!? తెల్లవారి అధికారం మారటం, స్వేచ్ఛా స్వాతంత్ర్యాన్నివ్వటం అలా ఉంచితే, తమ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గుప్పిట పట్టి ఊపిరి సలపనివ్వని నల్ల దొరలు మారేదెన్నడు? ఈ దృష్టి కుసుమ ధర్మన్నది. ఈ రెండు రచనలు రెండు అవసరాలు నెరవేరటానికి రాసినవి. ఈ దేశంలో సమాంతరంగా సాగుతున్న మానవ జీవితాలను ఈ రెండు రచనలు అక్షరీకరించి చరిత్రను చూపుతూ చరిత్రగా మిగిలాయి. గరిమెళ్ళసత్యనారాయణ, కుసుమ ధర్మన్న ఇరువురూ సమకాలికులు. ఈ రెండు రచనలు ఒకే కాలంలో రాసినవి. అయినా, రెండు విభిన్న చారిత్రకవాస్తవాలకు ఇవి దర్పణాలు. ఈ రెండు మారవలసిన నాటి విషయాల ప్రస్తావనలు.

**1. గాంధేయ దృక్పథం :** మాకొద్దీ తెల్ల దొరతనము గేయం గాంధీ ప్రభావంతో రాసినది. జాతీయోద్యమం, అందులో భాగంగా సహాయ నిరాకరణోద్యమం జరుగుతున్న కాలం అది. బ్రిటిష్ పాలకుల దమన నీతిని తీవ్రంగా నిరసిస్తున్న కాలం. స్వాతంత్ర్య సముపార్జనకు ఉద్యమిస్తున్న భారతీయులను ఆంగ్ల పాలకులు తమ పాలన అనే ఇనుప పాదాల కింద అణచివేస్తున్న కాలం. ఇవన్నీ గరిమెళ్ళ రచనలో కనిపిస్తాయి. ఉప్పు సత్యాగ్రహం, విదేశీ వస్తు బహిష్కరణ, ఖద్దరు వాడకం భారతీయుల పోరాట స్ఫూర్తిగా ఉంటే ఉప్పు ముట్టవద్దంటారు ఆంగ్లేయులు. గాంధీ టోపిని వాడవద్దంటారు. 'రాజ ద్రోహమంతా రాట్నములో యున్నదట' అని ఆంగ్ల పాలకులను ఎద్దేవా చేశాడు. ఆంగ్లేయులు మత్తు పానీయాలను తయారు చేసి భారతీయుల ఆరోగ్యాలను కృంగదీసారంటూ ఆంగ్లేయుల అరాచకాన్ని ఎత్తి చూపాడు కవి. ఆంగ్ల పాలకులు భారతీయుల పంట భూములను హస్తగతం చేసుకొన్నారు, తమపై పన్నుల భారం మోపారని బాధపడ్డాడు. 144 సెక్షన్ పేరుతో తమ వాక్ స్వాతంత్రాన్ని హరించటాన్ని నిరసించాడు. మీ సేనవొచ్చి కాల్చినా సత్యాగ్రహాన్ని వీడం, శాంతి పథాన్ని వీడం అన్నాడు. అది నాటి భారతీయుల సత్యాగ్రహ దీక్షాతత్వం. గరిమెళ్ళ కూడా ఆ ఉత్సాహ పూరితుడే

**తిట్లు, శాపనార్థాలు :** సాధారణ మానవులు అసంతృప్తిని ఎలా వ్యక్తం చేస్తారో, అలా గరిమెళ్ళ కూడా వ్యక్తం చేశాడు. ఆంగ్లేయుల తీరు పట్ల విసుగు చెందిన కవి వారి తీరును నిరసించాడు. 'కయ్యాలకీ ముందు కాలు దువ్వి వెనుక దెయ్యమై మింగుతాడు' అంటూ వారి స్వభావాన్ని దుయ్యబట్టాడు. వారి దోపిడీని 'వాడి తాత గాడీ మూట దాచీ పెట్టిన యట్లు/ ధాటీ చేస్తాడీ దేశమున' అని ప్రజల భాషలో నిరసించాడు. వాడి ముల్లె కాని వాడి తాత ముల్లె కాని లేకపోయినా, మొహమాటం లేకుండా దౌర్జన్యాలు చేస్తాడు దోచుకొంటాడు ఆంగ్లేయుడు. 'వాడి శాసనాలు మాడిపోనూ వాడి గోడియే మాకొద్దు తండ్రి' అని శాపనార్థాలూ పెట్టాడు గరిమెళ్ళ. తీవ్ర నిరసన ఈ వ్యక్తీకరణల్లో ఉంది. ఈ గేయంతో ఆంధ్ర ప్రజానీకం ఊగిపోయింది. దీనికి లభించిన ప్రాచుర్యం కవికి ఏడాది పాటు జైలు శిక్షకు కారణం అయ్యిందీ అంటే ఎంతటి ప్రాచుర్యాన్ని పొందిందో అర్థం చేసుకోవచ్చు.

**ఆత్మానుశీలన :** గరిమెళ్ళ ఆంగ్ల పాలకులను తిట్టే క్రమంలో తనలో తాను ఆత్మానుశీలన చేసుకొన్నాడు. ఇది ఒకరకంగా నాటి సమాజ ఆత్మానుశీలన. సమాజం ముక్కలు, చెక్కలుగా ఉంది. దాని ఫలితమే పరపాలన. 'మా ధర్మమయ్యె ఐకమత్యముతోను అలరారుతామయ్య'. ఐకమత్యం లేదు అది పాటించడం ఇప్పుడు అనుసరించాల్సిన ధర్మం అని పేర్కొన్నాడు. కొందరు ఇంకొందరిని నాడు దోచుకొన్నారు. అందుకే 'ఎన్ని జన్మములందు ఏమీ పాపము చేసి, కన్నూ గానక తిరిగినాము/ ప్రజల అన్నమెల్లా గ్రుమ్మినాము/ దైతులకన్నా చెడ్డగా మెగిలినాము/ దున్నల వలె నేడు దొరికితిమి దొరలాకూ' అంటూ తాము చేసిన తప్పులూ, దానికి ప్రతిఫలంగా నేడు దొరలు చూపుతున్న క్రూరత్వానికి గురి కావడాన్ని గుర్తు చేశాడు. సంతాపం వ్యక్తం చేశాడు, గాంధేవాది అయిన గరిమెళ్ళ.

**దిద్దుబాటు :** బ్రిటిష్ వారి దౌర్జన్యాలకు దారుణాలకు తమలోని అనైక్యతే కారణమని, గ్రహింపు నాడు సమాజంలో ఉంది. ఈ కవిలోనూ ఉంది. గాంధీ జాతీయోద్యమంలో భాగంగా హరిజనోద్ధరణను చేపట్టాడు. కాంగ్రెసు దానిని బాగా ప్రచారం చేసింది. హిందువుల మైన తామందరూ ఒకరితో ఒకరు సంఘర్షించుకొంటే అనైక్యంగా ఉంటే ఫలితం శూన్యమని, ఆంగ్ల ప్రభుత్వం దిగిరాదని గ్రహించి అస్పృశ్యతను నివారించే చర్యను అందరూ చేపట్టారు. గరిమెళ్ళ అదే అంటున్నాడు. 'బ్రాహ్మణాబ్రాహ్మణ పంచమాబ్రాహ్మణ భేదాల తెగులు మీకేలా/ మీ భేదాల వడి గొల్చరేల/ చెడు బోధనలకు లొంగిరేల/ ఈ మధూకరపు వృత్తి మరిగినారది యేల' అంటూ ఈ భేదాలను తొలగించు కొమ్మని చెప్తూ 'ఎవరెన్ని చెప్నా హిందూ దేశ వాసులేక సోదరూలమండి/ అంటూ దోషాము మాకు లేదండీ/ అంటూ చాటుదాము రండీ' అని దిద్దుబాటు చర్యలకు ఊతాన్నిచ్చాడు. జాతీయోద్యమ సాధనకు అంటరానితనాన్ని నివారించాలనే గాంధీ భావనను అనివార్యంగా చేపట్టాలని అందరూ అర్థం చేసుకొన్నారు. దీనిని ఒక ఆదర్శంగా నాడు భావించి అందుకొన్నారు. సోదర భావాన్ని కలిగి ఉండటానికి ప్రయత్నించారు. ఆ సంస్కరణ భావాలే గరిమెళ్ళ ఇక్కడ ప్రకటించాడు. 'మాకొద్దీ తెల్ల దొరతనము దేవ' అని ఆరంభించిన గరిమెళ్ళ 'మా పాపముల నెల్ల బాపి రక్షించుమెు పావనాశన ధర్మమూర్తి' అని దైవాన్ని ప్రార్థించాడు. తన గేయంలో తెల్ల దొరల దాష్టికాన్ని చెప్పాడు, గాంధీ పోరాటాన్ని, సత్యాగ్రహ మార్గాన్ని చాటాడు, తమ లోపాలనూ వ్యక్తం చేశాడు, రక్షించ వలసిందిగా భగవంతుడిని ప్రార్థించాడు. గాంధేయవాదిగా నిలిచాడు.

**2. అంబేద్కర్ దృక్పథం :** కుసుమ ధర్మన్న తొలుత గాంధేయవాది. ఆపై అంబేద్కర్ వాది. విద్యావంతుడైన ఈ కవి, సమాజంలో నెలకొని ఉన్న వ్యత్యాసాలను గుర్తించాడు. బ్రిటిష్ పాలకులు సమాజంలోకి సమానత్వం తెచ్చారు. దళితులను సమానంగా చూశారు వివక్షతతో చూడలేదు. తోటి హిందూ సమాజం వేల ఏళ్లుగా దళితులను దూరంగా ఉంచింది. బ్రిటిష్ వారు స్వాతంత్ర్యం ఈ దేశానికి ఇస్తే వందల ఏళ్ళ సమస్యకు -పరపాలనకు- పరిష్కారం లభిస్తుంది. ఈ దేశంలో వేల ఏళ్లగా ఉన్న సమస్యకు -అస్పృశ్యతకు -ఈ స్వాతంత్ర్యం పరిష్కారం ఇవ్వదు. మరి పరిష్కారం ఏమిటి? ఈ ప్రశ్న అందరిలో ఉంది. జాతీయంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ రాజకీయంగా కలిగించిన చైతన్యం కూడా కారణమే. దళితుల పట్ల బ్రిటిషు పాలకులు చూపిన సమతా దృక్పథం, దళితులలో కొత్త ఆశలు చిగురించడానికి కారణం అయ్యింది. దళితులకు వేల యేళ్లగా జరిగిన అవమానాలకు ఆంగ్ల పాలకుల దృక్పథం లేపనంగా నిల్చి, ఓదార్పు నిచ్చింది. వారు దేశానికి స్వాతంత్ర్యాన్ని ఇస్తే సంతోషం. అంతకంటే ముందు తమ సమస్యకూ పరిష్కారం చూపాలని, దేశంలోని అన్ని ప్రాంతాలలో ఉన్న దళితులలోనూ వ్యక్తమయిన, ఉన్న అభిలాష ఇది. ఇదే భావనను డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ తర్వాతి కాలాలలో లండన్ లో జరిగిన 2 రౌండ్ టేబుల్ కాన్ఫరెన్సులో బలంగా వ్యక్తం చేశాడు. భారతదేశం నుంచి వచ్చిన ప్రతినిధులందరిలోనూ, వారి వ్యతిరేకతను ఖాతరు చెయ్యకుండా నిస్సంకోచంగా తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశాడు. ఆ వాణి అశేష దళిత ప్రజానీకానిది.

**వివక్ష :** కుసుమ ధర్మన్న కవి 'మాకొద్దీ నల్ల దొరతనము- దేవ....../ మాకు పదిమందితో పాటు -పరువు గలుగక యున్న' అంటూ తన గేయాన్ని ఆరంభించాడు. దానిని సాధించడం ఎంత కష్టం!? హిందూ సమాజం, వర్ణాశ్రమ ధర్మాలను మీరటం వల్ల మీరిలా అయ్యారంటారు. మేం కష్టపడితే కూర్చొని తింటారు, లేని అప్పులు పెంచి కోర్టులకు ఈడుస్తారు. పశుపక్షాదులకంటే, హీనంగా చూస్తారు. ఎరుకలు, యానాదులు, చాకలి ,మంగలి వంటి వారిని ఆదరిస్తారు. తమను ఏ మాత్రం గుర్తించరు. చివరికి తెల్లదొరలను కూడా ఆలయాలకు రానిస్తారు తమను నిరాకరిస్తారు. రైలు, పడవ, కోర్టు, గ్రామ కచేరీలలోనూ కాఠిన్యమే. అంటు అంటూ తొలగదోస్తారు అని తన ఆవేదనను వ్యక్తం చేశాడు. నాడు ఎంతటి వివక్ష!?

పొలం పనులు ఇంటి పనులు ఏవైనా దళితులు చేయవచ్చు, పనులు చేసేటప్పుడు అంటు ఉండదు. 'యేమిపని లేనపుడు యెడగాలుండాలంట'. మతం వేరైన ముస్లింలను మన్నిస్తారు కాని దేవుళ్లు కట్టు బొట్టూ దేశమూ ఒకటే అయినా కూడా దళితులను ముట్టరు. గాంధీ సిద్ధాంతాలిష్టపడతారు కానీ దళితులంటే మండి పడతారు! '............ మన ఖద్దారు గట్టమంటారు/ శాంతమే స్వారాజ్యమంటారు/ శాంతి సైన్యామంటూ నిలుపుతారు/ మా మాలల సంగతి యేమి మహి మీద చెప్పారు' అంటు దళితుల కోరికలను పట్టించుకోని వైఖరిని చాటాడు. దళితులను చదువుకోనివ్వరు, చదువుకొన్న అందరూ అన్నదమ్ములంటారు ప్రకృతిలో లేని వివక్ష సమాజంలో

ఎందుకు? దళితులను వేరుగా చూస్తారు. మంచికి ఆనందానికి సుఖానికి సంతోషానికి ఆటపాటకు దళితులను దూరంగా ఉంచుతారు అంటూ ఎన్ని రూపాలలో దళితులు వివక్షకు గురి అవుతున్నారో చాటాడు. పగలు రాత్రి, వాన ఎండ, జనన మరణాలు సృష్టిలోని సమస్తం అందరికీ సమానం. ప్రకృతిలో లేని వివక్ష సమాజంలో ఎందుకు? దళితులకు ఈ వర్ణ వివక్ష ఎందుకంటాడు కవి. పరాయి దేశస్తులు ఆదరిస్తే, తమ హిందూ సమాజంలో కలవద్దంటారు. తమకూ దూరంగా ఉండమంటారు. ఇదెలాంటి న్యాయం అంటూ నిలదీశాడు. హిందూ సమాజంలోని అనైక్యతను వివక్షను గూర్చి గరిమెళ్ళ పేర్కొన్నట్టే, కుసుమ ధర్మన్నా పేర్కొన్నాడు.

**ఆర్థిక దోపిడి :** దళితులు ఎన్నో ఏళ్ళగా ఆర్థిక దోపిడీకి గురయ్యారు. వారి శ్రమను దోచుకొన్నారు. ఏ కాస్త అవసరం పడినా అప్పులు ఇచ్చి వడ్డీలు కూడా కట్టలేని స్థితిలో ఉన్నటువంటి వారి నుంచి, బలవంతంగానైనా ఉన్న కొద్దిపాటి భూమినీ, ఇంటిని గదుముకొన్నారు. ఉన్నత వర్గాలవాళ్లు నిరుపేదలను మరింత దరిద్రంలోకి నెట్టేస్తారు. ఆర్థికంగా తమను దోచుకోవడాన్ని 'మా కళ్ళ దుమ్మేసి మాకున్న మాన్యాలు/ గదుమూకొని కలుపూ కొంటారు/ అప్పులిచ్చి కొంపముంచుతారు' అంటూ వారి దుశ్చేష్టలను ప్రకటించాడు. '....లేని అప్పులెన్నో పెంచుతారు/ చంపగొట్టీ కొంప లాగుతారు/ కొట్టి తిట్టి కోర్టుకు లాగుతారు దేవ'. ఇది దోపిడి చేసే తీరు. అసలే దళితులది అసహాయ స్థితి. ఆపై కోర్టు కచేరి వీరి జీవితాలు ఇలా నలిగిపోతున్నాయి అని నాటి వాస్తవాన్ని కళ్ళకు గట్టాడు. 'స్వారాజ్యమనుచు సర్కారుతో పోరాడి/ స్వాతంత్రీయ మడుగుతారు/ మాకు స్వాతంత్రీయ మివ్వబోరు/ .... మాలలంటే హక్కు లేదంటారు/ మాకు హక్కు లేదంటే స్వారాజ్యమెక్కడ దక్కు' అని ప్రశ్నించాడు. ఈ ప్రశ్నలో ధిక్కారం ఉంది. నిశిత దృష్టితో చూస్తే హెచ్చరికా ఉంది. హిందూ ధర్మ బోధకులు, ఇతిహాసాలను రాసిన వారు దేవుళ్ళు దేవతలు తమ వారే అని ధైర్యంగా చాటాడు. 'మా యతిథులై వచ్చి మమ్మణగ ద్రొక్కితిరి నేటికి మీరు' అంటూ చారిత్రక అవగాహనతో పేర్కొన్నాడు. నాటి ఆర్యులు ఈ దేశానికి వచ్చిన వారుగా చరిత్ర చెబుతుంది. అలా వచ్చిన వారు స్థానికులను అణగ దొక్కటాన్ని ఇక్కడ కవి పేర్కొన్నాడు.

**చైతన్యం :** సమాజంలో పెరుగుతున్న సామాజిక చైతన్యంతో, రాజకీయ అవగాహనతో ఎందరో వర్ణ వ్యవస్థ వల్ల కలుగుతున్న దురాగతాలను గుర్తించారు. ఆ పరిస్థితిని మార్చాలను కొన్నారు. దీనికి గాంధీ ఉద్దేశించిన హరిజనోద్ధరణ పూనికను ఇచ్చింది. అనేకులు దళితుల దురవస్థను గుర్తించారు. వారి ఉద్ధరణకు నేడు బాల ముకుందు, లాల్జీ సతిగారు, హీరాబాయి, చిలకమర్తి, కందుకూరి పూనుకొన్నారు గౌరవిస్తున్నారు అని నాడు సమాజంలో నెలకొని ఉన్న కలిగిస్తూ ఉన్న చైతన్యాన్ని చాటాడు. అదే చైతన్యంతో మా ఆత్మగౌరవాన్ని గుర్తించే వరకు, 'మాకు హిందూ సంఘము నందు/ స్వాతంత్ర్యమగు వరకు' సమాజ దౌర్జన్యాలు అడుగంటే వరకు 'మాపై భాతృ భావము జూపు వరకు/జాతి భేదంబు లడుగంటు వరకు/...' మాకొద్దీ నల్ల దొరతనము అని ఖరాఖండిగా పేర్కొన్నాడు.

**ముగింపు :** గరిమెళ్ళ కాంక్షించినది స్వాతంత్ర్యం, ధర్మన్న కాంక్షించినది సమానత్వం. ఆంగ్ల ప్రభుత్వం ఈ దేశాన్ని విడిచి వెళ్ళింది. స్వాతంత్ర్యం సముపార్జించుకొన్నాం. గరిమెళ్ళ కాంక్ష ఫలించింది. హిందూ సమాజం తమను సమానంగా చూడాలని ధర్మన్న కాంక్ష హిందూ సమాజం దళితులూ ఇక్కడి వారే, కలిసి ఉండవలసిందే కానీ, ధర్మన్న కోరిక నేటికి ప్రశ్నార్థకమే. స్వతంత్ర దేశంలో రాజ్యాంగం బాధ్యతనిచ్చింది. సమానత్వాన్ని పేర్కొంది కాని అవి కాగితాలకే పరిమితమవుతూ ఉన్నాయి. సమాజం తమలో ఉండవలసిన హృదయ సంస్కారాన్ని దాని మంచి నేర్చుకోలేదు. రెండు చారిత్రక వాస్తవాలకు దర్పణాలు ఈ రెండు రచనలు. గరిమెళ్ళ, కుసుమ ధర్మన్న ఇద్దరూ దేశభక్తులు. ఇద్దరిలో సామాజిక చైతన్యం ఉంది. సమాజం ఎలా మారాలి అనే అంశంపై స్పష్టత ఉంది. దళితులను సమాజంలో కలుపుకోవాలని కలవాలని కోరిక ఉంది. తాము చేసిన తప్పులను గరిమెళ్ళ వ్యక్తం చేస్తే, తమ పట్ల సమాజం చూపిన వివక్షను కుసుమ ధర్మన్న బాహాటంగా చూపాడు. జాతియోద్యమంలో దళితులను కలుపుకోవాలని తమ వారిని గరిమెళ్ళ హెచ్చరిస్తే, దళిత స్వేచ్ఛాస్వాతంత్ర్యం ఆత్మగౌరవం దక్కకపోతే ఈ దేశ స్వాతంత్ర్యంలో తాము భాగం కాకపోతే స్వాతంత్రం ఎలా దక్కుతుందని ధర్మన్న నిలదీశాడు. అందరూ కలిస్తేనే అందరికీ సుఖమన్న భావన దళితుల విషయంలో ఈ ఇద్దరిలో వ్యక్తం కావటం దేశ భవితకు సంతోష కారకం. ఎప్పటికైనా సిద్ధించగలదని నేటికీ అభిలాష.

**ఆచార్య కొలకలూరి మధుజ్యోతి**
**(పూర్వ ఉపాధ్యక్షులు, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం)**
**శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, తిరుపతి**

# ఆట – జీవితానికి ఆదర్శం

– ఆచార్య తంగెడ కిషన్ రావు

**ఆటవిక దశ :** ఆటవిక దశలోని మానవునికి ప్రకృతి పరిసరాలే నివాసయోగ్యాలు. క్రమబద్ధమైన జీవితం లేదు. సంచార జీవనమే లక్ష్యం. ఎక్కడ తిండి దొరికితే ఆ పూటకు అక్కడే నివాసం. ఆ తిండి ఒక జంతువు మాంసం లేదా చెట్టుతో ముడిపడిన కాయ, కసరు, ఆకు, అలమూ ఇలా ఏదైనా కావచ్చు. ప్రకృతి వైపరీత్యాలకు తట్టుకోగల్గినా క్రూరమృగాల ధాటికి మాత్రం నిలువలేకపోయాడు – ఆనాటి మానవుడు. అడవిలో మృగాలు తరిమితే తనను తాను రక్షించుకునేందుకు ప్రయత్నించేవాడు. ఆహారం విషయంలో గాని, తనను తాను సంరక్షించుకునే సందర్భంలో గాని, అతని ఆలోచనకు తొట్టతొలుత పని కల్పించింది మాత్రం జంతువే! జంతువు తరిమినప్పుడు పరుగు తీసేవాడు. చిన్న కాలువగానీ, గుంతగానీ వచ్చినపుడు దాన్ని దాటేందుకు ఒక్క దుముకు దుమికేవాడు. నదిగానీ, ఏరుగానీ అడ్డంగా వస్తే ఈదుతూ దాటేవాడు. సమీపంలో చెట్టు ఉంటే దానిపైకి ఎక్కి దాక్కునేవాడు. జంతువు మరీ సమీపంలో ఉంటే పెద్ద బండరాయిని ఎత్తి దానిపై పడవేసేవాడు. బల్లాన్ని జంతువుపైకి విసరటం, ధనుస్సులో బాణాన్ని ఎక్కుపెట్టి వదలటం – ఆలోచనా జ్ఞానం కొంత పెంపొందిన దశలోనే. ఈవిధంగా జంతువు నుండి తనను తాను కాపాడుకోవడంలోనే, అతడు తన ఆలోచనా పరిధిని పెంచుకొన్నాడు. వీటివల్ల అతనికి శారీరక శక్తి, వేగం మొదలైన లక్షణాలెన్నో పెంపొంది అవే క్రమంగా... నేటి క్రీడాంశాలుగా రూపుదిద్దుకొన్నాయి.

**పురాణ యుగం :** 'పూర్వగాధ' లేక 'ప్రాచీన కథ' అనే పేరుతో ప్రసిద్ధిపొంది, భారతీయ సంస్కృతిని ప్రతిబింబించేవి పురాణాలు. అవి పురాతన కాలం నాటివే అయినా ఆనాటి నవీన విషయాలను తమలో ఇముడ్చుకోవడం గమనార్హం. అందుకే అవి "పురాపినవమ్ పురాణమ్' అనే నానుడితో ప్రకాశించినాయి. అంటే 'పురాణాల్లో వర్ణింపబడిన వస్తు విశేషాలు పురాతనాలైనా నవ్యమై, నిత్య నూతనమై భాసిస్తాయి'. అందుకే – పురాణ పురుషులను పరిశీలించినప్పుడు, ఏదో ఒక క్రీడ వారి వ్యక్తిత్వ రూపంలోనో లేదా వారు ప్రయోగించే ఆయుధం ద్వారానో ప్రత్యక్షమై, అదే వారి ప్రత్యేక లక్షణంగా దర్శనమిస్తుంది.

ఉదా :

| ప్రాచీన క్రీడ | ఆధునికరూపం | పురాణ పురుషుడు |
|---|---|---|
| 1. విలువిద్య | ఆర్చరీ | అర్జునుడు |
| 2. ముష్టియుద్ధం | బాక్సింగ్ | భీముడు |
| 3. పర్వతమును మోయుట | వెయిట్ లిఫ్టింగ్ | శ్రీకృష్ణుడు (గోవర్ధనగిరి) |
| 4. సముద్రమును దాటుట | లాంగ్ జంప్ | హనుమంతుడు |
| 5. చక్రమును విసురుట | డిస్కస్ త్రో | శ్రీకృష్ణుడు (సుదర్శనం) |
| 6. జూదము | చెస్ | ధర్మరాజు |

ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే! ఆధునిక యుగంలో అంతర్జాతీయ క్రీడారంగంలో – అత్యధిక ప్రచారంలో ఉన్న ఈ ఆటల లక్షణాలు మరియు సామగ్రి – పురాణ పురుషులకు స్వతస్సిద్ధంగా స్వంతమై ఉన్నాయి. అవి వారి కార్య సాఫల్యానికి ఎంతగానో తోడ్పడి, శక్తియుక్తులతో వారిని వీరులుగా కాలచక్రంలో నిలబెట్టినాయి. పురాణ యుగం దాటి, ఆధునిక యుగంలో జన జీవితంలోకి ప్రవేశించిన ఈ ఆటలు, జీవన విధానంలో అంతర్భాగమై, ఆటలూ–జీవితమూ పరస్పర బంధంతో పెనవేసుకొన్నాయి.

**జన జీవితంలోని ప్రతి సన్నివేశం ఆటలకు సంబంధించినదే!** జానపదుల జీవితాల్లో ఆటలు ఎంతగా అంతర్భాగాలైనాయో వారి మాటలను పరిశీలించినప్పుడు తెలిసిపోతుంది. దీనివల్ల ఆటలపట్ల వారికి గల గౌరవభావం, ఆటలకు వారిచ్చే అత్యంత అమూల్యమైన విలువను ఊహింపవచ్చు. ఉదా : 1. ఇద్దరు వ్యక్తులు తమ భావాలను పంచుకోవటాన్ని 'మాట్లాడు కోవటం' అంటారు. (మాటలు + ఆడుకోవడం). 2. బోరింగు పంపువద్ద స్త్రీలు నీళ్లకోసం పోట్లాడుకుంటున్నారు. (పోటు+ ఆడుకుంటున్నారు). 3. పిల్లలూ! కొట్లాడుకోకండి (కొట్టుడు + ఆడుకోకండి) ఇలాంటి సంభాషణలను పరిశీలించాలే కాని ఇటువంటి ఎన్ని ఉదాహరణలైనా ఎత్తి చూపవచ్చు. నిజానికి పై వాటిలో ఏ ఒక్కటి కూడా ఆటకాదు. కాని జానపదుల దృష్టిలో ఏ ఒక్కటీ సీరియస్ విషయం కాదు. అందుకే

సీరియస్ విషయాలను కూడా వినోద సంబంధమైన ఆటతోనే వారు కలిపి చూస్తారు.

ఇద్దరు వ్యక్తులు వారివారి మనస్సుల్లోని భావాలను మాటల ద్వారా పంచుకోవటం కూడా జానపదుల దృష్టిలో ఒక ఆటే! అదేవిధంగా – స్త్రీలు నీళ్లు పట్టుకునే సందర్భాల్లో తొందరపడుతూ 'నేనంటే నేను ముందు' అనుకుంటూ ఒక్కొక్కసారి అదుపు తప్పి మాటలను తూలుతుంటారు. అది కొంతసేపే. వేడి చల్లారేంత వరకే. అందుకే కోపంతో కూడుకున్న వారివారి మాటలు కూడా చూసేవాళ్లకు ఒక ఆటే. ఇక – పిల్లల పరిస్థితి అయితే చెప్పవలసిన పనేలేదు. పెద్దలకన్నా తామేనయం అన్నట్టు అప్పటికప్పుడే కలసిపోతారు. అందువల్ల వారు కొట్టుకోవడం కూడా ఒక ఆట వంటిదే! ఈ విషయాన్ని గుర్తించని పెద్దల అరుపులు, మందలింపులే పిల్లలకు పెద్ద దెబ్బలవలె తగుల్తాయి.

ఈ విధంగా ఆట పరిధిలోనికి రాని విషయమంటూ జానపదుల దృష్టిలో లేదు. అది వారి మనస్సులోని నిర్మలత్వాన్ని మాత్రమే కాదు ఆటలకూ – జీవితానికీ వారు చూపించే సంబంధ బాంధవ్యాలను కూడా స్పష్టపరుస్తుంది. ఈ ఆటలు – నడువగల్గే వయసు వచ్చిన పసివాడి దగ్గర్నుండీ, కాలు చేతులూ కదపగల్గే వృద్ధుల వరకూ ఏదో ఓ రూపంలో ఉండి వాళ్లను ఉత్తేజపరుస్తూనే ఉంటాయి.

ఆట – నిజానికి జీవితంలో ఓ భాగం. అందుకే మేధావులెందరో జీవితాన్ని ఆటతో పోల్చారు. జీవితంలో ఏదో ఒక సమస్య ఎదురెవని మనిషంటూ ఎవరూ ఉండరు. ఆ సమస్యను అతడు ధైర్యంతో ఎదిరించి నిలబడితే దానికి పరిష్కారం ఉంటుంది. అలాకాక, పిరికితనంతో వేదనపడితే విలువైన జీవితం దెబ్బ తింటుంది. ఫలితం అనుకూలంగా లేకున్నా, సమస్యకు తట్టుకొని నిలబడగల్గడం ముఖ్యం. ఈ మౌలిక జీవన సిద్ధాంతాన్ని అంతస్సూత్రంగా కల్గిన విలువైన ఆటలను ఈ విధంగా విభజించవచ్చు.

**1. లింగభేదం** – బాలురు ఆడేవి, బాలికలు ఆడేవి, బాలబాలికలు కలిసి ఆడేవి, స్త్రీలు ఆడేవి, పురుషులు ఆడేవి, స్త్రీ పురుషులు కలిసి ఆడేవి.

**2. వయోభేదం** – పిల్లలు, యువకులు, పెద్దలు – ఇలా వేరువేరుగా ఆడేవి.

**3. స్థల నిర్దేశం** – ఇంటి లోపల, ఇంటి ముంగిట, చెట్లపైన, నీళ్లలో ఆడే ఆటలు. 4. సామగ్రి సహాయంతో ఆడే ఆటలు. 5. సామగ్రి లేకుండా ఆడే ఆటలు. 6. మౌఖిక సంబంధాలైన ఆటలు – కూత, మాట, పాటలతో వేరువేరుగా ఆడేవి. 7. ఉత్సవాల సందర్భంగా ఆడే ఆటలు. 8. శరీరానికి సంబంధించిన ఆటలు 9. బుద్ధికి సంబంధించిన ఆటలు 10. ఆటగాళ్ల సంఖ్య ననుసరించి – గుంపుగా ఆడేవి, రెండు జట్లుగా చీలి ఆడే ఆటలు.

ఈ విధంగా ఆటలను ఎన్నో విధాలుగా, సూక్ష్మ విభాగాల కింద కూడా విభజించవచ్చు. ఏది ఎట్లున్నా, జానపద మౌలిక లక్షణమైన సామూహికత్వమే ఈ ఆటల పుట్టుకకు కారణమైంది.

**ఆటలు–సామూహికత :** కాలక్షేపం, వినోదం, పరిసరాలు స్ఫూర్తినివ్వగా సామూహిక సృష్టినుండి పుట్టేవే ఆటలు. ఇందుకు ఉదాహరణగా బాలురకు సంబంధించిన ఒక ముఖ్యమైన సన్నివేశాన్ని వివరిస్తాను.

పశువుల కాపర్లయిన పిల్లలు, యువకులు మంద (పసువుల సమూహం)లను ఊరవతల చెరువు ఒడ్డునో, విశాలమైన బీడు ప్రాంతాల్లోనో మేపుతూ ఉంటారు. ఇలాంటి మందలన్నీ ఒక గ్రామానికి సంబంధించి ఎన్నయినా ఉండవచ్చు. అవి మేస్తుండగా దాదాపు ఒకే వయసులో ఉండే ఆ బాలురంతా తీరికగా ఉండి, చేసే పని లేక ఒకరిని ఒకరు ఆట పట్టించుకుంటూ, ఉడికించుకుంటూ, గిల్లికజ్జాలు తెచ్చుకుంటారు. అపుడు వాళ్లలో కొందరు పెద్దలుగా మారిపోయి, పంచాయితీ ద్వారా సమస్యను తీరిస్తే అంతా మళ్లీ కలిసిపోతారు. ఇది కొంతసేపు మాత్రమే! తర్వాత – ఏదో ఒక ఆటను రెండు జట్లుగా ఏర్పడి ప్రారంభిస్తారు. ఆ ఆట–మైదానంలో కావచ్చు, చెట్ల కొమ్మలపై కావచ్చు, చెరువులోని నీళ్లలో కావచ్చు. ఇలా ఒక సమూహం కల్సినపుడు కాలక్షేపం కోసం, వినోదం కోసం కొన్ని ఆటలు సామూహికంగా సృష్టింపబడుతాయి. అవి శారీరక ఆరోగ్యానికి, మానసిక పుష్టికీ కూడా తోడ్పడుతాయి. దానివల్ల వ్యక్తుల స్వభావం తెల్సిపోతుంది. గెలవాలనే పోటీతత్వం ఏర్పడుతుంది. వృత్తిలోని కష్టం తెలియకుండానే కాలం క్షణాలమీద దొర్లిపోతుంది. సామూహిక బలం ఏర్పడుతుంది. ఆటకోసమైనా, తోటివారి సాహచర్యం కోసమైనా వృత్తిపట్ల ఆసక్తీ, గౌరవభావం ఏర్పడుతాయి. ఇక్కడ వృత్తి అంటే పసువులను కాయడమే! వయసులో చిన్నవారై పసితనం వీడని 10 సంవత్సరాలు దాటిన పిల్లలు మొదలుకొని,

15-16 సంవత్సరాలు, యువకత్వంలోకి అడుగు పెడుతూన్న చిలిపి చేష్టల యువకులూ - వీరిలో ఎక్కువగా ఉంటారు. ఈ చేష్టలే క్రమంగా ఏదో ఒక ఆటలోకి దారితీస్తాయి. ఈ విధమైన సమూహం కేవలం పసులకాడి పిల్లలది మాత్రమే కానవసరం లేదు. అంతస్తు, సాంఘిక హోదా వంటి తేడాల్లేకుండా ఏ ఊరిలోనైనా, ఏ వాడలోనైనా పిల్లలు కాలక్షేపం కోసం ఇటువంటి ఆటల్ని సృష్టించుకొని ఆడుతూ, వాటికి ప్రచారాన్ని తీసుకువస్తారు లేదా ప్రచారంలో ఉన్న ఆటలనే ఏ బంధువుల ఊరికో వెళ్లినపుడు నేర్చుకొని వచ్చి తిరిగి ఆడుకుంటారు లేదా తమ ఊరికి చుట్టంగా వచ్చిన బాలుని నుండి నేర్చుకొని ఆ ఆటను తమదిగా చేసుకుంటారు. ఇట్లా ఆట అనేది సంచారశీలియై, నిత్యనూతనమై అభివృద్ధి చెందుతూ ఉంటుంది. ఈవిధంగా ఆట పుట్టుకకైనా, ప్రచారానికైనా ప్రధానంగా కావల్సింది మాత్రం పిల్లల సమూహం మరియు పరిసరాలు. అందువల్ల - ఆటలకూ, బాల్యదశకూ ఉన్న అవినాభావ సంబంధాన్ని పరిశీలించి చూస్తే - 'నేడు ఆటలాడుకునే పిల్లల సమూహం రేపటి ఉత్తమ పౌర సమాజంగా మార్పు చెందేందుకు దోహదం చేసేవి - కేవలం ఆటలు మాత్రమే' అనే విషయం సుబోధకమౌతుంది.

విద్య బద్ధిని వికసింపజేస్తే, ఆట శరీరానికి ఆరోగ్యాన్నందించడంతోపాటు మానసిక వికాసానికి దోహదం చేస్తుంది, అనే విషయాన్ని ముందుగా గ్రహించి, ప్రోత్సహించాల్సింది మాత్రం పెద్దల పని.

**ఆటలు-బాల్యదశ :** 'పిల్లల లోకమే వేరు' అనే మాటను మనం తరచూ వింటూ ఉంటాం. ఆ లోకం పేరు 'ఆటలోకం'. ఆటలెన్ని ఉన్నా అందులో పిల్లల ఆటలు ప్రత్యేక విభాగానికి చెందుతాయి. చతుష్షష్టి (64) కళల్లో 'బాల క్రీడనకములు' అనే 61 కళగా ప్రత్యేకంగా పిల్లల ఆటలు పేర్కొనబడినాయి. ఇలా పిల్లల ప్రపంచంలో ఆటస్థలం ఒక సమాజం. ఆ సమాజంలోని వ్యక్తులే ఆటలాడుకునే పిల్లలు. ఆ ఆటల్లోనే ఎన్నో సమస్యలు, పరిష్కారాలు. ఆటలో గెల్చినవాడిది ఒక మనస్తత్వం, ఓడిన వానిది మరొక మనస్తత్వం. అందులోనే మంచీ-చెడూ. ఇలా ఎన్నెన్నో గుణాలవారు. చిన్నప్పటి నుండీ బయటి వారితో కలివిడిగా కలిసి తిరుగకపోతే, పెద్దయిన తర్వాత వారి మనసు పరిణతి చెందకపోవచ్చు. అలాంటి వారు పెరిగి పెద్ద అధికారిగా మారినా సమస్యల పరిష్కారాలపట్ల, వారు తమ కింది అధికారులపైనే ఆధారపడవలసి రావచ్చు. సిద్ధార్థుడు కోటగోడల లోపల సర్వ సుఖాలలో ఉన్నప్పుడు జీవితాన్ని దర్శించలేదు. జీవితం అంటే అతనికి తెల్సివచ్చింది, అతడు బయటి ప్రపంచాన్ని చూసిన తొలిరోజుననే! తమ గారాల కొడుకు పాదం బయట మోపితే ఏమౌతుందో అని ఆలోచించే సంపన్నులైన తల్లిదండ్రులు, తమ చిన్నారి ఎదుగుదలకు చిన్ననాటనే అవరోధాన్ని కల్గిస్తున్నామనే మాటను మర్చిపోతున్నారు.

ఆటలు కేవలం శరీరానికి మాత్రమే పని చెప్పేవి, అనే ఉద్దేశ్యం ఎంతోమంది పెద్దలకు కూడా ఉండటం శోచనీయమైన విషయం. మెదడుకు పని చెప్పని ఆటంటూ బహుశా ఏదీ ఉండదు. పిల్లలు ఆటస్థలంలోనో, ఇంటి బయటో లేదా ఇంట్లోనో ఆడుకోవటాన్ని ఎందరో పెద్దలు, పిల్లలకాలం వృథా అవుతున్నట్లే భావిస్తారు. అందుకే ఆటలాడుకోటానికి అభ్యంతరం చెప్పడమే కాదు, కొన్ని సందర్భాల్లో దెబ్బలతో శరీరాన్నీ, ఖచ్చితమైన కట్టడితో మనస్సునూ నొప్పిస్తారు. దానివల్ల తమ పిల్లలు బాగుపడతారు, బుద్ధిమంతులవుతారు, క్రమశిక్షణతో ఉంటారు, అని భావిస్తారు. కాని ఆ భావనే పిల్లల ఎదుగుదలను నిరోధిస్తుందనే విషయం మాత్రం పెద్దలు ఆలోచించరు. అందుకే - ఆటస్థలమే ఒక సమాజం. అందులోని సభ్యులే సమాజంలోని వ్యక్తులు, అందువల్ల దానికి వయసుతో పనిలేదు, అని పెద్దలు గ్రహించాలి.

'ఆటల్లో ఒకోసారి తోటివాళ్లకు సహకరించాల్సి వస్తుంది. కొన్ని కొన్ని సమయాల్లో సర్దుబాటు చేసుకోవాల్సి వస్తుంది. వీటి మూలంగా వాళ్లకు సమాజంతో మంచి సంబంధాలు ఎలా ఏర్పరచుకోవాలో తెలిసివస్తుంది. కొన్ని ఆటలు కేవలం పిల్లల ఉద్వేగాల తీవ్రతను తగ్గించడానికి ఉపయోగపడతాయి' అని పిల్లల మనస్తత్వ శాస్త్రవేత్తలు తరచూ తెలియజేసే మాటల్లో ఎంతో సత్యం ఉంది.

పిల్లలకు ఉద్వేగాలు ఏంటి? అవి ఆటల్లో తీరడం ఏంటి? అనేవి ప్రశ్నలుగా కన్పించవచ్చు. పిల్లలు సహజంగా స్వేచ్ఛాప్రియులు. తాము చేసే పనులకు ఆటంకం కల్గితే భరించలేరు. అభ్యంతర పెడితే బాధపడతారు. వినరు. ఏడుస్తారు. మొండికేస్తారు. అందువల్ల మొట్టికాయలు తింటారు - ఇవన్నీ సమస్యలే. ఐతే, వారిని స్వేచ్ఛ పేరుతో గారాలు చేయమనో, గాలికి వదిలేయమనో ఎవరూ కోరుకోరు. అలా కోరితే క్రమశిక్షణా లోపంతో వారు సమాజానికి పనికి రాకుండా

పోవచ్చు. వారికి స్వేచ్ఛనిచ్చి, భయంవల్ల వారు మనసులో అణచిపెట్టుకున్న చిన్న కోర్కెలను తెల్సుకొని మరీ తీర్చి, వారి మనసు ఉద్వేగానికి గురికాకుండా చూడాల్సిన బాధ్యత పెద్దలదే! అప్పుడే వారు పెద్దలను గౌరవిస్తారు. మంచిని మంచిగా చెబితేనే పిల్లలు వింటారు. అందుకు ఎంతో సహనం, మంచితనం పెద్దలకు అవసరం. అవి ఉండాలంటే ముందు పెద్దల్లో సరియైన అవగాహన ఉండాలి. 'ముందు మేం చెప్పినట్టు మీరు వినండి, తర్వాత మీరు చెప్పినట్టు మేం వింటాం!' అనేది పెద్దలపట్ల పిల్లల మనసులోని మాట. పిల్లలకు అనుగుణమైన మాట ఇంటా, బయటా లేనపుడే వారు ఉద్వేగాలకు లోనౌతారు. అందుకే ఆట పేరుతో వారికి స్వేచ్ఛ దొరికినప్పుడు ఆటలోనే తమ ఉద్వేగాలను మనోల్లాసంతో బయటికి పారదోలగల్గుతారు.

పిల్లలకు ఆటలవల్ల మానవ మనస్తత్వం మొగ్గలోనే తెలిసి వస్తుంది. నేటి బాలురే రేపటి పౌరులు. సమాజాన్ని నడిపించేది వారే. వారికి తోటివారి మనస్తత్వం తెలియడం ఎంతో అవసరం. ఆటలవల్ల పిల్లల మనస్తత్వాన్ని కనిపెట్టవచ్చు. ఓడినప్పుడు వారు సరిగా నిలబడి ఆడటం లేదా పారిపోవడం, అబద్ధాలాడటం, ఆటలో పేచీ వచ్చి అవతలి వానిని కొట్టటం, తిట్టటం, మిగతా సభ్యులు వారిని ముందుకు నడిపించటం, బుద్ధి చెప్పటం, ఇలా వారిలోనే ఎన్నో వర్గాలు, సమస్యలు, పరిష్కారాలు - అందుకే ఆట స్థలమే ఒక సమాజం. ఇలా భవిష్యత్తు అనే నాటకానికి ఆటస్థలం అనేది ఒక రిహార్సిల్.

తమతో ఆడకుండా ఒంటరిగా దూరంగా కూర్చున్న పిల్లలు దద్దమ్మలు. వారిని హేళన చేస్తే తప్ప వారు ఆటలోనికి దిగరు-

**"ఒంటి పిల్లి రాకాసి ఒకచోట**
**ఇద్దరు ముగ్గురు ఒకచోట"**

ఇలా ఆటలకు ముందు కూడా కొన్ని పాటలుంటాయి, అని తెల్పే ఈ పాట కొత్తవారిలోని బిడియాన్ని పోగొట్టి తమలో కలుపుకొనే 'టీజింగ్' పాట. సమూహాన్ని విడిచి ఒంటరిగా ఉండటం మానసిక అనారోగ్య లక్షణం అనేది, ఈ జానపదుల పాటలోని అంతస్సూత్రం. పిల్లల నేటి ఆట రేపటి పనిగా మారుతుంది. ఆ పనిలోనూ ఈ పాటే తోడుగా నిల్చి పనిలో ఒక భాగం అన్నంత ప్రాధాన్యాన్ని సంపాదించుకుంటుంది. ఈవిధంగా ఒక పిల్లవానికి ఆట మంచి నేస్తం అయినట్లే, పనికి గూడా పాట మంచి నేస్తగానిగా సహకరిస్తుంది. ఆటాపాటల్లేని పిల్లలు సామాన్యంగా కన్పించరు. ఒకవేళ కన్పించినా అది అనారోగ్య లక్షణంగానే భావించవలసి వస్తుంది. వారికి ఆట తర్వాతే ఏదైనా, అప్పుడు వారి ధ్యాసే వేరు. ఎంత ఆడినా తృప్తి తీరదు. అందుకే వారు విహరించే లోకం పేరు 'ఆటలోకం'. ఈ ఆటలోకమే వారికి స్వేచ్ఛనూ, సంతోషాన్ని ఇస్తుంది. మానసిక వికాసానికి పునాది వేస్తుంది. పరిశీలనా భావాన్ని పెంపొందేలా చేస్తుంది. అదే రేపటి క్రియాత్మకతకు దోహదం చేస్తుంది. దీనికి పెద్దల చేయూత మాత్రం తప్పకుండా అవసరం. పెద్దల ప్రోత్సాహం లేకుంటే ఆటల అభివృద్ధి కూడా నిల్చిపోతుంది.

ఇంటి ముంగిట్లో ఎన్నో ఆటల్ని ఆడుకునే పిల్లలను 'చదువు పాడవుతుంది', 'ఇతరులతో స్నేహం చేస్తే చెడిపోతారు' వంటి మాటలతో పెద్దలు మందలిస్తారు. ఇది తమలోని అజ్ఞానాన్ని బయటపెట్టుకోవడమే, అనే విషయం ఆ పెద్దలకు తెలియదు. తద్వారా తమ పిల్లల భవిష్యత్తును చేజేతులా నాశనం చేస్తున్నామనే విషయాన్ని కూడా వారు ఊహించలేరు. ఈ పరిస్థితి జానపదాల్లో ఎక్కువగా కన్పించకపోవడం గమనార్హమైన విషయం.

జానపదాల్లోని పిల్లలు కొన్ని ఆటలను సమయానుకూలంగా అప్పటికప్పుడే తయారు చేసుకుంటారు. అప్పటి సమయం, సందర్భం, ఆలోచనలు, ఊహలు ఒక ఆటగా రూపుదిద్దుకుంటాయి. ఆ రూపమే క్రమంగా ఒక ఆటగా స్థిరపడిపోవచ్చు. ఒక ఆట పుట్టుకకు ఈ రకమైన కారణాలు కూడా దోహదం చేయవచ్చు-అటువంటిదే, శ్రీకృష్ణ బలరాములు గోపబాలురతో ఆడుకుంటూన్న సందర్భంలోని ఆట, పోతన భాగవతంలోని దశమస్కంధ పూర్వ భాగంలో ఈ విధంగా ఉదహరింపబడింది. గోపకుమారులతో కృష్ణుడు -

**"గో వల్లభుడ నేను గోవులు మీరని**
**వడి అంకె వైచుచు వంగియాడు"**

ఈ పాటలో శ్రీకృష్ణుడు పాలకుడు. గొల్ల పిల్లలు పాలింపబడువారు. అధికార స్వరూపం, చొరవ గల పిల్లవాని లక్షణం ఇది. 'అమ్మా-నాన్న-పిల్లలు' అనే ఆటలో - అక్కడ గుమికూడిన పిల్లల్లో ఒకరు అమ్మ. ఒకరు నాన్న. ఇతరులు వారి సంతానం. అది కావాలి - ఇది కావాలి అని, నాన్న అమ్మను పురమాయించటం, అమ్మ విసుక్కోవటం, పిల్లలు తమలో తామే పోట్లాడుకుంటుంటే నాన్నపై విసుగుతో అమ్మ పిల్లల్ని కొట్టడం, వాళ్లు ఏడ్వడం, అమ్మ అక్కడి నుండి వెళ్లిపోయిన తర్వాత పిల్లల్లోని ఒక

పెద్ద ఏడ్చేవాళ్లను ఉద్దేశించి 'ఊర్కో! అలా ఏడిస్తే ఎలా? పాపం అమ్మకు ఎన్ని పనులో? అలా సతాయించ కూడదుగా మరి!' అని సముదాయించడం జరుగుతుంది. విసుగుతో ఒక దెబ్బ వేసినా చాటునుండి పిల్లల సంభాషణను విని కొంత నవ్వు, కొంత బాధతో తన తొందరపాటుకు తానే సిగ్గుపడుతుంది తల్లి. తన పశ్చాత్తాపానికి ప్రతిఫలంగా వారికేదైనా తినుబండారాలను అందించి మరిపిస్తుంది. 'స్కూల్ టీచర్ – పిల్లలు' – ఆటలో టీచర్ పిల్లలకు పాఠాలు చెప్పటం, ప్రశ్నలు అడగటం, చెప్పనివాళ్లను దండించటం మొదలైన అంశాలుంటాయి. ఇదంతా పిల్లలు ఆట ద్వారా అనుకరించే విషయం. ఒక సంఘటన పట్ల పిల్లలు ఏవిధంగా ప్రతిస్పందించేదీ ఈ ఆటలు చెప్తాయి. అమ్మానాన్నల పోట్లాటలో వాళ్లు పిల్లల్ని దండించటం, స్కూల్ అంటేనే – ప్రశ్నలడగటం, పరీక్షలు నిర్వహించడం, టీచర్లు కూడా పిల్లల్ని కొట్టడం అనే అంశాలు పిల్లల మనస్తత్వంపై ప్రభావాన్ని చూపిస్తాయి. వారిలో అశాంతిని రేకెత్తించి భవిష్యత్ పట్ల కూడా ఒక దురవగాహనను కల్గజేస్తాయి. ఇవి పెద్దల పరిశీలనకు, పరిష్కార మార్గాలకు ఒక పరీక్షగా నిలుస్తాయి. ముఖ్యంగా పిల్లల ఆటలు పాటల రూపంలో ఉండి ఆటపాటలు అనే మాటలతో కవల పిల్లల్లా కల్సిపోతాయి. పాట రూపంలో ఆట ఉండటం వల్ల ఆటల పట్ల ఉత్సాహం కల్గటం, ఆటవల్ల పాట కంఠస్థం కావడం జరుగుతుంది. ఈ విధంగా ఆటలోని పాటవల్ల జ్ఞాపక శక్తి పెంపొంది, విద్యాభ్యాసం సుగమం అవుతుంది.

పిల్లల ఆటల్లో ఆటకు సంబంధించిన పాటలే కాదు – గెలిస్తే సంతోషంతో పాడుకునే పాటలు, ఓడిన వారిని గేలి చేసేందుకు పాడే పాటలు, ఓడినవారు ఆట మధ్యలో పారిపోతే వారిని ఉడికించేందుకు పాడే పాటలూ ఉన్నాయి. శ్రమతో గెలవడం, లేదా ప్రతిభ చూపించి గెల్వడం వల్ల కల్గిన ఆనందంతో, గెల్చిన జట్టు ఓడిన జట్టును ఉడికించటం పరిపాటే. అపుడు ఓడినవారు తమలో అనైక్యత, పట్టుదల లోపించడం వల్ల ఓడిపోయిన విషయాన్ని గుర్తు చేసుకుంటారు. సామాన్యంగా పిల్లల్లో పౌరుషం ఎక్కువ. మాటంటే పడరు. ఇంకొకసారి మాటపడవల్సి వస్తుందనే ఆలోచన వల్ల గెల్చేందుకు ప్రయత్నం చేస్తారు. ఆట మధ్యలో పారిపోవడం పిరికితనమే కాదు, నీతి బాహ్యం కూడా. అందుకే సాటివారిలో గేలివల్ల భరించే అవమానం కన్నా, ఓటమిని అంగీకరించి ఆటను పూర్తి చేయటమే మంచి పని అని పిల్లలు భావిస్తారు.

"ఆటా పెట్టదు గూటా పెట్టదు
వద్లా రామని చిన్నాపెండ్లాం"

అని ఆటలో ఓడిపోయి ఆట తీర్చకుండా (శిక్ష అనుభవించక) మధ్యలోనే పారిపోయే పిల్లవాన్ని ఉడికించేందుకు మిగతా వాళ్లంతా కలిసిపాడే ఇలాంటి జానపద గేయాలు ఎన్నో ఉన్నాయి. దీనివల్ల వానిలో మగవాన్నయిన తనను స్త్రీగా, అందులోనూ ఇంకొకని పెళ్లాంగా చిత్రీకరించారనే పౌరుష భావం పెల్లుబుకుతుంది. ఆట మధ్యలో పారిపోవడం అంటే సమస్యలకు భయపడి పిరికివానిగా వెన్నిచ్చి పరుగెత్తడం వంటిది. ధైర్యంగా నిలబడి సమస్యల నెదుర్కోవడమే సమంజసం అనే విషయాన్ని ఈ పాట అంతర్గతంగా ప్రబోధిస్తుంది. అసలు ఆటలంటేనే భావి జీవితాల్లోని సమస్యలు. సమస్య పరిష్కారానికి సహనం ముఖ్యం. ఈ సహనం ఆటలోని ఓటమి వల్లనే ఎక్కువగా వస్తుంది. ఓడినవాడు ఆట తీర్చడం ద్వారానే తన నిజాయితీని నిరూపించుకో గల్గుతాడు. అందువల్ల భావి జీవితంలోని కొన్ని సత్యాలను ఈ ఆటలు సూచిస్తాయి. వారిని సరిదిద్దుతాయి. అందువల్ల పిల్లల ఆటల పట్ల పెద్దల ప్రోత్సాహం ఉండాలి.

శారీరక ఆరోగ్యం, మానసిక ఉల్లాసం, జ్ఞాపకశక్తి, ఆలోచనా పటిమ, పట్టుదల, ఏకాగ్రత, ఉత్తేజం, కార్యదీక్ష, ఐక్యత, సమయస్ఫూర్తి, లోకజ్ఞానం, సామూహిక తత్వం మొదలైన విభిన్నమైన అంశాలకు ప్రతిరూపంగా నిల్చే ఆటలను – బాల్య దశ నుండే పిల్లలకు దైనందిన కార్యక్రమంలో ఒక భాగంగా శిక్షణనిస్తే – వారు భావి జీవితంలో గొప్ప సామాజికులుగా మారే అవకాశం ఉంటుంది.

అటను కేవలం ఆట దృష్టితో కాకుండా – ఆటలో జీవితాన్ని దర్శించగల విశాల భావనను అలవర్చుకోవాలి. అప్పుడే – ఆట – జీవితానికి ఆదర్శం అవుతుంది.

ఆచార్య తంగెడ కిషన్ రావు
పూర్వ వైస్ ఛాన్సలర్, పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం,
హైద్రాబాద్, ఫోన్ : 7702414100

## నవరసాల బనారస్




**కా**శీ నగరం మీద వచ్చిన పుస్తకాలు మరే నగరం మీద వచ్చి ఉండవు. కానీ కాశీని అన్ని కోణాలనుంచి విశ్లేషణ చేసిన పుస్తకాలు అరుదేనని చెప్పాలి. గంగానది, కాశీ విశ్వనాథుని సన్నిధిని దాటి కాశీ నగరం లౌకిక, అలౌకిక ప్రపంచాలను పరిచయం చేసే ప్రయత్నం చేశారు కిల్లాడ సత్యనారాయణ గారు తన బహుముఖ బెనారస్ గ్రంథంలో. ఈ పుస్తకంలోని వ్యాసాలన్నీ **మిసిమి** పత్రికలో చోటు చేసుకున్నప్పుడు భక్తి, రక్తి, ముక్తి పరిమళాలను మనకు పంచాయి. ఇప్పుడవన్నీ పుస్తక రూపంలో వచ్చినప్పుడు కాశీనగరం విశాల హృదయాన్ని మనం చూస్తాం. కాశీ నగరం ఎన్నింటికి ప్రసిద్ధి.. వేదాధ్యయనమేనా.. అఘోరాలకేనా.. కబీర్, తులసీదాసులకేనా..!కాశీ నగరం హిందువులకు జీవన లక్ష్యం.. బౌద్ధులకు జ్ఞానమార్గం, జైనులకు పవిత్ర స్థానం,మహమ్మదీయులకు జీవన మార్గం. లౌకిక అలౌకిక సంగమరూపం బనారస్. ప్రతి నగరానికి ఒక సాంస్కృతిక చరిత్ర ఉంటుంది.. అయితే ఆ చరిత్రను బనారస్ సొంతం చేసుకున్న తీరు మాత్రం అద్వితీయమైనది ఎనిమిదవ శతాబ్దంలో శంకర భగవత్పాదుల వారు..మండన మిశ్రాను ధర్మశాస్త్రాలపై తన వాదనా పటిమతో ఓడించిన చోటు ఇదన్న మొదటి వ్యాసంతో మొదలు పెడతారు పుస్తకాన్ని రచయిత.. అక్కడినుండి కాశీ నగరం మూలమూలలా మనలను తిప్పుతారు.. ఎన్నో వింతలు, విశేషాలు ఒకప్పటివి, ఇప్పటివి మనకు చూపుతారు.. కాశీ నగరం ఎందుకు ఒక గొప్ప కెలీడోస్కోపో (kaleidoscope) చాలా వివరంగా.. మనం విస్తుపోయే విధంగా చెబుతారు.. రెండువందల ఎనభై సంవత్సరాలు జీవించిన తెలుగు వారు తైలింగ స్వామి కాశీ వాసులను అలరించిన విధానం.. దేశభక్తిలో తమవంతు పాత్ర పోషించిన తావైఫ్‌లు, వారకాంతలు ఎంతోమంది మనకు తారసపడతారు.. గాంధీజీ అంతటి వారికి కూడా తప్పని పండాల ఆగడాలు.. ఆశ్చర్యం కలిగించే విధంగా పండితులు,పెహల్వానులు కలిసి కుస్తీ పోటీల్లో పాల్గొనటం కూడా జరుగుతుంది ఇక్కడ అని తెలిసి ఆశ్చర్యపోయేలోపే ఇక్కడ ఒకప్పుడు తిట్లపై పోటీలు జరిగాయి ఇక్కడ అని తెలిసి ఔరా అనుకుంటాం.. కాశీ ఎంత సంస్కృతి సంప్రదాయాలతో ఎంతగా వెలసిల్లిందో అంతేవిధంగా ఆధునికతను పెనవేసుకున్నదని తెలిసి మన మొహంపై చిరునవ్వు పూస్తుంది.. అందరికీ తెలిసిన కాశీ నగరాన్ని సుసంపన్నం చేసిన వ్యక్తులు, సమూహాలు, ఆచారవ్యవహారాలు ఇవన్నీ ఆధ్యాత్మిక కాశీని నవరసాల బనారస్‌గా ఎలా తీర్చిదిద్దాయో ఏకబిగిన చదివించే వ్యాసపరంపర ఈ పుస్తకం.. అందుకే అందరికీ కాశీ ఒక వ్యసనం... మార్మికతకు అంజనం..ఈ పుస్తకం మాత్రం కాశీ అన్నపూర్ణ మనకు తినిపించే అమ్మచేతి గోరుముద్ద.

*నవరసాల బనారస్ : రచయిత: రమా సత్యనారాయణ, **మిసిమి** ప్రచురణ, వెల:199/-. 240పేజీలు*

*ప్రతులకు : **మిసిమి**, ఫోన్ : 9949516567; హైదరాబాద్ నవోదయ, ఫోన్ : 9247471362,విజయవాడ సాహితీ ప్రచురణలు, ఫోన్ : 9849992890*

---

## మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ "హిచ్ కాక్"




**స**ర్ ఆల్ ఫ్రెడ్ జోసెఫ్ హిచ్ కాక్ అంటే ఒక తరం సినీ అభిమానులకు నిద్రాహారాలు ఉండేవి కావు.హిచ్ కాక్ అంటే మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ అని జబ్బలు చరుచుకునేవారు.కానీ ఆ అభిమానాన్ని అక్షరంగా మార్చి పుస్తకంగా తెచ్చినవారెందరుంటారు..ఇదిగో ఇలా ఆ పని చేసి చూపించారు జంట రచయితలు..సినీ జర్నలిస్ట్ పులగం చిననారాయణ, రైల్వే అధికారి రవి పాడి. ఐదువందలకు పైగా పేజీలతో మాస్టర్ ఆఫ్ సస్పెన్స్ -హిచ్ కాక్ అంటూ కళ్ళు చెదిరే పుస్తకమే తెచ్చేశారు. ఎవరి పని వారు చేయాలనేది హిచ్ కాక్ నిశ్చితాభిప్రాయం. ఇక హిచ్ కాక్ యాభై మూడు సినిమాలు తీస్తే అందులో తొమ్మిది మూకీలే. మూకీల కాలంలో అవి నవరత్నాలుగా ప్రసిద్ధినొందాయి. తామే అన్ని సినిమాలు విశ్లేషించాలనే కోరిక లేకుండా హిచ్ కాక్‌ను ప్రేమించిన జర్నలిస్టులు, సినీరంగ ప్రముఖుల చేత వ్యాసాలు రాయించటం వలన ఇలాంటి పుస్తకాల్లో ఉండే మొనాటనీని నివారించగలిగారీ జంట రచయితలు. అదనంగా ప్రతి సినిమా నిర్మాణం వెనుక హిచ్ కాక్ పడిన కష్టాన్ని, నష్టాన్ని పొల్లుపోకుండా మనముందు బుల్లెట్ పాయింట్స్‌గా ఆవిష్కరిస్తారు రవి పాడి. నిజానికి ఈ టిట్ బిట్స్ మనల్ని చాలా ఆకర్షిస్తాయి. నిర్మాణ విలువలు సినిమానెంత తీర్చిదిద్దుతాయో, ఇటువంటి పుస్తకాలు ఎంతందంగా ఉంటే అంతెక్కవగా పాఠకుడు ప్రేమిస్తాడు. ఈ పుస్తకం కవర్ పేజీని ఆర్టిస్ట్ ఈశ్వర్ తన చివరి రోజుల్లో తయారు చేసిచ్చారు. హిచ్ కాక్ తన సినిమా స్క్రిప్ట్ లను చూసుకుంటూ సమ్మోహనంగా కనిపిస్తాడు. అదే కవర్ పేజీ..రాంగోపాల్ వర్మ, తనికెళ్ళ భరణి, పూరీ జగన్నాథ్, ఇంద్రగంటి మోహన కృష్ణ.. ఇలా ఎందరో తమ వ్యాసాలతో దర్శనమిస్తారు.. హిచ్ కాక్ 125 జయంతి సందర్భంగా తెచ్చిన ఈ పుస్తకం ఓ ప్రయోగంగా నిలిచిపోతుంది.హిచ్ కాక్ "హిట్ కాక్" ఎందుకయ్యాడో సవివరంగా పరిచయం చేస్తుంది. హిచ్ కాక్ పై ఇద్దరి తెలుగు రచయితల అభిమానానికి తార్కాణంగా నిలుస్తుంది.

*వెల : 650/-, పేజీలు : 600, ప్రతులకు : హైదరాబాద్ నవోదయ, ఫోన్ : 9247471362,విజయవాడ సాహితీ ప్రచురణలు, ఫోన్ : 9849992890*

***- సి.ఎస్. రాంబాబు, ఫోన్ : 8374818961***

# చదవండి...

**- మిసిమి**

📖 **కవిత - నిర్వాహక సంపాదకులు - విశ్వేశ్వర రావు, సంపాదకులు - బండ్ల మాధవరావు :** గద్దర్ ముఖచిత్రంతో వచ్చిన ఈ కవితా సంకలనం ఇరవై కవిత్వ సంచికల ప్రస్థానం. కవిత్వం ఒక తీరని దాహం అంటూ ఈ దాహమే గత రెండున్నర దశాబ్దాలుగా వీరిని ఆవహించి ఊపిరులు పోస్తోంది అంటారు మాధవరావు. గత చరిత్ర పునాదుల మీద వర్తమానం ఎప్పుడూ ఉత్తేజ పూర్వకంగానే ఉంటుందంటారు. వీరు ఎంపిక చేసిన దెబ్బై అయిదు కవితలు ఈ సంకలనంలో ఉన్నాయి. ఇది ప్రయాసతో కూడిన వ్యవహారమని, రెండువేల కవితల్లోంచి వీటిని ఎంపిక చేశామని తమ కష్టం చెప్పుకున్నారు. వారి కష్ట ఫలమే మన చేతిలోకి వచ్చిన ఈ కవితా సంకలనం. చదివి ఆనందించండి.




పేజీలు : 204, వెల : 200, ప్రతులకు : శ్రీశ్రీ ప్రింటర్స్, ఫోన్ : 8490634849

📖 **కవితా 80 - :** మోహన్ బొమ్మతో మన చేతిలోకి వచ్చిన ఈ 80వ సంచిక ఆలోచన రేకెత్తించే విధంగా ఉంది. ఇంకా గురజాడ, చలం, శ్రీశ్రీయేనా అనేవాళ్లు ఉన్నారంటూ కొత్తవాళ్లు కొండ శిఖరాలు ఎక్కుతున్నారంటూ మనకు గుర్తు చేస్తున్నారు. మానవ వినాశనానికి సాంకేతిక అభివృద్ధి కారణం అనవచ్చా అని అడుగుతున్నారు. ఎన్నో విజ్ఞానశాస్త్ర ప్రయోగాలు క్రూరత్వానికి నిదర్శనంగా నిలుస్తున్నాయంటారు. ఇవన్నీ ఆలోచించదగ్గ విషయాలే. మనదేశంలో మత తత్వంతో కూడిన నియంతృత్వం రాజ్యమేలుతోందంటారు. వీరికి ముస్లిమ్ లీగ్‌తో కలిసిన క్రిస్టియన్ కాంగ్రెస్ కావాలేమో! అది లౌకిక ప్రజాస్వామ్యం అంటారు. ఇలా భిన్నస్వరంలో సాగిన ఇందులో వ్యాసాలు, కవితలు చదవండి. దీనితోపాటే కవితా 81 కూడా ఖాదర్, అందెశ్రీలకు జరిగిన పురస్కార సన్మానాలను బొమ్మలతో సహా ప్రచురించారు.




పేజీలు : 51, వెల : 25/-, ఫోన్ : 9490634849

📖 **ప్రస్తార - కథాసాహిత్య వ్యాసాలు - ఎమ్వీ రామిరెడ్డి :** కోవిడ్ మానవాళి ఆలోచనా విధానాన్ని, జీవన విధానాన్ని మార్చిందనడంలో సందేహం లేదు. ఆ ప్రభావంతో ఈ సాహిత్య విమర్శ సాగిందనుకోవచ్చు. సాహిత్య విమర్శ ఒక సముద్రం. కేవలం ఓ తపనతో తన చుట్టూ ఉండే మనుషుల్ని తను చదివిన కథల్లో ఎలా దర్శించారో, రాగద్వేషాల అన్వేషణలో ఏవిధంగా నిమగ్నమయ్యారో ఈ వ్యాసాలు వ్యాసకర్తను తెలియజేస్తాయి.




పేజీలు : 193, వెల : 200, ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, ఫోన్ : 9247471362

📖 **విస్తార - కవిత్వ సాహిత్య వ్యాసాలు - ఎమ్వీ రామిరెడ్డి :** కవిత్వం ఎప్పుడూ పరమ ఔషధమే. ఎన్నో మూలికలు రంగరించి ఆ ఔషధాన్ని తయారు చేస్తారు. ఇది రచయిత ఆశ్చర్యపోయే విషయం. ఒకరకంగా ఈ ఔషధ తయారీకి ఏ మూలికలు వాడారో అనే అన్వేషణే వీరితో ఈ వ్యాసాలు వ్రాయించింది. కవుల మానసిక సంస్కారాన్ని అంచనా కట్టే ప్రయత్నం ఈ వ్యాస సంపుటి.




పేజీలు : 243, వెల : 250, ప్రతులకు : నవోదయ బుక్‌హౌస్, ఫోన్ : 9247471362

📖 **శబ్ద బ్రహ్మ చిన్నయసూరి - వెలమల సిమ్మన్న, గుమ్మా సాంబశివ రావు :** చిన్నయసూరి రెండువందల జయంతి ఉత్సవాల సందర్భంగా వీరు ఈ పుస్తకాన్ని ప్రచురించారు. ఇందులో బాలవ్యాకరణం, శాస్త్రీయ వ్యాఖ్య. చిన్నయసూరి జీవితం బాలవ్యాకరణ సంబంధమైన అనేక విషయాలు ఈ పుస్తకంలో ఉన్నాయి.




పేజీలు : 168, వెల : 160, ప్రతులకు : వెలమల సిమ్మన్న, ఫోన్ : 9440641617, గుమ్మా సాంబశివరావు, ఫోన్ : 9849265025

# మిసిమి
మాసపత్రిక

## మీరు చందాదారులుగా చేరండి      బహుమతిగా పంపండి

ప్రియమైన పాఠకులకు ఒక సూచన : **మిసిమి** మాస పత్రికను పంపిణీ చేస్తున్న కొందరు పుస్తక విక్రేతలు సొమ్ము పంపని కారణగా వారికి పత్రికను పంపడం ఆపుతున్నాము. విజ్ఞులైన పాఠకులు **మిసిమి** ని వార్షిక చందాలు పంపి పొందవలసిందిగా మనవి.
మీ చిరునామా వివరాలు మాకు ఫోన్ (994 951 6567) లేదా ఇ-మెయిల్ (misimi90monthly@gmail.com) ద్వారా తెలియజేయండి. మీరు ఇచ్చిన చిరునామాకు నెలనెలా **మిసిమి** పత్రికను పంపిస్తాం.

**A/C Name : Misimi A Unit of Kalajyothi Process P Ltd.**
**HDFC Current Account No. 50200091136242**
**IFSC Code : HDFC0000472**

**చందా వివరాలు:**
₹ 600/- (సంవత్సర చందా),
₹1200/- (రెండు సంవత్సరాలకు),
₹1800/- (మూడు సంవత్సరాలకు),
**Scan QR to Pay**
Misimi A Unit of Kalajyothi

## మిసిమి ప్రచురణలు


నోబెల్ వ్యాసాలు


మిసిమి పార్థసారథి వ్యాసాలు


చిత్రకళా నీరాజనం


దూరతీరాలలో...


బహుముఖ బనారస్


ఐరోపా శిల్ప - చిత్రకళావైభవం


పురస్కార సాహిత్యం


వ్యాస మంజూష


సారస్వత వ్యాసాలు


చార్లీ చాప్లిన్


రజ్జు సర్ప భ్రాంతి


బైరన్


యాత్రా కథనాలు


షెల్లీ జీవిత కథ


దోసిట చినుకులు


నృత్యభారతి


పారిజాతం


సిద్ధార్థ


సప్తపర్ణి

ప్రతులకు: **మిసిమి** కార్యాలయాన్ని సంప్రదించండి. ఫోన్: **994 951 6567.**

**మిసిమి at Kala Jyothi Process Pvt. Ltd., 1-1-60/5, R.T.C. 'X' Roads, Hyderabad - 500 020. Ph. 040-27645536.**